RNI No. APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 18 Issue No. 6 Monthly June 2021 ISSN No. : 2456-4702 Rs. : 15/-



## కాళీపట్నం రామారావు




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)



Editor : Kolla Sri Krishnarao

E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.



**Vol. 18 - Issue. 6 - June 2021 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



**EDITORIAL BOARD**

*Chief Editor*

**PITTA SANTHI**

***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***

**C/o. Dr. Busi Venkataswamy**

Holy Homes Apartment, Postal colony ,

4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
   HOD, Dept. of Telugu,
   Govt. Degree College, Puttur, Chittor Dist.

**ASSOCIATE EDITORS**

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

BHAVAVEENA
Vol. 18, Issue. 6, June 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# కాళీపట్నం రామారావు

కాళీపట్నం రామారావు 'కారా మాష్టారు'గా సుపరిచితులు. సరళ భాషా రచయిత, కథకుడు, విమర్శకుడు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన ప్రవృత్తి రీత్యా కథకులు. వీరి కథల్లో రచనా శైలి సరళంగా ఉంటుంది. కారా కథా రచన విషయంలో **"Accuracy"** కోసం తీవ్ర కృషి చేస్తారు. ప్రతి వర్ణన, పాత్రణ, సంభాషణ ఖచ్చితంగా ఆయా సన్నివేశాలలో అమరిపోతాయి. ఈ విషయంలో చాగంటి సోమయాజులుతో పోల్చదగిన వ్యక్తి కారా. ప్రసిద్ధ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్, కారా రచనలకు ప్రేరణ పొంది ఆయనను గురువుగా భావించేవాడు.

కారా మాష్టారు 1924 నవంబర్‌లో శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం మురపాకలో జన్మించారు. ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూ తెలుగు కథకు జీవం పోశారు. తెలుగు కథకు శాశ్వతత్వాన్ని చేకూర్చే దిశగా విశేష కృషి చేశాడు. ఆంధ్రభూమి దినపత్రికలో "నేటి కథ" శీర్షికను ప్రారంభించి క్రొత్త రచయితలకు అవకాశం కల్పించారు. కారా తన జీవితం అనుభవించిన కష్టాలను, సంఘర్షణలను ఆయన కథల్లో ఇమిడ్చాడు. 1964 సంవత్సరంలో వెలువడిన 'యజ్ఞం' కథ ఫ్యూడల్ విధానంలోని దోపిడీని కళ్ళకు కట్టినట్టు చూపించారు. అందుకే ఆయన కథలు ఇతర భాషల్లోకి కూడా అనువదించబడ్డాయి.

కారా గారి రచనల్లో 'కాళీపట్నం రామారావు కథలు, యజ్ఞం, యజ్ఞంతో తొమ్మిది, జీవధార, రాగమయి' అనే కథా సంపుటాలు ప్రసిద్ధాలు. తెలుగు సాహిత్యంలో వెలువడిన కథలన్నింటిని భావితరాల వారికి భద్రపరచాలన్న సంకల్పంతో కారా కథానిలయాన్ని శ్రీకాకుళంలో స్థాపించారు. ఈ కథానిలయంలో దాదాపు 2000లకు పైగా కథల సంపుటాలున్నాయి. కారా కృషికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డుతోపాటు మరెన్నో సన్మానాలు, సత్కారాలు పొందారు. కారా తన విశ్వాసాలకి అనుగుణంగా విప్లవ రయితల సంఘంలో సభ్యుడిగా, కార్యదర్శిగా పనిచేశారు. కొంత కాలానికి విరసం నుండి బయటకి వచ్చేశారు. యువ కథా రచయితలకి 'మాష్టారు'గానే వుండటానికి కారా ఇష్టపడ్డాడు.

కారా కథలు కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైనవి కావు. మనిషికీ మనిషికీ మధ్య పెరిగిపోతున్న అడ్డుగోడల్ని నిరసించి మనిషితనం కోసం వెంపరలాడే ఉత్తమ కథకులు కారా.

భావితరాలకు కథల మాధుర్యాన్ని పంచాలన్న సంకల్పంతో 'కథా నిలయం' స్థాపించి ఎంతోమందికి ఉపయోగపడేలా చేశారు. తన వద్దకు వచ్చే ఎంతోమంది జూనియర్ కథకులకు తన మెలకువలు చెబుతూ ప్రోత్సహిస్తున్నారు. 'కథానిలయం' వార్షికోత్సవాలను ప్రతి యేటా జరపడం పరిపాటి. తెలుగు కథలకు విశేష కృషి చేస్తూ 2021 జూన్ 4వ తేదీన పరమపదించారు.

- సంపాదకవర్గం

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | తెలుగులో ప్రబంధ మహాకావ్యాల విశిష్టత | - బి. క్యాథరీన | 5 |
| 2. | సినారె సినిమా పాటలు పద ప్రయోగాలు | - బి. వెంకటయ్య | 10 |
| 3. | స్త్రీ విద్య నాడు - నేడు | - డా॥. శిరీష ఈడ్పుగంటి | 14 |
| 4. | మాతృభాషను కాపాడుకోవడం మనందరి కర్తవ్యం | - డా॥. కడివెండి మమత | 19 |
| 5. | సమాజ కుళ్లును ఎత్తి చూపిన దిగంబర కవిత్వం | - డా॥. వెల్దండి శ్రీధర్ | 22 |
| 6. | మాడభూషి కవిత్వం - ప్రతీకవాదం | - డా॥. వి. త్రివేణి | 26 |
| 7. | చంద్రిక పరిణయం - ప్రకృతి సౌందర్యం | - జి.వి. సుజాత | 37 |
| 8. | తెలంగాణ కథలు- బహుజన అస్తిత్వ చైతన్యం | - జన్ను అశోక్ | 44 |
| 9. | జయప్రభ కవిత్వం - స్త్రీల హక్కుల సాధన | - డా॥. ఇ. కోన ప్రభ | 48 |
| 10. | సింగమనేని కథలలో - విద్యావ్యవస్థ చిత్రణ | - కె. నాగరాజు | 53 |
| 11. | సింగిడి కథా సంకలనాలు - తెలంగాణ స్థానీయత | - కొత్త అరుణ | 57 |
| 12. | జానపద కళల్లో - డప్పు వైశిష్ట్యం | - మొత్కురి అనిల్ కుమార్ | 60 |
| 13. | ఉపాధ్యాయలోకంలో ఉరిమే ఉత్తేజం - డా. సుచరిత | - సాహితి మోదుగుల | 64 |
| 14. | దేశి కవితకు పట్టం కట్టిన ప్రథమ కవి పాల్కురికి సోమన | - ఆర్. రమాదేవి | 70 |
| 15. | సొలొమోను మహారాజు అందించిన అద్భుతమైన సామెతలు | - సూరేపల్లి పద్మావతి | 74 |
| 16. | తెలంగాణ విమోచనోద్యమ నవలల్లో స్త్రీ చైతన్యం | - డా॥. తిరునగరి దేవకీదేవి | 77 |
| 17. | అనువాదం - ఆవశ్యకత | - ఆచార్య ఎన్. వి. కృష్ణారావు | 82 |
| 18. | జానపద గేయాలు - జగద్ధితవాక్యాలు | - డా॥. పఠాన్ ఖాసిం ఖాన్ | 84 |
| 19. | మనసు కవి - మన 'సు' కవి - గేయ సాహిత్యం | - డా॥. పెండ్యాల లావణ్య & - డా॥. పి. శాంతి | 89 |
| 20. | జానపద సాహిత్యం - మానవతా దృక్పథం | - డా॥. డి. విజయ కుమారి | 94 |
| 21. | 'ఆకాశమంత చూపు' - సమీక్ష | - డా॥. చిలకా అనిత | 99 |
| 22. | సాహిత్య ప్రస్థానం పత్రిక - నానీలు - సామాజిక విశ్లేషణ | - డా॥. సంగీతరావు మెడతోటి | 101 |
| 23. | కాళహస్తీశ్వర శతకము - మానవాభ్యుదయ మార్గము | - డా॥. వి.ఎన్. మంగాదేవి | 107 |
| 24. | కథావార్షిక కథలలో ఇతివృత్త వైవిధ్యం | - కె. వెంకట లక్ష్మి | 110 |
| 25. | వలసపాలనలో జమిందారీలు - రైతాంగ పోరాట చరిత్ర | - డా॥. కె. శ్రీదేవి & చంద్రబాబు | 114 |
| 26. | "గురుదేవోభవ" ఆడియో గీతాల ఆల్బమ్ -గురువు విశిష్టత | - పురస్తుల అనిల్ కుమార్ | 118 |
| 27. | కె.వి.నరేందర్ కథలు - ఇతివృత్త వైవిధ్యం | - రాయపూడి శివకుమారి | 124 |
| 28. | డా॥. అక్కినేని పౌరాణిక భక్తి పాత్రల విశ్లేషణ | - జి.ఏ.జె. ప్రకాశిని | 130 |
| 29. | ద్వివేదుల విశాలాక్షి రచనలు – సామాజిక సమస్యలు | – డా॥. జి. శ్రీనివాసరావు | 133 |
| 30. | The Eighth Hue : Amrita Sher-Gil in Biofiction | - Dr. Prashant kumar | 135 |
| 31. | Analytical Review on Centenary Years of Jellian .. | - Dr. Battu Kiritam | 145 |

# తెలుగులో ప్రబంధ మహాకావ్యాల విశిష్టత

- **బి. క్యాథరీన,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, గవర్నమెంటు డిగ్రీ సిటీ కాలేజ్, హైదరాబాద్.

సాహిత్యం సామాజిక జీవన ప్రతిబింబమని విజ్ఞుల భావం. సామాజిక పరిస్థితుల్ని బట్టి సాహిత్య దృక్పథం కూడా పరిణామం చెందుతూ ఉంటుంది. హితంతో కూడుకున్నది సాహిత్యం. ఆ సాహిత్యానికి ఒక్కో సందర్భంలో ఒక్కో దృక్పథం ఉంటుంది. దృక్పథం అంటే చూచే పద్ధతి. ఈ పద్ధతి వ్యక్తిని బట్టి, కాలాన్ని బట్టి మారుతూ ఉంటుంది. సమాజం ఉన్నంతకాలం సాహిత్యం ఉంటుంది. సాహిత్య సృజన చేసేవ్యక్తి సంఘంలో సభ్యుడై ఉంటాడు. అందువల్ల సమాజంలో ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితుల్ని గమనిస్తూ ఉంటాడు. ఆ పరిస్థితుల్ని తనకునచ్చిన ప్రక్రియలో వెల్లడిస్తూ ఉంటాడు. దీనివల్ల సాహిత్యం జీవనదిగా సాగిపోతూనే ఉంటుంది. అదే విధంగా ప్రబంధ ప్రక్రియ కూడ పురాణ ఇతిహాసం నుండి జనించి స్వంతమార్గం వేసుకొని అభివృద్ధి చెందింది.

తెలుగు పంచకావ్యాలలో శృంగార నైషధం మను చరిత్ర, వసుచరిత్ర, ఆముక్తమాల్యద, పాండురంగ మాహత్మ్యంలను తెలుగు పంచకావ్యాలనడం పరిపాటి. ఈ ఐదింటిలో చివరి మూడింటికి బదులు వేరే కావ్యాలు ఉంచడం కూడా కద్దు. కాని మనుచరిత్ర, వసు చరిత్రలను మాత్రం పంచకావ్యాలలో ఎవ్వరైనా ఉంచాల్సిందే. అలాంటి మహాకావ్యద్వయం 'మనుచరిత్ర, వసు చరిత్రలు'. ప్రబంధ కావ్య సముద్రానికి మనుచరిత్ర చెలియలికట్ట అయితే-వసుచరిత్ర మణిద్వీపం. సంప్రదాయం అంటే అనంతంగా సాగిపోయే జీవనది. ఎక్కడో ప్రవహించడం ప్రారంభమై, మహా ప్రవాహమై అనంత సాగరంలో కలసిపోతుంది. గంగోత్రిలో చిన్ని నీటి జలగా పెల్లుబికి క్రమంగా హృషీకేశంలో, హరిద్వారంలో, త్రివేణీ సంగమంలో, మహా సాగరం దాకా ప్రసరించుతూ-అనేక జల వాహినులను తనలో కలుపుకొంటూ, ప్రక్కనున్న పొలాలోకి ప్రవహిస్తూ సస్యశ్యామలం చేస్తూ, వర్షాకాలంలో తనలో పేరుకున్న, మట్టినీ, ఇతర వ్యర్థ పదార్థాలనూ తీరాల వైపు త్రోసి వేస్తూ నిరంతరంగా సాగిపోతుంది. గ్రీష్మంలో సన్నబడుతూ, వర్షాకాలంలో పొంగులెత్తుతూ, శరత్కాలంలో స్వచ్ఛమవుతూ అనేక పరిణామాలు పొందుతూ వుంటుంది. అలకనందగా, మందాకినిగా, భాగీరథిగా, జాహ్నవిగా ఈ జలసంఘాతం. ఐనా తన మౌలిక 'జీవన' తత్త్వం నిలుపుకుంటుంది.

సకల విద్యాసనాథ కవిసార్వభౌమ శ్రీనాథుని శృంగార నైషధము, సంస్కృత పంచ మహాకావ్యాలలో చివరిదిగా, ఆంధ్ర పంచ మహా కావ్యాలలో మొదటిదిగా ప్రసిద్ధి కెక్కింది. దీనిని సంస్కృతంలో రచించినది మహాకవి శ్రీహర్షుడు. ఇతను కాశ్మీర దేశంలోని శారదాపీఠంలో శేషాహి అంశమున జన్మించిన శ్రీహీర పండితునికి, మామల్లదేవీలకు చింతామణీ మంత్ర చింతన ఫలంగా వుట్టిన కుమార రత్నం. ఇతని కాశ్రయుడైన కన్యాకుబ్జేశ్వరుడు జయంత చంద్రుడని చెబుతారు. ఇతడే రాణీ సంయుక్తకు తండ్రి. పృధ్వీరాజుకు విరోధి అయిన జయచంద్రుడని కొందరి అభిప్రాయం.

శ్రీహర్షుడు పృధ్వీరాజు గుణగణాలనూ, సంయుక్తా స్వయంవరాన్ని మనసులో ఉంచుకుని నైషధ కావ్యంలో నలుని గుణగణాలూ, దమయంతీ స్వయంవరాన్ని రచించాడని విమర్శకుల అభిప్రాయం. అలాంటి నైషధ మహాకావ్యాన్ని శ్రీనాథ కవి చంపూ రూపమున తెలుగులో రచించి పెదకోమటి వేమారెడ్డి మంత్రి సోమ సిద్ధాంత వ్యాఖ్యాతగా పేరుపొందిన మామిడి సింగనామాత్యునికి అంకితమిచ్చాడు.

శ్రీనాథునికి ముందు సంస్కృత కావ్యాలను తెలుగులో అనువదించిన వాళ్ళంతా పురాణాలను అనువదించినవారే

కాని, రసమూ, వర్ణనా ముఖ్యమైన కావ్యలను అనువదించడంలో శ్రీకారం చుట్టినవాడు మాత్రం శ్రీనాథుడే. శ్రీహర్షుడు మహా పండితుడు. ఆయన తన కావ్యానికి 'నైషధీయ చరిత్ర' అని పేరు పెట్టాడు. దీనిలో శృంగార రసం ప్రధానంగా వుండడం వల్ల శ్రీనాథుడు దీనిని 'శృంగార నైషధం' అన్నాడు. నైషధ కావ్యాన్ని నిండు యవ్వనంలో ప్రారంభించాడు. శ్రీనాథుడు భోగ లాలసుడని ఒక అపవాదు వుంది. అది ఎంతవరకు నిజమో చెప్పలేము. కాని శృంగార రసపోషణలో అతని ప్రజ్ఞ అంత ఇంత అని చెప్పలేము. రచనలలో శృంగారం చక్కగా పోషించే వాళ్ళంతా జీవితంలో కూడా శృంగార పురుషులని అనడం భావ్యం కాదు. శ్రీనాథుడు తన శృంగార నైషధాన్ని ఆంధ్ర సరస్వతికి అమూల్య అలంకారంగా తీర్చిదిద్దాడు.

సంస్కృతమున శ్రీహర్షుని నైషధము శృంగార రస ప్రధానమైనది దానిని శ్రీనాథుడు శృంగారనైషధమను పేర అనువదించినాడు. తెలుగులో అంతవరకు శృంగార రసమంగిగా గల కావ్యములు లేకపోవుటచే శ్రీనాథుడు కావ్యనామములోనే అట్టి శృంగారరసము ప్రాధాన్యముగా గల కావ్యమని సూచించుటకై శృంగారనైషధమని నామముంచెను. సంస్కృత మహాకావ్యములలో నఖశిఖ పర్యంత స్త్రీవర్ణనలు కలవు బాణుడు కాదంబరిలో కాదంబరీ, మహాశ్వేతలను సుదీర్ఘముగా వర్ణించి యున్నాడు. నైషధమున శ్రీహర్ష మహాకవి నఖశిఖ పర్యంతముగా దమయంతి వర్ణనను రెండుమార్లు కావించినాడు. కాళిదాసుసైతము స్త్రీవర్ణన చేసియున్నాడు. శ్రీహర్షుని నైషధకావ్యము తెనుగున కనువదింప బడిన నాటి నుండి నాయిక అంగాంగవర్ణన తెనుగు కవులకు వర్ణ్య విషయమయ్యెనని చెప్పవచ్చును. పినవీరన నైషధముననుసరించి రెండుమార్లు శకుంతల అంగాంగ వర్ణన గావించినాడు. శ్రీనాథునకు పూర్వము నన్నె చోడుడు పార్వతిని నఖశిఖపర్యంతముగా రెండుమార్లు ప్రౌఢప్రబంధమార్గమున వర్ణించియున్నాడు. నన్నయ. తిక్కన, ఎఱ్ఱన, నాచనసోమనాథి కవులు సందర్భాను గుణముగ తగినమోతాదులలో స్త్రీ సౌందర్యవర్ణనను చేసినారు జక్కనాది పద్యకథాకావ్యకర్తలు కొంతమట్టుకు దీర్ఘముగా స్త్రీవర్ణన చేసి యుండిరి. కాని నైషధమువలె అవి ప్రౌఢమైన అంగాంగవర్ణనలు కావు.

తెలుగు ప్రబంధాలలో 'మనుచరిత్ర' స్థానం సమున్నత మైనది. కృతులు రచించటానికి అనువైన పరిస్థితులను పెద్దన ఒక చాటు పద్యంలో చెప్పాడు. 'మను చరిత్రం బందుకొను వేళ రాయలు పెద్దన కూర్చున్న పల్లకిని తన కొలబట్టి ఎత్తాడు. ఇటువంటి ఘనమైన సత్కారాలెన్నో పెద్దనకు లభించాయి. మను చరిత్ర రచన తర్వాత వరూధినీ ప్రవరాఖ్యులు పూర్తిగా తెలుగు వారే అయినారు. నిజానికి యీ రెండు పాత్రలు 'మార్కండేయ పురాణము'లోవే. పెద్దన కవితా ప్రతిభ వల్లనే అవి జీవం నింపుకున్నాయి. పెద్దన చేసిన హిమాలయాల వర్ణనకు సాటి వచ్చేది మరేది తెలుగులో లేదు. పెద్దన పద బంధాలు, వాగ్వైఖరి, ఊహాశక్తి, కల్పనా రామణీయకమూ వేనోళ్ల కొనియాడదగినవి.

పెద్దనలో పూర్వకవుల శుభలక్షణాలన్నీ కేంద్రీకృత మైనాయి. నన్నయగారి ప్రసన్న కథా కలితార్థ యుక్తి, తిక్కన సంభాషణ శైలి, పాత్ర చిత్రణ, ఎర్రయ ఔచిత్య వంతమయిన తెలుగు ప్రయోగం, నాచనసోముని కొత్త చమత్కారాలు, శ్రీనాథుని శయ్యాసౌభాగ్య ప్రీతి పెద్దనలో ఒక్కరూపులో మూర్తీభవించి సాక్షాత్కరిస్తాయి. శిరీష కుసుమపేశల సుధామయోక్తుల పెద్దనార్యుని మను చరిత్ర అష్టాదశ వర్ణనలతో అలరారుతున్న మహాకావ్యం. తెలుగు సాహిత్యంలోని పంచమహాకావ్యాలలో మను చరిత్రను మొదటిదిగా ఎంచుతారు. ఆంధ్రభోజుడని ప్రసిద్ధి చెందిన శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులలో పెద్దన ఒకడు. పెద్దన తన మనుచరిత్ర ప్రబంధాన్ని రాయలకు అంకితం ఇచ్చాడు. పెద్దనకు ఆంధ్రకవితా పితామహుడని బిరుదు. పురాణ కథను తీసుకుని మొట్టమొదట మనుచరిత్ర అనే ప్రబంధం

రచించడం వల్ల ఆయనకు యీ బిరుదు వచ్చిందని కొందరంటారు. పెద్దన అందరూ మెచ్చుకునే విధంగా కవిత్వం చెప్పగా, రాయలు స్వయంగా సింహాసనం దిగి వచ్చి, తన చేతులతో ఆ గండపెండేరాన్ని పెద్దన కాలికి తొడిగాడు. అంతేకాకుండా మనుచరిత్రను అంకితం తీసుకునే వేళ పెద్దన ఎక్కిన పల్లకిని రాయలు తన చేతబట్టి ఎత్తాడు.

ప్రకృతి వర్ణనలతో, రాజనీతి విశేషాలతో అమోఘ కల్పనలతో కృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద రచించి తెలుగు సాహిత్యానికి అనర్ఘరత్నాన్ని ప్రసాదించాడు. 'ఉన్నట్లయుండ నద్దరి/కిన్నరులను నావ చేర్చుక్రియ వెస(దా(బో/ కున్నట్లయుండి కాలం/ బున్నరులకు వయసు (బుచ్చిమోసము( దెచ్చున్' లాంటి వర్ణనలు రాయల వారి ప్రతిభను చాటగలవి 'ఆముక్తమాల్యద'లో కొల్లలుగా వున్నాయి. రాయలు ప్రాచీన వైష్ణవ గురు చరిత్రము నుండి గోదాదేవి, యామునాచార్యులు వృత్తాంతం; విష్ణుపురాణం నుండి ఖాండిక్యకేశిధ్వజ సంవాదము, వరాహ పురాణం నుండి మాలదాసరి కథను తీసుకుని తనకు తోచిన మార్పులు చేసి, సందర్భోచితంగా కల్పించి ఆముక్తమాల్యదను అద్భుతంగా రచించాడు. ఆంధ్ర వాఙ్మయానికి అలంకారమని చెప్పదగిన ప్రబంధ రత్నం ఆముక్తమాల్యద. ఆముక్తమాలద్యలో గోదా శ్రీరంగేశుల కల్యాణమే ప్రధాన ఇతివృత్తం భూదేవి గోదాదేవిగా జన్మించటానికి హేతువైన విధానాన్ని విష్ణుభక్తి మహాత్మ్యాన్ని వివరించిన విశిష్ట ప్రబంధం ఇది. ఇందులో ఉదాత్తమైన శృంగారం తప్ప ప్రభంద ప్రక్రియల్లో కనిపించే శృంగారం ఇందులో లేదు.

వసుచరిత్రలోని కథకు మూలం భారతం ఆది పరర్వంలోవున్న ఉపరిచర వసు మహారాజు వృత్తాంతం. వ్యాసుని తల్లి అయిన మత్స్యగంధి పుట్టడానికి కారకుడు ఈ మహారాజే. భారతంలో ఇతని కథ చాలా చిన్నదిగా వుంది. భట్టుమూర్తి దానిని తీసుకుని కొద్దిగా మార్పులు చేసి, అద్భుతమైన కల్పనలతో, వర్ణనలతో పెంచి వసు చరిత్రను గొప్ప ప్రబంధంగా రూపొందించాడు. దీనికి సాటి, పోటీ నిలిచే కమనీయ కావ్యం ఇంకొకటి ఆంధ్ర సారస్వతంలోనే కాదు, ఇతర సారస్వతాలలో కూడా లేదనడం అతిశయోక్తి కాదు. దీనిని సంస్కృత, తమిళ భాషలలోకి అనువరించడమే ఇందుకు నిదర్శనం.

పద్యం వినడంతోనే మనస్సులు రంజితమౌతాయి. శబ్దంతో అర్థం ఉయ్యాలలూగుతుంది. సంగీతపు కచ్చేరీ సీసపద్యంలో కొలుపు తీరింది. ఈ సీస పద్యంలో తొలి పాదంలో స్త్రీలక్రీంగంటి చూపులతో మన్మధునితో సమానమైన కాముకుల నిరంతరాయపు కౌగలింత లున్నాయి. రెండవపాదంలో మందమారుతంతో కదిలే తియ్యమామిళ్ల చిగురుటాకులు మెక్కే చిలుకలున్నాయి. మూడవపాదంలో ఆడుతుమ్మెదల సమూహపు రెక్కల చేత నల్లగా అయిన తామరతీగలలో దాక్కన్న చక్రవాక పక్షులున్నాయి. నాలుగో పాదంలో పూపొదరిళ్లలో యథేచ్ఛగా రతికేళి సలిపే జంటలున్నా ఎత్తుగీతిలో గోరంటపూల మొగ్గలు, కోయిల పాటలున్నాయి. పద్య మంతా నిండి పొంగారే వసంత ఋతువు ఉంది.

ఇక కవిగారి సంగీత కళారహస్య నిదిత్వం చూద్దాం.

'అరిగాపంచమ మేళవించినవలా లవ్వేళ హిందోళవై
ఖరిబూనన్ పికజాత మాత్మరవభంగవ్యాకులంబై వనీ
ధరనాలంబిత పల్లవ వ్రతవిధుల్ తాల్పన్ దదీయధ్వనిన్
సరిగా గైకొనియన్ వసంతము మహా సంపూర్ణ భావోన్నతిన్'

స్త్రీలు హిందోళ రాగం పాడితే కోయిలలు బాధ పడ్డాయిట. ఎందుకంటే హిందోళరాగంలో రిషభము పంచమస్వరం ఉండదు. అది అసంపూర్ణ రాగం. అందుకే అవి తపస్సు చేశాయిట. చిగురుటాకులు మాత్రమే తినడం మొదలెట్టాయి. వాటి తపస్సు మెచ్చి ప్రకృతిలో వసంతం వచ్చేసింది. వసంతం అనేరాగంలో రిషభము, పంచమ స్వరం ఉంటుంది. 'అరి'గా అనటంలో 'రి'షభం లేదు హిందోళంలో -'సరి'గా అనటంలో 'రిషభం'

ఉంది. వసంతంలో రిషభ వసంతాలుంటాయి. ఈ పద్యం సాహిత్యం సంగీతం కలసి వాణీవీణలా మొగింది.

కోయిలలు, చిలకలు, వీణానాదాలు, దేవతా స్త్రీలు చారణులు, కిన్నరులు, బృందగీతాలతో కోలాహలంగా ఉంది కోలాహల పర్వతం. అప్పుడు వారికి నాయిక వీణానాద ధ్వనితో కావ్యంలో తొలిసారి ధ్వనిస్తుంది ఆ ధ్వని ఎలా ఉంది.

వీనుల విందై, అమృతపు సోనలపొందై యమం
దసుమ చలదళినీ
గానము క్రందై, యా రవ మానంద బ్రహ్మమయిన
నధిపతి దెలిపెన్

ఇక్కడ ఆనందబ్రహ్మ పదప్రయోగం కవి యొక్క దార్శనిక దృష్టి తెలియజేస్తుంది.

ఆ నాదం ఎక్కడిదో కనుగొనడానికి నర్మసచివుడు వెలతాడు. వెళ్లి కొండమీద పగడాల మంజరులు, వజ్రాల తిన్నెలు, మణిమందిరాలు చూస్తాడు. ఒక మణి మంటపంపై ఓ అందమైన అమ్మాయి వీణవాయిస్తుం టుంది. నర్మసఖుడు ఆ అమ్మాయిని చూసి ఆమె గూర్చి చెప్పడానికి రాజు వద్దకు వెళతాడు. అక్కడ గిరికను ఆపాదమస్తకం వర్ణిస్తాడు. అద్భుతమైన సౌందర్యం కనిపిస్తుంది. ఇక్కడే ప్రక్యాతమైౖ ముక్కుపద్యం కనపడుతుంది.

నానాసూన వితాన వాసనల నానందించు సారంగ మే
లానన్నొల్ల దటంచు గంధఫలి బల్ కాకాకన్
తపంబంది యో
షా నాసాకృతి దాల్చి సర్వసుమన స్సౌరభ్య సంవాసియై
పూనెన్ ప్రేక్షణ మాలికామధుకరీ పుంజంబు
లిర్వంకలన్ (మ.చ.2-47)

ఈ పద్యం ముక్కుతిమ్మన వ్రాస్తే రామ రాజభూషణుడు కొనుక్కున్నాడన్న అబద్ధం ప్రచారంలో ఉంది.

సరే ! అలా వరించిన తర్వాత రాజుగారు ఆమె వివరాలు వెళ్లి అడగలేక పోయావా! అని నర్మ సచివుని అడుగుతాడు. వెళ్లితే 'రసభంగం' అవుతుందని అందమైన పద్యం చెపుతాడు.

'స్వైర విహార ధీరలగు సారసలోచనలున్న చోటికిన్
బోరునలాతివారు చొరబూనినచో రసభంగ మంచు నే
జేరక పూవుతీదీయల చెంతన నిల్చి లతాంగి రూపు క
న్నారగ జూచివచ్చితి నవాంబురుహాంబకనీకు తెల్పగన్'

ఈ పద్యానికి పెద్దాపుర సంస్థానంలోన విద్వత్కవి, వైణికులు శిష్టకృష్ణమూర్తి శాస్త్రిగారు 64 రకాల అర్థాలు చెప్పారట. వాటిలో కొన్ని అర్థాలు చూద్దాం. 'స్వైర విహార ధీరలగు' 'సారసలోచనలు' ఉన్న చోటుకు పరాయి వాళ్లు వెళితే 'రస'భంగం జరుగుతుందిట. 'సారస లోచనలు' అన్న పదంలో 'రస' భంగమైతే 'సా..లోచనలు' అవుతుంది. అదొక విశేషం. అదొక పద చమత్కారం. 'రూపు'కన్నారగ చూడడం అంటే ఆమె రూపాన్ని చూడడం అన్నీ 'ఆమె మెడలోని రూపు' అనే హారాన్ని చూడడమని రెండర్థాలు. రాయల సీమ ప్రాంతంలో పెళ్లికాని పిల్లలే రూపు ధరిస్తారు. ఆమెకు పెళ్లి కాలేదు అనే వస్తుధ్వని ప్రకటించాడు కవి.

'నవాంబురుహాంబక' అన్న పదాన్ని తీసికొని పద్యానికి ఎన్నో అర్థాలు చెప్పవచ్చు. విష్ణుపరంగా 'నవాంబు రుహాంబక'- వికసించిన తామరపూలవంటి కన్నులుగల విష్ణుమూర్తి- స్వైర విహార ధీర అంటే లక్ష్మీదేవి వంటి స్త్రీలవద్దకు నేను వెళ్లగలనా అని అర్థం. శివునిపరంగా నవ-అంబురుహ అంబక నీటి యందుపుట్టిన అగ్ని నేత్రముగా గల శివుడా- స్వైర విహారధర యైన గంగానది వంటి స్త్రీల దగ్గరకు నేను వెల్లితే రసభంగం అవుతుంది. మన్మధునిపరంగా, నవ-అంబురుహ-అంబక-కొత్త తామరలు బాణాలుగా గల మన్మథా, స్యైర్వ విహారధీరలైన రతీదేవి రూపాలుగల స్త్రీల వద్దకు నేను వెలితే రసభంగం కాదా.. ఇలా ఎన్నెన్నో అర్థాలు చెప్పవచ్చు.

రామకృష్ణుడు వివిధ పురాణాల నుంచి తీసుకున్న తొమ్మిది కథలతో స్థలపురాణాన్ని ఐదాశ్వాసాల కావ్యంగా

1302 గద్య పద్యాలలో కథనం చేశాడు. పాండురంగ క్షేత్ర మాహాత్మ్యాన్ని ప్రతిపాదించే ఈ ప్రబంధానికి 'పాండు రంగ మాహాత్మ్యము' అనే పేరుతో పాటు 'పౌండరీక మాహాత్మ్యము' అనే పేరు కూడా ఉన్నట్లు గ్రంథం మొదటగల గద్యమును బట్టి తెలుస్తోంది. పాండురంగ విట్టలుడు మహారాష్ట్రలోని పండరీపురంలో దేవుడు. ఆంధ్రుడయిన రామకృష్ణ కవి ఈ కథను వ్రాయడం విశేషం. ఈ ప్రబంధానికి స్కందపురాణంలోని కథ మూలమని కృతిపతి అంటాడు. కాని స్కందపురాణంలో ఈ కథ కన్పడదు. పద్మపురాణంలో పాండురంగ ప్రసక్తి కొంత ఉంది. వివిధ పురాణాల నుండి తీసుకున్న కథలతో, ఈ స్థలపురాణాన్ని రామకృష్ణుడు రచించి ఉంటాడు. ఇది ఐదు ఆశ్వాసాల కావ్యం. 1302 గద్యపద్యాలతో తొమ్మిది కథలతో దీనిని కవి చెప్పాడు. అందులో 'నిగమశర్మోపాఖ్యానం' ముఖ్యమైన కథ. ఈ అసలు సిసలు తెలుగు కుటుంబ కథను రామకృష్ణుడు నిరుపమానంగా సజీవ భాషలో చెప్పాడు. ఇందులోని పాత్రలన్నిటిలో ప్రత్యేక వ్యక్తిత్వం కనబడుతుంది. అద్భుతమైన శిల్పంతో ఈ ఉపాఖ్యానాన్ని రామకృష్ణుడు రచించాడు. 'నిగమశర్మ అక్క' పాత్ర పాండురంగ మాహాత్మ్యంలోని తృతీయాశ్వాసంలో వుంది. 'పాండురంగ మాహాత్మ్యము' ప్రాచీన కాలపు ప్రౌఢ ప్రబంధాలలో ఎన్నిక కాబడింది. ఆంధ్ర పంచకావ్యాల పట్టికలో పద్దు వేయించుకొంది. శృంగార నైషధము, మనుచరిత్ర, వసుచరిత్ర, ఆముక్తమాల్యద, పాండురంగ మాహాత్మ్యము అనే ఐదింటిని తెలుగులో పంచకావ్యాలంటారు.

BHAVAVEENA
Vol. 18, Issue. 6, June 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# సినారె సినిమా పాటలు పద ప్రయోగాలు

- బి. వెంకటయ్య

తెలంగాణాలో పుట్టి తెలుగు సినీగేయ సాహిత్యాన్ని శిఖరాయమానం చేసిన కవి డా॥సి.నారాయణరెడ్డి ప్రజల నాలుకలమీద నేటికి నాట్యమాడుతున్న పాటలను అనేకం రాశారు. 68వ సంవత్సరంలో పిల్లలకు రంగరించి పోసిన ఆశావాదం ఇప్పుడు తలచుకుంటే పాడినవ్వు పుట్టిస్తుంది. కులాల రొచ్చు రోజు రోజుకూ పెచ్చుపెరిగిపోతున్నది. భాషా వివాదాలు లేవుగానీ మాతృభాషకే ఎగనామం పెట్టే పరిస్థితి దాపురిస్తున్నది. ఉగ్గుపాల సంగతి అలా వొదిలేసి, తెలుగు గురించి మాట్లాడుకుందాం. తెలుగు పిల్లలకు కాన్వెంట్ స్కూళ్ళలో అక్షరాభ్యాసం ఎ.బి.సి.లతోనే. మధ్యలో ప్రవేశిస్తుంది తెలుగు. అదీ ఒక్కొక్క సారి ఐచ్ఛిక విషయంగా, తెలుగు బాగా నేర్చుకుని, ఆపైన ఓపికవుంటే ఇతరభాషలు నేర్చుకోవాలని ప్రబోధించారు. ఈ గీతంలో, ఇప్పుడైతే 'డియర్ కిడ్స్ ! ఆంగ్లభాషతోపాటు కాస్త తెలుగుకూడా నేర్చుకోండి' అని అన్నారు.

"ఆదికవి నన్నయ్య అవతరించిననేల
తెలుగుభారతి అందియలు పల్కె ఈనేల
ఆంధ్రసంస్కృతికి తీయని క్షీరధారలై
జీవకళలొలుకు గోదావరి తరంగాల
ఆడవే జలకమ్ములాడవే".

అప్పటికే ఉన్న తెలుగు బాషసంస్కృతికి ఈ గోదావరి జలాలు క్షీరధారలై జీవ కళలొలికించాయి. 'నీరం' కంటే 'క్షీరం' జీవవర్ధిని కదా ! అదీ ఈ పదప్రయోగంలోని ధ్వని. ఆంధ్ర మహాభారతం తెలుగు భారతి శైశవ దశలో ఉన్న ప్పుడు వెలువడ్డ కావ్యం . ఆ పాలు ఒంటబట్టడం వల్లనే అది క్రమంగా అంతబాగా వర్ధిల్లింది.

"నాగార్జునుని బోధనలు ఫలించిన చోట
బౌద్ధమతవృక్షమ్ము పల్లవించిన చోట
కృష్ణవేణీ తరంగిణి జాలి గుండెలో
సాగరమ్మై రూపు సవరించుకొనునీట
ఆడవే - జలకమ్ములాడవే".

తన బోధనలను వ్యాపింప జేయడంతో పాటు ఆ బౌద్ధమత తరువుకు సరికొత్త చిగుళ్ళ తొడిగించాడు నాగార్జునుడు. అంతటి చారిత్రక ప్రాధాన్యమున్న స్మరణీయ విభవానికి నిత్యసాక్షిగా నిలిచింది. కృష్ణవేణి అయితే గతంలోని ఘనతను నెమరువేస్తూ సాగిపోలేదు ఆ నది. తాను నిండుగా గలగలా సాగిపోతూ ఉన్నా, నీరులేక ఎండిపోతున్న పరిసరాలను చూసి ఆ తరంగిణి గుండె జాలితో జాలువారి సాగరంలా రూపొందిందని చమత్కృతితో వాస్తవికతను అనుసంధించారు.

'చాంగురే బంగారు రాజా' అంటూ పల్లవి ఎత్తు కున్నాను. ఆ తరువాత 'మజ్జారే మగరేడా/ మత్తైన వగకాడా/ అయ్యారే నీకే మనసియ్యాలని ఉందిరా' అంటూ పల్లవి పూరించాను. చాంగురే, మజ్జారే, అయ్యారే అనే పదాలు అచ్చతెలుగువైనా మన వాడుకలో లేనివి. వీటి ప్రయోగాలు ప్రాచీన ప్రబంధకావ్యాల్లో మాత్రమే వున్నాయి.

ఈ పాటలో 'అమ్మకచెల్ల' అనే మరో ప్రయోగం వుంది. ఈ 'అమ్మకచెల్ల' అనే అనే పదాన్ని చేమకూర వెంకటకవి 'విజయవిలాసం' కావ్యంలో యమకగమకంలో 'అమ్మక చెల్ల! నాదు మనసమ్మక చెల్లదు' అని ప్రయోగించాడు.

'ఆలుమగలు విడిపోయినంతనే అనురాగాలే మారునా
విడిగా బతుకులు గడిపినంతనే వివాహబంధం తీరునా'

ఈ పాటలోని చరణాల్లో వివాహ సంబంధమైన సాంప్ర దాయికపదాలు చాలా మెలకువతో ప్రయోగించాను. వివాహం అనేది ఒక విధానం మాత్రమే కాదు, ఒక బాహిరబంధం మాత్రమేకాదు. నుదుట బాసికం, పాదాల పారాణి తీసేయవచ్చు, మాసి పోవచ్చు, అగ్ని సాక్షిగా

అంకితమైన అంతరంగాలు వేరవుతాయా ? ఇదీ నాయిక హృదయమథనంలోంచి వెలువడిన హాలాహలంలాంటి ప్రశ్న.

"కోవెలతలుపులు మూసినంతనే దైవం దూరమైపోవనా
మనసున చీకటికమ్మినంతనే మమతలవెలుగులు మాయునా".

వివాహబంధం అనురాగాన్ని పెనవేసుకున్న విశేష బంధంగా మరింత దృఢమవుతుంది.

"కాకినాడ రేవుకాడ కలుసుకుంటవా - నా
కళ్లలోని బాసలన్ని తెలుసుకుంటవా" అని నాయిక అంటే
"కాకినాడ రేవుకాడ కళ్లు కళ్లు కలుపుకుంటే
ఓడలోని నీటుగాళ్లు ఊరుకుంటరా" అంటారు నాయకుడు.

అచ్చమైన పల్లెపాటల వరుసలో పోతపోసిన ఈ గీతంలో కాకినాడరేవుతో పాటు 'గండిపేట చెరువు' ప్రసక్తి ఉండడం గమనించదగిన అంశం.

"పందిరిలేకుంటే తీగ పైకిపోతుందా
గోడలు లేకుంటే గోపురమే వుంటుందా
పురుషులు లేకుంటే తరుణుల పని గోవిందా"

తనబోధనలను వ్యాపింప జేయడంతో పాటు ఆ బౌద్ధ మత తరువుకు సరికొత్త చిగుళ్ళు తొడిగించాడు కలహ భోజనుడు నారదుడు తెచ్చియిచ్చిన పారిజాత పుష్పాన్ని కృష్ణుడు రుక్మిణిసిగలో తురిమాడని తెలుసుకుని ఆవిడపొందిన క్రోధరూపం 'పారిజాతాపహరణం' కావ్యంలో నందితిమ్మన అచ్చొత్తినట్టు చూపించాడు. ఆ అలకలకొలికి తన ప్రాణేశ్వరుణ్ని పాదతాడనంతో సత్కరించి, అంతలోనే భోరున అశ్రువృష్టి కురిపించి పారిజాతం మొక్కనే నందనవనం నుంచి తెప్పించుకుని తన పెరట్లో నాటించుకుంటుంది.

నా దేశం భగవద్గీత..
ఎక్కడ కెళుతూంది-దేశం
ఏమైపోతూంది ?
హిమశైల శిఖరం పైకా
పాతాళ కుహరం లోకా? (బంగారు మనిషి)

(దీనికి మూలం 'నాదేశం కనిపించింది' అనే సి.నా.రె. కవిత. 'ముఖాముఖి' (1971) కవితా సంపుటి లోనిది)

అంతా నాటకం-మనదంతా నాటకం....
లేనివాడి బతుకే తెరలేని నాటకం
ఉన్నవాడిదంతా తెరచాటు నాటకం
(కాలాంతకులు)

వందేమాతరం... వందేమాతరం
వందేమాతర గీతం వరస మారుతున్నది
తరం మారుతున్నది ఆ స్వరం మారుతున్నది
(వందేమాతరం)

విద్యార్థులు నవసమాజ నిర్మాతలురా
విద్యార్థులు దేశ భావినిర్ణేతలురా
(రంగేళీరాజా)

మొదలైన చైతన్య గీతాలతో తన కలం పదునును రుజువు చేసుకొన్నారు సి.నా.రె.

పగలే వెన్నెల-జగమే ఊయెల
కదలే ఊహలకే కన్నులుంటే
పగలే వెన్నెల-జగమే ఊయెల
నింగిలోన చందమామ తొంగిచూచె
నీటిలోన కలువభామ పొంగిపూచె
ఈ అనురాగమే జీవనరాగమై
ఎదలో తేనెజల్లు కురిసిపోదా ॥ పగలే॥
(పూజాఫలం)

ఇది అచ్చమైన భావగీతం. సి.నా.రె. పేరు చెప్పగానే గుర్తొచ్చే పాట. సినీకవిగా సి.నా.రెకి గుర్తింపు తెచ్చిన పాట.

చరణకింకిణులు ఘల్లుఘల్లుమన
కరకంకణములు గలగలాడగ
వినీల కచభర విలాసబంధుర
తనూలతిక చంచలించిపోగా

పల్లవి : ఆడవే మయూరీ-నటన మాడవే మయూరీ
(చెల్లెలి కాపురం)

ఈ పాటలతో పాటు ఇలాంటి పాటలెన్నిటికో సి.నా.రె.కి నంది బహుమతులు, జాతీయ పురస్కారాలు రావాల్సింది. కాని ఆయనకు సినీకవులకు నంది పురస్కారాలు

ప్రారంభించిన పాతికేళ్ల తర్వాత ఈ దశాబ్దిలో రాసిన

1. కంటేనే అమ్మ అని అంటే ఎలా
కరుణించే ప్రతి దేవత అమ్మే కదా.. కన్న అమ్మే కదా
(ప్రేమించు-2001)

2. ఇదిగొ రాయల సీమ గడ్డ...
దీని కథ తెలుసుకో తెలుగుబిడ్డ
(సీతయ్య-2003)

అనే పాటలకు మాత్రమే నంది పురస్కారాలు లభించాయి.

ప్రతిమనిషి వ్యక్తిత్వం స్వతంత్రమైందిగా ఉండాలని పల్లవిలో ప్రతిపాదిస్తూ ఇలా రాశాను.

"ఎవరికీ తలవంచకు- ఎవరినీ యాచించకు
గుండెబలమే నీ ఆయుధం - నిండుమనసే నీ ధనం"

ఈ పల్లవిలోని తలవంచని మనస్తత్వాన్ని మాస్టర్ వేణు భావగర్భితంగా స్వరపరిచారు. ఎవరికీ ఎవరినీ అనే పదాల్లోని చివరి అక్షరాలను పై స్థాయిలో సాగదీయడం ఈ బాణీ జనప్రియంకావడంలో తోడ్పడింది. ఒక చరణంలో పల్లవిలోని భావాన్నే ఇలా విస్తరించాను.

"చాలీచాలని జీతంతో - మిడి - మేలపు కొలువులు కొలవకు
ముడుచుకుపోయిన ఆశలతో - మిడిమిడి బతుకును గడపకు.
చీకటి రాజ్యం ఎంతోకాలం - చెలాయించదని మరువకు"

మనిషి ఎదుగుతూ బతకాలి. స్వతం కాళ్ళమీద నిలవాలి. ఇప్పుడున్న ప్రతికూల స్థితి ఎప్పుడూ ఉంటుం దనుకోవద్దు. మంచిరోజులొస్తాయనే ఆశావాదం ఈ చరణంలో ధ్వనింపజేశాను. మరోచరణంలో మరీ అంతసూటిగా వెళ్లినా మనుగడకే ప్రమాదమని చిరు హెచ్చరిక చేశాను. జీవితాన్ని సరికొత్తగా ఉపమిస్తూ ఇలా సాగింది ఆ చరనం.

"జీవితమే ఒక వైకుంఠపాళి - నిజం తెలుసుకోభాయీ
ఎగరేసే నిచ్చెనలే కాదు - పడదోసే పాములు ఉంటాయి
చిరునవ్వులతో విషవలయాలను - ఛేదించి ముందుకు పదవోయి"

వైకుంఠపాళి ఆటతెలిసిన వాళ్ళకు ఇందులోని నిచ్చెనలేమిటో, పాములేమిటో వివరించనక్కరలేదు. లక్ష్యసాధన అంత సులభమైందికాదని, నిచ్చెనలెక్కగానే సరిపోదని ఆ పక్కనే వున్న పాముల్ని గమనించాలని ఈ చరణం చెబుతుంది. అయితే ఇందులోని కొసమెరుపు పాముల్ని చంపమనేబదులు 'విషవలయాలను ఛేదించి ముందుకు పదవోయి' అనడంలో ఉంది. అయితే అందుకు చిరునవ్వు సరిపోతుందా? ఆ చిరునవ్వు కేవలం పెదవిమీద అతికించుకున్నది కాదు. విషమపరిస్థితులకు చెదిరిపోని గుండెబలానికి ప్రయోగించిన సంకేతమది.

'భలేమొనగాడు' లోని ఒక గీతం. ఈ గీతంలోని వస్తువు 'మనిషి'. పిడికెడుగుండె కడలిగా మారదా ? ఔను. అదే

"మనిషి తలచుకుంటే - గిరులు ఝురులుగా పొంగవా
అవని దివికి ఉప్పొంగదా"

మానవ సంకల్పంలోని ఈ అనర్గళశక్తిని విస్తరింప జేశాను చరణాల్లో,

చంద్రబింబమున పందిరివేసి - సూర్యగోళమున పీఠంవేసి
గ్రహతారకల గతులేమార్చి - కల్లోలం కలిగించడా -
మనిషి తలచుకుంటే - "

చంద్రబింబంలో కాలుమోపడం నిన్నటి నిజం. సూర్యగోళాన్ని అందుకోవడం సుందరస్వప్నం. అంతటి తోనే కాదు ఆ సాధన పూర్తయ్యేది. 'సత్యాగ్రహమే ఆయుధమ్ముగా/ మృత్యువునే ఎదిరించడా' అంటూ మృత్యుంజయత్వానికి మర్త్యుడనబడే నరుడు చేస్తున్న నిరంతర కృషిని స్ఫురింపజేశాను. ఈ గీతంలోని చివరి

చరణం సినిమాల్లోని క్లైమాక్స్ సన్నివేశంలా బహువేగంగా అంటే ద్రుతగతిలో ఇలా చెలరేగిపోతుంది

"సప్తమరుత్తులు సర్వసరిత్తులు - విక్రమించినా
ప్రళయాంభోధరచలచ్చంచలలు - విభ్రమించినా
దిక్పాలకులే ధిక్కరించినా - యక్షరాక్షసులు హుంకరించినా
మనిషి ఓడునా - ప్రగతి ఆగునా"

పై పంక్తుల్లో - కథానాయకుడు సామాన్యుడే అయినా అతని సంకల్పబలం ఎంత వజ్రసదృశమైందో అంటూ చక్కని పదప్రయోగాలతో సినారె సినీగేయాలను రచించారు.

# స్త్రీ విద్య నాడు – నేడు

– డా॥. శిరీష ఈడ్పుగంటి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, శ్రీ వేకంటేశ్వర డిగ్రీ కాలేజి, ఢిల్లీ.

సమాజంలో మనిషికి విద్య అనేది చాలా అవసరం. అది స్త్రీకైనా, పురుషుడికైనా. విద్య లేనివాడు వింత పశు వుతో సమానం అనే నానుడి కూడా ఉంది. కాని విద్యను అభ్యసించడం అనేది ఒకప్పుడు పురుషులకు మాత్రమే ఉన్న అవకాశం. ఆ అవకాశం స్త్రీలకు ఉండేది కాదు. వారు కేవలం ఇంటి పనులు మాత్రమే చూసుకునేవారు. ఇదంతా స్వాతంత్ర్యానికి ముందుతరంలో ఉండేది. ఆ తరంలోనే కొంతమంది సంఘసంస్కర్తలు స్త్రీలకు కూడా కొంతవరకు చదువు అవసరం అని గుర్తించారు. వారిలో ప్రథములు కందుకూరివారు. వారు స్త్రీని ఆదర్శ వంతమైన గృహిణిగా చూడాలనుకున్నారు. అందుకోసం స్త్రీలకు కొంతవరకు విద్య అనేది తోడ్పడుతుందని భావించారు. అంతేగాకుండా సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉండాలని, సాహిత్యం ద్వారా సమాజాన్ని సంస్కరించాలని, జనంలో జాతీయ భావనలు మేల్కొల్పా లని కోరుకున్నారు. స్త్రీలకు అర్థమయ్యే రీతిలో చిన్న చిన్న కథలు రాసేవారు. అవి స్త్రీలకు చదువు పట్ల ఆసక్తి కలిగేవిధంగా ఉండేవి. కొంతమంది రచయితలు స్త్రీ చైతన్య సాధన కోసం సాహిత్య కృషిచేశారు.

స్త్రీ అభ్యుదయానికి పునాది విద్య. నాడు విద్యను స్త్రీలు అభ్యసించే అవకాశం లేకపోవడమే ప్రధాన సమస్య. పురుషులు నేర్చుకునే విద్యను కాకుండా పతివ్రతా ధర్మాలు బోధించే విద్యను మాత్రమే నేర్చుకోవాలి. అది కూడా పురుషులు నేర్చుకునే విధానంలో కాదు, ఇంటిపట్టునే ఉండి చదువుకోవాలి. ఆవిధంగానే చాలా మంది గృహిణులు, బాలికలు ఆరోజుల్లో చదువుకునే వారు. పురాణాలు, ఇతర భక్తిరచనలు చదవడం ప్రారంభించారు. అంతేగాకుండా కుటుంబంలో సోద రులు చదువుకునేటప్పుడు విని నేర్చుకునేవారు. అది కూడా విద్యావంతుల కుటుంబాల్లో మాత్రమే ఈ తరహా స్త్రీల చదువు కనిపించేది. మిగతా కుటుంబాల్లో స్త్రీలకు ఆ చదువూ ఉండేది కాదు. ఈవిధంగా భక్తిరచనలు, పురాణాలు చదివిన స్త్రీలు వాటి ఆధారంగానే మెలమెల్లగా రచనలు చేయడం కూడా ప్రారంభించారు. ఆరోజుల్లో ప్రధానంగా కనిపించే సమస్యలపై రచనలు చేయడం మొదలుపెట్టారు. బాల్యవివాహాలు, కన్యాశుల్కం, వేశ్యా వృత్తి మొదలైన సమస్యలను రచనలలో చర్చించేవారు. అంతేగాకుండా చదువుకున్న స్త్రీలు చదువులేని స్త్రీల పరిస్థితి గూర్చి రాసేవారు. ఒకరకంగా వారిలో చైతన్యాన్ని కలగజేసేవిధంగా రచనలుండేవి. రచనలే కాకుండా పత్రికలు, సంస్థలను నెలకొల్పారు. వాటిల్లో స్త్రీ చైతన్యానికి సంబంధించిన చర్చలు చేసేవారు. స్త్రీలకు చదువు లేకపోవడం వలన కలిగే ఇబ్బందులను గూర్చి కథల రూపంలో పత్రికలలో రాసేవారు. ఆ పత్రికలకు స్వయంగా స్త్రీలే సంపాదకత్వం వహించేవారు.

పంతొమ్మిదవ శతాబ్ది ప్రారంభంలో స్త్రీలలో చదువు అనేది చాలా తక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. తదుపరి కాలంలో స్త్రీ బడికి వెళ్ళి భారతీయ భాషల్లో చదువు నేర్చుకునే అవకాశాలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. అంతేకాకుండా ఆనాడు సమాజంలోని సతీసహగమనం, బాల్యవివాహాలు వంటి దురాచారాలు కూడా క్రమంగా తగ్గుతూ వచ్చాయి. విధవా పునర్వివాహాలకు సమాజంలో ఆమోదం వచ్చింది. ఈవిధంగా ఇరవైశతాబ్ది పూర్వంలో కొన్ని చిన్నచిన్న మార్పులు వచ్చినప్పటికీ స్త్రీవిద్యలో చెప్పుకోదగినంత మార్పు ఏమీలేదు. స్త్రీ పురుషునితో సమానంగా ఇంగ్లీషు చదువు చదవకూడదు. అతనితో ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పడకూడదు. వికాసం పొందిన గృహిణిగా రూపొంది భర్త అవసరాలు, పిల్లల చదువు చూసుకుంటూ, పిల్లలకు పొదుపు, పరిశుభ్రత, క్రమశిక్షణ లాంటి విలువలు నేర్పడమే జీవిత పరమార్థం

అయ్యింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశ పునరుద్ధరణ కార్యక్రమాల్లో భాగంగా స్త్రీవిద్య మరోఊపు అందుకుంది. ఈ విషయంలో పత్రికలు ప్రముఖపాత్ర వహించాయి. కొంతమంది రచయితలు వేశ్యలను విద్యావంతులుగా, పండితురాండ్రుగా చూపడం కూడా జరిగింది.

### ఆనాటి రచయిత్రులు :

స్త్రీవిద్య పై ఆనాటి రచయిత్రులలో ఒకరిద్దరి అభిప్రాయాలను ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. వీటి ద్వారా ఆరోజులలోని స్త్రీలకు చదువుకునే అవకాశాలు ఎంతవరకు ఉండేవి అనే విషయం తెలుసుకోవచ్చు. స్త్రీవిద్య కోసం రచనల ద్వారా వీరు చేసిన కృషిని, స్త్రీవిద్య ఆవశ్యకత మొదలైన అంశాలను గమనించవచ్చు.

**భండారు అచ్చమాంబ :**

తొలికథా రచయిత్రి. ఈమె రచనలలో స్త్రీవిద్య ఆవశ్యకత, దేశభక్తి, స్త్రీ చైతన్యం మొదలైన అంశాలు కనిపిస్తాయి. 'జీవితంలో విశేషంగా కృషి చేసిన స్త్రీల జీవితాలను తెలియజేయడం ద్వారా స్త్రీలు బలహీనులని, తెలివితేటలు, నైతికతలో తక్కువవారని ఉన్న అభిప్రాయాన్ని సరిదిద్దారు. చదువుకు, స్వేచ్ఛకు అవకాశం కలగజేస్తే స్త్రీలు చెడిపోగలరు లేదా హద్దు మీరతారన్న అపోహను తొలగించారు.' వాస్తవ, చారిత్రక స్త్రీ జీవితాలను ఇతివృత్తాలుగా చెప్పడం ద్వారా స్త్రీ చైతన్యానికి పూనుకున్నారని తెలుస్తుంది.

**మల్లాది సుబ్బమ్మ :**

ఎనిమిదేళ్ళ వయసు బాలికలకు వివాహం చేసే ఆరోజులలో ఈమె పదమూడవయేట వరకు చదువుకోగలగడం విశేషం. ఇదంతా తండ్రి అభ్యుదయభావం అని సుబ్బమ్మగారు ఆత్మకథలో పేర్కొన్నారు. 'పెళ్ళైన తర్వాత చదువుకు అత్తగారు మొదట అనుమతించలేదు. ఆరోజులలో మగ టీచర్ల దగ్గర చదువుకోనిచ్చేవారు కాదు. ఇళ్ళకు వచ్చి ట్యూషన్లు చెప్పే ఆడటీచర్లు ఉండేవారు కాదు. వేరే ఇంటికి ట్యూషన్ల కోసం వీళ్ళను పంపించేవారు కాదు. పిల్లలు పుట్టిన కొంతకాలం తర్వాత అత్తగారే స్వయంగా సుబ్బమ్మగారిని చదువుకోమన్నారు.

కుటుంబ నియంత్రణ డిప్లొమా, ఫ్యామిలీ వెల్ఫేర్ వర్కర్స్ ట్రైనింగ్ ఒక సంవత్సరం తీసుకున్నారు. తదనంతరం భర్త అనుమతితో ఉద్యోగం కోసం అప్లై చేశారు. అయితే ఉద్యోగం ఇచ్చే ఆఫీసర్ కూడా భర్త అనుమతి ఉందా అని అడుగుతాడు. భర్త అనుమతితో ఇచ్చిన లేఖ చూపించిన తర్వాత సుబ్బమ్మగారికి ఉద్యోగం ఇస్తారు'. అంటే ఒక స్త్రీ కుటుంబపరంగా భర్త అనుమతి తీసుకోవడం సాధారణమే. కాని ఉద్యోగానికి కావలసిన అర్హతలలో చదువుతో పాటు భర్త అనుమతిలేఖ అడగడం ఆ రోజులో కనిపిస్తుంది.

### స్త్రీవిద్యకై తోడ్పడిన మహానుభావులు :

స్త్రీ విద్యకై తోడ్పడిన పురుషులను ఒకసారి గుర్తుకు తెచ్చుకోవడానికి ఒకరిద్దరి గూర్చి ప్రస్తావిస్తున్నాను. కందుకూరి, గురజాడ మొదలైనవారు స్త్రీ విద్యకై కొంతవరకు సాహిత్య కృషి చేసినట్లు తెలుస్తుంది. బాపూజీ, వివేకానందుడు మొదలైనవారు కూడా స్త్రీకి గృహపక్షమైన విద్య ఉండాలని ఆశించారు. వీరేకాకుండా ఇంకా మరికొందరు స్త్రీ ఉన్నతవిద్య, చైతన్యానికి విశేషమైన కృషి చేసినట్లు తెలుస్తుంది. వారిలో

**ప్లేటో :**

స్త్రీవిద్యకు అత్యున్నత స్థానం కల్పించారు. ఈయన శిష్యులలో మగవారు, ఆడవారు అందరూ ఉండేవారు. అందరికీ సమానంగా సూచనలిచ్చేవారు. ఉన్నత చదువుతో పాటు ఈత, గుర్రపుస్వారీ, యుద్ధవిద్యలను కూడా స్త్రీలు నేర్చుకోవాలని అన్నారు. అన్ని రంగాలలోను స్త్రీలకు ప్రవేశముండాలని కోరుకున్న వ్యక్తి.

**ఈశ్వర చంద్ర విద్యాసాగర్ :**

మగవారైనా, ఆడవారైనా స్త్రీవిద్యను గూర్చి ప్రస్తావించడానికి వీలులేని కాలంలో ఈయన స్త్రీవిద్యను ప్రోత్సహిస్తూ ఒక పుస్తకం రాశాడు. కొంతమంది

ఆంగ్లేయుల సహాయంతో హిందూ బాలికా విద్యాలయం స్థాపించాడు. అందులో బాలికలను చేర్పించమని ఇంటింటికి వెళ్ళి అడిగేవాడు. స్త్రీవిద్యపై అనేక వ్యాసాలు, ప్రసంగాలు చేసి స్త్రీలలో చైతన్యాన్ని కలిగించిన వ్యక్తి. స్త్రీవిద్య కొరకై తన సుఖమయ జీవితాన్ని త్యాగం చేసి సంఘంలో అనేక అవమానాలను ఎదుర్కొని చివరకు స్త్రీలలో కొంతవరకు మార్పు తీసుకురాగలిగాడు. స్త్రీ చైతన్యానికి పూనుకున్న మహనీయుడు.

## చారిత్రక ఆధారంగా స్త్రీవిద్య :

భారతదేశ చరిత్రను పరిశీలిస్తే అనేక శతాబ్దాల నుండి చదవడం, రాయడం నేర్చుకున్న స్త్రీలు చరిత్రలో ఉన్నట్లుగా కనబడతారు. కాని ఆ కాలంలో చదువుకునే సంప్రదాయం కొంతమంది బాలికలకు మాత్రమే పరిమితమైంది. ప్రధానంగా కొన్ని కులాలకు మాత్రమే. దేవదాసీ సముదాయానికి చెందిన బాలికలు దేశీయ, గ్రామీణ పాఠశాలలో అబ్బాయిలతో పాటుగా చదువుకునే వారు. 1813 లో దక్షిణ భారతదేశానికి క్రైస్తవమిషనరీలు రావడంతో దాని ప్రభావం బాలికల విద్య మీద పడింది.

## బాలికల కోసం స్థాపించబడిన పాఠశాలలు :

1820 దశకం మొదటిభాగంలో మద్రాసు దగ్గరున్న వెపెరిలో spckవారు (Society for Promoting Christian Knowledge) ఒక బాలికా పాఠశాలను ప్రారంభించారు. 1841లో నెల్లూరులో అమెరికన్ బాప్టిస్టుమిషన్ వారు ఒక బడి, 1842లో గుంటూరులో అమెరికన్ లూథరన్ మిషన్ వారు ఇంకొక బడి, 1849లో రాజమండ్రిలో మరొక బడి స్థాపించారు. ఇవికాక తర్వాతి కాలంలో మరికొన్ని బాలికా పాఠశాలలు స్థాపించబడ్డాయి. హిందూ, ముస్లిం బాలికలు కూడా ఈ పాఠశాలలో చదివేవారు. 1841లో మద్రాసులో జాన్ ఆండర్సన్, బ్రెడ్‌వుడ్, అతని భార్య కలిసి బాలికల కోసం ఒక మిషనరీ స్కూల్ స్థాపించారు. 1847 నాటికి ఆ బడిలో మూడువందల కన్నా ఎక్కువమంది బాలికలు చేరారు. 1850 తర్వాత దక్షిణ భారతదేశంలో బాలికల చదువు విషయంలో మరింత పురోగతి కనిపిస్తుంది.

తెలుగు జిల్లాలలో కూడా స్త్రీవిద్య విషయంలో కొన్ని ప్రయత్నాలు జరిగాయి. "1867లో విశాఖపట్టణంలో జమీందార్ల కుటుంబానికి చెందిన గోడె జానకమ్మ ఒక స్కూల్ ప్రారంభించారు. బ్రాహ్మణ, కోమటి, తెలగ, కులాలకు చెందిన బాలికలు ఇందులో చదివేవారు. 1868లో కాకినాడలో అప్పటి విజయనగరం మహారాజా వారు ఒక పాఠశాలను, పిఠాపురం రాజావారు మరొక పాఠశాలను స్థాపించారు. 1874లో ధవళేశ్వరంలోను, 1881లో రాజమండ్రిలోను వీరేశలింగం పంతులుగారు బాలికల పాఠశాలలను స్థాపించారు. 1880 - 1920 ప్రాంతంలో బాలికల విద్యారంగంలో గణనీయమైన ప్రగతి కనబడుతుంది. స్త్రీ అధ్యాపకుల కొరతను అధిగమించడానికి ఇరవయ్యో శతాబ్దపు మొదట్లో చాలామంది వితంతువులకు శిక్షణ ఇచ్చారు". (రాజ గోపాల్, వకుళాభరణం. (సంపా.) 2005: 12 - 14) ('ఆత్మ చరితాని'కి చారిత్రక నేపథ్యం).

నేడు స్త్రీవిద్యా విధానంలో ఆనాటితో పోలిస్తే గణనీయమైన మార్పులు కనిపిస్తాయి. పురుషులతో పాటుగా స్త్రీలు కూడా సమానంగా చదువుతున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. రచనలు చేస్తున్నారు. విదేశాలలో చదువుతున్నారు. ఎంతదూరమైనా కష్టమైనా స్త్రీ పురుష భేదం లేకుండా వెళ్ళి పనిచేస్తున్నారు. ఉన్నచోటనే ఉండి పనిచేస్తున్న వాళ్ళు ఉన్నారు. అనేక సంస్థలు, పత్రికలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్య, వైద్య సంస్థలను నడుపుతున్నారు. పారిశ్రామికరంగంలో రాణిస్తున్నారు. మీడియాలో పనిచేస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తిలోనూ ఉంటున్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా వివిధ సంస్థలలోనూ పనిచేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలలోనూ విధులు నిర్వహిస్తున్నారు. రక్షణ శాఖలలోనూ ఉంటున్నారు. చివరికి రాజకీయాలలోకి కూడా వస్తున్నారు. దేశమంతటా అన్ని రంగాలలోనూ స్త్రీలు

తమ విధులు నిర్వహిస్తున్నారు. ఇదంతా స్త్రీ చదువు కోవడం వలన చేయగలుగుతుంది. సమాజం కూడా ఆవిధంగానే స్త్రీని ప్రోత్సహిస్తోంది. ఇందుకు తల్లి దండ్రులు, గురువులు తోడ్పాటుగా ఉంటున్నారు. అంతేగాకుండా స్త్రీలకు కావలిసినంత స్వేచ్ఛను కూడా ఇస్తున్నారు. ఈవిధంగా మహిళాలోకం కొంతవరకు ముందుకు వెళుతున్నదని చెప్పవచ్చు.

కాని కొన్ని ప్రాంతాలలో స్త్రీలు ఇంకా ఇప్పటికీ వెనుక బడే ఉన్నారు. కొన్నిచోట్ల పాతరోజులే కనబడుతున్నాయి. బాల్యవివాహాలు, వరకట్న సమస్యలు, చిన్నపిల్లలను పనిలో పెట్టుకోవడం, ఆడపిల్లలకు చదువులేకపోవడం వంటివి మనం అక్కడక్కడ చూస్తూనే ఉంటాం. ఆడ పిల్లలు పుడితే పాపం అనుకునేవాళ్ళు ఉన్నారు. ఆడ పిల్లలకు చదువు అవసరం లేదనే విషయం పక్కన పెడితే అసలు ఆడపిల్లలే వద్దనుకునేవారున్నారు. అబార్షన్లు, ఆడపిల్ల పుట్టిన వెంటనే ఎక్కడో ఒక చోట వదిలివేయడం మనం నిత్యం వార్తాపత్రికలలోనూ, మీడియాలోనో చూస్తూంటాం. వీటి నిమిత్తం ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఇంకా అవి ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. కొన్ని కుటుంబాలలో మగపిల్లలు పుట్టేంతవరకు ఆడపిల్లలను కంటూనే ఉంటారు. ఇద్దరు, ముగ్గురు, నలుగురూ అమ్మాయిలు ఇలా ఎంతమంది అయిన సరే అబ్బాయి పుట్టేంతవరకు కంటూనే ఉం టారు. అలాగే ఒక్క అబ్బాయి ఉంటే ఒంటికాయ సొంటికొమ్ము అనే సామెత చెప్పి ఇద్దరు మగ పిల్లలు పుట్టేంత వరకు పిల్లల్ని కంటూనే ఉంటారు. ఒకరకంగా చెప్పాలంటే కుటుంబంలో ముఖ్యంగా స్త్రీలు చదువుకోక పోవడం వలన ఇటువంటివి జరగడానికి కారణం అవుతున్నాయి. అయితే మరికొన్ని చోట్ల చదువుకున్న వాళ్ళు కూడా ఇదే పని చేస్తున్నారు. ఇందుకు కుటుంబంలో ఉన్న కొన్ని నమ్మకాలు, ఆచారాలు కారణం కావచ్చు. అబ్బాయిల్ని ప్రైవేటు స్కూళ్ళల్లోనూ, అమ్మాయిల్ని గవర్నమెంటు బడుల్లోనూ చేర్పిస్తున్నారు. కొంతమంది అయితే అబ్బాయిల్ని మాత్రమే చదివిస్తు న్నారు. అమ్మాయిల్ని ఇంటిపనుల్లో ఉంచుతున్నారు. దీనికి కారణం ఒకటి ఆర్థికపరమైన సమస్య. చదివించే స్తోమత లేకపోవడం. రెండు స్తోమత ఉన్నప్పటికీ అమ్మాయికి పెళ్ళి చేసినపుడు కట్నం ఇవ్వాలి అనే ఉద్దేశ్యంతో కూడా ఈవిధంగా జరుగుతున్నాయి.

అయితే ప్రస్తుత రోజుల్లో వీటన్నింటి కంటే ప్రమాదకర మైనది స్త్రీకి రక్షణ లేకపోవడం. ఎక్కడ చూసినా అత్యా చారాలు, ఆ పై హత్య ఇటువంటి సంఘటనలే నేడు పత్రికలు, మీడియాలో కనిపిస్తున్నాయి. ఇటువంటి ఒక సంఘటన జరిగిన తదుపరి దానివెనువెంటనే అటువంటి సంఘటనలు పదే పదే వస్తుంటాయి. వీటిలో కొన్ని వాస్తవాలు కావచ్చు. మరికొన్ని అవాస్తవాలు కూడా కావచ్చు. కాని ఈ సమస్య మాత్రం ప్రస్తుత కాలంలో ఎక్కువగా ఉంది. దీనిపై పత్రికలు, మీడియా కూడా శ్రద్ధ వహించి ఎక్కడ ఏం జరిగినా వెలికితీసి ప్రజల దృష్టికి తెస్తుంది. చివరికి చిన్నపిల్లలు సైతం దీనికి బలి అవుతున్నారు. కావున నానాటికీ పెరిగిపోతున్న ఈ సమస్యను తుదముట్టించాలి. అందుకు తగినవిధంగా స్త్రీ, సమాజం, ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఇటువంటి పరిస్థితుల కారణంగా స్త్రీ ఈ రోజుల్లో కూడా చదువుకోలేక పోతూంది. తల్లిదండ్రులు చదివించాలా వద్దా అనే సందిగ్ధంలో పడుతున్నారు.

ఆధునిక సాహిత్య ప్రక్రియలైన నవల, నాటకం, కథ, స్వీయచరిత్ర, జీవితచరిత్ర మొదలైన ప్రక్రియలు స్త్రీల జీవితాల్ని చిత్రిస్తున్నాయి. వివిధ పత్రికలు, సంస్థలు, స్త్రీలకు విద్య అనేది ఎంత అవసరమో తెలుపుతున్నాయి. తద్వారా స్త్రీలను చైతన్యవంతం చేస్తున్నాయి. ప్రగతి మార్గంలో నడిపిస్తున్నాయి. స్త్రీలు చదువుకుని ఎంత ముందుకు వెళ్ళినా, ఎక్కడో ఒకచోట ఇంకా వెనుక బడుతూనే ఉన్నారు. ఈనాడు పత్రిక వసుంధరలో వరం గల్లు జిల్లాలో జరుగుతున్న బాల్యవివాహాలను గూర్చి, బాలికలను చదివించకపోవడం మొదలైన సమస్యలను

గూర్చి రాస్తూ, తరుణి సంస్థవారు వాటిని అడ్డగిస్తూ ఉన్నప్పటికి ఇంకా జరుగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సంస్థే ఈ సమస్యల పరిష్కారానికిగాను ఇటీవల కొత్తగా తరుణి పత్రిక ప్రారంభించినట్లు తెలుస్తుంది. అలాగే ఎప్పటినుంచో స్త్రీలకు సహాయం అందిస్తున్న మరొక సంస్థ భూమిక హెల్ప్‌లైన్ కేంద్రం. ఇలా ఎన్నోరకాల సంస్థలు, పత్రికలు మీడియా ఈ సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తున్నాయి. ఈ సమస్యలన్నింటికి మూలకారణం స్త్రీకి విద్య లేకపోవడమే.

## ముగింపు :

ఇప్పటికీ ఇంకా అక్కడక్కడ జరుగుతున్న బాల్య వివాహాలను ఖండించి, వరకట్న సమస్యలను నిర్మూలించి, అత్యాచారాల వంటి అమానుష చర్యలను ప్రతిఘటించి మరెక్కడా ఇటువంటివి జరగకుండా చూసినప్పుడే స్త్రీస్వేచ్ఛగా ఉండగలుగు తుంది. ఇందుకుగాను ప్రజలు, ప్రభుత్వం కృషిచేయాలి. అప్పుడే స్త్రీ విద్యా విధానం అనేది సక్రమంగా జరుగుతుంది. సమాజం తద్వారా దేశం ప్రగతిపథంలో నడుస్తుంది.

## ఉపయుక్త గ్రంథసూచి :

1. అచ్చమాంబ, భండారు. 1917. అబలా సచ్చరిత్ర రత్నమాల (ద్వితీయ సంపుటం). వేదం అండ్ కంపెనీ ముద్రాక్షరశాల, మద్రాసు.
2. సత్యవతి, ఏడిదము. 2005. ఆత్మచరితము. (సంపా. రాజగోపాల్, వకుళాభరణం) అస్మిత రిసోర్స్ ప్రచురణ. సికింద్రాబాద్.
3. సుబ్బమ్మ, మల్లాది. 1991. పాతివ్రత్యం నుంచి ఫెమినిజమ్ దాకా. మల్లాది సుబ్బమ్మ ట్రస్టు ప్రచురణ. హైదరాబాదు.

# మాతృభాషను కాపాడుకోవడం మనందరి కర్తవ్యం

- డా॥. కడివెండి మమత, సహాయ ఆచార్యులు, బద్రుకా వాణిజ్య మరియు కళల కళాశాల, హైదరాబాద్.

'దేశ భాషలందు తెలుగు లెస్స' అని అన్నారు శ్రీకృష్ణ దేవరాయలు. తెలుగు భాషలోని మాధుర్యం, గొప్పతనం ఇక ఏ భాషలోనూ లేదని చాలా మంది కవులు చెప్పారు. సుసంపన్నమైన మన భాషా సాహిత్య సౌందర్యాన్ని అవగాహన చేసుకోవడం, మన భాషను, సంస్కృతినీ కాపాడుకోవడం, భావి తరాలవారికి దీన్ని అందించడం ఆ భాషా సౌందర్యసంపదను కాపాడటం అందరి కర్తవ్యం.

తెలుగులో వాడుక భాషా ఉద్యమ పితామహుడు, గిడుగు వెంకట రామమూర్తి గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియజెప్పిన మహనీయుడు. ఆంధ్రదేశంలో వ్యావ హారిక భాషోద్యమానికి మూలపురుషుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది. శిష్టజన వ్యవహారికభాషను గ్రంథరచనకు స్వీకరింప జేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చతెలుగు చిచ్చర పిడుగు గిడుగు. 'నాది బడి పలుకుల భాష కాదు.. పలుకుబడుల భాష.. నా మాతృభాష తెలుగు' అని ఎలుగెత్తి చాటిన మహనుభావుడు కాళోజీ. తెలంగాణ పలుకుబడితో ప్రజల మాట, వ్యథలను ఆయన వ్యక్తం చేసిన తీరు అమోఘం. అందరికీ ఆదర్శప్రాయం.

తెలుగు ప్రజలంతా అమ్మ భాషకు పునరంకితం కావాలి. తెలుగు భాషకు అంతర్జాతీయ స్థాయిలో గౌరవం కల్పించాలి. మన భాషను, యాసను మర్చిపోకూడదు. మన పాతతరం మనకందించిన భాషా నుడి కారాలు, సాహిత్య సౌరభాలను మనం కొత్త తరానికి అందించాలి. గురువుకు ఉన్న స్థానం ఎంతో ఉన్నతమైనది. అందుకు గూగుల్ ప్రత్యామ్నాయం కాదు. నెలకోసారి తెలుగు నేలను తాకకపోతే ఏదో కోల్పోతున్నట్లుగా అనిపిస్తుంది.

ఎంతటివారికైనా అమ్మ ఒడే మొదటి బడి. అక్కడి నుంచే మన జీవిత ఒరవడి, నడవడి ప్రారంభమవు తుంది. తల్లి బిడ్డకు చనుబాలు తాగిస్తూనే "జో అచ్యుతా నంద జో జో ముకుందా" అంటూ బిడ్డను ఆదర్శ వంతుడిగా మారాలని ఆకాంక్షిస్తోంది. అందుకే బిడ్డకు మొదటి గురువు మాతృమూర్తే. సరళమైన, కమ్మనైన తేట తెలుగు భాషలో... ఒడిలో పాఠాలను, బతుక సారాన్ని విడమరిచి చెప్పే అద్భుతమైన గురువులు ఆరోజు ఈరోజు ఉన్నారు కాబట్టే మన భాష విలసిల్లుతోంది. అమ్మ భాషను అందలం ఎక్కించాలి. తెలుగు వెలుగును ప్రపంచానికి ఘనంగా చాటాలి. అంతర్జాతీయంగా తెలుగు భాషకు పట్టం కట్టేందుకు తెలుగు వారందరం కృషి చేయాలి.

తల్లిపాల వంటిది మాతృభాష, పోతపాల వంటిది పరభాష" అన్నారు ప్రముఖ భాషావేత్త కొమర్రాజు గారు. 'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్'గా విదేశీయులు మన తెలుగు భాషను పేర్కొన్నారు. కానీ మన మాతృభాష తెలుగు రోజురోజుకు నిరాదరణకు గురవుతున్నది. మాతృభాష అంటే అమ్మ భాష అమ్మ నేర్పే తప్పటడుగుల భాష. అది ఏ భాష అయినా మాతృభాష. తెలుగు భాష విదేశీయ భాషలన్నింటిలో గొప్ప భాషగా పేర్కొనబడింది. ఇది మొదటగా శాసనభాషగా ఉండి ఆ తర్వాత పరిపూర్ణమైన సాహిత్య భాషగా అవతరించింది.

నన్నయ్య 'అక్షరరమ్యత', తిక్కన 'నాటకీయత', ఎర్రన 'వర్ణణీయత' వెరసి కవిత్రయ కలములో పద్యమై పరిమళించింది. నన్నెచోడుడి జాను తెనుగు పాల్కురికి దేశీయత ద్విపద ఛందము తెలుగు భాషకు అందాన్ని చేకూర్చింది. స్వచ్ఛమైన తెలుగుగా అవతరించింది. శ్రీనాథుని పద్య శృంగారాలు తెలుగుభాష సింగారాన్ని మార్చాయి. పోతన శబ్దం, సౌందర్యం అలంకారికమై తెలుగుభాషకు శోభచేకూర్చింది.

ప్రబంధ పదబంధాలు ప్రౌఢత చేకూర్చి వర్ణనీయమై, కమనీయమై, అర్థవంతమైన సంగీత, సాహిత్య మేళ వింపులను రాణించింది. ఇక 'పదము' జీవన మధురము పదకర్త గేయకర్తల అధరములలో నాట్యమాడుతూ, సంగీత స్వరూప సిద్ధికల్గి రాగాలలో విరాజిల్లింది. అంతేనా! జనపదుల హృదయనాదమై, జానపదమై, ఆశువై అశ్రు బిందువులు, ఆనందభాష్పములలో ఊరడించి, జాన పదుని బతుకులో మమేకమైంది. ఆధునిక పోకడలలో వచనమై పొల్లులుగా ఎగిరిపడింది తెలుగుభాష. వ్యావ హారికంలో ఆహార్యమైంది. ఆధునికుల ఆశాజ్యోతి అయింది. ఊహాప్రేయసాలకు ఊపిరిపోసింది. దేశభక్తిని నలుదిక్కులకు విసిరింది. భావకవిత్వంలో ప్రభావితమై కిన్నెరల హొయలు చూపింది. అభ్యుదయంలా మేలుకొని శ్రమైకజీవన సౌందర్యాన్ని నిరూపించింది.

ఇది ఉద్యమకర్తలకు ఊపిరి అయ్యింది. గాయమైనా, ఓర్చుకుని గేయమైంది. ప్రాణమై పాటఅయ్యింది. అనాథలెందరికో అన్నార్తులెందరికో ఆయుధమైంది. తెలుగుభాష దేశదేశాలలో రెపరెపలాడిన మన భాష, మనందరి భాష విఖ్యాతిచెంది ప్రాచీనతను సంతరించు కుంది. ఇంత అందమైన భాష ఇప్పుడు కన్నీరు పెట్టింది. పరభాష పలవరింపు తట్టుకోలేకనా? పాలకుల అలసత్వంతో సొమ్మసిల్లేలా? అధికారుల అండదండలు లేకనా? ఎందుకు అని మనం ప్రశ్నించుకోవాలి. ఎందుకు ఇవ్వాళ తెలుగుభాష అందరి ఆదరణకోల్పోతుంది. ఆత్మీయత తగ్గింది. కొంతకాలం తర్వాత మనభాషను మనమే గుర్తించుకోలేని గుర్తుపట్టని పరిస్థితి వస్తుంది. మాతృభాషల ప్రశస్థిని ఎందరో విద్యావేత్తలు, తత్వవేత్తలు విచారించారు. అయినా మనం మన భాషపైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాం.

విశ్వకవి రవీంద్రుడు బోధనలో మాతృభాషనే ఉం డాలి అంటారు. మాతృభాషలో విద్యను బోధించడం వల్ల మనసులు చురుగ్గా పనిచేస్తాయి అనేది వారి ఉద్దేశం. మాతృభాషలో విద్యాబోధన విద్యార్థులకు సులువుగా ఉండటంతోపాటు గ్రహణసామర్థ్యం పెరుగుతుంది. జె.బి.ఎస్. హాల్డెన్ అనే విదేశీయుడు వైద్య విజ్ఞానశాస్త్ర విషయాలు బోధించడానికి తెలుగు భాషనే అనువైందనీ చెప్పాడు. తెలుగు భాషను నేర్చుకుని సాహిత్యాన్ని ముద్రించి సమాజానికి అందించిన వెలుగురేఖ సి.పి.బ్రౌన్. తెలుగు భాషను వివరిస్తూ ఇలా అంటారు. "ఈ భాషలోని సాహిత్యం. రసాస్వాదన ఈ భాషను నేర్చుకోవడానికి పడిన ప్రయాసను మరిపించి మురిపిస్తుంది అని. ఈ విధంగా తెలుగు భాషను తెలిసిన, నేర్చిన విదేశీయులు మన భాషపట్ల ఆప్యాయత చూపిస్తుంటే మనం ఈ మాత్రం విస్మరిస్తున్నామేమేనని అనిపిస్తుంది.

నన్నయ్య, తిక్కన, ఎర్రన, పాల్కురికి సోమన, బమ్మెర పోతన... కాళోజీ, సినారె, సుద్దాల హనుమంతు, అంపశయ్య నవీన్, కాత్యాయని విద్మహే, ముదిగంటి సుజాత రెడ్డి... ఇలా ప్రతి తరంలోనూ అద్భుతమైన కవులు సాహిత్యకారులు మాతృ భాషను సుసంపన్నం చేసినటువంటి వారే. వారి స్ఫూర్తితో తెలుగు భాషా వికాసానికి నడుం కట్టాలి.

## గొప్ప పద్యాలు ఎన్నో...

మన పూర్వ, ప్రస్తుత కవులు గొప్ప పద్యాలు, కమ్మని పద్యాలు జాలువారినట్లు రాశారు. ఆ రోజుల్లో గురువులు అలా బోధించారు. బమ్మెరపోతన అద్భుతమైన భాగ వతాన్ని అందించారు.

'నల్లని వాడు..
పద్మనయనంబులవాడు..
కృపారసంబు పై జిల్లెడి వాడు
మౌళిపరిసర్పిత పింఛమువాడు..
నవ్వురా జిల్లెడు మోము వాడు...' అంటూ మరో పద్యంలో

'ఇందుగలడందులేడని
సందేహంబు వలదు...'

అంటూ చాలా సులభమైన సంస్కృత పదాలు

లేకుండా అద్భుతమైన సాహిత్యాన్ని అలవోకగా అందించారు బమ్మెర పోతన. సరళమైన, కమ్మనైన, అందమైన అచ్చ తెలుగు భాష. అచ్చ తెలుగు మాటలలో సినారె 'మందార మకరందాలు' అనే చిన్న పుస్తకంలో వర్ణించిన తీరు మరిచిపోలేము. పోతన ఎంత గొప్పగా రాశారో సినారె అంత బాగా వాఖ్యానం రాశారు. నేటి సమాజంలో గోరేటి వెంకన్న తెలంగాణ యాసలో అద్భుతమైన పాటలు రాశారు 'గల్లీ చిన్నది...' అనే పాట వింటే కళ్ళు చెమరుస్తాయి. సంతా.. మా ఊరి సంత.. సంతలు ఎలా జరిగే ఓ చెబుతుంది. ఆయన అద్భుత వాగ్గేయకారుడు. నేటి తరం గొప్ప కవి. అందెశ్రీ 'జయ జయహే తెలంగాణ.. జననీ జయకేతనం..' అంటూ అద్భుత సాహిత్యాన్ని అందించారు.

యాస, ప్రాస, భాషలో ఉండే ఆనందం చెప్పలేనిది. నెల్లూరుకి వెళితే 'ఏమబ్బాయ్యా బాగున్నావా..' అంటాం. తెలంగాణకు వస్తే 'ఏం బిడ్డ ఏం సంగతి..' అంటాం. యాసలో చెప్పినప్పుడు వచ్చే సంతోషం చెప్పలేనిది. తెలుగు రాష్ట్రాల్లోని కోస్తా, రాయలసీమ, తెలంగాణ యాసలు తెలుగుకు మణిహారాలు. మనిషి లోంచి ప్రాణం తీస్తే ఎలాగో.. సమాజం నుంచి భాషను తీస్తే అంతే బాధగా ఉంటుంది. మన కట్టు, బొట్టు, సంప్రదాయం మనము కాపాడుకోవాలి. అమ్మ అనే మాట గుండె లోతుల్లోంచి వస్తుంది. 'మమ్మీ' అనే పదం పెదాల పైనే వినిపిస్తుంది. మన భాష, యాస మరిచిపోతే కన్నతల్లిని మర్చిపోయినట్లు అవుతుంది. మాతృభాషను మృతభాష కానీయొద్దు. దాన్ని మరచి పోతే అస్తిత్వమే ప్రశ్నార్థకం అవుతుంది. కాబట్టి అందరూ మాతృభాషను గౌరవించాలి మన భాషను మనం కాపాడుకోవాలి.

# సమాజ కుళ్లును ఎత్తి చూపిన దిగంబర కవిత్వం

- డా॥. వెల్దండి శ్రీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల , హయత్‌నగర్, జి. రంగారెడ్డి.

ఆధునిక జీవితాన్ని కప్పివేసిన ముసుగును తొలగించేందుకు తెలుగు కవితా రంగంలో ఏర్పడిన స్తబ్ధతను ఛేదించి నూతన చైతన్యం కల్గించడానికి ఆరు మంది యువకులు "దిగంబర కవులు"గా కవితా రంగంలో ప్రవేశించారు. వారే

1. నగ్నముని- మానేపల్లి హృషికేశవరావు
2. నిఖిలేశ్వర్- యాదవరెడ్డి
3. చెరబండరాజు-బద్ధం భాస్కర్ రెడ్డి
4. మహాస్వప్న- కమ్మిశెట్టి ఈశ్వర్‌రావు
5. జ్వాలాముఖి- వీర రాఘవాచార్యులు
6. భైరవయ్య- మన్‌మోహన్ సహాయ్

వీరు 1965-1968 వరకు మూడు సంవత్సరాలపాటు తెలుగు సాహిత్యంలో గగ్గోలు పుట్టించి, తిరుగుబాటు సాగించి 'Shock Treatment' వంటి పద్ధతిలో తమకు నచ్చని వాటిని బూతులు తిడుతూ మూడు సంపుటాలను వెలువరించారు. సంప్రదాయాల మీద, గతంలోని మంచి మీదా వీరు తిరుగుబాటు చేశారు. మొత్తం సమాజమే కుళ్లి, కంపుకొడుతున్న ఒక కుష్టురోగి అని అసహ్యించుకుంటూ తాము కారణజన్ములమని, విప్లవ దూతలమని దిగంబర కవులు చిత్రించుకున్నారు. సమాజంలోని మురికిని అంతకంటే మురికి ధోరణితో కడిగివేయాలని వీరు భావించారు. వర్తమాన సమాజంలోని అక్రమాలపై బండ బూతులతో విరుచుకుపడ్డారు. జీవిత వాస్తవికతను చిత్రించలేని పూర్వ కవితా రీతులపై తిరుగుబాటుగా వచ్చిందే దిగంబర కవిత్వం.

### దిగంబర కవుల నేపథ్యం :

దిగంబర కవిత్వం తెలుగులో ఏదో అకస్మాత్తుగా, ఆవేశపూరితంగా, ఆలోచనా రహితంగా ఆవిర్భవించింది కాదు. ఇంగ్లీషులో, పాశ్చాత్యదేశాలలో ఆవిర్భవించిన అనేక ఉద్యమాలు తెలుగు సాహిత్యంపైనాప్రగాఢ ప్రభావాన్ని చూపాయి. అలాంటి వాటిలో ఈ దిగంబర కవిత్వం కూడా ఒకటి. అయితే భారత దేశంలో ముఖ్యంగా బెంగాల్‌లో వచ్చిన ఉద్యమాలు కూడా దిగంబర కవిత్వాన్ని ప్రభావితం చేయడం విశేషం. 1950వ దశకంలో అమెరికాలో 'బీట్నిక్స్' కవుల ఉద్యమం ఆవిర్భవించింది. ఇది ప్రపంచంలో అనేక మంది యువకులను ఆకర్షించింది. అప్పట్లో 'అల్లాన్ గాన్స్‌బరీ' రాసిన హౌల్ (Howl) కావ్యం యువకవులకు పారాయణ గ్రంథం అయిందని చెప్పవచ్చు టి. యస్. ఇలియట్ దిగంబర కవులకు కవితావేశం కల్గించాడు. మరోవైపు బ్రిటన్‌లో "యాంగ్రీ యంగ్‌మెన్" ఉద్యమానికి 'జార్జ్ ఆర్వెల్' నాయకత్వం వహించాడు. శాస్త్రజ్ఞానం అన్ని సమస్యలకు పరిష్కార మార్గాలను సూచిస్తుందని నమ్మిన "నిహిలిస్ట ఉద్యమం" 19వ శతాబ్దంలో రష్యాలో మొగ్గ తొడిగింది. ఇవన్నీ ప్రపంచంలోని వివిధ భాషా సాహిత్యాలపై ప్రభావం చూపాయి. ఆ ప్రభావం తెలుగు సాహిత్యంపై కూడా ప్రసరించింది. ఇవి గాక 1958లో బెంగాల్‌లో బయలుదేరిన "ఆకలితరం కవులు" దిగంబర కవులను ప్రభావితం చేశారు. ఇవన్నీ దిగంబర కవుల భావజాలానికీ, రచనలకు నేపథ్యంగా నిలిచాయి.

కీర్తి ఇనుప పాదాల కింద లోకం నలిగి పోతోందని ఆక్రోశించే దిగంబర కవులు తమ కవిత్వ సం పుటాలను మూడింటిని హైదరాబాద్‌లో రిక్షా వానిచేత (పాండు), విజయవాడలో హోటల్ క్లీనర్ చేత (జంగాల చిట్టి), విశాఖపట్టణంలో బిక్షగత్తె (యశోద) చేత అర్ధరాత్రి పూట విచిత్రంగా ఆవిష్కరించి సంచలనం సృష్టించారు. తమ కవితా ఖండికలను 'దిక్' లని పిలవాలని 'జబ్బు పొరల్ని చీల్చి కాస్మిక్ మార్గాన్ని నిర్దేశించేవి ఈ 'దిక్' లు.

మానవత్వపు విలువలు వీటి హద్దులు' అని దిగంబర కవులు వెల్లడించారు.

'మంచికోసం, మనిషిలోని నిప్పులాంటి నిజమైన మనిషి కోసం, కపటంలేని చిరునవ్వులు చిందే
సమాజం కోసం, అహెూరాత్రులు ఆరని అగ్నిలో నడిచిన ఆత్మలలోంచి పలుకుతున్న గొంతులం మేం'
అని ప్రకటించుకున్నారు దిగంబర కవులు.

దిగంబర కవులు ప్రచురించిన సంపుటాల ద్వారా ఆ కవుల తత్త్వాన్ని, దృక్పథాన్ని, ఆలోచనలనూ అర్థం చేసుకోవచ్చు. సమకాలీన జీవితంలోని ఆవేదనను వారు మొదటి సంపుటంలో వ్యక్తం చేశారు. జీవితం అట్టడుగు పొరల్లో దాగున్న నిజాల్ని శోధించి వెలిగక్కే ప్రయత్నం చేశారు. వారి ఆ ప్రయత్నం మెదటి సంపుటంలో కని పిస్తుంది. ఇక రెండో సంపుటంలో మానవుని ఉనికిని పటిష్టం చేసే తాత్త్విక దృక్పథాన్ని వారు ప్రత్యక్షరీక రింపజేశారు. మూడో సంపుటంలో నేటి వ్యవస్థను కుష్ఠు వ్యవస్థగా పరిగణించి దానిపై దిగంబర కవులు చేసిన తిరుగుబాటు దర్శనమిస్తుంది. ఈ పరిణామ క్రమంలో ఆవేదన క్రోధంగానూ, క్రోధం కసిగానూ మారిన వైనం గమనించవచ్చు.

దిగంబర కవులు తమ కవిత్వంలో వాస్తవికతకు ప్రాధాన్యం ఇచ్చారు. వారి రచనలలో "జీవితం తన నిజరూపంలో ప్రతిబింబిస్తుంది. ఈ దేశంలో, ఈ భూగోళంలో ఊపిరి పీల్చే ప్రతి మనిషీ ఉనికి కోసం తపన పడి, అతడి భవిష్యత్తును చూసి వెక్కి వెక్కి ఏడ్చి, పిచ్చెత్తి ప్రసవించిన కవిత" అని దిగంబర కవులు మొదటి సంపుటంలో తమ కవితా స్వరూపాన్ని స్పష్టం చేశారు.

దిగంబర కవులు వారికి వారు ఒక ప్రత్యేక, సరికొత్త పదజాలాన్ని సృష్టించుకున్నారు. ఆరుగురు దిగంబర కవుల పేర్లపై ఆరు సంవత్సరాలు, ఆశ, తపన, అశ్రు, మదిర, విరహ, విషాద అనే పేర్లపై ఆరు రుతువులు, స్నేహ, విశృంఖల, క్రాంతి, సృజన, వికాస, అనంత అనే పేర్లపై ఆరు వారాలకు పేర్లు పెట్టారు.

దిగంబర కవిత్వం అంటే ఏమిటి? అన్న ప్రశ్నకు కేతవరపు రామకోటి శాస్త్రి

1. పతితమైన జాతికి మానవతను చూపేందుకు అవసరమైన జాగృతిని కలిగించేందుకు చేస్తున్న ధ్వంస రచన.
2. దిగంబర కవిత్వం మానిషాద శోకంలోంచి వేదనా వల్మీకంలోంచి ఆవిర్భవించింది.
3. మానవత రెండు కళ్లూ మూసుకునప్పుడు మూడో కన్ను విప్పుకుంటూ తుఫానుగా వచ్చిందే ఈ ఉద్యమం.
4. మంచిగా, ఆకాశంలా, అవనిలా, మనిషిలా బతకాలి ముందు మనం మనుషులం. మానవత్వా న్ని ప్రతిష్ఠించే మానవుడైన మహర్షి కొరకు అన్వేషణ. మనిషి దేనికీ బానిస కాకూడదు.

మానసిక దిగంబరత్వం, వ్యక్తి అస్తిత్వ పరిరక్షణ, నూతన వ్యవస్థానిర్మాణం ఈ ఉద్యమ గుణాలని చెప్పవచ్చు.

"నన్నయ్యను నరేంద్రుడి బొందలోనే
నిద్రపోనియ్యి
లేపకు
పీక నులిమి గోతిలోకి లాగుతాడు
ప్రబంధాంగనల తొడలు తాడిమొద్దులు
తాకితే కాళ్లు విరగ గొట్టు
పండిత వర్యా రికార్డులా నోరు తిప్పకు
నవ సృష్టిని కాలదన్నకు
భావకవుల నపుంసక హావ భావాలకు సవాలు
అభ్యుదయ కవీ నల్లమందు తిని నిద్రపోయావ్
నయాగర జలపాతంలో
దూకలేక పోయిన అన్నయ్యా!
గుడ్ బై మీకందరికీ సలామ్ వాలేకుమ్ - నిఖిలేశ్వర్

ఇది మొదటి సంపుటిలోని మొదటి కవిత. ఇందులో దిగంబర కవుల లక్ష్యం, ఆవిర్భావ హేతువూ చెప్పబడింది.

"ఇవి నిజాలు
నిత్యం మండే యథార్థాలు
ఆడదాని ప్రసూతి వేదనలా
జీన్ వాల్జిన్ ఆకలి మంటలా
ఎదిగి చేతికందిన కొడుకు
యముడి పరమైతే
తల్లడిల్లే విధవ తల్లి గర్భ శోకంలా
సూటిగా నగ్నంగా చెప్పబడే సత్యాలు"

- భైరవయ్య

ఈ సత్యాలు వీళ్ల కవిత్వంలో ఉంటాయి. అంటే వీళ్లు చెప్పే నిజాలు భయంకరంగా, దుర్భరంగా, దుస్సహంగా ఉంటాయి. నిజాలు ఎప్పుడూ అంతే గదా!

దిగంబర కవులు మత మౌఢ్యాన్ని, మత దురహం కారాన్ని ఎండగట్టారు. 'మతపిచ్చిపై' ధ్వజమెత్తారు. మానవుడ్ని మానసిక బలహీనుడిని చేసి, అస్తిత్వం, వ్యక్తిత్వం లేకుండా చేస్తుందని ప్రబోధించారు.

"లింగ భేదాలు వాదాలు తప్పితే
మందిర్, మజ్జిద్, చర్చి
మతాధికారులు, మతాలు ఎందుకు?"

- చెరబండరాజు

"ఇంకమోయలేను
ఈ దేవుళ్లనీ ఉద్గ్రంథాల్నీ
ఆపండి ఆర్కెస్ట్రాని
ఆర్పండి కాగడాల్ని"

- మహాస్వప్న

"నవరత్న ఖచిత సువర్ణ కిరీటాల కోసం
నిలువు దోపిడీల కోసం
నెత్తి మీద జుత్తు కోసం
అమ్ముడు పోయేవాడు నా దేవుడు"

- భైరవయ్య

అంటూ నెగెటివ్ ధోరణిలో దేవుడ్ని ఎలా తయారు చేశారో చెప్తూ మత మౌఢ్యాన్ని నిరిసించిన విధంలో కవితా శిల్పం ఉంది.

దిగంబర కవులు వచన కవిత్వంలో కొత్త ప్రయోగా లను, కొంగ్రొత్త అభివ్యక్తినీ ప్రవేశపెట్టారు. భావాలను ఎంత స్పష్టంగా, సూటిగా చెప్పవచ్చో తెల్పారు. సరికొత్త ఉపమానాలను, ప్రతీకలను, రూపకాలను ప్రయోగిం చారు.

"అనుభవం మగ్గం మీద వేసుకున్న ఆనవాలు పట్టే
పంచుంటే కట్టుకో
వడ్డీలు పెరుగుతున్న ఆకలి, ఆకాశం విస్తట్లో అన్నం ముద్ద
ఒంటికాలి నృత్యం చేస్తున్న
అణ్వాస్త్రాల ఆధునికుణ్ణి నేను..."

దిగంబర కవిత్వంలో అందమైన చిత్రణగాని, వీనుల విందైన శబ్ద సమ్మేళనంగానీ లేదని చెప్పవచ్చు. అశ్లీల పదజాలంతో, జుగుప్సా కరమైన శబ్దాలతో రాసిన కవిత్వమే ఎక్కువ.

నగ్నముని 'బ్రహ్మపదార్థం' అనే కవితలో భూగోళాన్ని వర్ణిస్తూ

"భూమి ముసలి వరిబీజంలా ఉంది
భూమి ఆంధ్రుల జీవితంలా ఉంది
భూమి కవి సమ్రాట్టు తర్కంలా ఉంది
భూమి వచన కవిత్వోద్యమంలా ఉంది
భూమి తెలుగు సినిమాలా ఉంది
భూమి ఎద్దు ప్రభుత్వంలా ఉంది
భూమి కడగని పీతి ముడ్డిలా ఉంది"

అన్నాడు లైంగిక క్షుద్రత్వాన్ని తాత్త్విక స్థాయికి చేర్చి.

"వాళ్లు కుష్ఠు చేతుల్లో రొమ్ములు పిసికి పిసికి గెంతారు
తొడలు నలిపి
అవయవంలో కసిగా గర్భగుడిలో వేళ్లు దోపి దోపి
ఒళ్లంతా కసిగా తొక్కి తొక్కి
వాళ్ల జబ్బు రసినంతా ఒంటి మీద కార్చి తుళ్లారు..."

అని నిహిలిస్టు ధోరణిలో రాశారు.

వేల్చేరు నారాయణరావు అన్నట్లు తెలుగులో హేయ వస్తు కవిత్వం ప్రారంభమైంది దిగంబర కవు లతోనే.

దిగంబర కవిత్వంపై నిప్పుల దాడిలాంటి విమర్శలు వచ్చాయి. కొందరు ఈ ఉద్యమాన్ని ప్రశంసిస్తే మరి కొందరు తీవ్రంగా వ్యతిరేకించారు.

1. సమాజం మీద కక్షగట్టిన దిగంబరులు ముఖ్యంగా మధ్యతరగతి మీద వీళ్లు కత్తి దూశారు. వీళ్లు చేసేది అభ్యుదయ రచన కాదు. జాగృతి కోసం ధ్వంస రచన అంటారు ఆరుద్ర.
2. వాళ్లు నిజమైన కవులు. అయితే వాళ్ల కవితా శక్తుల్ని సరైన మార్గంలో పెట్టలేక పోతున్నారు. వాళ్లలోని అశాంతిని సరైన మార్గంలో పెడితే బాగుంటుంది. దిగంబర కవులు తిరుగుబాటు చేస్తున్నారు. వాళ్లు కనపడిన ప్రతిదాని మీదా తిరగబడుతున్నారు. వాళ్లు అనార్కిస్టులనుకోవాలో, మార్కిస్టులనుకోవాలో తెలీదు. ఎక్కువ అనార్కిస్టులుగానే కనిపిస్తుంది అంటారు శ్రీశ్రీ.
3. దిగంబర కవులు ఆధునిక కవిత్వంలో ఒక కొత్తదారి చూపారు. ఇది నిజమైన విప్లవ తిరుగుబాటు కవిత్వం. ఈ కవిత్వం ప్రజలకు ఈనాడు అవసరం అంటారు కొడవటిగంటి కుటుంబరావు.
4. సమాజం కుళ్లుకు వీళ్లు ఒక చిహ్నం. సమాజం కుళ్లులో వీళ్లు ఒక భాగం. సమాజం కుళ్లిపోయిందనడానికి వీళ్లు ఒక కారణం. సమాజం కుళ్లి పోయిన మాట నిజమే. సమాజం పతనమైన మాట నిజమే. విప్లవాగ్ని జ్వాలలతో తప్ప సంస్కరించడానికి సాధ్యం కానంతగా పతనమైన మాట నిజమే. కానీ ఎంత పతనమైనా ఈ దిగంబర పైత్యాన్ని కవిత్వమనుకునేటంతగా పతనమైందా? అని విరుచుకు పడ్డారు రాచమల్లు రామచంద్రారెడ్డి.

అయితే కేతవరపు రామకోటిశాస్త్రిగారన్నట్లు 'మానవులంతా ఒక కొత్త కుటుంబంగా ఏర్పడటం గురించి కలగని అది నిజం కావాలన్న ఆశతో, ఆవేశంతో, కవితా కర దీపికలతో నిజాయితీ గల అన్వేషణగా సాగిన దిగంబర కవితా ఉద్యమం తెలుగు సాహిత్యంలో ఒక చారిత్రక ఘట్టం'.

వీరి ప్రేరణతో 'తిరగబడు', 'మార్చ్' అనే కవితా సంపుటులు. పైగంబర కవులు మరో రెండు కవితా సంపుటాలను వెలువరించారు.

1970 శ్రీశ్రీ షష్టి పూర్తి సభలో విశాఖ విద్యార్థులు పంచిపెట్టిన 'రచయిలకు సవాల్' అనే కరపత్రం దిగంబర కవుల పునరాలోచనకు కారణమయింది. కొంత మంది దిగంబర కవులు విరసంలో చేరగామరి కొంతమంది 'టచ్‌మి నాట్ ' లాగా ఎక్కడో ఉండి పోయారు.

# మాడభూషి కవిత్వం – ప్రతీకవాదం

**– డా॥. వి. త్రివేణి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన శాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్.

As Commonly used in discussing Literature, Symbol is applied only to a word or set of words that signified an object or event which it self signifies something else; that is the words refer to something which suggests a range of reference beyond it self.

*- A Glossary of Literary Terms -MH Abrams.*

ఏదైనా ఒక వస్తువును గాని, భావాన్ని గాని సూచించే మరో వస్తువు గాని, భావం గాని ప్రతీక అనవచ్చు. ఈ దృష్టితో చూస్తే శబ్దములు అన్నీ ప్రతీకలే. ప్రతీకలతోనే ఆలోచనను సాగించవచ్చు. ఉదాహరణకు బీజ గణితంలో వట్టి అక్షరాలనే ఉపయోగించి ఆలోచనను సాధిస్తాము. అందుకే బీజగణితాన్ని 'ప్రతీకాత్మక తర్కం' అనవచ్చు. సాహిత్యంలో ప్రతీకకు మౌలికంగా ఉన్న అర్థం ఇక్కడ నుండే ప్రారంభమవుతుంది. ఒక శబ్దంకాని, శబ్ద సముదాయం గానీ, ఒక వస్తువునో, క్రియనో, సంఘ టననో సూచిస్తూ; అవి తిరిగి వేరొక అంశాన్ని సూచించి నప్పుడు అది ప్రతీక అవుతుంది. ఆ శబ్దాలు ఏ సాధా రణాంశాన్ని సూచిస్తాయో ఆ ఆవరణను దాటి ఉన్న అంశాలను అది ధ్వనింపజేస్తుంది.

- పాశ్చాత్య సాహిత్య విమర్శ చరిత్ర సిద్ధాంతాలు -
వడలి మందేశ్వరరావు.

ఆంగ్ల సాహిత్యంలో 'Symbolism'కు సమానార్థకంగా తెలుగులో 'ప్రతీకాత్మకత' అనే శబ్దాన్ని ప్రయోగిస్తున్నాం. కవిత్వ ప్రయోజనాన్ని చేకూర్చడం కోసం కవులు ప్రతీకలను అనుసంధానం చేస్తున్నారు. అందువల్ల కవిత్వంలో వీటి ప్రయోగం అనివార్యమవుతుంది. ఆధునిక సాహిత్య విమర్శా సిద్ధాంతాలను అనుసరించి ప్రతీకవాదం ప్రత్యేక స్థానాన్ని సంతరించుకుంది. పాశ్చాత్య సాహిత్యాలతో ప్రతీక ధోరణి అత్యంత ప్రాధాన్యం వహిస్తుంది. తెలుగులోనూ అంతటి ప్రసిద్ధిని సాధించడం కోసం కవులు తమ కవిత్వ అభివ్యక్తిలో నూతన ఒరవడిని ఏర్పరచుకుంటున్నారు. అందులో భాగంగానే సామాజిక ప్రతీకలు, వ్యష్టిప్రతీకలు విభజింపబడ్డాయి.

తాత్త్విక దృక్పథంతో పురాతన కాలం నుండి సాహిత్యంలో వెలుతురు-జ్ఞానానికి, చీకటి - అజ్ఞానానికి, వసంతం- జన్మకు, శిశిరము - మృత్యువుకు, అఖండ జ్యోతి-ఆదర్శానికి ప్రతీకలుగా చెప్పబడుతున్నాయి. నీలం-కార్మిక శక్తికి, ఎరుపు-విప్లవ భావానికి, ఆకుపచ్చ - మేధావి తనానికి ప్రతీకలుగా సైద్ధాంతిక నేపథ్యంలో ఏర్పడ్డాయి. ఇనుము - ధనిక వర్గానికి, రాగి - మధ్య తరగతికి, తుత్తునాగం - శ్రామిక వర్గానికి ప్రతీకలుగా విప్లవ సంకేత రూపంలో వ్యవహరింపబడుతున్నాయి. ఇవన్నీ సామాజిక, వ్యష్టి ప్రయోజన పరంగా కవిత్వ గాఢతకు తార్కాణంగా నిలుస్తున్నాయి.

ఈ ప్రతీకలు మూడు విధాలుగా కవిత్వంలో ప్రయోగింపబడుతున్నాయి. 1.పదాలు, పదబంధాలను ప్రతీకలుగా ఎన్నుకోవడం, 2. కవితా శీర్షికకు, కవితా సందేశానికి అనేక ప్రతీకలను ఎన్నుకోవడం, 3. దీర్ఘ కవితా శీర్షికకు, దీర్ఘకవిత సూచించే సందేశానికి ప్రతీకలను సమూహంగా ఎన్నుకోవడం. అదే విధంగా వస్తు ప్రాధాన్యతను బట్టి పురాగాథా, చారిత్రక, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ ప్రతీకలు కవిత్వంలో కూడి వస్తున్నాయి. భావాత్మక పరవశంలో ప్రకృతి ప్రతీకలకు, అత్యాధునిక ప్రభావంలో సాంకేతిక ప్రతీకలకు ఆకర్షితుడవుతున్నాడు కవి.

తెలుగులో మొదట ఈ ప్రతీక వాదం శ్రీశ్రీ, ఆరుద్ర, నారాయణదాసు కవిత్వంలో తాత్త్విక నేపథ్యంలోనే ప్రదర్శింపబడింది. అనంతరం కళాత్మకతను సంతరింప

జేస్తూ గుంటూరు శేషేంద్రశర్మ, ఆర్.ఎస్.సుదర్శనం, జీ.వీ. సుబ్రహ్మణ్యం, ముదిగొండ వీరభద్రయ్య కవిత్వంలో అద్భుతంగా ప్రయోగింపబడింది. ప్రత్యేకంగా తెలంగాణ సాహిత్యంలో ప్రతీక ఛాయలు ప్రస్ఫుటంగా గోచరమవు తున్నాయి. తొలితరం కవుల్లో పొట్లపల్లి రామారావు మొదలుకొని మలితరం కవుల్లో డా॥ సి. నారాయణరెడ్డి వరకు ఆయా దేశకాల సామాజిక గతి తార్కిక దృక్పథానికి అనుకూలంగా కవిత్వాన్ని ప్రతీకలతో నిలువరింపజేశారు. అత్యాధునిక కవిత్వ నిర్మాణ పద్ధతుల్లో శబ్ద గాఢత కోసం ప్రశస్తి పొందిన కవులెందరో 'ప్రతీకాత్మకత'కు ప్రభావితమవుతున్నారు. అందులో ప్రసిద్ధకవి ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ ఒకరు. సాంస్కృతిక పురోభివృద్ధికి, సామాజిక పరివర్తనకు ఆలంబనగా వీరి కవిత్వం పరిఢవిల్లుతుంది. అప్రయత్నంగానే ప్రతీకలు కవిత్వంలో స్థానం కల్పించుకుంటున్నాయి. కవితా సాంద్రతను ప్రదర్శిసున్నాయి. 'జీవితం - కవిత్వం', 'శత్రువుతో ప్రయాణం', 'ఆలోచనలు', 'చివరకు నువ్వే గెలుస్తావు', 'మూడోమనిషి', 'వికారి' వంటి కవితా సంపుటాలు డాక్టర్ మాడభూషి సంపత్ కుమార్ కలం నుండి వెలువడ్డాయి. కవిత్వంతో కాలాన్ని అనుసంధానం చేస్తూ వర్తమాన సామాజిక స్థితిని ప్రతిబింబింపజేయడం కవి సంపత్‌కుమార్ కర్తవ్యంగా అవగతమవుతుంది.

''జీవితం - కవిత్వం'' అనే కవితా సంపుటిని మాడభూషి మినీ కవితల సమాహారంగా తీర్చిదిద్దారు. ఇందులోని ప్రతి శబ్దం ప్రతీకాత్మకతను ధ్వనింపజేస్తుంది.

సముద్రాన్ని గురించి
ఆలోచించు!
జీవితాన్ని అందులో దించు!
కవిత్వాన్ని గురించి
ఆలోచించు
సముద్రాన్ని అందులో ముంచు (పేజీ 1)

జీవితం - కవిత్వం అనే రెండు పదాలలోనే పెన వేసుకొని ఉన్న సమస్త లోకాన్ని అభివర్ణించారు. రెండు పదాల అర్థం / సారం అనిర్వచనీయమైంది. శబ్ద సమ్మేళనంలో అద్భుతాన్ని సృష్టించారు ఆయన. ఈ రెండు పదాలతో అర్థబోధక జిమిక్కులే చేశారని భావించవచ్చు.

దేహికి
ప్రాణికి ఉన్న బంధాన్ని
కవికి
కవిత్వానికి ఉన్న అనుబంధాన్ని
పలకరించడానికి
పుస్తకం చాలదు
జీవి లాగే
జీవితం కూడా (పేజీ 5)

ఆధ్యాత్మిక ప్రతీకలు ఈ కవితా పాదాల్లో ఉన్నాయి. అవి "దేహి / ప్రాణి", "కవి / కవిత్వం" అనేవి సామాజిక సాంస్కృతిక ప్రతీకలు. జీవిని ధరించునదే జీవితం / విడదీయలేనిది.

పండు వెన్నెల్లో
కవిత్వాన్ని ఆరబోసి
జీవితమంతా కాపలా కాస్తాను
జీవితానికి పండువెన్నెల్ని
ఆసరా చేస్తాను
కవిత్వానికి జీవితాన్ని ధారబోస్తాను.(పేజీ 8)

'పండువెన్నెల' అంటే సంతోషానికి, ఆనందానికి హృదయోల్లాసానికి ప్రతీక. వీటిని కవిత్వం ద్వారా సాధిస్తానంటాడు కవి మాడభూషి. జీవితంలో ఆ ఆనందాలను, సంతోషాలను చేజారిపోకుండా కాపాలా కాస్తాననే భావన ఇందులో అభివ్యక్తమవుతుంది.

అంతరాంతరాల్లో నుండి
ఉబికేది కవిత్వం
అనంత వాయువుల్లోకి
దూకేది జీవితం! (పేజీ 17)

ఈ కవితా పంక్తుల్లో తాత్త్విక ప్రతీకలను సంపత్ కుమార్ ప్రయోగించాడు. అంతరాంతరాల్లో అనంత

వాయువుల్లో ఈ రెండు పదాలు కవిత్వానికి, జీవితానికి ప్రతీకలుగా కవి అభివర్ణించాడు. లోతైన నిశీధి ఛాయలను, అనంతమైన వాయువులను ఈ పదాలకు ప్రతీకలుగా ప్రదర్శింపబడ్డాయి.

జీవితం ఆలోచనల పద్మవ్యూహం
కవిత్వం లోచనాల అస్త్ర స్వరూపం (పేజీ 40)

పౌరాణిక ప్రతీకలు ఈ కవితా పాదాల్లో దర్శన మవుతాయి. పద్మవ్యూహం జీవితానికి 'అస్త్ర స్వరూపం' కవిత్వానికి ప్రతీకలుగా కవి ప్రయోగించాడు.

జీవితపు
రహదారిలో
సేద తీర్చే చెట్టు
కవిత్వం! (పేజీ 41)

కవిత్వాన్ని కల్పవృక్షంగా భావించి కావ్యాన్ని రచించిన కవులున్నారు. కవి సంపత్ కుమార్ కవిత్వానికి 'చెట్టు' ను ప్రతీకగా కొనియాడాడు. ఆ చెట్టు బాటసారులకు సేద తీర్చుతుంది. ఆ బాటసారులు రహదారిలో పయనిస్తున్నారు. ఈ రహదారిని జీవితానికి ప్రతీకగా అనుసంధానం చేయడం ఇందులో శేషం.

"శత్రువుతో ప్రయాణం" అనే కవితా సంపుటిలో శబ్దాలన్నీ భావ గర్భితంగానే ఉన్నాయి. మాడభూషి ఈ పుస్తకంలో ప్రకృతి ప్రతీకలను ప్రయోగించారు.

'అడవిలో పొద్దుగూకింది' కవితలో 'అడవి' అంత: స్వరూపాన్ని తెలియజేశారు కవి.

అడవికి అవతల అద్భుతమైన సౌందర్యం
కౌగిలించుకొని ఉక్కిరి బిక్కిరి
చేయడానికి కాచుక్కూర్చుంది
ఒకటే షరతు
అందంగా, హుందాగా, దర్జాగా
వస్తేనే కౌగిలి
ఆలోచనలకి చీకటి కమ్మలేదు
అడవిలో పొద్దు గూకింది! (పేజీ 10)

చీకటికి ప్రతీక అడవిలోనే ఆలోచనలు, ఆశలు, కోరికలు అంతార్ధానం కావడం. 'అడవి', 'పొద్దు గూకింది' అంటే జీవితాన్ని పూర్తిగా ప్రతిబింబించే కవిత ఇది. జీవితానికి 'అడవి' అనే ప్రతీకను ప్రయోగించారు. ఈ జీవితంలో కలిగే ఆశలు, కోరికలను దాటవేసి సుదీర్ఘ దూరం పయనించి జీవిత చరమాంకానికి చేరుకోవడం అడవి శబ్ద లక్ష్యం. 'అడవికి' ఆవల అంటే జీవనానంతర తీరం. అదే స్వర్గం. జనన మరణాలు వృత్తం లాంటివి. ఆలోచనలు మాత్రం నిత్యం వెలుగులీనుతుంటాయి. ఆలోచనలు అంటే ఆశలు, కోరికలు, భావనలతో కూడి నూతన దృక్పథాన్ని ఆవిష్కరించడమే అవుతుంది.

'కత్తి కింద పడకుండా' అనే కవితలో కవి మాడభూషి పోరాట స్ఫూర్తిని ప్రదర్శించారు.

చంద్రుడికి చాప చుట్టేసి
సూర్యుణ్ణి నిద్ర లేపుతాడు
అడవిలో ఎక్కడో వెన్నెల కాస్తుందంటే
అమృతం కోసం అక్కడికి పరుగు !
ఎడారిలో కొబ్బరి నీళ్ళున్నాయంటే
అక్కడికీ ప్రయాణమే! (పేజీ 11)

'తెల్లవారడం', 'వెలుగు ప్రసరించడం' అనేవి వెలుగుకు ప్రతీకలు. రెండు ఒకే అర్థాన్ని స్ఫురింపజేస్తాయి. 'అడవిలో వెన్నెల వెలుగు', 'ఎడారిలో కొబ్బరి నీళ్ళు', వృధా జీవితానికి ప్రతీకలు. కోరికలు తీరనితనానికి నిదర్శనం.

'కవి' అనే కవితలో వ్యక్తిత్వ సంస్కృతిని తెలియజేశారు సంపత్ కుమార్.

కవితా! ఓ కవితా!!...
ఎవడైనా అర్థనగ్నంగా కనిపిస్తే అసహ్యించుకొని
వాడి శీలాన్ని శంకించి
వాడి వ్యక్తిత్వాన్ని పంకిలం చేసి
చాటి చెప్పేదాకా నిద్రరాదు
నన్ను నేను ప్రతి రాత్రీ
అద్దం ముందు నిలబడి

నగ్నంగా ప్రదర్శించుకొన్నా
మనసు ఏ మాత్రం చివుక్కుమనడం లేదు(పేజీ 35)

చాలా పెద్ద కవిత ఇది. గొప్ప కవిత కూడా అర్ధనగ్నం / నగ్నం. ఈ రెండు ప్రతీకలు మనిషి లోపాలను ఎత్తి చూపుతారు. ఇవి భౌతిక ప్రతీకలే. ఎదుటి వాడి లోపాలు కొన్నైనా కొండంత చేసి విమర్శిస్తాం. మనలోని లోపాలు కొండెత్తు కనిపిస్తున్నా వాటిని లోపాలుగా భావించని మానవ మనస్తత్వానికి ప్రతీకలుగా భాసిస్తున్నాయి.

'ఆలోచనలు' అనే కవితలో సామాజిక అవరోధాలు, ప్రతిబంధకాలను సంపత్‌కుమార్ ప్రతీకల ద్వారా ఖండించారు.

జెండా సాక్షిగా
పేరు చుండూరు
హృదయం మండేచూరు
1991 ఆగస్ట్ 6 (పేజీ 8)

ఈ కవితా పాదాల్లో దళిత ప్రతీకలను కవి ప్రయోగించారు. బానిస, పీడన, దోపిడి, అత్యాచార ఘటనను ఈ కవిత గూర్చి ప్రస్తావిస్తుంది. చుండూరును 'మండే చూరు'ను ప్రతీకగా పేర్కొన్నారు. ఏ చూరైనా జలధారను కురిపిస్తుంది.కాని చుండూరు మంటలను రగులు గొల్పుతుందని, ప్రతీకార జ్వాలగా మండుతుందని కవి మాడభూషి అభివర్ణించారు.

ఉదయం తెల్లవారదు
రాత్రి చీకటి పడదు
చావు బతుకుల సంధ్యాకాలం (పేజీ 10)

జీవితం గడువని రోజులను తలపింపజేసే కవితా పంక్తులు ఇవి. 'తెల్లవారడం' అంటే జీవితాల్లో వెలుగు నింపడం, జ్ఞానవంతం కావడం. 'చీకటి పడడం' అంటే జీవితం ముగిసిపోవడం. ముక్తిని సాధించడం. ఈ రెండింటి ప్రతీకల మధ్య ఊగిసలాడుతున్నది 'సంధ్యా కాలం'. ఇది కూడా ప్రతీకనే. సందిగ్ధావస్థలో నిలిచిన ప్రతీక. ప్రకృతి ప్రతీకలతో జీవన నిర్దేశాన్ని కవి వెలిబుచ్చాడు.

రైతే కూలి
ప్రపంచమంతా కంప్యూటరీకరణ
హైటెక్ సేద్యం, గ్లోబలీకరణ
బస్సు మొహం చూడని పల్లె! (పేజీ 15)

ఈ కవితా పంక్తుల్లో అత్యాధునిక సాంకేతిక ప్రతీకలను కవి ప్రవేశపెట్టారు. ప్రపంచమంతా ఎంతో పురోభివృద్ధి పొందుతున్నా పల్లెలు మాత్రం ఇంకా అభివృద్ధి సాధించ లేక పోతున్నాయని కవి ఆవేదన. 'కంప్యూటరీకరణ' 'హైటెక్ సేద్యం, గ్లోబలీకరణం, బస్సు' అనేవి యాంత్రిక ప్రగతికి ప్రతీకలుగా తెలుపుతూ, వాటి ప్రయోజనాలు నాగరికులకు మాత్రమే అనుకూలంగా ఉన్నాయంటాడు సంపత్ కుమార్.

కొన్ని ఆలోచనలు
కలం ఇంకిపోయింది
కవులు రాస్తూనే ఉన్నారు
అక్షరాల ఆర్తనాదం! (పేజీ 25)

సాహిత్య ప్రతీకలను ప్రయోగించి అక్షరాల ఆవశ్య కతను తెలియజేశారు. ఇందులోని 'కలం - కవులు - అక్షరాలు' సాహిత్య ప్రతీకలుగా అభివర్ణించవచ్చు. నూతన త్వాన్ని, జ్ఞానాన్ని, జాగృతిని కలిగించేవి ఇవి. కాని అక్షర స్వేచ్ఛపై జరుగుతున్న దాడుల వల్ల అక్షరాలు 'ఆర్తనాదం' చేస్తున్నాయని కవి అంటాడు.

కొన్ని ఆలోచనలు
నరికేసిన కొమ్మ
కొడవలై మొలుస్తుంది
దళిత చైతన్యం (పేజీ 27)

ఉద్యమ ప్రతీకగా నిలిచింది ఇందులోని ప్రతీక 'కొడవలి'. 'కొమ్మ నరికివేయడం' అణచివేతకు, దోపిడికి ప్రతీక. బానిస బతుకులకు ప్రతీక. 'కొడవలై మొలవడం' అనేది చైతన్యానికి ప్రతీక. ఇందులో కవి దళిత చైతన్యాన్ని కాంక్షించాడు.

దృశ్యాలు
తెల్లకాయితం మీద

నల్లవేలి ముద్ర చేసిన పాపం
పరంపరగా సాగిన బానిసత్వం! (పేజీ 32)

'నల్ల వేలి ముద్ర' భారతీయుల అభాగ్యస్థితికి ప్రతీక. 'తెల్లకాగితం' బ్రిటీష్ వారి పాలన. తరతరాల బానిసత్వానికి భారతీయులు అజ్ఞానమే కారణంగా కవి వ్యక్తపరిచారు. అధికారం, దర్పం, దౌర్జన్యం చెలాయించి భారతీయులను హింసించిన ఘటన ఈ కవితా పంక్తుల్లో కనిపిస్తుంది.

'చివరకు నువ్వే గెలుస్తావు' అనే కవితా సంపుటిలో విజయ పరంపరను, బ్రతుకు మీద ఆశను, జీవితానికొక సార్ధకతను అనేక కవితల్లో ప్రదర్శించారు కవి.

'బావి'
ఒక వీర వనితలా ధీర వనితలా లోకాన్ని జయిస్తుంది.
బావిని చేరుకొంటుంది
బావి ఒళ్లంతా ఏడుస్తుంది
బావి అభయమిస్తుంది
ఎంతో మంది ఆమె నుంచి అభయం పొందారు
భావిని ప్రశ్నిస్తుంది
జవాబు లేని ప్రశ్నగా నిలదీస్తుంది
లేస్తుంది - పరుగులు తీస్తుంది బావిని ఏలుతుంది
ఓదారుస్తుంది నిలదీస్తుంది
బావిని పూడుస్తుంది, భావిని కదిలిస్తుంది
భావిలో తిరిగి చూస్తుంది
కుందేలు కుక్కని తరిమినట్టు
తరుముతుంది - తరుముతుంది - తరుముతుంది
పరుగో పరుగు
తరిమిన వాళ్లంతా
తిరిగి చూడకుండా పరుగో పరుగు! (పేజీ 6)

ఈ కవిత స్త్రీ జీవితాన్ని తలపిస్తుంది. ఇందులోని 'బావి / భావి' శబ్దం ధ్వనిని ప్రదర్శిస్తుంది. స్త్రీకి ప్రతీకగా బావి, భావిని తీసుకున్నారు కవి. స్త్రీలకష్టాలకు, కడగండ్లకు 'బావి' ని గూర్చి కవి ప్రస్తావించారు. ధైర్యంగా, స్థైర్యంగా పరిస్థితులకు లొంగకుండా, బానిస సంకెళ్ళను, కట్టుబాట్లను తెంచుకొని, పోరాట పటిమను ప్రదర్శిస్తూ 'భావి'ని ఎలా చేరాలో తెలియజేశారు. ఎన్ని సమస్యలు చుట్టుముట్టినా వాటన్నింటిని తరుముతూ ముందుకు వెళ్ళాలనే స్ఫూర్తిని కవి కలిగించారు. ఈ కవిత శీర్షికతో పాటు వస్తువు మొత్తం స్త్రీ ప్రతీకగా నిలిచింది.

'మనం' కవితలో కవి మాడభూషి ప్రకృతి ప్రతీకలను ప్రయోగించారు.

ఎంత అద్భుతమైన కలయిక
ఎంత ఆనందమైన చేరిక
హృదయం రంగుల గాలిపటం
మనస్సు పురివిప్పిన మయూరం
పాతికేళ్ళనాటి ప్రమోదం అందివచ్చిన వేళ (పేజీ 15)

బాల్యం, పాఠశాల, విద్యాభ్యాసం ఎవరి జీవితంలోనైనా విడదీయరాని అనుబంధాన్ని చేకూర్చుతాయి. బాల్యం తిరిగిరానిది. పాఠశాలలో గడిచిన జీవితం, స్నేహం, చదువు ఎల్లప్పుడు చరగని ముద్రవేస్తాయి. కవి స్నేహితుల కలయికను 'రంగుల గాలిపటం' 'పురివిప్పిన మయూరం' గా పరవశం చెందినట్లుగా ప్రతీకలు ప్రయోగించారు.

'మరణం నా శాశ్వత చిరునామా!
సుదీర్ఘ ప్రయాణం తరువాత
చల్లని చెట్టుకింద సేద తీరినట్టుంది (పేజీ 35)

'మరణం' మీద సుదీర్ఘ కవితనే రచించారు కవి. 'మరణం' ఎంతటి గొప్పతనాన్ని ఆపాదిస్తుందో తెలిపారు. ఇందులో 'సుదీర్ఘ ప్రయాణం' - జీవితానికి ప్రతీక. 'చల్లని సేద తీర్చేచెట్టు' - మరణానికి ప్రతీక.

'సముద్రం' అనే కవితలో జీవన పరమార్థాన్ని తెలిపే ప్రతీకలను ప్రవేశపెట్టారు కవి.

సముద్రం ఒక అగాధ్త
ఎంతమంది ఎన్ని ప్రయత్నాలు
చేస్తున్నారో దాటడానికి
దాటిన వాళ్ళు మేటి

దాటడానికి పోటి
ఈ పోటీలో నే గెలువలేను (పేజీ 45)

'సముద్రం' దాటడం అంటే విదేశాలకు వలస వెళ్లడం వంటిది. డాలర్ మాయజాలంలో చిక్కి, మానవ విలువలను మంటగలిపి, విదేశీ మోజులో పడి వెళ్తున్నవారిని గూర్చి చెబుతున్న కవిత ఇది. 'సముద్రం దాటడం' విదేశాలకు వెళ్ళడమనే ప్రతీకగా నిర్ధారించు కోవచ్చు.

సముద్రాన్ని దాటిన వారికి
జీవితం తేలిక!
జీవితాన్ని ఈదిన వారికి
సముద్రం పేలిక (పేజీ 48)

ఈ కవితలోనే సముద్రాన్ని జీవితంతో ముడి వేశారు. సముద్రం జీవితానికి ప్రతీకగా కవి తీసుకున్నారు.

'తీర్పు' కవితలో పల్లె పచ్చదనాలను విధ్వంసం చేస్తున్న అనేక అంశాల గురించి ప్రస్తావించారు.

ఇంకిన చెరువులను గురించి
ఎండిన పొలాలను గురించి
పిడచకట్టిన నాలుకలను గురించి
వాడికేం తెలుసు
కన్న భూమిని కన్నీళ్ళలో నింపి
పరాయి భూమిని పావనం చెయ్యాలంటాడు.
(పేజి 49)

న్యాయం లేని తీర్పును గూర్చి కవి ఈ కవితా పంక్తుల్లో ఆవేదన చెందుతున్నారు. 'ఇంకిన చెరువులు', 'ఎండిన పొలాలు', 'నాలుకలు' దైన్యానికి ప్రతీక. దౌర్జన్యానికి, పాలకుల నిర్లక్ష్యానికి ప్రతీక. ఇవి దుర హంకారాన్ని ప్రదర్శిస్తున్నాయి.

'సునామీ' అనే కవితలో సునామీ భీభత్సకర, భయోత్పాత దృశ్యాన్ని కవితాత్మకంగా కవి తీర్చిదిద్దారు.

ఇప్పుడు కదా ఒళ్ళు గగుర్పొడుస్తున్నది
ఇన్నాళ్ళు పడగనీడలో పవ్వళించానని
మొసలి నోట్లో తల దాచుకున్నానని
ఇసుక గూటిని ఇంద్ర భవనమనుకున్నానని
నమ్మించి గొంతుకోసే నీ సావాసాన్ని
ఇంకా ఎలా కొనసాగించేది (పేజీ 70)

కవి ఈ కవితలో క్రూరజంతు ప్రతీకలను ప్రయోగించారు. 'సునామీ' బీభత్సం ఎంతటి ఉత్పాతాన్ని కలిగించిందో అందరికి తెలిసిన విషయం. కాని సముద్రపు ఒడ్డును తల్లి ఒడిగా భావించి పరవశించే జనాన్ని నట్టేట ముంచిన దుర్ఘటన మరచిపోలేం. 'పడగనీడ', 'మొసలి నోట్లో' సునామీ ప్రళయానికి ప్రయోగించిన ప్రతీకలు. ప్రాణాలను హరించివేసే శబ్ద సర్పాలు.

కళ్ళకు తప్ప చెవులకు ఏ పనీ లేదు
పొద్దున్నే ఎన్ని కిలకిలలో
సాయంత్రం అంత నిశ్శబ్దం
మూగబోయిన పక్షుల రెక్కలచప్పుడు తప్ప
నోరు తెరిచిన శబ్దం వినిపించదు
సూర్యుడు అస్తమించినందుకు నిరసనగా
మౌనంగా ఇంటిదారి పట్టాయి
గూటిలో పిల్లల ఆకలి వినిపిస్తూ ఉందేమో!
(పేజీ 82)

సాయంత్రం అంటే పొద్దుగూకడం. అది రోజుకైనా ఒకటే, జీవితానికైనా ఒకటే. పక్షి ప్రతీకలను కవి ప్రయోగించారు. 'మూగబోయిన పక్షుల రెక్కలచప్పుడు' సాయంత్రానికి ప్రతీకగా అనుసంధానింపబడింది.జీవన వార్ధక్యంలో సంభవించే సజీవ దృశ్యాలను పక్షి, శబ్ద ప్రతీకల ద్వారా ప్రదర్శించాడు కవి.

'మూడోమనిషి' అనే కవిత సంపుటిలో మనస్తత్వ చిత్రీకరణ అద్భుతంగా చేశారు కవి సంపత్ కుమార్. మనిషిలోని అంతర్గత స్వరూపాన్ని తెలిపే కవితలు ఒక ప్రత్యేక ఆలోచనా ధోరణిని ఏర్పరుస్తుంది. అభౌతిక స్థితిని ఆవిష్కరిస్తాయి.

ఆత్మ ఘోషిస్తూ ఉంది
మార్చురీ గదుల్లో శవాలు

శాంతి వేదం వింటున్నాయి
రోడ్డు మీద యాగంకోసం
రాజయోగంకోసం
వేద ఘోష వినిపిస్తోంది!
యజ్ఞ వాటికలో బలి పశువుల్ని
బంధించి ఉంచారు!
ఇంకా యూప స్తంభాలు నాటుతూనే ఉన్నారు
పదవి కోసం విశ్వామిత్రుడి పోటీ
ఇంద్రుడు ఇంకో పారిజాతాన్ని తుంచి పడవేశాడు!
గో వ్యాఘ్రాలు రెండూ ఒక సంతతి
అయినా గోవులు గజగజలాడుతూ ఉన్నాయి
వ్యాఘ్రం ఇంద్రుడి వజ్రాయుధం
ఋషులందరూ ఇంద్రుడి పక్క జేరి శాంతి వేదం
పఠిస్తున్నారు

(పేజీ 9 )

'మహా ఆత్మ ఘోష' కవిత నిండా ప్రతీకల వర్షం కురుస్తుంది. పూర్తిగా పౌరాణిక ప్రతీకలు ప్రయోగించి వర్తమాన రాజకీయ స్థితిని తెలిపాడు కవి మాడభూషి. 'రాజయోగం', 'వేదఘోష', 'యజ్ఞ వాటిక', 'యుగ స్తంభాలు' యాగ ప్రతీకలుగా అభివర్ణించవచ్చు. త్యాగోద్దేశంలో ఈ ప్రతీకలు ప్రయోగింపబడ్డాయి. 'విశ్వామిత్రుడు' 'ఇంద్రుడు' గో వ్యాఘ్రాలుగా చెప్పినప్పుడు వ్యాఘ్రాన్ని చూసి గోవు వణకడం అనేది నాటి రాజకీయ స్థితిని తెలుపుతుంది. వ్యాఘ్రం మాత్రం ఇంద్రుడి వజ్రాయుధంగా నిలిచింది. ఇంద్రుడే పాలకుడు. ఇంద్రుడి పంచనే చేరిన ఋషులు. పురాణ గాథతో లౌకిక రాజకీయ ఎత్తుగడలను ప్రవేశపెట్టారు కవి.

మనం ఎప్పుడూ
అసమ సమాజంవైపు పయనిస్తూ ఉంటాం
పట్టాలా ప్రవహిస్తూ ఉండడం తప్ప
జంక్షన్‌కు చేరనే చేరం!
రంగుల రాట్నంలో
స్థితులు మారడం తప్ప
గతులు మారడం లేదు
అందరూ రాజ్యాధికారం కోసమే
తమ అధికారంలోనే సమత్వమంటారు
అధికారం వచ్చిన తరువాత
కొమ్మల్లేని చెట్టులా
తాము మాత్రం పెరుగుతూ ఉంటారు. (పేజీ 23)

సామాన్యుడి రాజ్యాధికారం దక్కకపోవడానికి నిదర్శనంగా ఈ కవితా పంక్తులు నిలుస్తాయి. అందుకే ప్రజానీకం కేవలం పట్టాల మీదనే సాగిపోతుంటారు. జంక్షన్‌కు చేరేదారి వారికి తారసపడదు. 'పట్టాలు' సామాన్య ప్రజలకు ప్రతీక అయితే; 'జంక్షన్' ధనిక సమూహానికి ప్రతీక. 'జంక్షన్' ఆడంబరంతో అలరారుతుంది. 'పట్టాలు' బానిసలుగా భావాన్ని మోస్తాయి.'జంక్షన్' ధనరాశులను దింపుకునే పనిలో ఉంటుంది. అందుకే కవి 'రంగుల రాట్నం' అనే ప్రతీకను జీవితానికి ప్రయోగించారు. సామాన్యుడి జీవితం 'రంగుల రాట్నం' లాగా ఉంటుందని, స్థితులు మారడం తప్ప, గతులు ఎప్పటికీ మారనివిగా కవి వ్యక్తీకరించాడు. పేదింటి జీవితాలను 'కొమ్మలేని చెట్టు (మోడు వారిన చెట్టు) గా అభివర్ణించాడు మాడభూషి.

'వికారి' కవితా సంపుటిలో సామాజిక ప్రతీకలను అడుగడుగున ప్రయోగించారు కవి. వ్యష్టి ప్రతీకలతో సమష్టి ప్రయోజనాన్ని ఆశించారు.

ఒక్క నిమిషం కూడా ప్రతి విశ్వాసం చూడకుండా
దాని కడుపులో గునపాలు గుచ్చినప్పుడు
అది శపిస్తుందని ఊహించి ఉండరు
ఇప్పుడు నాలుక పిడచకట్టిన తరువాత
ఇక్కడ చెరువు ఉన్నట్టు గుర్తుకొస్తోంది కదూ

(పేజీ 18)

విధ్వంస, వినాశకారక, అహంకార వాదానికి ప్రతీక వికారి. 'చెరువు శాపం' కవితలో ప్రయోగించిన "కడుపులో గునపాలు' వంటివి దౌర్జన్య కాండకు ప్రతీక. తరతరాల

దాహాన్ని తీర్చి, సేద్యానికి నీరందించిన చెరువు నామరూపాలు లేకుండా అంతార్థానం కావడం వెనుక ఉన్న రాజకీయ కుతంత్రాన్ని కవి ప్రతిఘటించారు. 'నాలుక పిడచకట్టిన తరువాత' జనానికి ఊరిచెరువు మీద మమకారం పుట్టుకొస్తుందని కవి వ్యంగ్యంగా పేర్కొన్నారు. నీటికోసం అలమటించే దీనజనుల దాహార్థికి ప్రతీక 'నాలుక పిడచకట్టిపోవడం'

మంచు చుక్కలాంటి
కవిత్వాన్ని
జుర్రుకొని
జీవితం
గడ్డకట్టిపోయింది (పేజీ 22)

ఈ దృశ్యం మనకు దాహం అనే కవితలో కనిపిస్తుంది. ఈ కవితా పాదాలు స్తబ్దతకు ప్రతీకగా నిలుస్తాయి. దాహం తీర్చుకోవడం కోసం 'కవిత్వం' ఒక ఉపశమనం కలిగించింది కవికి. కాని ఆ కవిత్వం మంచు చుక్కల సాంద్రతకు గడ్డకట్టి పోయింది. 'మంచు చుక్కలు' అక్షర సముదాయానికి ప్రతీక కాగా,'గడ్డకట్టిన కవిత్వం' జీవితానికి ప్రతీక. కవిత్వం దాహాన్ని తీర్చడమే కాదు; శీతల ద్రవభవనాన్ని కలిగిస్తుందని కవి భావన. ఈ కవితలో 'నీటికొండ'ను జీవితానికి ప్రతీకగా 'నీటికుండ'ను జీవితదాహానికి ప్రతీకగా కవి అభివర్ణించారు.

గుండెల్లో మండుతున్న
అగ్ని గుండాన్ని
కొంచెం రగలనివ్వండి
అగ్నికి ఆజ్యం పోస్తున్నా
మండనీ గుండెలు
ఇవిగో ఎండు పుల్లలు
(పేజీ 28)

స్త్రీకి పునఃశ్శక్తిని, పోరాట స్ఫూర్తిని రగిలింపజేసే కవితా పంక్తులను అన్యాయాన్ని ఎదురించడానికి కవి స్త్రీకి ప్రేరణగా నిలిచారు. 'అగ్నిగుండం రగలడం' 'అగ్నికి ఆజ్యం పోయడం' వంటివి ప్రతికార జ్వాలలకు ప్రతీక. ప్రకృతి ప్రతీకలను ప్రయోగించి స్త్రీలలో గల సహజ అంతఃశక్తిని కవి ప్రోద్బలం చేస్తున్నారు. 'ఆజ్యం' 'ఎండుపుల్లలు' ప్రతీకారానికి పనిముట్లుగా కవి అందించారు.

శబ్దం
నిశ్శబ్దంగా
కవిత్వంలోకి దూరి
మనసును కలవర పెడుతుంది
తిమిరంతో సమరం సలిపి
మనిషిలో వెలుగును రేపుతుంది
మనిషికి
అక్షర జ్ఞానం కలిగింది
స్థిరమైన భావజాలం ముద్రిస్తుంది
(పేజీ 32)

నిశ్శబ్దానికి ఎంతటి శక్తి ఉందో కవులు అద్భుతంగా వర్ణించారు. సంపత్‌కుమార్ కూడా శబ్దం నిశ్శబ్దంగా మారినపుడు కలిగే ప్రయోజనాలను పేర్కొన్నారు. 'తిమిరం' అజ్ఞానానికి, 'వెలుగు' జ్ఞానానికి ప్రతీక. ప్రకృతి ప్రతీకల ద్వారా ప్రగతి బాటవైపు, అభ్యుదయ పరిధి వైపు కవి పయనింపజేశారు. నిశ్శబ్దంగా కవిత్వంలోకి ప్రవేశించిన జ్ఞానం అక్షరంగా మారి స్థిరమైన భావజాలం ఏర్పరుస్తుందని కవి ఆశావాహ దృక్పథాన్ని వెలువరించారు.

మాడభూషి కవిత్వంలో బలంగా నిలబడేది రెండు నిశ్శబ్దం, శబ్దం. ఈ రెండింటికి ప్రపంచ సాహిత్యంలోనే అపూర్వ నిర్వచనాలను కవితాపరంగా కవులు సృజియించారు. పాశ్చాత్య భావుకతకు నిశ్శబ్దం ఒక వారధిగా నిలిచింది. శబ్ద ప్రపంచాన్ని వృద్ధి పరుచుకుంది.

నిశ్శబ్దం... నిశ్శబ్దం నుండి మౌనం... మౌనం నుండి ఆలోచన.... ఇవి మనోస్థితికి దృష్టాంతాలు. నిశ్శబ్దం, మౌనం, ఆలోచన ఉత్తరోత్తర బలీయమైనవి.

నిశ్శబ్దం ఒక మేధోస్థితి. భావస్థితి. నిశ్శబ్దానికి వాహకం శబ్దం. శబ్దం నిశ్శబ్దంలో ప్రయోగించి శూన్యంలో రూపు దిద్దుకొని భావంలో ఐక్యమవుతుంది. మౌనం : అవ్యక్త భాష, అసలైన వాస్తవ భాష. మౌనం ద్వారానే పదార్థాలు భావం అవగతమవుతుంది. ఆలోచన : మనిషి అంటే ఆలోచన. మనిషి లేకపోయినా ఆలోచనలు ఉంటాయనేది బుద్ధుడి బోధ. అందుకే మనిషికంటే ముందుగా భావ సరణిలో ఆలోచనలు దర్శనమిస్తాయి. ఈ విధంగా నిశ్శబ్దం, మౌనం, ఆలోచన అవినాభావ సంబంధాన్ని కలిగిఉన్నాయి. నిశ్శబ్దం వినిపిస్తుంది. మౌనం అనుభవంలోకి వస్తుంది. ఆలోచన ఆత్మీయమై సాక్షాత్కరిస్తుంది. సంపత్‌కుమార్ అంతర్గత సామాజిక తాత్త్విక నేపథ్యానికి ఈ ప్రతీకవాదం వచన కవిత్వ బలాన్ని చేకూర్చింది.

నీకు
నువ్వే శత్రువు
మానసిక పరిపక్వత లేని వాళ్ళకు
ప్రపంచమంతా
శత్రు సమూహంలా కనిపిస్తుంది
ఆత్మశుద్ధి లేనివాళ్ళకు
అంతరాత్మే పెద్ద శత్రువు. (పేజీ 34)

'శత్రువు' ఎక్కడో ఉండడు. మనలోనే దాగి ఉంటాడు. 'తనకోపమే తన శత్రువు' సుమతీ శతకకర్త పేర్కొన్నాడు. యోగులు, ఋషులు అంతర్గత శత్రువు మూలాలను కూల్చివేయడానికి సాధన చేస్తారు. కవి ఈ కవితలో ఆధ్యాత్మిక - తాత్త్విక ప్రతీకలను ప్రయోగించారు. 'మనసు-బుద్ధి-ఆత్మ - చిత్తం' 'మానసిక పరిపక్వత', 'ఆత్మశుద్ధి', 'అంతరాత్మ' వంటి ఆధ్యాత్మిక ప్రతీకల ద్వారా శత్రువు జాడను పసిగట్టాడు. మానసిక పరిపక్వతను పెంపొందించుకొని, ఆత్మబుద్ధిని ఏర్పరచుకొని శత్రువును తరిమికొట్టాలనే సందేశం ఇందులో వెలువరించారు.

ఒక్కొక్కడు ఒక్కొక్కతీరు
అందరికీ మనసులో అదే జోరు
అన్ని చేష్టలకూ
ఒక చూపుతో సమాధానం
సర్వసంగ పరిత్యాగిలా
స్థిత ప్రజ్ఞతతో
చెక్కు చెదరని
అదే చిరునవ్వుతో
పలకరింపు (పేజీ 38)

'నవ్వు'ను కూడా కవులు కవిత్వంలో అనేక పార్శ్వాలలో అభివ్యక్తీకరించారు. 'నవ్వు' మౌనముద్రకు తార్కాణం. 'సర్వసంగ పరిత్యాగి' అనేది సన్యాసికి ప్రతీక. అన్ని వదులుకున్నవాడు భైరాగి. అతని నుండి వెలువడేది శబ్దంకాదు, నవ్వు. చెక్కుచెదరని చిరునవ్వు మాటలకందని మధుర భావ పటిమ. అది 'స్థిత ప్రజ్ఞత' జ్ఞానానికి ప్రతీక. ఆముష్మిక ప్రతీకలుగా ఈ కవితలోని శబ్దాలు వెలుగొందుతున్నాయి.

హృదయ స్పందనను కూడా గుర్తించకుండా
కంటికి కనిపించినంత దూరం
కాపలాకాస్తూ
రెప్పలకు పని చెప్పకుండా
శత్రువుకై నిప్పులు చెరిగేవాడిని
మరణం అంటారు. (పేజీ 41)

ఈ కవితలో కూడా కవి ప్రతీకార జ్వాలలతో కూడిన ప్రతీకలను ప్రయోగించారు. 'నిప్పులు చెరగడం' శత్రు సమూహాన్ని చీల్చి చెండాడడం. వీరత్వానికి, ధీరత్వానికి ప్రతీకగా, సరిహద్దుల్లో సైనికులు దేశ రక్షణకోసం కాపలాకాస్తూ ధైర్యంగా నిలబడే విషయాన్ని ఈ కవిత వెల్లడిస్తుంది. శత్రువుల మరణశాసనం రాసే సైనికులకు మరణం అంటదని కవి పేర్కొన్నాడు.

రెండంచుల కత్తి అనే కవితా శీర్షిక మొత్తం ప్రతీకగా నిలుస్తుంది. రాజకీయ ప్రతీకలు విరివిగా ప్రయోగించిన కవిత ఇది. కవి ఈ సమాజంలో స్వార్థంతో రాజకీయ నాయకులు అవలంబించే విధానాన్ని కళ్ళకు కట్టినట్టు వ్యక్తీకరించారు. స్వప్రయోజనాలకోసం ప్రజలను పావులుగా ఉపయోగించుకొని నిర్దాక్షిణ్యంగా వారిని అణచివేయడం వంటి దృశ్యాలకు ఈ కవిత దృష్టాంతంగా నిలుస్తుంది. రాజకీయ ఎత్తుగడలతో పార్టీలు మారుతూ రెండు వైపుల నుండి స్వలాభం దిశగా వెళ్ళేవారిని నిరసించారు కవి.

కత్తి మొన మీదున్న వాళ్ళ సంగతేకాదు
కత్తికి అటూ ఇటూ ఉన్నవాళ్ళు కూడా అంతే
(పేజీ 43)

ఎన్నో సిద్ధాంతాలతో రాద్ధాంతాలు చేసిన వారైనా కూడా; చివరికి ఎలాంటి విలువలు లేకుండా రెండు నాల్కల ధోరణిని వహిస్తారు. ఇక్కడ 'కత్తి' రాజకీయం. 'రెండంచులకత్తి' అంటే ద్వంద్వ వైఖరిని ప్రదర్శించే రాజకీయ పార్టీని గురించి కవి వ్యక్తపరిచిన విషయం.

రాముడి మీద
అర్జునుడు అస్త్రం సంధిస్తాడు
లక్ష్మణుడి మీద
రాముడు కత్తి దూస్తాడు
భీష్ముడి పై
కృష్ణుడు చక్రం తీస్తాడు
అన్నదమ్ములు
పెరిగి పెద్దవాళ్ళై
శత్రువులవుతారు. (పేజీ 44)

ఈ కవితా పంక్తుల్లో కవి పౌరాణిక ప్రతీకలను ప్రయోగించాడు.'రాముడు, అర్జనుడు, లక్ష్మణుడు, భీష్ముడు, కృష్ణుడు' వీరందరు రక్త సంబంధీకులు. అన్నదమ్ములు, బంధు మిత్రులు. అయినాగాని ఒకరిపై ఒకరికి రాజకీయపరంగా కక్షలు, కార్పణ్యాలు ఉంటాయని కవి అంటాడు. వీరేగాదు 'ప్రజాస్వామ్యం/ ప్రజలు / పాలకులు / రెండంచుల కత్తి కిందే / పరిణతి పొందుతారు / పరివర్తన చెందుతారు' అంటాడు కవి.

మొదటి రోజు
ఎవరెస్టుకు చేరిన
అభినందన గ్రాపు
మూడో రోజుకు
కన్యాకుమారికి దిగిపోయింది
దేశభక్తికి కూడా
కులమే
కొలమానం (పేజీ 59)

'అభినందన' కవితలో దేశ ప్రతీకలను కవి ప్రయోగించాడు. 'ఎవరెస్టు', 'కన్యాకుమారి' ఇవి రెండు ప్రదేశాలు దేశానికి ఉత్తర దక్షిణాలుగా ఉన్నాయి. కవి వీటిని ఎత్తు పల్లాలుగా పరిగణించారు. 'ఎవరెస్టు' గర్వానికి, ఉన్నతికి, గౌరవానికి, ఖ్యాతికి, కీర్తికి ప్రతీకగా వెలువరిస్తే; 'కన్యాకుమారి' దిగువస్థాయికి, కిందిస్థాయికి, చివరి స్థాయికి ప్రతీకగా పేర్కొన్నారు. ప్రశంసల వెల్లువ రోజు రోజుకు ఏ మార్పులను తీసుకొస్తాయో తెలుపుతూ చెప్పిన ప్రతీకలు ఇవి.

రైతు ఆత్మకథ
రైతు ఆత్మకథ
వాడి స్వేదం నుండి జాలువారుతుంది (పేజీ 60)

'స్వేదం' కర్షక కార్మిక శక్తికి ప్రతీక. కష్టం, శ్రమ నుండి ఉత్పన్నమయ్యే శక్తి శ్రామిక శక్తికి తార్కాణం. తుత్తునాగం శ్రామిక శక్తి ప్రతీకగా అభివర్ణిస్తాం. 'స్వేదం' కూడా.

నీరసంగా ఉన్న జనానికి
అప్పుడప్పుడూ యుద్ధం గ్లూకోజ్ ఎక్కిస్తేగాని
ఒంట్లో వేడిపట్టదు
అంతా ప్రశాంతంగా ఉంటే
అంతర్గత యుద్ధం మొదలవుతుంది (పేజీ 64)

'గ్లూకోజ్' ఔషధ ప్రతీక. చైతన్యాన్ని కలిగిస్తుంది. అందరు శాంతిని కోరుకుంటారు కాని సంపత్‌కుమార్

'యుద్ధం' అప్పుడప్పుడు చేయాలంటాడు. 'యుద్ధం' మానవ సమూహానికి గొప్ప ఉత్తేజాన్ని అందిస్తుందనేది కవి వాదన. ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ తన కవిత్వంలో సామాజిక, సాంస్కృతిక, పౌరాణిక, చారిత్రక, రాజకీయ, ఆధ్యాత్మిక, ప్రకృతి, సాంకేతిక ప్రతీకలను ప్రయోగించారు. కవితాంశాలను బట్టి స్థల కాల మాత్రుకలను కూడా ప్రవేశపెట్టారు. అత్యాధునిక సాహిత్య విమర్శా ధోరణికి చెందిన 'ప్రతీకవాదం' కవిత్వ గాఢతను నిర్దేశిస్తుంది. మాడభూషి కవిత్వం శైలీ పరంగా సాంద్రతను వస్తు పరంగా అర్థ స్ఫురణను కలిగి ఉంది. వీటితో పాటు శబ్ద నైపుణ్యంలో ప్రతీకల కూర్పు కవితా సౌందర్యాన్ని సాధించాయి.

**ఆధారగ్రంథాలు :**

1. నారాయణరెడ్డి.సి. డా॥ నవంబర్ 2011, ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు - ప్రయోగములు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
2. మందేశ్వరరావు, వడలి, 1994, పాశ్చాత్య సాహిత్య విమర్శ చరిత్ర సిద్ధాంతాలు, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
3. లక్ష్మణచక్రవర్తి, సిహెచ్., (సం), 2004, ఆధునిక సాహిత్య విమర్శ రీతులు, ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర తెలుగు శాఖ, హైదరాబాద్.
4. సంపత్ కుమార్. మాడభూషి. ఆచార్య., ఏప్రిల్ 2013, జీవితం - కవిత్వం, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.
5. సంపత్ కుమార్. మాడభూషి, ఆచార్య., మార్చి 2015, శత్రువుతో ప్రయాణం, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.
6. సంపత్ కుమార్. మాడభూషి. ఆచార్య., ఏప్రిల్ 2015. ఆలోచపలే, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.
7. సంపత్ కుమార్. మాడభూషి. ఆచార్య., ఏప్రిల్ 2016., చివరకు నువ్వే గెలుస్తావు, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.
8. సంపత్ కుమార్. మాడభూషి. ఆచార్య., మార్చి 2017. మూడో మనిషి , పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.
9. సంపత్ కుమార్. మాడభూషి. ఆచార్య., ఏప్రిల్ 2019. వికారి, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.
10. సంపత్ కుమార్. మాడభూషి. ఆచార్య., (సం) ఎప్రిల్ 2019.తెలుగు దీప్తి, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.

# చంద్రిక పరిణయం – ప్రకృతి సౌందర్యం

– **జి.వి. సుజాత,** జూ॥ లెక్చరర్ - తెలుగు, ప్రభుత్వ జూ॥ కళాశాల, నందికొట్కూరు, కర్నూలు జిల్లా.

## వర్ణనానుశీలనం - పరిచయం :

**'కవయతీతి కవిః'** వర్ణించేవాడు కవి అని చెప్పడం వల్ల కావ్యమంతా వర్ణనే అనవలసి వస్తుంది. కాని సాధారణంగా 'వర్ణన' శబ్దాన్ని ఈ అర్థంలో గ్రహించడం లేదు. నగరం, శైలం, సూర్యోదయం, చంద్రోదయం మొదలైన వర్ణనలే కావ్యంలో వర్ణన శబ్ద వాచ్యంగా భావించడం జరుగుతోంది. కావ్యంలో అష్టాదశ వర్ణనలుండాలని అలంకారికుల నియమం. వేట, మౌనీంద్ర పుణ్యాశ్రమం, కన్యాంగ సౌందర్య కథనం - అనే వాటిని కూడా చేర్చి కావ్యంలో ఇరవై రెండు వర్ణనలను అప్పకవి చెప్పాడు. వాటిలో కొన్ని తక్కువైనా దోషం లేదు.

'చంద్రికా పరిణయంలో అష్టాదశ వర్ణనలలోనివే కాకుండా అప్పకవి అదనంగా చెప్పిన వర్ణనలకు కూడా అవకాశం కలిగింది. (వేట, మౌనీంద్ర పుణ్యాశ్రమం, కన్యాంగ సౌందర్య కథనం) ప్రబంధాలలో కథను నెపంగా చేసుకొని వర్ణనలు ఉంటాయి. అందులో సూర్యోదయ వర్ణన, చంద్రోదయ వర్ణన, సముద్ర వర్ణన, సెలయేళ్ళు, అరణ్యాలు, పగలు, వెన్నెల, రాత్రి, నదులు, పర్వతాలు, పశుపక్ష్యాదులు మొదలైన ప్రకృతి వర్ణనలు ఎన్నో ప్రబంధాలలో చోటు చేసుకొంటాయి. ఆయా సందర్భాలలో తగిన విధంగా కవులు ప్రకృతి వర్ణనలు చేయడం పరిపాటి. మానవులు జడులు కారు. కనుకనే కేవలం తిండి తీర్థం, నిద్రలు మాత్రమే ముఖ్యం కాదు. వాటితో పాటు మానసికోల్లాసానికి సంబంధించిన అంశాలు మానవులకు కావాలి. ఎంతో అందమైన ప్రకృతిని చూసి మానవులు పులకించిపోతారు. జంతువులు కూడా అంతో ఇంతో ప్రకృతిని చూసి స్పందించకుండా ఉండలేవు. అలాంటప్పుడు మానవులు ఎలా స్పందించకుండా ఉంటారు.

రెండు మూడు దశాబ్దాల క్రితమే సంగీతాన్ని విని పశువులు పాలు అధికంగా ఇస్తాయని, పొలాల్లో పంటలు అధికంగా పండుతాయని శాస్త్రవేత్తలు చెప్పిన సంగతిని ఇక్కడ గుర్తు చేసుకోవచ్చు. (వార్తాపత్రికల ద్వారా మనకీ విషయం తెలిసింది). సముద్రం కూడా పున్నమి నాటి చంద్రుణ్ని చూసి ఉప్పొంగుతున్నదందుకే. ప్రకృతిలోని పదార్థాలకు, పశుపక్ష్యాదులకే ఇంత స్పందన ఉంటే మానవులకు ఇక ఎంత ఉంటుంది. ప్రకృతిని చూసి ఆహ్లాదించకపోతే జడ పదార్థాలకంటే హీనమని చెప్పవచ్చు. ఆధునిక మానవులీనాడు కృత్రిమ విధానాలకు అలవాటు పడి, హృదయ స్పందనను బలవంతంగా అదిమిపట్టి ఇటువంటి ఆనందాన్ని పోగొట్టుకుంటున్నారు. అలా చేయవద్దంటున్నారు ప్రకృతి శాస్త్రవేత్తలు.[1] అందుకే ప్రకృతి చికిత్స పేరుతో ఈనాడు మళ్ళీ తెరపైకి వచ్చింది. ప్రకృతి వర్ధనలు ఆస్వాదయోగ్యంగా ఉంటాయి. ఇలాంటి కావ్యాలు చదవడం వల్ల హృదయం నిర్మలమవుతుందతి. మానసిక ఒత్తిడి తగ్గుతుంది. రక్తపోటు సాధారణ స్థితిలో ఉంటుంది. మానవుని ఆరోగ్యానికి ఆరు సూత్రాలలో ఇది కూడా ఒకటి.

### వసంతఋతు వర్ణన :

సీ॥ సుమనోగ సమ చూత సుమనో గణపరీత
సుమనోగణిత సారశోభితాళి
కలనాద సంతాన కలనాద సమ నూన
కలనా దలిత మానబలవియోగి,
లతికాంతరిత రాగలతికాంత సపరాగ
లతికాంత పరియోగ లక్ష్యకాళి,
కమలాలయాస్తోక కమలాలయ దనేక
కమలాలసిత పాక కలితకోకి,

తే॥ జాలకవితానక వితాన పాళిభూత
చారు హరిజాత హరి జాత తోరణోల్ల

సద్వృతతి కాంత్రవతతిగా వ్రజ క్షయాతి
భాసురము పొల్చె వాసంత వాసరంబు (4-27)

కల్పవృక్షాలతో సమానమైన మామిడి, కుసుమ కదంబాలతో వ్యాపించబడి అధికమైన సామర్థ్యంతో ప్రకాశిస్తూ మామిడి రసాలను, కుసుమాలను తుమ్మెదలు ఆశ్రయించి ఉన్నాయి. కోకిల గుంపుల ఆవ్యక్తమధురమైన ధ్వని విరహిణుల కోప సామర్థ్యాన్ని పోగొట్టే విధంగా ఉంది. తీగలతో కప్పబడిన దాడిమి (దానిమ్మ) కొమ్మల పూలు, పుప్పొడి జల ప్రవాహాల మీద పడి చూడ సొంపుగా ఉన్నాయి. సరస్సులలో లక్ష్మీదేవికి గృహాల లాగా ఉన్న పద్మాలలో మిక్కిలి ప్రకాశిస్తున్న పిల్లలతో ఆడు జక్కవలు కూడుకొని ఉన్నాయి. అంటే వసంతకాలంలో కొలకులలో (సరస్సులలో) చక్రవాక స్త్రీలు తమ బిడ్డలతో నివసిస్తూ ప్రకాశిస్తున్నాయన్నమాట. మొగ్గల గుంపనే మేలుకట్లతో బారులు తీరి మనోహరమైన మన్మథునికి వాహనాలైన చిలుకల గుంపనే తోరణాలతో ప్రకాశిస్తూ తీగల ప్రక్క కొమ్మల గుంపనే గృహాలతో మిగుల ప్రకాశిస్తుంది. అంటే వసంతకాలంలో లతా గృహాలు మొగ్గలగుంపనే మేలుకట్లతో, చిలుకల బారులనే తోరణాలతో విలసిల్లు తున్నదని భావం.

## వసంతాగమనం :

సీ॥ శ్యామోదయము కొంబియము చేయనేతెంచి
శ్యామోదయమును హెచ్చఁగఁదనర్చె,
సుమనోవిలాసంబు చూఱపుచ్చఁగఁ జేరి
సుమనోవిలాసంబు లమరఁ జేసె,
తుంగ కదంబాభ దూల్పంగఁ బొడకట్టి
తుంగ కదంబాభ పొంగఁదార్చె,
హైమజాలకరూఢి నపహరింపఁగఁ బొల్చి
హైమజాలకరూఢి యడల నూన్చె,
తే॥ శుచి పలాశాళి హృతిఁగూర్ప నచల వెలసి
శుచి పలాశాళి వర్ధక స్ఫూర్తిఁబొదలె
నహహ! కమలేశ్వరాత్మ జాతైక మైత్రి
కతనఁ జైత్రుండు, సమ్మదాకలన నొంది. (4-45)

వసంతుడు రాత్రి ఆవిర్భావాన్ని కొంచెంగా చేయటానికి ప్రేంకణ వృక్షాలను అధికంగా వద్ధి చేశాడు. జాజుల విలాసాన్ని కొల్లగొట్టడానికి పువ్వులను అందంగా అమరు నట్లు చేశాడు. ఉన్నతమైన కడిమిచెట్ల కాంతిని తూల్చ డానికి పొన్నల గుంపుల కాంతిని అతిశయించినట్లు చేశాడు. మంచు బిందువుల రీతిని అపహరించటానికి చంపక సంబంధమైన మొగ్గల రూఢిని ఒప్పేటట్లు చేశాడు. ఎండుటాకుల సమూహాలను హరించివేయడానికి భూమిమీద ప్రకాశించే నిర్మలమైన మోదుగల సమూహాన్ని వృద్ధి పొందించి ప్రకాశత్వంతో ఒప్పాడు. ఆశ్చర్యం! లక్ష్మీకాంతుడైన విష్ణువు పుత్రుడు మన్మథుణ్ణి స్నేహితుడిగా గలిగిన వసంతుడు సంతోషంగా వనంలో ప్రవేశించాడు.

అంటే వసంతకాలంలో సూర్యగతిమాంద్యం వల్ల రాత్రి తక్కువ కావటం, లతలు వృద్ధి పొందడం, జాజులు వికసించకుండా ఉండటం, పూలు సమృద్ధమవడం కదంబాలు పుష్పించకుండా ఉండటం, పొన్నలు ప్రకాశించడం, మంచు సమూహం తగ్గిపోవడం, సంపెంగలు ప్రబలడం, పండుటాకులు రాలడం, మోదుగచెట్లు వృద్ధి చెందడం, మొదలైనవి కొన్ని లోక ప్రసిద్ధాలు. కొన్ని కవి సమయ సిద్ధాలు.

## ఉద్యానవన సౌందర్యం :

కువలాస్త్ర రుజాగతిఁ బో
క్కు వలాహకకచకు వనిక కొమ రయ్యెడఁ ద
త్కువ లాంబకాళి సుధతేఁ
కువ లార్చు శుభోక్తిఁ దెల్పెఁ గూరిమి పొదలన్. (4-52)

మదన జ్వరంతో తపిస్తున్న చంద్రికకు మేఘం వంటి కురులు కలిగిన ఆ స్త్రీలు సుధ కన్నా మధురమైన పలుకులతో ఉద్యానవన సౌందర్యం ద్విగుణీకృతం అయ్యింది.

సీ॥ జాలాంబుజ తమాలమా లాభినవజాల
జా లామృతోల్లోల షట్పదౌఘ,
రాగాది పరమాగ మాగాంత సుపరాగ
రాగావరణభా గరాళపవన,

కేళీగృహన్మౌలి మౌలిస్థిత పికాలి
కాలీనరవ లోలితాధ్వగాత్మ,
రాజీవశరవాజి వాజీన నిరతాజి
తాజీ జనక రాజితామ్రఫలిక ;

తే॥ భవ్యబుతుకాంత కాంత తాత్పర్య సృష్ట
ఘనవిషమబాణ బాణ సంఘాత కలిత
తిలక మధుగంధగంధ సంచులు కితాశ,
కనదచిరధామధామ! యివ్వనికఁ గంటె ? (4-53)

లేత పద్మాలు, కానుగ పంక్తుల నూతనమైన మొగ్గల గుంపుల పూదేనియల్లో మిక్కిలి ఆసక్తిగా తిరుగాడే తుమ్మెదల సమూహాలు ఉన్నాయి. దాడిమి వృక్షాలు మొదలైన శ్రేష్ఠమైన వృక్షాలలోని పూల మకరందం ఆచ్ఛాదనంగా కలిగి వాయువులు వీస్తున్నాయి. విహార గృహాలయిన అశోక వృక్షాల అగ్రభాగాన ఉన్న కోకిల సమూహాల స్పష్టమైన ధ్వనులవల్ల బాటసారుల మనస్సులు చలించే విధంగా ఉన్నాయి. మన్మథునికి అశ్వాలైన పక్షి శ్రేష్ఠాలు అంటే చిలుకలు ఎల్లప్పుడూ తగ్గని కలహానికి హేతువై మామిడిపండ్లు ఒప్పుతున్నాయి. మనోజ్ఞమైన వసంతుని మంచి ఆసక్తివల్ల సృజించబడిన అధికమైన పుష్పబాణాల సముదాయంతో కూడుకున్న బొడ్డుగుల మకరంద పరిమళ గంధాలు దిక్కులంతా వ్యాపించి ఉన్నాయి. ఒప్పుతున్న మెరుపువంటి కాంతి కలదానా? ఉద్యానవనం చూశావా?

అంటే నవాంభోజ, తమాల జాలకాల పూదేనియ నందు ఆసక్తి చూపించే తుమ్మెదలు గలిగి, దాడిమి మొదలైన వృక్షాల పుష్పరేణువు వల్ల వ్యాపించిన గాలులు గలిగి, బాటసారుల చిత్తాలను చలింపజేసే అశోక వృక్షవాసులైన కొకిల ధ్వనులు గలిగి, ఎల్లప్పుడు చిలుక లకు జగడాన్ని కలుగజేసే మామిడిపండ్లు గలిగి, వసంతోదయాన ఉదయించిన బొడ్డుగు పూల సువాసన దిక్కులంతా వ్యాపించి ఉద్యానవనం విరాజిల్లుతున్నట్లు ఉన్నాయని కవి వర్ణించాడు.

**రాజహంసలతో ప్రకాశిస్తున్న కొలను :**

ఎడ తెగని కాలి అందెల ధ్వని వచ్చే దిశను తెలుసు కొని వనదేవతా జనాలు విజృంభిస్తూ తీరమనే రాజ ధానిలోని విడిది స్థానాల్లో సమూహాలలాగా, మనోజ్ఞమైన మొగ్గలనే ముత్యాల చాలు వేలుకట్లవల్ల ఇంపైన వాయువు చక్కని రాకతో జారుతున్న అశోక వృక్షాల్లోని పూల పరాగ పటలం అనే రత్న కంబళి సమూహాలతో సంపెంగ చాలు అనే బంగారు సౌధాలతో, మార్గాల వెంట ప్రకాశిస్తున్న మాగిన పండ్లతో, ఒప్పుతున్న అరటి, పోక మ్రానులతో, ప్రకాశిస్తున్న పరిమళ గంధాలు గలిగిన మకరందం అనే గంధం నూనెతో, దట్టమైన దాస మొగ్గలనే కళికల వంటి దీపాల సమూహాలతో, తీర ప్రదేశంలో అతిశయిస్తున్న పొదరిండ్లు మనస్సుకు సంతోషాన్ని కలిగిస్తున్నాయి. హంస స్త్రీలనే స్త్రీలు శుభ్రమైన కాంతి అనే ధవళ గీతాల వర్ణనలతో నిండి ఒప్పిదంగా అతిశయించే తీరమనే కల్యాణ గృహంలో సాటిలేని మెట్టతామర అనే పెండ్లి పీట మీద కూర్చున్న బెగ్గురు పక్షి అనే పెండ్లికొడుకుకు వివాహకాలంలో వధూవరులపై చల్లే అక్షింతలు చల్లడానికి గొప్ప కాల్వలు అనే స్త్రీ సమూహం మిక్కిలి ప్రకాశిస్తున్న కేసరాలనే వడ్లరాశితో కూడుకొని కొంచెం విరిసిన ఎర్రతామర అనే రోలులో దంచే రోకళ్ల అందంతో, ఆ కమలం మధ్యలో పడటం, ఎగవేయటం చేస్తున్న తుమ్మెదబారులు మిక్కిలి నయనా నందాన్ని కలిగిస్తున్నాయి.

సరస్సు అనే యమునా నది అగాధ జల ప్రదేశంలో వేగంగా ప్రవేశించి నీలోత్పల సంబంధమైన తీగలాంటి కాలియుడనే సర్పం చుట్టూ త్రొక్కి ఆ తామరతూడు అనే సర్పశరీరాన్ని కుడివైపు చేతిలో అమరేటట్లు, నీలోత్పల దళాలనే పడగల అగ్రభాగాలవల్ల మకరందం అనే విషధారాలు (నీటి ధారలు) బయలుదేరినట్లు తన నల్లని దేహం కలికి శ్రీకృష్ణతత్వం అర్థవంతమై వర్తించేటట్లు మెచ్చుకోదగిన నాట్యాన్ని చేస్తూ కలహంసలు కనపడుతున్నాయి. మలయ మారుత మోసులతో, మీదికి

ఎగసిన ఎర్రతామర పుప్పొడి సమూహంతో వ్యాపించిన ఆకాశ ప్రదేశం కల్పించబడిన సాయంకాలంలో ఉడిగిపోయిన తెల్లతామరల మధ్య ప్రదేశంలో నివసిస్తున్న అధికమైన తుమ్మెదల బ్రోతలు సుతులు కాగా, ఎల్లలోకాలను గెలవడంతో మిక్కిలి ఉప్పొంగిన మన్మథుని జయ చిహ్నాలతో గూడిన గద్యపద్యాల గానేచ్ఛ వహించిన బంగారు కాయలు గల వీణా దండాల లాగా అడ్డంగా కనిపిస్తున్న ఒక్కొక్క తామర తూడు మీద ఒక్కొక్క చక్రవాక పక్షి సంతోషంగా అతిశయించింది.

అంటే మలయ మారుతాలతో ఎర్రతామర పుప్పొడులు గగనభాగం నిండి సంధ్యా కాలాన్ని తలపిస్తున్నదని, అప్పుడు సంధ్యా సమయంలో భ్రాంతితో తెల్లతామరలలో చేరిన తుమ్మెదలు రొద చేస్తున్నాయని, ఆ రొదకు ఆ చక్రవాక పక్షులు ఒక్కొక్కటి ఒక్కొక్క తామర తూడును చేరి మన్మథుని బిరుదాలైన గద్యపద్యాలను గానం చేస్తుండగా, జలాధిదేవతలు చేపట్టిన బంగారు దండలను పోలి దేవత గానాలకు సుతులుగా ఉన్నాయని భావం.

సూర్యమండలం అనే మిత్రమండలితో కూడి ఎక్కువైన వేడుకతో అపూర్వమైనట్లు తన ప్రియమైన స్త్రీతో కూడినదై ఆడ బెగ్గురు పక్షుల మంగళకరమైన పాటలు అధికమై ఒప్పుతుండగా శతపత్రం అనే తన గృహంలో శుభాన్ని పొందడానికి తిన్న తిన్నగా వస్తున్న చక్రవాక పక్షులకు హారతి ఇవ్వడానికి చెంగల్వ లతలనే ప్రశస్తమైన స్త్రీలు స్వర్ణమయాలైన కదలారతి పళ్లెం అంటే ఒక విధమైన చెంగల్వ లతలనే ప్రశస్తమైన స్త్రీలు స్వర్ణమయాలైన కదలారతి పళ్ళెం అంటే ఒక విధమైన ఆరతి తట్ట (వివాహాది శుభ సమయాలలో వధూవరులు ప్రవేశించే టప్పుడు హరిద్రా జలాదులతో గూడిన తట్టలతో ఎత్తే ఆరతికి కదలారతి అని ప్రసిద్ధి). అందంగా పచ్చని పుప్పొడి అనే పసుపు పొడితో వ్యాపించబడి ఆ చెంగల్వ పూదేనె మధ్యభాగంలో శ్రేష్ఠమైన కింజలాదెల ఓదనంతో చూడ చక్కగా ఒప్పుతున్న చెంగల్వ గుంపులు సంతోషాన్ని చిగురింప చేస్తున్నాయి.

అంటే చక్రవాక శ్రేష్ఠం నిజకామినీ సమేతంబై సూర్యోదయ పరికల్పితమైన మహోత్సవానికి శతపత్రం ప్రవేశిస్తుండగా నూతనగృహ ప్రవేశాన్ని మిత్రమండల సమూహం చేస్తున్నట్లున్నదని, అప్పుడు ఆడ బెగ్గురు పక్షులు ధ్వని చేస్తుండగా స్త్రీలు పాట పాడుతున్నట్లు ఉన్నదని, చెంగల్వతీగలు పచ్చని పరాగంతో గూడి మకరంద భరితాలైన కేసరాలతో గూడి చెంగల్వ పూలతో కూడి ఉండగా నూతన గృహ ప్రవేశం చేసే రథాంగ దంపతులకు మంగళ స్త్రీలు కదలారని ఎత్తటానికి బంగారు పళ్ళెరాలు పట్టుకొని వానిలో పసుపునీరు, అన్నం మెతుకులు వేసుకొని ఎదురు నిల్చి ఉన్నారని భావం.

తన మనస్సుకు దుఃఖకరమైన, ఆటంకంలేని మత్తగజాలనే ఘాతుకుల రీతులు కలకాలం పొందకుండా ఉండటానికి కమలాల కాండాలను ఆహారంగా చేసుకొని కమలాసనుడైన (పద్మాసనుడైన) బ్రహ్మకు అధికమైన మనస్సుతో మిక్కిలిగా తన హంసతనమనే యతిత్వం ఖ్యాతి గాంచినట్లు ప్రసిద్ధి పొందడానికి తపస్సు లాచరించే విధంగా అధికమైన ఎర్రతామరల ఆశ్రమ మధ్యభాగంలో ఉత్కృష్టమైన అశోకనవదళాలనే అగ్నిజ్వాలలు చుట్టు కొనగా అఖండానందంతో నేత్రయుగ్మం సగం మూసుకొని కదలకుండా వర్తిస్తున్న రాజహంసలు మానసవీధిలో ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి.

అంటే ఆ కొలనులో రాజహంసలు ఎర్రతామరల మధ్య పద్మాలపై కూర్చొని కమలకాండ భక్షణ చేస్తూ కండ్లు అరమోడ్చి కదలకుండా మేఘాలనే దుష్టుల వల్ల తమకు కలకాలం అపాయం రాకుండా ఉండటానికి కోకనదం అనే ఆశ్రమం మధ్యలో జలభక్షణ చేస్తూ, బ్రహ్మను గురించి తపస్సు చేస్తూ ఆనందంతో కండ్లు అరమోడ్చి కదలకుండా తమ హంసత్వాన్ని ప్రసిద్ధి చెందించే విధంగా ఉన్నాయని, ఎర్రతామర దళాలు చుట్టూ చుట్టి ఉండగా

అవి అగ్ని శిఖలను పోలి ఆ హంసలు పంచాగ్ని మధ్యలో కూర్చున్నట్లు తోస్తున్నదని కవి చక్కగా వర్ణించాడు.

చంద్రిక మరియు తన తోటి చెలికత్తెల నయన సౌందర్య సందర్శనంతో ఉదయించిన లజ్జాతిశయంతో ముడుచుకు పోయి ఉన్న కలువలకు సంతోషంతో ఆ స్త్రీ నయన విలాస సౌందర్యాన్ని చూడాలనే కోరిక కలిగింది. అతి వేగంగా పైకి ఎగిరి ఆ స్త్రీ నయన సౌందర్యానికి భయపడి మరుగున పడే విధంగా ఎగరడం, మరలడం మొదలైన విధంగా మత్స్య విశేషాలు మిక్కిలి సంతోషాన్ని కలుగజేస్తున్నాయి.

అంటే కొలనులో కలువలు సూర్యోదయంతో ముడుచుకు పోవడం, చేపలు ఎగిరిపడటం సహజం. కాని ఇక్కడ ఆ స్త్రీ నయన సౌందర్యాన్ని చూసి సిగ్గుతో కలువలు ఉడిగినట్లు. మత్స్యాలు ముడుచుకు పోయిన ఆ కలువలను చూసి తాము ఆ నయన సౌందర్యాన్ని చూడాలని చెంగున ఎగిరి ఆ నయన సౌందర్యానికి భయపడి మరల క్రిందికి పడుతున్నట్లు ఉన్నాయని భావం.

మిక్కిలి సమీప ప్రదేశాలలో సంచరిస్తున్న సూర్యుని కిరణ సమూహం వల్ల మిక్కిలి తాపాన్ని పొంది, మంద మారుతాలతో చలింపచేయబడిన నూతన నీలోత్పలాల మకరంద బిందువుల చేతనైన తాపాన్ని తగ్గించుకోవాలనే కోరికతో కమలం మధ్యలో దాగి ఉన్న ఆకాశం మధ్య భాగంలో తీర ప్రదేశాన్ని చుట్టుకొన్న మంజులమైన జాజి, బండి గురివింద, ప్రేంకణ, మల్లె మొదలైన లతలతో వ్యాపించి దట్టమైన మోదుగుల అతిశయంతో సూర్యుని ప్రకాశత్వ మహిమ కోల్పోగా కనిపిస్తున్న నక్షత్ర సముదాయాలు సౌందర్యంతో కనిపిస్తున్నాయి. కమలాలనే గృహాల మధ్య భాగంలో నివసిస్తున్న సంతోషంగా ఉన్న ఆడు తుమ్మెదలు చక్కని దేహకాంతితో వ్యాపించిన నీటిమీద కనబడుతున్న తెల్లని ఫేనఖండాల సముదాయాలు సంతోషాన్ని వృద్ధిచేస్తున్నాయి.

అంటే ఆ కొలకులలో జలాలు తుమ్మెదల దేహకాంతితో తటద్రుమ చ్ఛాయావృతమై అందులో ఉన్న ఫేనఖండాలు నల్లగా ఉండగా, సూర్యుడి చెంత ఉండటం వల్ల కలిగిన తాపాతిశయంతో ఆకాశం నీలోత్పల మకరంద బిందువులను త్రాగడానికి కాసారం జేరి తటద్రుమ సందోహంతో సూర్య ప్రకాశాన్ని పొంద కుండా అందులో కనిపించే నక్షత్రాల గుంపు చందంగా ఉంది.

సహజంగా సూర్యాస్తమయం అయిన వెంటనే సరస్సులలో నీరు నల్లగా కనిపించడం, ఆకాశం నీళ్ళలో ప్రతిబింబించడం సహజం. కాని ఇక్కడ కవి సూర్య తాపాన్ని పోగొట్టుకోవడానికి సరస్సులలోని నల్ల కలువల మకరందాన్ని త్రాగడానికి చుక్కల గుంపులతో సహ వచ్చినట్లుగా కవి చక్కగా వర్ణించాడు.

ఆ కాసారం ఒప్పుతున్న చంద్రుని భార్యలైన నక్షత్రాల సంఘాలతో ప్రకాశిస్తోంది. ఆ కారణం వల్ల వృశ్చికం, మిథునం, మీనం, కర్కటకం, మకరం మొదలైన రాశులతో కూడినదై, ఒప్పుతున్న కమలాలని, కామినులు అనగా ఆడు జక్కవ పక్షులని వీటి సంఘాలతో కూడిన వృశ్చిక, మిథున, మత్స్య, ఎంద్రకాయ, మొసళ్ళు మొదలైన వాటితో కూడి ఉన్నదని వాస్తవార్థం.

మనోజ్ఞమైన సింహరాశితో కూడుకొని సూర్యుని ప్రకాశంతో సమానమైన ప్రకాశత్వంతో ప్రకాశిస్తూ, మనోహరమైన విరిసిన కదంబ వృక్షాలతో ప్రకాశిస్తూ, మనోహరమైన ప్రవాహాన్ని పొంది, జక్కవ పక్షుల నిర్మలమైన సద్విహారాలతో గూడి, మనోహరమైన సూర్యకులస్వామి అయిన రాముని హృదయ విదారకమైన యాత్ర కాబట్టి అడ్డులేని వేగంతో విజృంభిస్తున్న అనేక విధాలైన వానర వీరుల మిగుల ఒప్పుతున్న కలకలధ్వని విలాసంతో పుడిసిలించబడిన దిగంతాలు కలిగి ఉన్నది.

అంటే ఆ కొలను మనోజ్ఞమైన రాజహంస స్త్రీలతో, వానర వీరుల కోలాహలంతో ఉండగా, చెప్పనలవి కాని

కొలాహలంతో సంతోషం మూడు మడుగులు అయినట్లు ఒనరించగా ఆ స్త్రీలు పద్మాలు కలిగిన ఆ కొలనులో జలవిహార క్రీడపై కోరికతో సూక్ష్మమైన బంగారు వస్త్రాలను విడిచి పరికిణీలు ధరించి, కొమ్ములను స్వీకరించి తిన్న తిన్నగా ఒయ్యారం అతిశయించగా కొలనులో ప్రవేశించారు. (4-68).

## చంద్రోదయ వర్ణన :

మ॥ శరజద్వేషి నిశావధూటి వరణేచ్ఛన్ రాగ మున్మున్నె బల్
త్వరఁ గాలోపధికారు లూను నవచంద్రజ్యోతి రాళీలస
త్పరివర్ణ్య స్వకవర్ణ నిర్ణిహత చంద్రజ్యోతి రాళీ లస
దర్గిమం బెంపయి దోచెఁ బ్రాచి, నవదాత
త్విట్కులంబయ్యెడన్. (4-101)

కమల విరోధి అయిన చంద్రుడు రాత్రి అనే స్త్రీని వరించే కోరికతో వస్తుండగా ముందుకు ముందే అతి వేగంతో కాలం అనే నెపం గల శిల్పులు వహించిన నూతనాలైన కర్పూర దీపాల పంక్తుల్లాగా ప్రకాశిస్తూ వర్ణించదగిన స్వకీయమైన కాంతితో అఖండితమైన పగలు వత్తులు అనే వరుసలతో ఒప్పుతున్న అతిశయంతో శుభ్రకాంతి పుంజం ఆ సమయంలో తూర్పున అధికమై కనిపించింది.

అంటే చంద్రుడనే నాయకుడు 'నిశ' అనే స్త్రీని వరించడానికి వస్తుండగా ముందు ముందే శిల్పకారులు పట్టిన పగలు వత్తులు లాగా తూర్పున తెల్లని కాంతి పుంజం లాగా తోచింది. తూర్పున చంద్రకిరణ పుంజం కనిపించిందని కవి వర్ణించాడు.

సీ॥ గగనబాలుం డూర్ధ్వగత రశ్మిదివియంబైఁ
జక్కఁజేర్చు పసిండి చక్రమనఁగఁ,
బాంథ భీకరలీలఁ బ్రబలు నిశాభూత
సతి గొన్న యాలాత చక్రమనఁగ,
చీకటి పొలదిండి మూకఁ గూల్పఁగఁ గాల
శౌరి చేనెత్తిన చక్రమనఁగ
నినుడు పోయినదారిఁ గనఁ బూర్వగిరి శిఖా
స్థల మెక్కి నిల్చిన చక్రమనఁగఁ

తే॥ బ్రాచి తెలిచాయ యనుమంచు ప్రబల భాస్వ
దంశుక విహీన గాన దానందు కోర్వ
జాల కూన్చిన నవకీలి చక్రమనగ
నపుడు దొలి కెంపుతో సారసారి వొలిచె (4-102)

చంద్రబింబం ఆకాశమనే చిన్నవాడు ఉపరితల భాగంలో కిరణాల తాడుతో ఆకర్షించటానికి వచ్చిన బంగారు చక్రాన్ని పోలి ఉన్నది. నిశ అనే పిశాచ స్త్రీ పాంథులు భయపడేటట్లు త్రిప్పుతున్న కొటివిని పోలి ఉన్నది. కాలమనే విష్ణుమూర్తి చీకటి అనే రాక్షసుల గుంపును సంహరించటానికి పై కెత్తిన చక్రాయుధాన్ని పోలి ఉన్నది. సూర్యుడు పోయిన దారిని చూడటానికి ఉదయగిరి శిఖరాన్ని ఎక్కిన చక్రవాకాన్ని పోలి ఉన్నది. తెలిచాయ అనే మంచు అతిశయించగా సూర్యకిరణాలనే ప్రకాశిస్తున్న వస్త్రంతో హీనురాలు అవడంవల్ల పూర్వ దిక్కు అనే స్త్రీ ఓర్వలేక పెట్టిన మంటను పోలి చంద్రుడు తొలుతటి అరుణ కాంతితో ఉదయించాడు.

చంద్రోదయ కాలంలో చంద్రుడు అరుణకాంతితో ఉంటాడని కవి వర్ణించాడు.

## సూర్యోదయ వర్ణన :

వెలసెఁ బదాయుధార్భటులు వింటివె? ఓ యధరాను లిప్త నా
విలసిత పుష్కరారి పృథివీపతి పాంథపరాళి గెల్చి, తా
విలసిత పుష్కరాధిప నవీనపురేశముఁ జేరఁగా జనన్
దొలుత నుషోభట ధ్వనిత దుస్తర కాహళికాధ్వనుల్
బలెన్. (4-129)

చక్కెర వంటి పెదవి గల ఓ చంద్రికా! విన్నావా చంద్రుడనే రాజు విరహులనే శత్రువులను జయించి ప్రకాశిస్తున్న సముద్రమనే నూతనమైన నగర శ్రేష్ఠాన్ని పొందడానికి పోతుండగా మొదట ప్రభాతమనే భటునితో మ్రోగించబడిన అధికమైన బూరగల ధ్వనుల లాగా కుక్కుట ధ్వనులు వినిపిస్తున్నాయి.

అంటే ఒకరాజు శత్రువులను గెలిచి నూతనంగా పుర ప్రవేశం చేస్తుండగా భటులు చేసే కాహళీ ధ్వనులు లాగా చంద్రుడు పాంథులను కుందించి పశ్చిమ సముద్రాన్ని

చేరబోతుండగా కుక్కుట ధ్వనులు విలసిల్లాయని , సూర్యోదయం కోడికూతలతో ప్రారంభమైందని భావం.

స్ఫురదాజాండ ఘటిన్ నిశాతప పయస్సుల్ పేరఁ బూర్వావనీ
ధర గోపాలతనూజమౌళి గని, దోడ్తం జంద్ర మండంబు వా
పి, రహిన్ దద్దధిఖండ మూనె; నన నొప్పెన్ గంటివే? ప్రాగ్దిశా
ధర, గోపాల తనూజ! వాసవహరి త్పద్మా విలాసాబ్జమై. (4-130)

ప్రకాశిస్తున్న బ్రహ్మాండమనే కుండలో వెన్నెలనే క్షీరం గట్టకట్టగా, తూర్పు కొండ అనే శ్రీకృష్ణుడు చూసి వెంటనే చంద్రుడనే మీగడను కాజేసి ఆసక్తితో ఆ పెరుగు గడ్డను దోచుకొన్నట్లు తూర్పుకొండ ప్రాంతం ప్రాచీ లక్ష్మికి లీలారవిందమై ప్రకాశించింది. రాజపుత్రిక వైన ఓ చంద్రికా! చూశావా ?

అంటే బ్రహ్మాండమనే కుండలో వెన్నెలనే పాలు పేరి చంద్రుడు దానిపై మీగడలాగా ఉండగా ఉదయ పర్వతమనే శ్రీకృష్ణుడు చంద్రుడనే ఆ మీగడను మ్రింగి చేతబట్టుకొన్న ఆ పేరిన పెరుగు గడ్డను పోలి, పూర్వదిక్కనే లక్ష్మికి విలాసార్థమైన పద్మాన్ని పోలి తూర్పు కొండ విలసిల్లిందని భావం. తూర్పున సూర్యోదయ సంబంధమైన తెలిచాయ తోచిందని ఫలితార్థం.

ఈ విధంగా 'చంద్రికాపరిణయం'లో వసంత ఋతువు, ఉద్యానవనం, రాజహంసల కొలను, చంద్రోదయం, సూర్యోదయం మొదలైన ప్రకృతి దృశ్యాలు సుందరంగా వర్ణితమయ్యాయి.

BHAVAVEENA
Vol. 18, Issue. 6, June 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# తెలంగాణ కథలు– బహుజన అస్తిత్వ చైతన్యం

– జన్ను అశోక్

అస్తిత్వం అనే మాటను మనస్తత్వ శాస్త్రజ్ఞులు, సామాజిక శాస్త్రజ్ఞులు, తత్త్వశాస్త్రజ్ఞులు నిర్వచిస్తున్న క్రమంలో అస్తిత్వం వ్యక్తి జీవ లక్షణం, జన్యులక్షణం, జన్యు ప్రేరితం, గాయపడిన వ్యక్తి స్వభావం, సామాజిక ప్రాంతీయ సాలిడారిటికి సంకేతం అని కూడా భావిస్తు న్నారు. అస్తిత్వం అనే మాటకు 'ఉనికి', 'గుర్తింపు' అనే అర్థాలున్నాయి. 'Identity' అనే ఇంగ్లీష్ మాటకు సమానార్థకంగా అస్తిత్వం అనే మాటను విరివిగా ఉప యోగిస్తున్నారు. ఉదాహరణకు దళిత అస్తిత్వం, మైనారిటీ అస్తిత్వం, మహిళల అస్తిత్వం, ప్రాంతీయ అస్తిత్వం. ఒక భౌగోళిక ప్రాంతం లేదా ఉప ప్రాంతంలోని లేదా భాషా ప్రాంతంలోని ప్రత్యేక లక్షణాలను, భావాలను, విశ్వాసా లను ప్రతిఫలించే నిర్దిష్ట లక్షణాలను ప్రాంతీయ అస్తిత్వంగా స్థూలంగా నిర్వచించవచ్చు. ప్రాంతీయ అస్తిత్వ స్పృహతో వెలువడుతోన్న కథలు వెనకడుగు మాత్రం కాదు. అవి సమాజ అవగాహనకు మునుపటి కంటే ఎక్కువగా తోడ్పడుతున్నాయి. ఒక ప్రాంతం ప్రత్యేక లక్షణాలను ఆ ప్రాంతంలోని వివిధ సామాజిక సముదా యాల అవగాహనను పెంచుతుండడం చూస్తూనే ఉన్నాం.

అస్తిత్వ వాదాన్ని తెలుగులో సమూహాల గుర్తింపు వాదంగా వాడుతున్నాం. జుఇఅర్వత్ఋశ్రీఅంఎ కు సమానంగా వాడుతున్నాం. జీన్‌పాల్ సార్త్రె, మార్షల్ ప్రౌస్ట్ వంటి వారు ప్రతిపాదించిన అస్తిత్వ వాదంలో కీలకాంశం మనిషికి ఇచ్ఛా శక్తి ఉంది. తాను చేసే పనులకు తానే బాధ్యుడు. అయితే అర్థం పర్థం లేని ప్రపంచంలో ఏమైనా ఈ రకమైన అస్తిత్వ వాదానికి ఆధునికానంతరవాదం ఏ అంశాల్లో విభేదించిందో తెలిస్తే మనకు మంచిది. తెలుగులో సాహిత్య పరిభాష అభివృద్ధికి ఈ ప్రయత్నాలు మరింత దోహదం చేస్తాయి.

సమకాలీన తెలంగాణ సాహిత్య వాతావరణంలో ఇప్పుడు వీస్తున్న గాలి ప్రాంతీయతది. సాహిత్యంలో ప్రధానపీఠాలుగా భావించబడే ప్రక్రియలన్నీ దారి మళ్లించుకుని తన ప్రాంత అస్తిత్వాన్ని చెప్పేందుకు ఉత్సాహం చూపుతున్నాయి. కవిత్వం కథ, నవల, విమర్శ ప్రక్రియలు ప్రాంతీయ అస్తిత్వదృష్టితో తమ జాడను మరింత మూలాలలోకి వెళ్ళి వెతుక్కుంటూ ఉన్నాయి. ఈ వెతుకులాటలో ముందున్నది కథాప్రక్రియ. సమకాలీన కవిత్వంతో సరిసమానంగా కథానికపై సాహిత్య విమర్శ వెలువడుతూ ఉంది. వస్తు, శిల్ప, ప్రయోగ, పాత్ర చిత్రణలతో బాటు కథానేపథ్యం, వైవిధ్యం వివరిస్తూ కథా సాహిత్య విమర్శ విస్తృతంగానే వెలువడుతున్నది.

బోయ జంగయ్య రాసిన 'పనిష్‌మెంట్' కథ దళిత దృక్పథాన్ని తెలిపే మంచి కథ. తన భర్తను పోలీసుకేసు నుంచి తప్పించి కాపాడమని లక్ష్మి ఎమ్మెల్యే దగ్గరకు వెళ్తుంది. ఎమ్మెల్యే దానికి బదులుగా ఆమె శీలాన్ని కోరతాడు. తన భర్త కంటే తన శీలం గొప్పది కాదని లక్ష్మి తన శీలాన్ని సమర్పించినా ఆమె భర్తకు ఉరి శిక్షపడుతుంది. ఆర్థిక స్థోమతలేని దళితుల మానం, ప్రాణం ఎలా ప్రజా ప్రతినిథుల పాలు అవుతాయో చక్కగా వివరించిన కథ 'పనిష్‌మెంట్.' ఇదే కాక బోయ జంగయ్య రాసిన 'బంచరాయి', 'ఇదికథ', 'చీమలు', 'ఇంకానా ఇకపై సాగదు' 'గ్రహణం' కథలు కూడా దళిత జీవితాలను చిత్రించిన కథలే.

దళితులకు రాజ్యాధికారం లభించడానికి రాజ్యాంగం రిజర్వేషన్లను ప్రవేశపెట్టినా దొరలు, అగ్రవర్ణాలవారు మళ్ళీ దళితులను అడ్డం పెట్టుకొని రాజకీయాలు ఎలా నడుపుతున్నారో తెలిపే కథ చిలుకూరి దేవపుత్ర రాసిన 'ఊడలమర్రి'. ''ఈ గుడ్డి గవర్నమెంటు రిజర్వేషన్

BHAVAVEENA
Vol. 18, Issue. 6, June 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పెట్టిందే, ఏంజేసేది మల్ల, ఎవరో మాల మాదిగ నాయండ్లని ఓట్లేపిచ్చి గెలిపిస్తే కొమ్ములు మొలుచుకొచ్చి మనల్నే కుమ్ముతారని నాకు బాగా తెలుసు సార్! అందుకే మా జీతగానితోనే నామినేషన్ ఏపించినా! ఎట్టా ఈ నాకొడుకు మాలనాయలే ! ఈడయితే మనం యాడుండుమంటే ఆడపడి ఉంటాడు. చెప్పులిడిసే జాగలో కూచోమంటే గమ్మున కూచుంటాడు.'' అనే భూస్వామి భీమప్ప మాటలను బట్టి ఈ దేశంలో దళితుల పరిస్థితి తెలుస్తుంది. తరువాత ప్రమాణ స్వీకార మప్పుడు దళితుడైన ఓబులేసు భీమప్ప ముందే కుర్చీపై కూర్చొని అతని చేత చావు దెబ్బలు తింటాడు. అగ్రవర్ణాల ఊడలమర్రి కింద ఏ దళిత మొక్క మొలవదని చాటి చెప్పే కథ ఊడలమర్రి. రాజకీయ వైరి వర్గాలుగా ఉన్నా అవసరమైతే దళితులను నష్టపరచడానికి శత్రువు శత్రువు మిత్రువన్నట్లు అగ్రవర్ణాల వారు ఏకమవుతారని చెప్పే కథ చిలుకూరి దేవపుత్ర రాసిన 'సమిధలు'.

బహుజనుల రాజకీయ చైతన్యాన్ని ఎత్తిచూపే కథ బోయ జంగయ్య రాసిన 'ఊరేగింపు'. రెడ్డి ఇంట్లో పాలిచ్చే బర్రె చస్తే తీసివేయడానికి విముఖత చూపే దళిత యువకుల కథ జూకంటి జగన్నాథం రాసిన 'కళేబరం'. కుల కష్టి మానేసి దళిత యువత ప్రత్యామ్నాయ వృత్తులను చేపట్టుతుంది. ఇక చచ్చిన గొడ్డును పారేయడానికి ఎవరూ ముందుకు రారు అలాంటి సమయంలో పటేలు తన బండిలోనే ఎక్కించుకొని ఊరవతల పారేయడం కనిపిస్తుంది. దళితులు ఎంత ఎదిగినా అగ్రకులాల వారిని పెళ్లి చేసుకోలేకపోతున్నారని తెలిపే కథ బి.ఎస్.రాములు రాసిన 'బందీ' కథ. దళితులతో అక్రమ సంబంధాల నేపథ్యంలో రాసిన కథల్లో బోయ జంగయ్య రాసిన 'పాము' మద్దూరి నగేష్ బాబు రాసిన 'కొట్టం' కథను చెప్పుకోవాలి. కులాన్ని దాచుకొని ఆభాసుపాలైన శ్రీనివాసులు కథ బండి నారాయణ స్వామి రాసిన 'తల్లిమట్టి' దళితుల మధ్య ఎబిసిడి వర్గీకరణ జరిగిన నేపథ్యంలో వచ్చిన అద్భుతమైన కథ పైడి తెరేష్ బాబు 'అనుబంధ ప్రశ్న'. మాదిగ జీవితాల్లోని వెతలను, చీకటి కోణాలను, అవమానాలను 'మల్లెమొగ్గల గొడుగు' పేర అక్షరీకరించిన వారు ఎండ్లూరి సుధాకర్. మాదిగ ఈస్తటికన్ను, మూఢాచారాలను గొప్పగా తెలుగు కథా సాహిత్యంలోకి తెచ్చిన కథకుడు నాగప్పగారి సుందరరాజు. దళితుల పేదరికం, అత్యాచారాలు, అవమానాలు అన్నీ కన్పించే కథల సంపుటి జాజుల గౌరి 'మన్నుబువ్వ'. 'బీభత్సం', 'బాత్రూం', 'రోట్లోబడ్డ తలకాయ' 'మాన్యం', 'గద్దెత్కపోయిన బతుకమ్మ' కథల ద్వారా దళితుల జీవితాల్లోని, స్త్రీల జీవితాలపై తెలంగాణ దొరలు సాగిస్తున్న పెత్తనాన్ని, సాంస్కృతిక విధ్వంసాన్ని చర్చకు పెట్టిన రచయిత్రి జూపాక సుభద్ర.

శవయాత్ర ముందు డప్పుకొట్టే వృత్తిలోని మరో కోణాన్ని పట్టి చూపించే కథ పెద్దింటి అశోక్ కుమార్ రాసిన 'చావు డప్పు'. టెక్నాలజీ ఎంత పెరిగినా, స్వాతంత్ర్యం వచ్చి ఏండ్లు గడిచిపోతున్నా దళితుల జీవితాల్లో ఏ మార్పు లేదని చాటి చెప్పే కథలు డా.పసునూరి రవీందర్ వి. కుల వివక్ష మాయ మైనట్టే మాయమై నగరాల్లో అది తన రూపం మార్చుకొని పగ సాధిస్తుందని తెలిపే దళిత కథలు చాలా రాశారు పసునూరి. గోవర్ణం, వేరెవర్ యూ గో.., మీసాలోడు, నా ధనుంజయ్ తదితర కథలు ఆధునికంగా కులం ఎంత మాలిన్యాన్ని ప్రదర్శిస్తుందో తెలిపే కథలు.

గోగు శ్యామల, జూపాక సుభద్రల సంపాదకత్వంలో వచ్చిన 'నల్లరేగడి సాల్లు' కథల సంపుటి అనేక దళిత స్త్రీల గోసను, దుఃఖాన్ని చిత్రీకరించింది.

కాలువ మల్లయ్య కథలు, బి.ఎస్. రాములు కథలు, జూకంటి - జగన్నాథం 'వైపని', నేరెల్ల శ్రీనివాస్ గౌడ్ 'బతుకుతాడు' పెద్దింటి అశోక్ కుమార్ గా 'ఊటబాయి', 'మాయిముంత' 'భూమడు' కథా సంపుటులలో నూటికి నూరు శాతం బహుజనుల జీవిత సంఘర్షణలే ఉన్నాయి. డా. నలిమెల భాస్కర్ రాసిన 'మంద' కథలో సార్వత్రిక ఓటు హక్కు వచ్చిన తరువాత ఓటు హక్కు విలువ

తెలియని అమాయక బీసీలు దొరల భయానికి ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకొని రాజీ పడడం కనిపిస్తుంది. పి. చంద్ రాసిన 'గంజాయి' కథలో రైతు వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో దురాశకు పోయి గంజాయి పండించి పోలీసులకు దొరికిపోతాడు. దాంతో తన కుటుంబం సమస్యల వలయంలో చిక్కుకుంటుంది. కె.వి.నరేందర్ రాసిన 'గుట్ట' కథలో శిల్పకారుల దైన్యస్థితి కనిపిస్తుంది. వీరి 'దొరుంచుకున్న దేవక్క' కథ తెలుగు కథా చరిత్రలో సంచలనం సృష్టించిన కథ. కుక్కలు చింపిన విస్తరిలా అయిన దేవక్క, మందారంలా ఉండే దేవక్క నెత్తురు ముద్దలా అయిపోయింది. చైతన్యప్రకాశ్ 'బతుకురేవు', బెజ్జారపు రవీందర్ 'రాజవ్వ', వెల్దండి శ్రీధర్ 'మరణ మృదంగం', 'సజీవదహనం' 'పొక్కిలి' కథలో అపారమైన బహుజన జీవితం పరుచుకొని ఉంది.

పి. వి. నర్సింహారావు "గొల్లరామవ్వ కథ', నెల్లూరి కేశవస్వామి 'యుగాంతం', పొట్లపల్లి రామారావు 'న్యాయం', పి. వెంకటేశ్వరరావు 'సంఘం చిట్టీ'. ఉప్పల లక్షణరావు 'గెరిల్లా', కాంచనపల్లి చినవెంకట రామారావు 'మన ఊళ్లో కూడానా?' ఆవుల పిచ్చయ్య 'ఊరేగింపులు' తదితర కథలు ఎంతో బలంగా ఆనాటి తెలంగాణ పోరాట క్రమాన్ని చిత్రించాయి.

1970 నుండే తెలంగాణ ప్రాంత కవులు, రచయితలు గూడూరి సీతారాం, జి.సురమౌళి, కాళోజీ నారాయణరావు, ఇల్లిందల సరస్వతీదేవి, డా॥ పి.యశోదారెడ్డి, మాదిరెడ్డి సులోచన, తాడిగిరి పోతరాజు, బోయ జంగయ్య, బి.ఎస్.రాములు, దాశరథి రంగాచార్య ఎంతో మంది కథకులు తెలుగు కథను సుసంపన్నం చేస్తూనే తెలంగాణ 'సోయి'తో తెలంగాణ తెలుగులోనే తమ కథలు రాశారు. 1970 తరువాత తెలంగాణ కథను విప్లవోద్యమాలు ప్రభావితం చేశాయి. నక్సలిజం, రైతు కూలీ సంఘాలు, గోదావరిఖని రామగుండం ప్రాంతాల్లోని బొగ్గు పొరల్లోని కార్మికుల సంఘాలు, విద్యార్థి సంఘాలు ఇవన్నీ అంతో ఇంతో ఇక్కడి కథను ప్రభావితం చేశాయి. తెలుగు కథకు విప్లవ చైతన్యాన్ని అద్దాయి. ముఖ్యంగా అల్లం రాజయ్య, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, బి.ఎస్. రాములు, డా॥ కాలువ మల్లయ్య, ఉప్పల నర్సింహం, భూపాల్ లాంటి కథకులు తెలుగు కథకు ప్రాంతీయతతో పాటు విప్లవోద్యమ చైతన్యాన్ని కూర్చారు. అల్లం రాజయ్య రాసిన 'అతడు', 'మధ్యవర్తులు', 'మహాదేవునికల' 'మనిషిలోపలి విధ్వంసం' 'భూమి' కథలు, తుమ్మేటి రఘోత్తమరెడ్డి రాసిన 'జాడ', 'చావువిందు', 'పనిపిల్ల', 'ఇల్లు' కథలు చదివితే 1970 తరువాతి తెలంగాణ ప్రాంతపు జీవితం స్పష్టంగా కనిపిస్తుంది. ఇక్కడ జరిగిన విధ్వంసాలన్నీ బోధపడ తాయి. ఆడెపు లక్ష్మీపతి, సదానంద శారద కథల్లో కూడా ఇక్కడి సంక్లిష్టతలు, సంఘర్షణా సజీవంగా సాక్షాత్క రిస్తాయి. అయితే 1985 తరువాత ప్రపంచీకరణ నేపథ్యంలో తెలంగాణలో ఈ ప్రాంతీయ అస్తిత్వ స్పృహ మరింత పెరిగిందని చెప్పాలి. పులుగు శ్రీనివాస్ డా॥నందిని సిధారెడ్డి, డా॥బి.వి.ఎన్. స్వామి (నెలపొడుపు, రాత్రి పగలు, ఒక మెలకువ, తెలంగాణ చౌక్ - సంపాదకత్వం), పెద్దింటి అశోక్ కుమార్ (ఊటబాయి. మాయిముంత, భూమడు), బెజ్జారపు రవీందర్ (నిత్య గాయాలనది), జెజ్జారపు వినోద్ కుమార్, పి. చంద్, జూకంటి జగన్నాథం (వైపని), కాసుల ప్రతాపరెడ్డి, అనిశెట్టి రజిత, పంజాల జగన్నాథం, కె.వి.నరేందర్ (విభిన్న కథలు), స్కైబాబ (అధూరె), వేముల ఎల్లయ్య, కటుకోజ్వల మనోహరాచారి (నవ్వుతున్న నేలతల్లి) డా॥పసునూరి రవీందర్ (అవుటాఫ్ కవరేజేరియా), ఇలా ఎన్నో కథా సంపుటుల్లో, బి. ఎస్. రాములు సంపాద కత్వంలో వెలువడిన కరీంనగర్ కథాసరిత్సాగరం సంకల నాల్లో తెలంగాణ సోయితో కూడిన ఎన్నో కథలున్నాయి. ఈ ప్రాంతపు అస్తిత్వ స్పృహను చాటి చెప్పాయి.

నూతన శతాబ్ది తొలి దశాబ్దంలో తెలంగాణా నుండి ఎవరూ నిర్లక్ష్యం చేయలేని విధంగా దళిత. బహుజన కథ మహోన్నత శిఖరాలను చేరుకుంది. వందలాది రచయితలు బహుజన జీవితాలను చిత్రిస్తున్నారు.

శిల్పంలో కొందరు ప్రయోగాలు కూడా చేస్తున్నారు. చాలామంది వస్తు, శిల్పాల్లో నూతనత్వాన్ని సాధిస్తున్నారు. దాంతో ఈ దశాబ్దంలో వెలువడిన అనేక కథా సంకలనాల్లో తెలంగాణా సామాజిక పరిణామాలను, బహుజన జీవితాలను చిత్రించిన కథలను చేర్చక తప్పలేదు.

దళిత బహుజన, మైనార్టీ కథలకు పెదపీట వేసిన తెలంగాణా రచయితలు: తెలంగాణా నుండి దళిత, బహుజన మహిళా రచయితలు ఎందరో ఎదిగారు. అనిశెట్టి రజిత, జి.విజయలక్ష్మి, కొక్కుల పద్మావతి, ఒడ్నాల సూర్య, తాయమ్మ కరుణ, జాజుల గౌరి, జూపాక సుభద్ర, గోగు శ్యామల వంటి దళిత, బహుజన మహిళలు ఎన్నో కథలు రాశారు. ఇలా ఇతర ప్రాంతాల దళిత, బహుజన మహిళల నుండి కథా రచయితలు ఎదగలేదు. అలాగే ముస్లిం మహిళల్లో తెలంగాణా నుండి షాజహానా, వంటి రచయితలు ఎదిగి ముస్లిం మహిళల జీవితాలను రాస్తున్నారు. ఇతర ప్రాంతాల నుండి ముస్లిం మహిళా రచయితలు ఎదగలేదు. తెలంగాణా నుండి బహుజన సామాజిక వర్గాల గురించి ప్రత్యేక శ్రద్ధతో రాసిన కథకులను, వారి కథలను ప్రత్యేకంగా పేర్కొనడం అవసరం.

## తెలుగు సాహిత్యంలో తెలంగాణ సాహిత్యం ఒక దిక్సూచి :

తెలంగాణ బహుజన కథను చూసి భారతీయ సాహిత్యంతో పాటు ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ సాహితీవేత్తలు నేర్చుకోవాల్సింది ఎంతో వుంది. పాట, వచన కవిత, కథా ప్రక్రియల్లో తెలంగాణా నుండి మహిళా సాహిత్యం, బహుజన సాహిత్యంతో పాటు దళిత సాహిత్యం, విప్లవ సాహిత్యంలో కూడా అందరికన్నా ముందుంది. కార్మికవర్గ సాహిత్యం, విప్లవ సాహిత్యంలో కూడా తెలంగాణ ప్రాంతానిదే సింహభాగం. 'ఇలా దళిత, బహుజన, విప్లవ, మహిళా సాహిత్యానికి, సామాజిక పరిణామాల చిత్రణ సాహిత్యానికి తెలంగాణ సాహిత్యం ఒక దిక్సూచిగా ముందుకు సాగుతున్నది.

దిలావర్ కథల్లో బహుజన జీవితాలు దిలావర్ మైనార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీల దృక్పథంతో అనేక కథలు రాశారు. ప్రధానంగా మైనార్టీ జీవితాలను అనేక కోణాల్లో చిత్రించారు. 'వెలిసిపోయిన బతుకులు' కథలో నాటకాలు వేస్తూ, ఇల్లిల్లూ తిరిగి పౌడరులు, పిన్నులు అమ్మే కులవృత్తి వాళ్ళు చేపలు పట్టుకోవడం, గ్లోబలైజేషన్ క్రమంలో బ్యూటీ పార్లర్లు పెరిగి ఆధునిక సౌందర్య సాధనాలు పెరిగి వీరి వ్యాపారం, వృత్తులు ఎలా చితికి పోయాయో చిత్రించారు. కొన్ని ప్రాంతాల్లో ఈ కులాన్ని పూసలవాళ్లు అని పిలుస్తారు. 'గూడుచెదిరిపోయింది' కథలో వడ్రంగి వృత్తి ఎలా ఆధునిక అభివృద్ధిలో శిథిలమవుతూ చివరికి ఉపాధి లేక ఇల్లులేని దుస్థితికి దిగజారిపోయిన క్రమాన్ని చిత్రించారు. కోతిని, పామును ఆడించే వారిని 'కోరలు' కథలో చిత్రించారు. చివరకు అదే పాము కాటుకు జీవితం బలైన విషాదాన్ని అక్షరీ కరించారు.

కె.వి. నరేందర్ చిత్రించిన బహుజన కథలు: కె.వి.నరేందర్ 175కు పైగా కథలు రాశారు. 10 కథా సంపుటాలను వెలువరించారు. 'మనోగీతం', 'అమ్మ', 'యుద్ధం', 'బురదలో జాబిల్లి', 'కాలుతున్న పూలతోట', 'నాన్న', 'నాతిచరామి', 'వూరు', 'సిటీ' పేరిట వెలువ రించిన కథా సంపుటాల్లో చాలా కథలు దళిత, బహుజన జీవితాలకు సంబంధించినవే. 'బండలు' కథలో గుట్టలు తవ్వి రాళ్లను తరలించడం, కంకరగా మార్చడంతో శిల్పుల కులాలు ఎలా ఉపాధి కోల్పోయి శిథిలమవుతూ వస్తున్నారో చిత్రించారు. 'మ్యాచ్ ఫిక్సింగ్' కథలో బీసీల్లో ఆర్థిక సంబంధాలు, వాటి పరిణామాలు విశ్లేషించారు. 'సొంతిల్లు' కథలో బహుజన మధ్య తరగతి వాళ్ళు ఇల్లు కట్టుకోవడానికి అప్పుకోసం తిరిగితే బ్యాంకులు చేసే దోపిడీ ఎలా వుంటుందో చిత్రించారు.

# జయప్రభ కవిత్వం – స్త్రీల హక్కుల సాధన

– డా॥. ఇ. కోన ప్రభ, రీసెర్చ్ అసోసియేట్, మహిళా అధ్యయన కేంద్రము, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

తెలుగులో స్త్రీవాద కవిత్వం 1980లో వెలువడింది. స్త్రీవాద కవిత్వంలో జయప్రభ గారిది విశిష్టమైన స్థానం. ఈమె వ్రాసిన "చూపులు", "పైటని తగలెయ్యాలి" అనే కవితలు సాహిత్య ప్రపంచంలో ప్రకంపనలను సృష్టించాయి. స్త్రీవాద కవితా సంపుటాలను ఎక్కువగా తీసుకొచ్చిన కవయిత్రి జయప్రభ. ఈమె వ్రాసిన కవితలు స్త్రీవాద కవితా సంకలనాలలోనూ చోటుచేసుకుని కనిపిస్తాయి. సూర్యుడు కూడా ఉదయిస్తాడు, యుద్ధోన్ముఖంగా, వామనుడి మూడోపాదం, ఇక్కడ కురిసిన వర్షం ఎక్కడి మేఘానిది?, చింతల నెమలి, యశోధరా వగపెందుకే!, ది పబ్ ఆఫ్ వైజాగ్ పట్నం, క్షణ క్షణ ప్రయాణం లాంటి కవితా రచనల్ని జయప్రభ వెలువరించారు. జయప్రభ కవిత్వంలో అనుభూతి వాదం, పితృస్వామ్య ధిక్కరణ, స్త్రీల సమస్యా చిత్రణ, స్త్రీల హక్కుల చైతన్యం, లాంటి అంశాలు మనకు కనిపిస్తాయి.

ఈ నేపథ్యంతో స్త్రీల హక్కులు అనే కోణం నుండి జయప్రభ గారి కవిత్వాన్ని పరిశీలించడం జరిగినది. ఇందుకై జయప్రభ గారి ఇక్కడ కురిసిన వర్షం ఎక్కడి మేఘానిది?(1991), యశోధరా ఈ వగపెందుకే! (1993), అనే రెండు కవితా సంపుటాలను ఎంచుకోవడం జరిగినది. ఈ కవితా సంపుటాలలోని కవితలను స్వేచ్ఛ, సమానత్వం, చైతన్యం అనే అంశాలను ప్రధానంగా తీసుకుని పరిశీలించడం జరిగినది.

**జననం :**

ప్రపంచ ప్రసిద్ధ తత్వవేత్త రూసో సంకెళ్ళు తరువాత గానీ పుట్టుక మాత్రం స్వతంత్రమే నన్నాడు. కానీ స్త్రీ పుట్టుక మాత్రం స్వతంత్రం కాదు అని చెబుతూ జయప్రభ "స్వేచ్ఛ లేనే లేదని" అనే కవితలో

రకరకాలుగా నా పుట్టుకకి ముందే
నేను నిర్వచింపబడ్డాను
ఇలాగే నవ్వాలని ఏడవాలని సిగ్గుపడాలని
సరిగ్గా ఇలాగే ఆలోచించాలని
గీసిన లక్ష్మణరేఖల మధ్యనే జన్మించాను అని చెప్పారు..

(యశోధరా ఈ వగపెందుకే! - పుట. 49)

తల్లి గర్భంలో రూపం ఏర్పడక ముందునుంచే స్త్రీల పట్ల వివక్ష మొదలవుతున్నది . గర్భస్థ శిశువు ఆడపిల్ల అని తెలియగానే భ్రూణహత్యలకు పాల్పడుతున్నారు. ఒకవేళ పుట్టినా ఇలాగే నవ్వాలి, ఇలాగే ఏడ్వాలి, ఇలాగే సిగ్గుపడాలి అంటూ ఈ పితృస్వామ్య వ్యవస్థ రూపొందించిన ఆంక్షలు, కట్టుబాట్లు మధ్యనే బ్రతకాలే తప్ప ఆడపిల్లకు పుట్టుకకి ముందూ, మరణం తర్వాత కూడా స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు లభించడం లేదని ఈ కవితలో జయప్రభ స్పష్టం చేశారు.

**వివాహం :**

స్త్రీకి తన వివాహ విషయంలో అభిప్రాయాన్ని తెలియ చేసే స్వేచ్ఛ కూడా ఉండటం లేదనీ, స్త్రీ వివాహానికి సంబంధించిన నిర్ణయాధికారాలు పురుషుల ఇష్టాను సారంగానే ఉంటున్నాయి అని చెబుతూ జయప్రభ "అమ్మమ్మ స్వగతం" అనే కవితలో

మా తండ్రి వయస్సున్న ఆయన
నాకు మొగుడెలా అయ్యాడో ...?ఎందుకయ్యాడో
నాకెవరూ చెప్పలేదు
పుణ్యంకొద్దీ పురుషుడంటే
నాపుణ్యం అంతే అనుకుని
నోములు తద్దినాలతో దినాలు గడిపేశాను అని పేర్కొన్నారు.

(యశోధరా ఈ వగపెందుకే!. పుట. 3)

వివాహానికి సంబంధించి తీసుకొనే ముఖ్యమైన నిర్ణయాలలో స్త్రీ అంగీకారాన్ని తెలుసుకొనే ప్రయత్నాల కన్నా అంగీకరింపజేసే ప్రయత్నాలే ఎక్కువగా ఉంటున్నాయి. ఈ కారణంగా భర్త ముసలివాడైనా, మంచివాడైనా, చెడ్డవాడైనా స్త్రీ తన జీవితం ఇంతే అని అనుకుని సరిపెట్టుకోవాల్సివస్తున్నది. అంతే కాకుండా భర్త పెట్టే శారీరిక, మానసిక హింసను మౌనంగా భరించడమే తప్ప ప్రశ్నించే స్వేచ్ఛ కూడా స్త్రీలకు వుండటం లేదని పేర్కొన్నారు. ఈ కవితలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపుతూ

ఈ క్షణం నాకు ధైర్యంగా ఉంది
ఈ క్షణం నాకు తృప్తిగా ??ఉంది
నిజంగా
ఈ క్షణం నాకు నిన్ను చూస్తుంటే ఎంతో స్వేచ్ఛగానూ ఉంది

.........................................................................................

నోరు మూసుకుని బతికిన నాకు
జీవితం ఏది ఇవ్వలేదు
మీరు నాలా కానందుకు
నే వెయ్యని ప్రశ్నలెన్నో
మీ గొంతులో మోగుతున్నందుకు
నాకు ధైర్యంగా ఉంది! గర్వంగా ఉంది !!
ఇప్పుడిక నాకే బెంగా లేదు
ఈ వయసులో మీతో కలసి నడవలేక పోయినా
స్వేచ్ఛగా
మీతో గొంతు కలుపుతాను

అమ్మాయిలూ ! ముందుకు పదండి ! ముందుకు పదండి !! అని అంటూ ప్రశ్నించే నైతిక బలాన్ని స్త్రీ జాతి అలవరుచుకోవాలనే చైతన్యాన్ని అందించారు జయప్రభ.

(యశోధరా ఈ వగపెందుకే! - పుట .4)

**ఆర్ధిక స్వాతంత్రం :**

స్త్రీ, పురుషుల మధ్య వున్న వివక్షత కారణంగా సమాజంలో చాలా మంది స్త్రీలకు ఆర్ధిక స్వాతంత్రం, సమానత్వం, వుండటంలేదు అని చెబుతూ జయప్రభ "నాన్నలెందుకు రారని" అనే కవితలో

"అమ్మా! పోనీ ఐస్ క్రీమ్ కొనవే!"
ప్రశ్న తప్పు కాదుకదా
పసివాళ్ళకీ హక్కులుంటాయి మరి
"ఉస్సూ! నన్ను విసిగించకే"
కసురుకుంది తల్లి కానీ డబ్బులు లేక
మనసులోని కోపాన్ని ఎవరిమీద చూపించగలదు గనకా?
కళ్ళనీళ్ళు మరి రెప్ప దాటనివ్వకూడదు కదా! ఆదర్శ గృహిణి! అని అన్నారు

(యశోధరా ఈ వగపెందుకే! -పుట .11)

ఉద్యోగం చేస్తూ స్త్రీలు, పురుషులతో సమానంగా సంపాదిస్తున్నప్పటికీ, ఆర్ధికపరమైన విషయాలలో మాత్రం పురుషులతో సమానమైన హక్కు, అధికారం స్త్రీలకూ వుండటంలేదు. ఈ కారణంగా చాలామంది స్త్రీలు తమ చిన్నచిన్న కోరికలను తీర్చుకోలేక, కనీసం పిల్లలకి ఐస్ క్రీములు కొనిపెట్టలేక పిల్లలు అడిగే ప్రశ్నలకు తమ దీనస్థితిని వివరించలేక మానసిక వేదనను అనుభవిస్తున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు జయప్రభ.

**పిల్లల పెంపకం :**

పిల్లలకి జన్మనివ్వడంలో స్త్రీ,పురుషులు సమానమైన బాధ్యతను వహిస్తారు. కానీ మన సమాజంలో పిల్లల పెంపకం, వారి బాగోగులు ఎక్కువగా తల్లికి మాత్రమే పరిమితం చేయబడినవిగా కనిపిస్తాయి. ఈ కారణంగా తల్లి ఏ పరిస్థితిలో వున్నప్పటికీ పిల్లల బాధ్యత మాత్రం తల్లిదే. ఈ విషయంలో స్త్రీ, పురుష సమానత్వం లేదని చెబుతూ బోలెడంత లగేజితో పాటుగా పిల్లలని మోస్తూ ఒకతే నానా అవస్థ పడుతూ ప్రయాణం చేసే ఒక తల్లి పరిస్థితిని వివరిస్తూ జయప్రభ "నాన్న లెందుకు రారని" అనే కవితలో

సామాన్లతో పిల్లలతో
అమ్మలను రైలెక్కించేసి
అటు తర్వాత ఈలవేసుకుంటూ హుషారుగా
సెకండ్ షోలకి ....చీట్ల పేకకీ....తందనాలకీ తగలడే
నాన్నల సంగతి తెలీని
పసిపిల్లలు మాత్రం
ప్రయాణాలు చేసేటప్పుడు
ఒక్కరూ అయిపోయి
తోడులేక శక్తిలేక
అమ్మలే ఇలా అవస్థలెందుకు పడాలని
దు:ఖపడీ చెప్పలేక
కచ్చిగా నిలదీస్తుంటారు
తమతో నాన్నలెందుకు రారని? అని అన్నారు
(యశోధరా ఈ వగపెందుకే! - పుట 12)

భార్యలకు ఆసరాగా ఉండాల్సిన భర్తలు భార్యా పిల్లలను బస్సులోనో, రైలులోనో ఎక్కించి తరువాత సినిమాలు, షికార్లు అంటూ తమ సంతోషాల్ని చూసుకొంటున్నారే తప్ప తోడులేక, నాన్న ఎందుకు రాలేదనే పిల్లల ప్రశ్నలకి సమాధానాలు చెప్పలేక ఆ తల్లి పడే అవస్థను గూర్చి మాత్రం పట్టించుకోవడం లేదు అంటూ పిల్లల బాధ్యత విషయంలో వున్న స్త్రీ,పురుషుల అసమానతలను ఎత్తిచూపారు.

**ఇంటి చాకిరి :**

ఉదయం లేచినప్పటినుంచీ, రాత్రి నిద్రపోయేవరకు ఇంటిపని, పిల్లలపెంపకం, కుటుంబసభ్యులఅవసరాలు మొదలైన బాధ్యతలను నిర్వర్తిస్తూ స్త్రీలు విశ్రాంతి లేకుండా అలిసిపోతూ, తమ ఆహారం,ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించక లేకపోతున్నారని చెపుతూ జయప్రభ "వంగిన నల్లరేగడి భూమి" అనే కవితలో

విసుగూ విరామం లేక
వండి వడ్డించీ వడ్డించీ
అలసిపోయి నిద్రకాగలేక
తినకుండానే ముడుచుకు పడుకున్న
శిధిల దేహంతో నువ్వు!
(ఇక్కడ కురిసిన వర్షం ఎక్కడి మేఘానిదో? . పుట.59 )

కుటుంబ అభివృద్ధిలో పురుషులతో సమానంగా స్త్రీలు శ్రమపడుతున్నారు. ఐతే ఇంటిపనులలో పురుషుల భాగస్వామ్యం మాత్రం వుండడం లేదు. ఈ కారణంగా అధికశ్రమ, పనిఒత్తిడితో స్త్రీలు అనారోగ్యాలకు గురవుతున్నారని చెప్పారు.

**సంస్కృతి :**

పితృస్వామ్య సంస్కృతిలోని శిక్షాస్మృతి లన్నీ పురుష పక్షపాతంగా వున్నాయి అని చెపుతూ జయప్రభ "పాట నేరమైన చోట" అనే కవితలో

శిక్షాస్మృతి వాళ్ళదైనప్పుడు
తలెత్తి నడవటమూ
తల్లి వొళ్ళో పారాడటమూ నేరమే అవుతుంది
........................................................
మైదానాలూ జలపాతాలూ ఉండవు
జైళ్ళే ఉంటాయి
మన ఇళ్ళు కూడా జైళ్ళే అవుతాయి!
(యశోధరా ఈ వగపెందుకే! - పుట . 26)

లింగ వివక్షత కారణంగా నేరం చేసినా పురుషుడు ధైర్యంగా సమాజంలో నడుస్తాడు. కాని ఏ పాపం తెలియని స్త్రీ మాత్రం తలవంచుకుని నడవాలి. తల ఎత్తుకుని నడచినా అది నేరమే అవుతున్నది. ఈ కారణంగా స్త్రీలు స్వేఛ్ఛాస్వాతంత్రాలను కోల్పోయి ఇళ్ళలోనే జైలు జీవితాన్ని అనుభవిస్తున్నారని సమాజంలో వున్న లింగ అసమానతలను వ్యతిరేకించారు. ఇలా జయప్రభ కవిత్వంలో స్వేచ్ఛాస్వాత్రంత్రాలను, సమానత్వాన్ని అనుభవించలేక లింగ అసమానత్వానికి గురవుతున్న స్త్రీల సమస్యాచిత్రీకరణలతో పాటుగా, ఆ పరిస్థితి నుండి బయటపడడానికి అవసరమైన చైతన్య ప్రభోదం కూడా కొన్ని కవితలలో కనిపిస్తుంది.

**పోరాటస్ఫూర్తి :**

వేలసంవత్సరాలుగా కొనసాగుతున్న పితృస్వామ్య వ్యవస్థ కారణంగా పురుషులు ఇతిహాసాలు, పురాణాలను తమకు అనుకూలంగా రూపొందించుకొన్నారని, సంస్కృతి, పరువు, పాతివ్రత్యం పేరుతో నియమాలను నిర్దేశించి స్త్రీలను అణచివేతకు గురిచేస్తున్న పితృస్వామ్య భావజాలధోరణులను వ్యతిరేకించాలని, పోరాటస్ఫూర్తితో హక్కులను సాధించుకోవాలని చెబుతూ జయప్రభ

ఎదుగు లేని ఆ జీవితాలపై
ఇక్ష్వాకుల నాటి వాదాలపై
ఇబ్బంది పడనక్కరలేని
మహిళాభ్యుదయ శూన్య నినాదాల పై
ధ్వజం ఎత్తు ! కదం తొక్కు !
అమ్మాయీ గళం విప్పు !
మన చర్యల ద్వారానే
తల్లో జేజెమ్మని కదిలించాలి
పోగొట్టుకున్న ప్రతి హక్కూ
పోరాడి సాధించాలి! అని సూచించారు.

(ఇక్కడ కురిసిన వర్షం ఎక్కడి మేఘానిదో? .పుట. 38 )

అలాగే "యశోధరా ఈ వగపెందుకే?" అనే కవితా సంపుటిలోని "రేపటి మన పిల్లల ప్రాణానికి " అనే కవితలో

తలను వాడి పాదాల ముందు
తనువు వాడి గుప్పిట్లోనూ పెట్టినందుకు
వాడు ఆడమన్నట్టల్లా ఆడినందుకు
వాడి ఆజ్ఞలని శిరసావహించినందుకు
మనల్ని పుట్టనే వద్దంటున్నాడు
ప్రాణహక్కును కాలరాయమంటున్నాడు
ఇప్పుడైనా మనం ప్రశ్నించకపోతే..
ప్రతి స్పందించకపోతే..
రేపటి మన పిల్లల పిల్లల ప్రాణాలకి
ఈనాడే పూచీవహించకపోతే..?

(యశోధరా ఈ వగపెందుకే?. పుట . 42)

వేల సంవత్సరాలుగా స్త్రీలు, పురుషుల నియంత్రణలకు లోబడే జీవిస్తున్నారు. ఐనప్పటికీ తల్లి కడుపులో వున్నది ఆడపిల్ల అని తెలియగానే భ్రూణహత్యలకు పాల్పడుతూ పుట్టే హక్కు లేకుండా కాలరాస్తున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆడపిల్లలు తమ ఉనికిని కోల్పోయే పరిస్థితి ఎదురవుతుందనీ, కావున తమకు జరుగుతున్న అన్యాయాల్ని స్త్రీలు ప్రతిఘటించాలని, ప్రశ్నించాలని అప్పుడే స్త్రీలు తమ హక్కులను సాధించుకోగలుగుతారని చైతన్యాన్ని నింపారు జయప్రభ గారు.

**ముగింపు :**

స్త్రీ, పురుషుల మధ్య వున్న లింగ అసమానతల కారణంగా సమాజంలోగానీ, కుటుంబంలో గానీ, హెూదాను, గౌరవమును పొందుటలోగానీ, అవకాశాలను వినియోగించుకోవటంలో ఇలా ప్రతి విషయంలోనూ పురుషులతో సమానమైన స్థానం,గుర్తింపు,ప్రాధాన్యత, స్త్రీలకూ వుండటంలేదు. అంతేకాకుండా లింగవివక్షత కారణంగా అనేకరకాల దోపిడీలకు, అవమానాలకు, అత్యాచారాలకు, అన్యాయాలకు స్త్రీలు గురవుతూ వున్నారు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావడానికై స్త్రీవాద ఉద్యమాలు, స్త్రీ వాద సాహిత్యం చోటుచేసుకున్నాయి. తమ రచనల ద్వారా స్త్రీ జాతిని జాగృతపరచడానికి కృషి చేస్తున్న రచయిత్రులూ వున్నారు. ఈ ధోరణిలో నుంచి వెలువడినవే జయప్రభ గారి ఇక్కడ కురిసిన వర్షం ఎక్కడి మేఘానిది? (1991), యశోధరా ఈ వగపెందుకే! (1993), అనే రెండు కవితా సంపుటాలు.

ఈ కవిత సంపుటాలలోని కవితలలో పితృస్వామ్య వ్యవస్థ కారణంగా స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల చిత్రీకరణ, హక్కుల పరంగా ఉంటున్న వివక్షతను వివరించడమే కాకుండా ఆ వివక్షతలోంచి బయటపడడానికి స్త్రీలు చైతన్యం, పోరాటస్ఫూర్తిని అలవరుచుకుని ధైర్యంతో ఎదుర్కోవాలనే గొప్ప సందేశం కూడా ప్రధానంగా కనిపిస్తుంది. జయప్రభగారు ఈ రెండు కవితా

సంపుటాలను వెలువరించి దాదాపుగా ముప్పై సవంత్స రాలు కావస్తున్నా పరిస్థితిలో మాత్రం పెద్దగా మార్పు చోటుచేసుకోలేదనే చెప్పుకోవాలి. ఇప్పటికీ స్త్రీలు తమ హక్కులను అనుభవించే క్రమంలో అడుగడుగునా లింగవివక్షతను ఎదుర్కొంటున్నారు అన్నమాట మాత్రం వాస్తవం.

**ఆధార గ్రంథాలు :**

1. జయప్రభ కవితా సంపుటాలు
2. జయప్రభ కవిత్వం - జండర్ స్పృహ - డా.మేడిపల్లి రవికుమార్
3. ఆధునికాంధ్ర కవిత్వం - ఆవిర్భావ వికాసాలు - ఆచార్య ఎస్వీడీ చంద్రశేఖర్

# సింగమనేని కథలలో – విద్యావ్యవస్థ చిత్రణ

– కె. నాగరాజు, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

ఆధునిక తెలుగు సాహిత్యంలో అత్యంత జనాదరణ పొందిన ప్రక్రియ కథానిక. ఈ ప్రక్రియ ఆధునిక సాహిత్యానికి వెన్నెముకగా నిలిచింది. నిరంతర ప్రవాహంలా తన ఉనికిని చాటుకుంటూ వెళ్తుంది. ఈ ప్రక్రియను సంకుచితత్వ నుండి విశాల దృక్పథంవైపు మళ్ళించిన గొప్ప రచయితలు ఎందరో ఉన్నారు. వారిలో ఆధునిక స్పృహతో కలం చేత పట్టిన సింగమనేని నారాయణ ఒకరు. సింగమనేని అచ్చమైన రాయలసీమ కథకుడు. కథకుడిగా, నవలాకారుడిగా పాఠకలోకానికి సుపరిచితులు. పుస్తకాల్లో నుంచి కాక తన అనుభవాల్లోంచి మాట్లాడుతున్న రచయిత. తన అనుభవంలో దాగి ఉన్న సంఘటనలను వెతికి పట్టుకొని కథలుగా రాసి పాఠకలోకాన్ని ఆలోచింపచేసిన కథకులు.

అక్షరాక్షరం అభ్యుదయం సింగమనేని పంథా. ఈయన రాసిన ప్రతీ కథలోనూ అభ్యుదయ ఛాయలు ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. రాయలసీమ సామాజిక మూలాల్ని వాస్తవికంగా కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. ఈయన సృజించే కథా వస్తువూ, పాత్రలు, సన్నివేశాలు, సంఘటనలు, నేపథ్యాలు నిర్దిష్ట స్థల కాలాలతో ఆవరించి ఉంటాయి. రాయలసీమ ప్రజానీకంతో మమేకమవుతూ అక్కడి ప్రాదేశిక జీవిత చిత్రణ ద్వారా పాఠకుల్ని చైతన్యపరిచి మంచి మార్క్సిస్టు కథారచయితగా పేరు పొందారు.

సింగమనేని నారాయణ గారు స్వయంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు విద్యావ్యవస్థలోని లోపాల్ని, ఉపాధ్యాయుల బాధ్యతారాహిత్యాన్ని వేలెత్తి చూపే కొన్ని కథల్ని అక్షరబద్ధం చేశారు. వాటిని పరిచయం చేసి విశ్లేషిస్తాను.

'కంచె' కథలో ఏప్రిల్‌లో జరిగిన 7వ తరగతి పరీక్షల్లో ఒక జిల్లాలో 90 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులవుతారు. అయితే అదే జిల్లాలోని పది హైస్కూళ్ళు మాత్రం పదిశాతానికి మించి ఫలితాలు సాధించలేక పోతాయి. ఈ స్కూళ్ళలో విద్యాప్రమాణాలు పడిపోవటానికి కారణాలు పరిశీలించమని సంబంధిత అధికారులు ఆ బాధ్యతను డి.ఇ.ఓ.కు అప్పగించారు. డి.ఇ.ఓ. మొట్టమొదట వెంకటాపురం హైస్కూల్‌కు వెళ్తాడు. ఫలితాల విషయమై ఆ స్కూల్‌లోని ఉపాధ్యాయులను అడుగుతాడు. ఉపాధ్యాయులంతా పద్ధతి వల్ల జరిగే నష్టాన్ని స్పాట్ వాల్యుయేషన్ సెంటర్లలో అవకతవకల్ని డి.ఇ.ఓ.కి విన్నవించుకుంటారు. తమ పరీక్షలు స్ట్రిక్ట్‌గా నిర్వహించినందుకు విద్యార్థులు ఫెయిల్ అయినట్లు చెప్తారు. ఉపాధ్యాయుల మాటల్ని డి.ఇ.ఓ. పెడచెవిన పెడతారు. మంచి ఫలితాలు సాధించడానికి మిగితా స్కూళ్ళలో మాదిరిగానే మాస్‌కాపింగ్ చేయించమని సలహా ఇస్తాడు. అతడిచ్చిన సలహాకు ఉపాధ్యాయులందరూ నోళ్ళు వెళ్ళబెట్టి చూస్తుండిపోయారు. తల్లి, తండ్రి, గురువు, పిల్లల అభివృద్ధికి సకల జాగ్రత్తలు తీసుకోవాలి. అలాంటిది వారు ఆ ప్రయత్నాల నుండి వైదొలిగితే పిల్లలు అపసవ్యధోరణులకు ఆకర్షితులవుతారు. పై కథలో పిల్లలకు పాఠాలు బోధించి పరీక్షలు నిర్వహించాల్సిన ఉపాధ్యాయుడు ఫలితాలు రాబట్టడానికి మాస్ కాపియింగ్ చేయించమని విద్యాధికారి (డి.ఇ.ఓ.) సూచించడం 'కంచె' చేను మేసినట్లుందన్నది రచయిత ఉద్దేశ్యం.

'విరమణీయం' కథలో ఒక పాఠశాలలో హెడ్మాస్టర్ రామనాథం పదవీ విరమణ కార్యక్రమం కోసం విద్యార్థుల వద్ద డబ్బులు వసూలు చేస్తారు. అంతకుముందు ఆ పాఠశాలలో సైన్స్ టీచర్, తెలుగు పండిట్ బదిలీ అయిన

సందర్భంలో కూడా ఈ వసూళ్ల కార్యక్రమం జరిగింది. హెడ్మాస్టర్ పదవీవిరమణ కార్యక్రమానికి జిల్లా పరిషత్ అధ్యక్షులు, శాసనసభ్యులు, విద్యాశాఖాధికారి, ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులందురూ హాజరవుతారు. ఈ వీడ్కోలు సభ ఎంత గొప్పగా జరిగితే అంత ప్రతిష్టాత్మకంగా వ్యవహారంగా భావిస్తారు హెడ్మాస్టర్. అధికారులకు ముఖపరిచయం తప్ప వేరే పరిచయం లేకపోయినా ఆయన్ని అందరూ పొగడటమే పనిగా పెట్టుకుంటారు. ఒకరకంగా పొగడ్తల కోసమే సభ జరుగుతున్నట్లు అనిపిస్తుంది. హెడ్మాస్టర్ మాత్రం ఈ సన్మానాన్ని, అభినందనల్నీ జన్మలో మరువలేనని ఉత్త కన్నీళ్ళు కారుస్తాడు. సాయంకాలం అవుతున్న సభ ముగియక పోవడంతో పిల్లలందరూ అసహనంగా ఉంటారు. రాజేశ్వరి, వనజాక్షి అనే విద్యార్థినులు "బలవంతంగా పదులు పదులు వసూలు చేసి వాళ్ళకు నచ్చిన కానుకలు కొనుక్కొని విందులు తిని, ఇదంతా మనం ప్రేమతో చేసినట్లు ఎలా చెప్పుకుంటున్నారు." అని మాట్లాడుకుంటూ నవ్వుకుంటారు.

ఆధునిక సమాజంలో యాంత్రీకరణ, వ్యాపారీకరణ, మిథ్యావిలువలు, మానవ సంబంధాల్లో చొరబడ్డాయి. మనిషి సహజసిద్ధంగా జీవించే పరిస్థితులు కనుమరుగయ్యాయి. ఈ విరమణీయం కథలో బలవంతంగా విద్యార్థుల దగ్గర డబ్బులు వసూలు చేసి హెడ్మాస్టర్ రామనాథంకు సన్మానం ఏర్పాటు చేస్తారు. హెడ్మాస్టర్ గురించి తెలియనవాళ్ళు ఆ సన్మానంలో ఆయన్ని పొగడ్తలతో ముంచెత్తుతారు. ఈ సన్మాన సభలో చోటు చేసుకున్న కృత్రిమత్వాన్ని, మిథ్యావిలువల్ని రచయిత ఈ కథలో కనువిప్పు కలిగేట్లు చిత్రించారు.

'వేషం' కథలో రంగమ్మ కుటుంబం కూలీనాలి చేసుకొని బతుకీడుస్తుంటుంది. రంగమ్మ తన కొడుకు సూరిని చదివించాలనుకుంటుంది. ఒకరోజు సూరికి స్కూల్ యూనిఫాం లేనందున డ్రిల్ మాస్టర్ కొట్టి ఇంటికి పంపుతారు. సూరి ఇంటికెళ్ళి తల్లితో స్కూలు యూనిఫాం లేకపోతే వెళ్ళనని మారాం చేస్తాడు. అప్పటికి రంగమ్మకు స్కూలు ఫీజులని, నోట్సులని, తలకు మించిన భారమై ఉంటుంది. ఏం చదువులే, ఏం పాడో అని బాధపడుతుంది. నాలుగు రోజుల తర్వాత సూరికి యూనిఫాం కుట్టించి సూరితోపాటు స్కూల్‌కి వెళ్తుంది. ప్రార్థన స్థలంలో నిలబడి "అయ్యా! మేమేదో తిండికి గతిలేనివాళ్ళం. ఏదో నాలుగు ముక్కలు చదువుకుంటాడని బడికి పంపిస్తే బట్టలు లేవని కొడుతారా; నాకు తెలియక అడుగుతాను మీరు చదువులు చెప్పేది పిల్లవానికే గదా, బట్టలకు కాదు కదా మీకు పిల్లల కంటే బట్టలే ముఖ్యం అయినట్లుంది. ఇదేమన్నా మంచిపద్ధతా అని" ఉపాధ్యాయులను నిలదీస్తుంది. "చదువుల వల్ల రాని కమసిచ్చిన బట్టలతో వస్తుందంటే నాకు నమ్మకం చిక్క లేదయ్యా" అంటుంది. స్కూల్ హెడ్మాస్టర్ దగ్గరికొచ్చి యూనిఫాం లేకుండా బడికి రానివ్వం అంటాడు. దీంతో రంగమ్మ కోపంగా సూరి వేసుకున్న యూనిఫాం అక్కడే విడిచేసి ఈ బట్టలకే చెప్పండి చదువు అని సూరిని నగ్నంగా ఇంటికి తీసుకెళ్తుంది.

పిల్లలంతా సమానమే అని ఉపాధ్యాయుడు విద్యార్థుల్లో చైతన్యం కలిగించాలి. అలా కాకుండా యూనిఫాం రూపంలో విద్యార్థులకు సమానత్వాన్ని బోధించడం విచారకరం.

పై వేషం కథలో యూనిఫాం కుట్టించలేని ఆర్థిక దారిద్ర్యం వల్ల ఒక విద్యార్థి చదువుకు దూరమవుతాడు. కాబట్టి విద్యార్థులకు వేషం ముఖ్యం కాదని, వేషం ద్వారా ఆశించే లక్ష్యాన్ని వారిలో చైతన్యం నింపడం ద్వారానే సాధించవచ్చని రచయిత భావనగా వెల్లడవుతుంది.

'పరీక్ష' కథలో గంగాదరం ఉపాధ్యాయుడు. పరీక్షల నిమిత్తం జూనియర్ కాలేజీ సెంటర్‌లో ఇన్విజిలేటర్‌గా ఉంటాడు. అన్ని పరీక్షలు ముగుస్తాయి. చివరి పరీక్ష నిర్వహించటానికి వెళ్తాడు. బస్టాండు నుంచి కాలేజికి వెళ్తున్న సమయంలో డిప్యూటీ కలెక్టర్ రంగరాజు అతన్ని ఇంట్లోకి ఆహ్వానిస్తాడు. తన కుమారునికి పరీక్షల్లో కాపీలు

అందించమని కోరుతాడు. దానికి గంగాధరం అంగీకరించడు. ఎనిమిదేళ్ళ క్రితం ఇలాంటి సంఘటనకే బలైన వ్యక్తి గంగాధరం. ఇప్పుడు కూడా మారుమూల ప్రాంతం అయిన వెంకటాపురంకి బదిలీ అవుతాడు. సంవత్సరం తరువాత గంగాధరం వెంకటాపురంలో ఇన్విజిలేటర్‌గా నియామకమవుతారు. పరీక్షలు జరిగే సమయంలో స్క్వాడ్ వస్తుంది. గంగాధరం ఉన్న రూంలోకి ప్రవేశించి పిల్లల్ని గమనిస్తారు. అంతలో కాపీ రాస్తున్న విద్యార్థిని గమనించిన స్క్వాడ్ ఆఫీసర్ 'కాపీ కొట్టడం మీ జన్మ హక్కయి పోయింది. పాపం! మీరేం చేస్తారు మిమ్మల్ని తయారు చేసిన మీ తల్లిదండ్రులననాలి' అని ఆ విద్యార్థిని బయటకు పంపేస్తాడు. స్క్వాడ్ ఆఫీసర్‌గా వచ్చిన వ్యక్తి ఒకప్పటి డిప్యూటీ తాహసిల్దార్ రంగరాజు అని గమనించిన గంగాధరం రంగరాజును చూసి స్థాణువులా నిలబడి పోతాడు.

డిప్యూటీ తహసిల్దార్ రంగరాజు తన కొడుక్కి పరీక్షలో కాపీలు అందించమని ఇన్విజిలేటర్ గంగాధరాన్ని కోరాడు. అందుకు గంగాధరం తిరస్కరించాడు. స్క్వాడ్ ఆఫీసర్‌గా వచ్చిన రంగరాజు విద్యార్థి 'కాపీ' కొడుతుంటే దూషించి బయటకు పంపుతాడు. ఇక్కడ రంగరాజు తనకో నీతి ఇతరులకో నీతి అన్నట్లు వ్యవహరించాడు. ఇలాంటి అపసవ్యధోరణికి వ్యతిరేకంగా సంఘంలో చైతన్యం కల్పించడమే ఈ కథలో రచయిత ఉద్దేశ్యమని చెప్పవచ్చు.

'పరీక్షిత్తు' కథలో ఒక గ్రామీణ పాఠశాలలో ఏడవ తరగతి పరీక్షలు జరుగుతుంటాయి. విద్యార్తుల తల్లిదండ్రులు తమ పనులన్నీ పక్కనపెట్టి స్కూలు చుట్టూ మూగుతారు. తమ పిల్లలు ఫలితాలు సాధించటానికి కాపీలు అందిస్తారు. అవసరమైతే ఉపాధ్యాయుల్ని బెదిరిస్తారు. ఈ సంప్రదాయం ఆ ఊళ్ళో ఏళ్ళ తరబడి సాగుతూ ఉంటుంది. అయితే ఈ ఏడాది మాత్రం వెంకటపతి అనే ఆ స్కూల్ హెడ్మాస్టర్ స్ట్రిక్ట్‌గా నిర్వహించాలని భావిస్తాడు. పరీక్షల్ని చిత్తశుద్ధితో నిర్వహించాలని ఉపాధ్యాయులకు తగిన సూచనలిస్తారు. అతడి చిత్తశుద్ధిని ఆ ఊరి ప్రజలు అంగీకరించరు. బెదిరించే ప్రయత్నం చేస్తారు. వెంకటపతి మాత్రం పోలీసుల సాయంతో అన్ని పరీక్షల్ని స్ట్రిక్ట్‌గా నిర్వహించినందుకు ఆ ఊరి ప్రజలు అతడిని చితకబాదుతారు. ఆయన ఆ దెబ్బలకు తట్టుకోలేక మూల్గుతూ ఉంటాడు. ఆయన మూల్గులు పరీక్షల మూలాల్ని కెలుకుతున్నట్లుగా తెరలు తెరలుగా వ్యాపిస్తున్నాయంటూ కథ ముగుస్తుంది.

పరీక్షలు విద్యార్థుల విజ్ఞానాన్ని కొలిచే సాధనాలు. అయితే మార్కుల కోసం పరీక్షలు నిర్వహించే తంతువల్ల జ్ఞానకొలమానం అదృశ్యమైంది. 'పరీక్షిత్తు' కథలో తల్లిదండ్రులు తమ పిల్లలకు జ్ఞానం కంటే మార్కులు ప్రధానంగా పరిగణించారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించిన హెడ్మాస్టర్ వెంకటపతిపై దాడి చేశారు. తల్లిదండ్రుల్లో విద్యపట్ల సరైన చైతన్యం ఉనప్పుడే విద్యావిధానంలో అక్రమాలకు అవకాశం ఉండదన్నది రచయిత అభిప్రాయంగా భావించవచ్చు.

'విష్' కథలో హెడ్మాస్టర్ ప్రతిరోజూ ఉదయం తొమ్మిదన్నర గంటలకే స్కూలుకి వెళ్తాడు. స్కూల్లోకి అడుగు పెట్టే ప్రతీ టీచర్ మొదట హెడ్మాస్టర్‌కే విష్ చేయాలి. అలా చేయకపోతే ఆయన టీచర్లపై ఏదో ఒక రూపంలో కక్ష సాధింప చర్యకు పాల్పడుతాడు. హెడ్మాస్టర్‌కి తన కింద ఉన్న ఉపాధ్యాయులంటే చాలా చిన్న చూపు. ఒకసారి తెలుగు పండిట్‌ను "నీకు పిల్లల చేత కాంపోజిషన్ రాయించడం వచ్చా?" ఎవడయ్యా నీకు డిగ్రి యిచ్చిన వెధవ?" అని పిల్లల ఎదుటే తిట్టాడు. ఒక రోజు లెక్కల మాస్టర్ స్కూల్‌కి ఆలస్యంగా వచ్చి పరధ్యానంలో హెడ్మాస్టర్‌కు విష్ చేయటం మర్చిపోతారు.

హెడ్మాస్టర్ కోసంతో లెక్కల మాస్టార్‌కు మెమో జారిచేస్తాడు. హెడ్మాస్టర్ నియంతృత్వ పోకడలకు ఉపాధ్యాయులంతా విసుగు చెందుతారు. మూకుమ్మడిగా కూడబలుక్కుని మరసటి రోజు ఉదయం హెడామస్టర్‌కి ఒక్కరు కూడా విష్ చేయకుండా వెళ్ళిపోతారు. పరిమాణా

నికి హెడ్మాస్టర్ ముఖం మీద చెమటలు పట్టి కుర్చీ మీద తలవాల్చడంతో కథ ముగుస్తుంది. అధికారం నియంతృత్వానికి దారితీయకూడదు. అధికారం ఒక బాధ్యత. సంస్థలో పనిచేసే ఉద్యోగులు వారు చేసే సకల పనులు విలువైనవే. ఏ ఒక్క పనీ గొప్పదీ కాదు. తక్కువదీ కాదు. ఒక సంస్థ సక్రమంగా నడువాలంటే స్వీపర్ పని మొదలు, అధికారిపని వరకు అన్ని పనులు సజావుగా నడవాలి. ఈ పనులు చేసేవారందరూ సమానులే. ఇందులో హెచ్చు తగ్గులకు అవకాశం లేదు. హెచ్చు తగ్గులకు అవకాశం ఏర్పడితే పరస్పర విభేదాలతో సంస్థలు, అభివృద్ధి చెందలేవు. ఈ విషయాన్నే రచయిత పై కథలో సూచనాప్రాయంగా తెల్పారు.

ఈ విధంగా విద్యావ్యవస్థలో మార్పు తీసుకురావాలని సింగమనేని నారాయణ గారి ఆలోచనలు, కథలు.

**ఆధార గ్రంథాలు :**

1. కథానిక స్వరూప స్వభావాలు - పోరంకి దక్షిణామూర్తి
2. కథాశిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య
3. సింగమనేని నారాయణ 'అనంతం' కథల సంపుటి.
4. సింగమనేని నారాయణ కథల సంపుటి.
5. జీవఫలం - చేదు విషం కథల సంపుటి.

# సింగిడి కథా సంకలనాలు – తెలంగాణ స్థానీయత

– **కొత్త అరుణ,** పరిశోధకురాలు, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం,హైదరాబాద్.

తెలంగాణలో కవులే లేరు అన్నప్పుడు సురవరం ప్రతాపరెడ్డిగారు గోల్కొండ కవుల సంచికలప్రచురించారు. తెలంగాణలో మారుమూల గ్రామాలలో ఉన్న కవులు సైతం వారు గోలకొండ కవుల సంచికలో నమోదు చేశారు. అద్భుతమైన కవిత్వాన్ని ఒక చోట ప్రచురించి తెలంగాణలో గొప్ప కవులు ఉన్నారు అని రుజువు చేశారు. అదే విధంగా ఆనాడు వ్యాప్తిలో ఉన్న తెనుగు పత్రిక, దేశబంధు పత్రిక, సుజాత పత్రిక మొదలైనవి తెలంగాణ ప్రాంతపు ఎందరో కవులను తమ పత్రిక ద్వారా ప్రోత్సహించారు.

అదే విధంగా తెలంగాణలో సాహిత్యమే లేదు అనేనిందను కూడా మోయవలసి వచ్చింది. ఆనాడు ప్రచారంలో ఉన్న అనేక పత్రికలు తెలంగాణ కథను ప్రచురించాయి. ఎన్నో సాహిత్య ప్రక్రియలను ఆనాటి పత్రికలు అద్దం పట్టాయి. అయినా ప్రయత్నపూర్వకంగా తెలంగాణను శూన్యం చేయాలనే ఉద్దేశంతో తెలంగాణ మీద అనేక అభాండాలు మోపి నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కూడా ఇటువంటి పరిస్థితి ఎదుర్కోవాల్సి వచ్చింది. అందువలన తెలంగాణ లో బాధ్యతాయుతమైన కవులు రచయితలు మలిదశ తెలంగాణ ఉద్యమంలో పత్రికల నడిపి ఇక్కడి సాహిత్యాన్ని బయట ప్రపంచానికి తెలియజేశారు. అటువంటి ప్రయత్నంలో సోయి పత్రికల కృషి మరియు సింగిడి తెలంగాణ రచయితల సంఘం కృషి చెప్పుకోదగ్గది. ఇవి తెలంగాణ భాషను, సంస్కృతిని, రచయితల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు.

సింగిడి తెలంగాణ రచయితల సంఘం ఒక గురుతర మైన బాధ్యతలతో తెలంగాణ కథనువ్యాప్తిలోకి తీసుకు వచ్చింది. తెలంగాణ సంస్కృతిని విస్తృతమైన జీవితాన్ని చిత్రిక కట్టిన తొలితరం కథకులు అయిన వారిని సింగిడి తెలంగాణ రచయితల సంఘం విస్మరించలేదు. వారి వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని తెలంగాణలో కథల నిలబడాలని కథా సంకలనాలను ప్రచురించింది. అటు వంటి కథాసంకలనాలు తెలంగాణ స్థానీయత ప్రతిబింబిం చాయి. తెలంగాణ పోరాట చైతన్యాన్ని కథలు ఎత్తిపట్టి నాయి. సాహిత్యం ఉద్యమంతో మమేకమైన పరిస్థితులను కథా సంకలనాలు చిత్రించాయి. ప్రజలలో చైతన్యాన్ని ప్రోది చేసినాయి. కష్టాలు పడుతున్న ప్రజల పక్షాన నిలబడి ప్రజా వ్యతిరేక ధోరణులను నిలదీస్తున్నాయి.

సింగిడి తెలంగాణ రచయితల సంఘం ప్రచురించిన కథ సంకలనాలుఅన్యాయాలను ఆధిపత్యాలను దోపిడీదారులను దౌర్జన్య కారులను నిలదీస్తున్నాయి. కథా సంకలనాలలో తెలంగాణ ప్రాంతమే ఉన్నది. తెలంగాణ జనజీవన చిత్రణ మాత్రమే ఉన్నది. అందువలన తెలంగాణ స్థానీయత ప్రతి కథలోనూ నిక్షిప్తమై ఉన్నది. కథకు సంబంధించిన ఇతివృత్తంలోసమాజ మైనా, ప్రబోధమైనా, కుటుంబ పరిస్థితులైనా, సామాజిక ఆర్థిక రాజకీయ సంబంధమైనా అది తెలంగాణకు సంబంధిం చిందే కావటం వలన సింగిడి తెలంగాణ రచయితల సంఘం ప్రచురించిన కథాసంకలనాల లో తెలంగాణ స్థానీయత గురించి సందేహ పడవలసిన అవసరం లేదు.

సింగిడి తెలంగాణ రచయితల సంఘం 2013లో రందితెలంగాణ కథను ప్రచురించింది. ఆ కథా సంక లనంలో తెలంగాణ కథకులు అందరూ తెలంగాణ రాష్ట్రం కావాలని కోరుకున్నారు. కథా రచయితలు వివిధ సంఘాలలో పనిచేసిన వారే. అందువలన వారు ఎన్నో అనుభవాలతో కథలు రాశారు. ఈ కథా సంకలనలో సీని యర్ కథకుల కథలు ఉన్నాయి. వారిలో డాక్టర్ పసునూరి రవీందర్, చెన్నూరి సుదర్శన్, కవిత.కె, కె వి నరేందర్ ఆర్, డాక్టర్ కాంచనపల్లి, పెర్కపల్లి యాదగిరి, అఫ్సర్, జూపాక సుభద్ర, గాదె వెంకటేష్, బెజ్జారపు వినోద్

కుమార్, పెద్దింటి అశోక్ కుమార్, బూతం ముత్యాలు, హనీఫ్,మన్నేఎలియా, డాక్టర్ కె నాగేశ్వర్ ఆచారి, స్కై బాబా మొదలైన వారు ఉన్నారు. వారు తెలంగాణ సామాజిక పరిస్థితులను సాహిత్య సంస్కృతులను తన కథల ద్వారా కళ్లకు కట్టించారు. సాంస్కృతిక అంశం ప్రపంచీకరణ సామాజిక ఆర్థిక అంశము ఊరు మారి పోయిన తీరు దోపిడీ రూపాలు మార్చుకున్న వ్యవహారము వారి కథా రచనలో చోటుచేసుకున్నాయి. ఈ కథా సంకలనానికి సంగిశెట్టి శ్రీనివాస్ గారు, స్కై బాబా గారు సంపాదకత్వం వహించారు.

సింగిడి తెలంగాణ రచయితల సంఘం 2014లో తన్లాట కథా సంకలనాన్ని ప్రచురించింది. ఈ కథా సంకలనానికి సంగిశెట్టి శ్రీనివాస్ గారు ,స్కై బాబా గారు, వెల్దండి శ్రీధర్ గారు సంపాదకత్వం వహించారు.ఈ కథా సంకలనం ఆగమైన తెలంగాణ బతుకు చిత్రాలను రూపు కట్టింది. డాక్టర్ వంశీధర్ రెడ్డి చౌరస్తా కొత్త తరహాలో సాగిన కథ. టోల్గేట్ కథలు గాదె వెంకటేష్ పల్లె మరణాలను చెప్పారు. రామా చంద్రమౌళి దుఃఖాన్ని తెలంగాణ హృదయ వేదన. డబ్బు సంచి కథలు అనవసరంగా వైద్యులు చేస్తున్న దోపిడీని కె వి నరేందర్ చిత్రిక చేశారు. ఇండియా సన్ లో సరస్వతి రమ సామాజిక అస్తిత్వాన్ని కథగా చేశారు. ఇల్లు కథలో బండారు అంకయ్య గారు, అలికిన చేతులుకథలో పెర్కపల్లి యాదగిరి గారు, కుటుంబ సంబంధాలను ఆవిష్కరించారు. డాక్టర్ పసునూరి రవీందర్ సంపుడు పంజెంమానవ సంబంధాలను, చుక్కలు రాని ఆకాశం సామాజిక అస్తిత్వాన్ని కళ్లకు కడుతుంది. ఈ సంకలనంలో 2047అనే కథ విభిన్నమైంది. ఈ కథను వి. శ్రీనివాస్ గారు రాశారు. అటువంటి విభిన్నత తో రాయబడిన మరొక కథ కాసుల ప్రతాపరెడ్డి గారు రాసిన పూర్తికాని కథ. తాయమ్మ కరుణ రాజకీయ పరిస్థితులను తెలియజేస్తూ అమ్మ కథ రాశారు.ప్రజల చైతన్యాన్ని కాంక్షించి రాసిన రెండు కథలు ఒకటి థర్డ్ డిగ్రీ మోహన్ రెడ్డి గారు, రెండవది తమ్ముని మరణం పూడూరి రాజిరెడ్డి గారు కథను ఆలోచనాత్మక ధోరణిలో రాశారు.

సింగిడి తెలంగాణ రచయితల సంఘం 2015 లో నాలుగు తెలంగాణ కథనం ప్రచురించింది. ఈ కథా సంకలనం సంగిశెట్టి శ్రీనివాస్ గారి వెల్దండి శ్రీధర్ గారి సంపాదకత్వంలో వెలువడింది. ఈ కథా సంకలనంలో పన్నెండు కథలున్నాయి. అన్ని కథలు భాషా వైచిత్రి,శిల్ప నైపుణ్యాన్ని తెలియజేస్తాయి. సంపాదకులు ఎటువంటి రాగద్వేషాలు లేకుండా కేవలం ప్రజాస్వామ్యయుతంగా కథలను ఎంపిక చేశారు. ఈ కథా సంకలనం లో స్త్రీవాద కథలు కుటుంబ సంబంధమైన కథలు తెలంగాణ సాంస్కృతిక రాజకీయ సామాజిక ఆర్థిక వ్యవహారాలను తెలిపే కథలు ఉన్నాయి.

సంగిశెట్టి శ్రీనివాస్ గారు మరియు వెల్దండి శ్రీధర్ గారి సంపాదకత్వంలో తెలంగాణ కథ 2016 ప్రచురించబడింది. అటువంటి కథా సంకలనం పేరు కూరాడు. సింగిడి తెలంగాణ రచయితల సంఘం ప్రచురించిన అన్ని కథాసంకలనాలకు పేరు తెలంగాణ స్థానీయత నుంచి వచ్చినదే. ఈ కథా సంకలనం తెలంగాణ ప్రభావశీల సాహిత్యాన్ని సామాజిక పరిస్థితులను స్పష్టంగా చూపించింది. భారతదేశ సమాజాన్ని అద్దం పట్టే కథలు ఈ సంకలనంలో ఉన్నాయి అని చెప్పవచ్చు. సంపాదకులు వర్తమాన సమాజాన్ని ప్రతిబింబించే కథలను ఎంపిక చేశారు.కథకులు అంతా సీనియర్ కథకులు కావడం వలన అన్ని కథలలో పరిణతి చెందిన శిల్పం ఉన్నది.తెలంగాణ సమాజంసాంస్కృతిక జనజీవనం భాష అడుగడుగునా వ్యక్తమవుతున్నది.

సింగిడి తెలంగాణ రచయితల సంఘం డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ మరియు డాక్టర్ వెల్దండి శ్రీధర్ గారి సంపాదకత్వంలో 2017లో దావత్ తెలంగాణ కథనం ప్రచురించింది. ఈ కథా సంకలనంలో తెలంగాణ సాంస్కృతిక చైతన్యం ప్రపంచీకరణ అస్తిత్వం సామాజిక రాజకీయ పరిస్థితులువ్యక్తమయ్యాయి. తెలంగాణ భాష, వ్యవసాయ జీవన సంబంధాలు, తెలంగాణ ఆత్మ అయిన

సంస్కృతి, తెలంగాణ కూలీలు వలసలు వంటి ఎన్నో సామాజిక పరిస్థితులలో తెలంగాణ హృదయ స్పందనలు ఉన్నాయి. సింగిడి తెలంగాణ రచయితల సంఘం తెలంగాణకు సంబంధించినపలు అంశాలను కథల ద్వారా సంకలనాలను చేస్తూ తెలంగాణ స్థానికతను ప్రేమిస్తూ కథకు ప్రాణం పోస్తూ వచ్చింది.

1. సింగిడి కథా సంకలనాలు
2. రంది తెలంగాణ కథ 2013
3. తన్లాటతెలంగాణకథ 2014
4. అలుగు తెలంగాణ కథ 2015
5. కూరాడుతెలంగాణ కథ 2016
6. దావత్ తెలంగాణ కథ 2017.

# జానపద కళల్లో – డప్పు వైశిష్ట్యం

– మొత్కూరి అనిల్ కుమార్, పరిశోధక విద్యార్థి, జానపద కళల శాఖ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్.

ఆదిమ మానవుడు కనుగొన్న మొట్టమొదటి వాద్య పరికరం డప్పు అయితే డప్పు ఎలా పుట్టింది అనే విషయం ఎవరు చెప్పలేదు. కాని కొంతమంది అభిప్రాయం ప్రకారం ఆదిమానవుని కాలంలోనే డప్పు పుట్టిందని, మరికొందరు మనిషి పుట్టినప్పుడే డప్పు పుట్టిందని చెబుతున్నారు.

ఆదిమానవుని కాలంలో మనుషులు మృగాలను ఎదిరాస్తూ, కొన్ని జంతువులను వేటాడి వాటిని తింటూ జీవనం కొనసాగిస్తుండేవారు. ఈ తరుణంలో ఒక రోజు జంతువును వేటాడి దాని చర్మాన్ని తీసి ఒక రాయిపై ఎండలో ఆరబెట్టారు మరుసటిరోజు ఒక జంతువును వేటాడుతూ వస్తున్న వ్యక్తి తన చేతిలో ఉన్న కర్రను ఆ జంతువు పైకి విసరగా జంతువుకు తగలకుండా పక్కనుండి వచ్చి ఎండలో ఆరబెట్టిన జంతు చర్మంపై పడగానే 'ఢాం'అనే శబ్దం వచ్చింది. ఆ శబ్దం విన్న ఇతర జంతులు దూరంగా పరుగెత్తాయి. అది గమనించిన మానవుడు ఆ చర్మాన్ని తీసుకొని ఒక కర్రను గుండ్రటి చక్రంలా వంచి దానికి ఆ చర్మాన్ని అతికించి తీగలతో గట్టిగా కట్టి చర్మంపై కర్రతో కొట్టగా అది 'ఢాం', 'ఢాం' అని శబ్దం వచ్చింది. అప్పటి నుండి దాన్ని క్రూరమృగాలను ఎదిరించడానికి ఉపయోగించారు. అది దినదిన అభివృద్ధి చెంది డప్పుగా తయారయ్యింది రాజుల కాలం వచ్చేసరికి సాంకేత వాద్యంగా ఉపయోగపడింది. అలా వచ్చిన డప్పు అనేక మార్పులు చెంది నేడు ఒక ప్రత్యేకతను సంతరించుకుంది.

పూర్వకాంలో డప్పును మనిషి చనిపొయినప్పుడు మాత్రమే ఉపయోగించేవారు అలా కొన్ని రోజుల తర్వాత చాటింపు వేయడానికి, జాతర్లలో, ఉత్సవాలలో ఉపయోగించడం ప్రారంభించారు. రోజులు గడిచిన కొద్ది డప్పు ప్రాధాన్యత పెరిగి అనేక కార్యక్రమాలలో ఉపయోగించడం మొదలు పెట్టారు. మనిషి పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు జరిగే అనేక కార్యక్రమాలలో డప్పును ఉపయోగిస్తున్నారు పెండ్లిలు, సంబరాలు, ఊరేగింపులు, రాజకీయ ప్రచారం కొరకు విజయోత్సవ ర్యాలీలలో కూడా ఉపయోగించడం జరుగుతుంది.అనేక జానపద కళరూపాల వలె డప్పు ఎంతో ప్రాచుర్యం సంతరించుకొంది. కాబట్టి డప్పు నృత్యాన్ని జానపద కళారూపాలతో ఒకటిగ చెప్పుకొవడం జరుగుతుంది.

**డప్పు దరువులు :**

డప్పు వాద్యాన్ని పెండ్లిలు, పండుగలు, జాతర్లు , ఊరేగింపులు చావులల్లో ఎక్కువగా ఉపయోగిస్తారు. అయితే ఒక్కో సందర్భంలో ఒక్కో రకమైన దరువును ఉపయోగిస్తారు. మాములుగా అందరికి డప్పు పై వాయించే దరువులు కొన్ని మాత్రమే తెలుసుకాని డప్పు వరుసలు, శాస్త్రీయా దరువులతో కూడినది 101 జాతులు వాయించవచ్చు అని సూర్యాభగవంతరావు గారు చెప్పారు.

**ఆదిజతి :**

ఈ జతి యొక్క వరుస "జామ్ తక్క తక్క తక్క' ఏదైన సాంస్కృతిక కార్యక్రమం జరుగుతన్నప్పుడు అది జతితో ప్రారంభిస్తారు. అడుగులు వేసేటప్పుడు కూడా ఈ జతిలోనే ప్రారంభిస్తారు. జామ్ అని కొట్టినప్పుడు కుడికాలు ముందుకు వేసి కొంత ముందుకు వంగి తకతకతక్క అన్నప్పుడు కాలుని వెనక్కి తీసుకుంటారు. అదేవిధంగా కుడికాలుతోనే కుడి పక్కకు, ఎడమ పక్కకు వేస్తారు. కుడికాలు ముందునుండి పైకి లేపి కింద పెట్టి మళ్లి ఎడమకాలు పైకి లేపి కింద పెడతారు. అది జతికి

ఇంక వివిధ కరాల అడుగులను వేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో పెండ్లిలు జరిగటప్పుడు ఆదిజతికి ఉపయోగిస్తారు. తాళి కట్టే సమయంలో తకతకతక అంటు జోరుగా ఉత్సాహంగా వాయిస్తారు.

**చాటింపుజతి (దండోరజతి) :**

గ్రామాలలో చాటింపు వేయాడానికి ఈ జతిని ఉపయోగిస్తారు. చాటింపు జతి యొక్క వరుస 'జగు జగు నకు నకున్న' అంటు వీధులలో తిరుగుతూ చాటింపే వేస్తారు. అడుగులు వేసేటప్పుడు కుడికాలు ముందువేసి ఎడమకాలు కొంత పైకి లేపి మల్లి కుడికాలు వెనక్కి తెచ్చి ఇంకోంత ముందుకు వేస్తూ నడుస్తు ఉంటారు.

**జాతరజత :**

ఈ జతి యొక్క వరుస 'జామ్ జామ్ తకత' జాతర్లలో అమ్మవారిని కొలిచే సమయంలో ఈ జతిని ఉపయోగిస్తారు. కాబట్టి జాతర జతి అంటారు. అడుగులు వేసేటప్పుడు 'జామ్ జామ్' అని డప్పుపై కోట్టినప్పుడు కుడికాలును పైకి లేపి రెండు సార్లు నెలకు పాదం ముందు భాగంలో కొట్టి 'తకత' అన్నప్పుడు అడుగు ముందుకు వేస్తారు. అదేవిధంగా ఎడమకాలితో కూడా వేస్తు ముందుకు వెలుతు ఉంటారు లేదా గుండ్రంగా తిరుగుతుంటారు. వీరీ ప్రత్యేక పండుగల సమయాలలో నృత్యం చేసేటప్పుడు ఈ జతిని ఉపయోగిస్తారు.

**పులి అడుగు జతి :**

పులి అడుగు జతి నాలుగు వరుసలలో ఉంటుంది. ఒక్కొ వరుస ఒక్కొ సమయంలో ఉపయోగిస్తారు. వరుస 1. తకిట తకదిమిత తత 2. తకిట తకదిమిత దిరుగుడుత 3. జామ్ జామ్‌త జామ్ తత 4. జామ్ జామ్‌త జామ్ దిరుగుడుత. పీర్ల పండుగ సమయంలో కొంతమంది వ్యక్తులు పులివేశాలు వేసి నృత్యం చేసేటప్పుడు ఈ జతులను ఉపయోగిస్తారు. అదేవిధంగా ప్రాచీన యుద్ధ కళారూపం అయినటువంటి కర్రసాము విన్యాసాలతో, దుష్మన్‌ను ఎదుర్కొనేటప్పుడు పులి అడుగు జతిని ఉపయోగిస్తారు.

**బంజార జతి (లంబాడి జతి) :**

ఆదివాసులుగా చెప్పుకునే గిరిజన తెగలలో బంజార వారు కూడా ఒకరు. మరి వీరు నృత్యం చేసేటప్పుడు ఉపయోగించే డప్పు జతిని 'బంజార జతి' అంటారు. ఈ జతి యొక్క వరుస 'జామ్ కుంకునకు జామ్ తక తక తక' డప్పు ఈ నృత్యం చేసేటప్పుడు కూడా ఈ జతిని ఉపయోగిస్తారు. కుడికాలుతో అడుగు ముందుకు వేసి తక తక తక అన్నప్పుడు అడుగుని పక్కకు మూడు అడుగులు వేసి కాలు వెనక్కి తీసుకుని మరల జామ్ అని కొట్టినప్పుడు కాలు ముందుకు వేసి అదే విధంగా కొనసాగుతు ముందుకు వెలుతుంటారు.

**అమ్మవారి జత :**

అమ్మవార్ల జాతరలు జరిగే సమయంలో ఉపయోగించే జత కాబట్టి ఈ జతిని అమ్మవారి జతి అంటారు. జతిమొ వరుస 'తక తకిట తక తకిట తక తకిట దిరుగుడుత' అమ్మవారి జాతర్ల ఊరేగింపులో, పోతురాజు నృత్యం చేసేటప్పుడు, అమ్మవారికి నైవేద్యం పెట్టే సమయంలో ఈ జతిని ఉపయోగిస్తారు.

**బజారు జతి :**

జజారు జతి మొక్క వరుస 'జామ్ తక్క తాకిట తకదిమి' డప్పు నృత్యం చేస్తూ ఊరేగింపుగా వేళ్ళే సమయంలో ఈ జతిని ఏపయోగిస్తారు. నిటబద్ద దగ్గర నుండి కుడకాలులో ముందుకు వెనక్కి అడుగులు వేస్తారు. జతి డప్పు పై కోటే వేగం పెరిగనప్పుడు అడుగులు వేగంగా దుంకుతు వేస్తారు.

**చావు జతి :**

చనిపోయినప్పుడు వాయించే జతి కాబట్టి ఈ జతిని చావు జత అంటారు. ఈ జతి యొక్క వరుస 'తకజామ్ తక్క తక్కిట తకిట తకిట త ' అని వాయించుకొంటు ముందుకు వెళ్లుతూ ఉంటారు.

పైన పేర్కొన్న జతులే కాకుండ డప్పు పై ఇంక చాల జతులు వాయిస్తారు. దాండియా, తీన్మార్, పాలవరుసలు,

శాస్త్రీయ జతులు, కోలాటం వేసేటప్పుడు కూడా వివిధ రకాల జతులను ఉపయోగిస్తారు. ఇలా వివిధ సమయాలలో ఉపయోగించేవి మొత్తం 101 డప్పు జతుల వరకు ఉన్నాయి.

**డప్పు నృత్యం :**

వివిధ రకాల జతులను ఉపయోగిస్తు వాటికి అడుగులు వేస్తూ నృత్యం చేస్తారు. మధ్యమధ్యలో విన్యాసాలు చేస్తు, పాల వరుసలు ఉపమోగిస్తు నృత్యం పతాక స్థాయికి వెళ్ళేటప్పుడు ఒకరి పైకి ఒకరు ఎక్కుతు విన్యాసాలు చేస్తుంటారు. ఈ నృత్యం ఎంతో అకర్ష నియంగా ఉంటుంది. డప్పు నృత్యం చేసేవారు అంచు పంచను దొతికట్టి, ఒకే రంగులో ఉండే బనియన్ లేదా అంగులను ధరిస్తారు. అందరి కాళ్లకు గజ్జలు కట్టుకుని తలకు రిబ్బన్ లేదా ఒకే రంగులో ఉండే గుడ్డలను కట్టుకుని చూడటానికి అందరు ఒకే విధమైన అలంకరణతో కన్పిస్తారు. వీరందరు ఎప్పుడు డప్పు నృత్యం చేసిన ఇదేవిధంగా అలంకరించుకుంటారు. వీరి కాలి గజ్జలు డప్పు దరువులకు అనుగుణంగా గల్లు గల్లుమంటు ప్రేక్షకులను ఆకట్టుకొంటుంది.

**డప్పు తయారీ :**

డప్పు కుదురుకు వేప, గంగిరేగి, పనస, రేల, సంద్ర కర్రలను ఎక్కువగా ఉపయోగిస్తారు. ముందుగా నాలుగు చెక్కలను తీసుకొని వాటిని గుండ్రంగా వచ్చేటట్టు చెక్కి వాటి మధ్యలో ఇనుప బడ్డీలు పెట్టి మేకులు కొడతారు. ఇలా గుండ్రంగా తయారు చేసిన చెక్కలను కుదురు అంటారు. కుదురు తయారయిన తర్వాత లేత దూడ, లేదా మేక చర్మాన్ని పై వెంట్రుకల భాగం భూమిపై ఉండేటట్లు చర్మాన్ని వొలిచి ఉప్పువేసి చుట్టు మేకులు కొట్టి రెండు లేదా మూడు రోజుల వరకు ఎండబెట్టి ఆ తర్వాత వెంట్రుకలను తొలగించి నీటిలో నానబెడతారు. అదేవిధంగా చింతగింజలు బాగా వంచి వాటిని ఉడకబెట్టి జిగురులా తయారు చేస్తారు. అప్పుడు కుదురును తీసుకు వచ్చి దాని అంచుకు ఉడకబెట్టిన చింతగింజల జిగురు పెడుతూ చర్మాన్ని అతికిస్తూ గట్టి తాడు సహాయంతో బిగ్గరగా లాగుతూ వెనక భాగంలో ఒక రింగు పెట్టి చర్మాన్ని దానికి చుట్టి ఒకటి లేదా రెండు రోజులు దానిపై రాయిని బరువుగా పెట్టి ఎండబెడతారు ఎండిన తర్వాత కుదురు అంచుభాగానికి సరిపడు చర్మాన్ని ఉంచి మిగతాది తొలగిస్తారు. ఈ డప్పును ఎక్కువగా మాష్టివారు తయారు చేసేవారు.

**డప్పుకు ప్రాచుర్యం కల్పించిన వారిలో సూర్య భగవంత్‌రావు కృషి :**

డప్పు వాద్యానికి విశిష్ట సేవలు అందించినవారిలో ముఖ్యులు శ్రీ కుంపటి సూర్యభగవంత్‌రావు గారు. ఈయన కృష్ణా జిల్లా గంటసాల మండలం, చితుర్పు అనే గ్రామంలో కుంపటి వీరయ్య, మహాలక్ష్మీ దంపతులకు జన్మించారు. ఆయన చిన్నతనం నుండే డప్పు పై ఆసక్తి పెంచుకోవడంతో 5వ తరగతి వరకు చదువుకొని ఆ తర్వాత బడికి వెళ్ళకుండా పూర్తి సమయం డప్పు నేర్చుకోవడానికి ఆసక్తి కనబరిచారు. మొదటిగా వీరీ తాతగారు అయిన రామయ్య దగ్గర డప్పు నేర్చుకోవడం ప్రారంభించి తర్వాత బొబ్బిలి కన్నయ్య, కొక్కిలిగడ్డ పిలోమాన్, అలాగే మంగళి డోలు వాయించే పోతర్లంక కులుంబరావు గారు. వీరితో డప్పు నేర్చుకొని డోలు వరుసలను డప్పుపై వాయించడం ప్రారంభించారు. ఇలా బాగా అభ్యాసం చేసి తన గ్రామంలో ఆసక్తి ఉన్న కొంతమందిని పోగుచేసి వారందరికి డప్పు శిక్షన ఇవ్వడం ప్రారంభించారు. తన 16వ ఏట ప్రజానాట్యా మండలిలో చేరి వివిధ ప్రాంతాలలో డప్పు శిక్షణాలు ఇచ్చారు. 1990లో తెలుగు విశ్వవిద్యాలయయంలో జానపద కళల శాఖలో డప్పు ఉపాధ్యాయుడిగా ప్రవేశించి సాంస్కృతిక శాఖ తరుపున 12 రాష్ట్రాలు తిరిగి ప్రదర్శనలు ఇచ్చారు. ఫ్రాన్స్, దుబాయి దేశాలకు కూడా వెళ్ళి ప్రదర్శనలు ఇవ్వడం జరిగింది. తెలుగు విశ్వవిద్యాలయయం విద్యార్థులకే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో 3000 ల మందికి పైగా తెలంగాణలో దాదాపు 600 ల మంది వరకు డప్పు

శిక్షణ ఇచ్చారు. ఈయన తాను సొంతంగా 101 డప్పు జతలను తయారు చేసుకున్నారు. ఈ దరువులు శాస్త్రీయ తాళాలకు అనువుగా కూడా ఉంటాయి.

డప్పుపై శాస్త్రీయ దరువులను వాయించే వ్యక్తి ఈయనొక్కడే అందుకు హంస అవార్డు, దళితరత్న, డప్పు జానపద రత్న, డప్పు విద్య ప్రవీణ ధర్మనిధి పురస్కారం, ప్రతిభా అవార్డులు అందుకున్నారు.

**ముగింపు :**

ఆదిమానవుని కాలంలో పుట్టిన డప్పు అనేక రూపాంతరాలు చెందుతు, పెండ్లీలు, పండుగలు, ఉత్సవాలు ఊరేగింపులలో భాగమవుతు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. కొందరు కళాకారులు డప్పు కళను ప్రపంచ వ్యాప్తంగా ప్రదర్శిస్తు డప్పు మొక్క గొప్పతనాన్ని చాటి చెబుతున్నారు. డప్పు కళాకారులకు అనేక ప్రభుత్వ కార్యక్రమాలలో అవకాశాలను కల్పిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలోనే కాకుండ ఇతర రాష్ట్రాలలో కూడా డప్పు వాయిద్యానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని యం.పి.ఎ జానపద కళల శాఖలో డప్పు సిలబస్‌గా ఉంది. అదేవిధంగా ఇతర విశ్వవిద్యాలయాలు కళలకు సంబంధించిన కళాశాలలో డప్పు వాయిద్య డిప్లొమా డిగ్రీలు చేసే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తే బాగుంటుంది.

పూర్వకాలంలో డప్పు వాద్యాలను జంతులు చర్మంతో తయారుచేసేది కాని సాంకేతిక పరిజ్ఞానం వచ్చినప్పటి నుండి అన్ని ప్లాస్టిక్ డప్పులే కన్పిస్తున్నాయి. తోలుడప్పులు చేసేవారు ఎవరు లేరు. ఔత్సాహిక కళాకారులు వచ్చినప్పటి నుండి వృత్తి కళాకారులకు ఆదరణ తగ్గిపోయింది. ప్రభుత్వ వృత్తి కళాకారులను గుర్తించి వారకి ప్రోత్సాహం అందించేల చర్యలు చేపట్టాలి. పరిశోధక విద్యార్థులు ఈ వృత్తి కళాకారులు ఎక్కడేక్కడ ఉన్నారో గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి మన సంస్కృతి, సాంప్రదాయాలను కళారూపాలను అందరు కాపాడుకొవాలి.

**విషయధాతలు :**

1. కె. సూర్యభగవంత రావు
2. కె.బాబుజీ
3. డప్పుశేఖర్
4. ఎ.నరసింహ
5. యన్. పరమేశ్

**ఉపయుక్త గ్రంథాలు :**

1. తెలుగువారి జానపద కళారూపాలు - డా. మిక్కిలినేని రాధాకృష్ణ
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం - డా. ఆర్వియస్ సుందరం
3. తెలుగు జానపద విజ్ఞానం సమాజం -సంస్కృతి - సాహిత్యం - డా. ఆచార్య నాయిని కృష్ణకుమారి
4. ఉత్తరాంధ్ర గుండె చప్పుడు తప్పెగుళ్లు - బద్రి కూర్మారావు శబ్దం (త్రైమాసిక పత్రిక-అక్టోబరు- డిసెంబరు 2014)
5. కళలు - సాహిత్యం - వర్లీస్ (శబ్దం (త్రైమాసిక పత్రిక-అక్టోబరు- డిసెంబరు 2014)

BHAVAVEENA
Vol. 18, Issue. 6, June 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ఉపాధ్యాయలోకంలో ఉరిమే ఉత్తేజం – డా. కొడాలి సుచరిత

– సాహితి మేదుగుల, డిగ్రీ విద్యార్థి, ప్రభుత్వ మహిళా కళాశాల(స్వయంప్రతిపత్తి), గుంటూరు.

సముద్రం లోపల ముత్యపు చిప్పలుంటాయి. దానిలో చిన్న పురుగు ఉంటుంది. ఆ చిప్పల్లోకి ఇసుక రేణువులు జొరబడతాయి. అతి సున్నితమైన ఆ పురుగు ఇసుక రేణువులతో కలిగే ఆ చికాకును అస్సలు భరించలేదు. తన నోట్లో నుంచి తెల్లని జిగురును ఊరించి, ఆ రేణువులు చుట్టూ పొదిగి, గరగరల నుండి ఉపశమనం పొందుతుంది. ఆ జెల్లీ మెల్లగా గట్టి పడుతుంది. అదే మనం ధరించే మంచి ముత్యం. అంటే, ఒక్కోసారి కొన్ని గరగరలు జీవుడి వేదనలు జాతికి మేలు చేస్తాయి అని ఒక వ్యాసంలో ప్రస్తావించారు ప్రముఖ రచయిత శ్రీరమణ గారు. అలా నాకు జరిగిన ఒకానొక మేలు మా కళాశాల లోని సూక్ష్మజీవశాస్త్ర అధ్యాపకులవారితో పరిచయం ఏర్పడటం. వారి కెరీర్లో ఎంతోమంది ఉత్తమమైన విద్యార్థులను సమాజానికి అందించారు. ఇంకా ఎన్నో వందలమంది విద్యార్థులలో నైతికతను, సమాజం పట్ల శ్రద్ధను పెంపొందించాలి అని తహతహలాడే మంచి ముత్యం. ఒక క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా వారి ఉద్యోగాన్ని నిర్వర్తిస్తున్నారు.

ఎందరో విద్యార్థులకు ప్రసాద రావు - భారతిలక్ష్మి గార్ల ద్వారా వరప్రసాదంగా జన్మించిన వీరు, వారి చిన్నతనంలో శాస్త్రవేత్త కావాలని కలగనేవారట. వారు శాస్త్రవేత్త అయ్యుంటే దేశానికి మంచి శాస్త్రవేత్త దొరికి వారేమో. కానీ వారు ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకోక పోయుంటే విద్యా వ్యవస్థ ఖచ్చితంగా మంచి అధ్యా పకురాల్ని కోల్పోయేది. అదృష్టవశాత్తు అలా జరగలేదు. ఆదర్శప్రాయమైన అధ్యాపకురాలిగా, ఆత్మీయమైన కుటుంబ వ్యక్తిగా, సామాజిక దృక్పధం ఉన్న వ్యక్తిగా, వీరు మా కళాశాలలో అత్యంత ప్రతిభావంతమైన పాత్రని నిర్వహిస్తున్నారు. కలివిడితనం అనేది వారికి సహజంగా అబ్బిన గుణవిశేషం. వీరు ఎప్పుడు ఎక్కడ కనిపించినా మాతృభావంతో ప్రేమగా పలకరించడం అలవాటు అయింది. తెరిచిన పుస్తకంలా దాపరికంలేని నడవడి, ఓర్పే సమస్తంగా గడుపుతున్న జీవనశైలి నన్ను వారి అభిమానిని చేశాయి.

మా విద్యార్థి దశలో ఎందరో గురువులు మాకు తారస పడతారు. కానీ కొందరే మనసు తెరపై నిలుస్తారు. మనిషికి తల్లి జన్మనిస్తే ఆ జన్మని సార్థకం చేసుకునే దిశగా మనల్ని నడిపించే వ్యక్తి గురువు. భారతీయ సంప్రదాయంలో తల్లిదండ్రుల తరువాత అత్యంత పూజ్యనీయమైన వ్యక్తి గురువు. "ఆచార్యదేవోభవ" అంటూ విద్యాబుద్ధులు నేర్పించిన గురువుని కీర్తిస్తాం. ఎన్ని కాలాలు మారినా మానవుని జీవితంలో వన్నె తగ్గని స్థానం గురువుది. తల్లిదండ్రుల తరువాత ఒక వ్యక్తి తన జీవిత కాలంలో మర్చిపోకూడని వ్యక్తి గురువు. ఎందుకంటే మన తల్లిదండ్రుల తరువాత మన గురించి మన కంటే కూడా సరిగ్గా అంచనా వేసి చెప్పగలిగింది ఒక్క గురువే. మన గురించి వారికే ఎక్కువ తెలుసు అని అనటంలో ఎలాంటి సందేహం లేదు. అలా నా గురించి మా అమ్మ తరువాత నన్ను అంతగా విశ్లేషించి చెప్పగలిగింది డా. కొడాలి సుచరిత గారు. ప్రభుత్వ మహిళా కళాశాలలో పరిచయం అక్కర్లేని పేరు. ప్రభుత్వ మహిళా కళాశాల ఎంతో మంది అధ్యాపకులను చూసి ఉంటుంది. అయితేనేం! మా కళాశాల గర్వించి సగౌరవంగా చెప్పుకోగల అధ్యాపకుల్లో వీరు ఒకరు.

నేను గుంటూరు నందు ఉన్న ప్రభుత్వ మహిళా కళాశాలలో ఆంగ్ల సాహిత్య విద్యార్థిని. వారేమో సూక్ష్మ జీవశాస్త్రంలో అధ్యాపకులు. టూరిజం నా సబ్జెక్టుల్లో ఒకటి. ఎప్పుడూ నేను టూరిజం ల్యాబ్లో ఉండేదాన్ని. వారు సూక్ష్మజీవశాస్త్రం ప్రయోగశాలలో ఉండేవారు. మా

కళాశాలలో ఈ రెండు ల్యాబ్లు ఒకటి తూర్పుకి ఒకటి పడమరకు విసిరేసినట్లు ఉంటాయి. అందులోనూ ఏ ఆర్ట్స్ విద్యార్థి కనీసం తొంగైనా చూడని ప్రదేశం అది. మరి మా ఇద్దరికీ పొత్తు ఎలా కుదిరింది? ఆ డిపార్టు మెంటు వాళ్ళు పుట్టగొడుగుల పెంపకంలో శిక్షణని సర్టిఫికెట్ కోర్సుగా ఏర్పాటుచేయడం వలన. పుట్ట గొడుగులు అంటే నాకు చాలా ఇష్టం. అందువల్ల పుట్టగొడుగుల పెంపకం గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి కలిగింది. అయితే ఆ డిపార్టుమెంటుకి వెళ్లి పేరు నమోదు చేయించుకోవాలంటే సంశయంతో కూడిన భయం. ఆ తరుణంలో నన్ను ఎక్కువగా ప్రోత్సహించింది నా స్నేహితులు కృపా, హర్షిత. నేను వారిని ఈ సందర్భంగా స్మరించుకోకుండా ఉండలేను. ఎందుకంటే సుచరిత గారి పరిచయానికి వీళ్లిద్దరూ కారకులు. మైక్రోబయాలజీ హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్ డా. నందిపల్లి ప్రవీణా కుమారి గారి నైతే మర్చిపోయే ప్రసక్తే లేదు. వారే కనుక ఈ కోర్స్ పెట్టక పోయుంటే ఓ అద్భుతంతో పరిచయాన్ని కోల్పోయేదాన్ని. అలా నేను ఆ కోర్సులో జాయిన్ అయ్యాను. అప్పటిదాకా నాకు ఆ డిపార్టుమెంట్లో ప్రవీణ మేడం, బిందు మేడం తప్ప సుచరితా నామధేయులై ఇంకొకరు ఉంటారని తెలియదు. ఆ వ్యక్తి భవిషత్తులో నాకు అత్యంత ఆదర్శవంతమైన వ్యక్తిగా మారతారని నాకప్పుడు తట్ట లేదు. నేను వారిలాగా సారూప్యంగా మసులుకుంటానని ఆనాడు నేను ఎరుగను. నా మెదడులో వ్యాస రచన అనే భావాన్ని వారు మొలకెత్తిస్తారని నేను అనుకోలేదు.

అస్సలు పరిచయం లేని ఏ ఇద్దరి మధ్య అయినా పరిచయం పెరగడానికి ఇద్దరికీ నచ్చిన ఒక అంశం కామన్గా ఉండాలి. ఖచ్చితంగా ఉంటుంది కూడా. అలా మా ఇద్దరికీ అభిరుచి ఉన్న అంశం ఆంగ్ల సాహిత్యం. ముఖ్యంగా అయిన్ ర్యాండ్ రాసిన ఫౌంటెన్ హెడ్ అంటే వారికి అమితమైన పిచ్చి. ఎంత పిచ్చంటే నేను అయిన్ ర్యాండ్ రాసిన ఫౌంటెన్ హెడ్ మీద థీసిస్ చేస్తున్న సమయంలో ఆ సబ్జెక్టుతో వారికి ఎటువంటి సంబంధం లేకపోయినా ఆ థీసిస్ని వారే ముందుండి స్వయంగా అన్నీతానై నడిపించేంత. వారే తప్పుల్ని స్వయంగా దిద్దారు. నా చేత థీసిస్ అనే శిల్పాన్ని చెక్కించే ప్రక్రియలో ఎన్నో సుత్తి దెబ్బలూ, మరెన్నో రాతి దెబ్బలూ తిన్న ఉలి డా. కొడాలి సుచరిత గారు. నా చిట్టి హెడ్డుకి అయిన్ ర్యాండ్ ఫౌంటెన్ హెడ్ సుతరామూ అర్థమయ్యేది కాదు. కాలేజీలో వారికి తలకు మించిన భారం పని ఒత్తిడి ఉం డేవి. అయినా సరే వారు నాకోసం సమయాన్ని వెచ్చించారు. ఒకటికి పదిసార్లు ఎంతో సహనంతో ఓర్పుతో ఆ నవల అంతటినీ చెప్పి నాకు ఆ పుస్తకాన్ని అర్థం అయ్యేలా చేశారు.

అంతటి సహనవంతురాల్ని నేను మరెక్కడా చూడనే లేదు. ఇది వారి వక్తిత్వంలోని ఒకానొక విశేషాంశం. వారికి ఉన్న ఈ సహనమే వందలమందిలోనైనా వారిని ప్రత్యేకంగా చూపెడుతుంది. వారిని చుసిన ప్రతిసారి అపారమైన జ్ఞాన సంపదని దాచుకున్న ఈ పుస్తకాల పుటల్ని మించి ఎదిగిన వారి విజ్ఞాన విశ్వరూపం నా కళ్ళకు ఆకాశమంత ఎత్తుగా కనిపిస్తుంది. ప్రపంచంలోని పుస్తకాలన్నిటినీ గుట్టగా పేర్చి వాటి ఎత్తుని కొలిస్తే ఎంత ఉంటుందో అంత కంటే ఎన్నోరెట్లు ఎదిగిన వారి జ్ఞాన దీపం ఎంతో ప్రకాశవంతమై నా మనసులో రూపుకట్టు కుంది. బొత్తిగా కోపం రాకుండా ఎప్పుడూ నిర్మలంగా ఉండే వారి వ్యవహారశైలి సహజంగానే సర్వులకూ ప్రేమాస్పదమైంది.

ఏకాక్షర ప్రధాత గురుదితనభధీయతే అని అన్నారు పెద్దలు. తెలియనిది ఒక్క అక్షరం నేర్పినా గురువే. అలాంటిది నాతో వారు థీసిస్ అనే యజ్ఞమే చేయించారు. అలా నా థీసిస్ వారి ఆధ్వర్యంలో చేసిన క్రమంలో నాకు అయిన్ ర్యాండ్ రాసిన ఫౌంటెన్ హెడ్ మీద వ్యాసం రాయాలని కోరిక కలిగింది. ఆ కోరిక కలగడానికి పూర్తి కారణం మా కొడాలి వారు. వారు అయిన్ ర్యాండ్ గురించి చెప్తుంటే ఆ విషయాలు ఒట్టి మాటలుగా, వాక్యాలుగా మిగిలేవి కావు. నాలో ఉన్న ఊహాశక్తిని తట్టి లేపేవి.

వారు చెప్పే ఆయా పాత్రలు నా మెదడులో ప్రాణం పోసుకుని ఊహాలోకంలో సజీవరూపాన్ని సంతరించుకునేవి. అయితే భాషపై పట్టు లేదు. ఇంతకు ముందు ఏ చిన్న విషయం మీదైనా రాసిన అనుభవం లేదు. అందువలన భావాలూ సరిగ్గా పలికించలేనేమో అన్న భయం. నేను ఇలాంటి భయానికి లోనైనా ప్రతి సందర్భంలోనూ వారి మాటలు నాలో ఉన్న వ్యాస రచయిత్రిని మేల్కొల్పి గట్టి ప్రేరణనిచ్చాయి. వారి ద్వారా విని ఉండిన సమాచారం ఆధారంగా నా మొదటి వ్యాసం రాయాలని నేను సంకల్పించుకోవడం జరిగింది. అలా వ్యాస రచనలోకి అడుగిడడానికి మొదటి ప్రయత్నము వారి ఆధ్వర్యంలోనే జరిగింది. నేను ప్రయత్నపూర్వకంగా వ్యాస రచనకు పూనుకోవడానికి వారు మొదటి ప్రేరకులు. అలా నాకు వ్యాసంపై అవగాహన పెరగడానికి, నేను కూడా వ్యాస రచన చేయగలనని నమ్మకం కలగడానికి వారు కారకులు.

సంభాషణని ఒక కళగా ఆవిష్కరించడం నేను వారి దగ్గరే నేర్చుకున్నాను. నాకిప్పుడు 20 ఏళ్ళు. మరో అరవై ఏళ్ళ తరువాతైనా నా ముందు అయిన్ ర్యాండ్ ప్రస్తావన వస్తే నా మెదడులో మొదటిగా మెదిలేది మా కొడాలి సుచరిత గారే. నేను అయాన్ ర్యాండ్ని ప్రత్యక్షంగా చూడనే లేదు. మా సుచరిత గారే నాకు తెల్సిన అయిన్. నేను రోజూ చూసే రోర్క్. నేనెంతో ఇష్టంగా పిలుచుకునే జూనియర్ అయిన్ ర్యాండ్. నాకు వారిలో నచ్చిన ఇంకో విషయం ఏంటంటే చెప్పాలనుకున్న విషయాన్ని సాగదీయకపోవడం. నేను ఎవర్నైనా ఏదన్నా విషయం గురించి అడిగితే ముందు సాగదీసి తరువాత కొంత డొంకతిరుగుడు వ్యవహారంతో ముగిస్తారు. అలాంటి సందర్భాలలో అసలు ఇంతకీ మనమేమి అడిగాము అని అనుకునేలా చేసి అడిగిన విషయాన్ని సైతం మరిపింపజేయగల నేర్పులు అనేకులు. కానీ మా మేడం దగ్గర ఆ వ్యవహారం చెల్లదు. వారి ఎదుట ఓ ప్రశ్న ఉంచితే ఈ డొంకతిరుగుడు వ్యవహారం వారి సమాధానంలో మనకి వినిపించదు. చక్కని భాషా ప్రయోగంతో, పటిష్టమైన వాక్య నిర్మాణంతో, చిక్కని సమాధానం ఇస్తారు. దానికి చిన్న ఉదాహరణ చెబుతాను. నాకు టీచర్లతో మాట్లాడి వారి వృత్తి పట్ల వ్యక్తిగత అనుభవాలు తెలుసుకోవడం అంటే అమితమైన వ్యామోహం. అలా నాకు ఎదురుపడి చనువు ఏర్పడిన ప్రతి టీచర్ని నేను అడిగే ఏకైక ప్రశ్న "అర్ యూ ఏ మొమ్స్ పెట్. ఆర్ డాడ్స్ డార్లింగ్" అని. ఈ ప్రశ్నకి వన్ వర్డ్ ఆన్సర్ ఇస్తే సరిపోతుంది. కానీ, ఈ ప్రశ్నకి సమాధానం చెప్పిన టీచర్లు అందరూ ఎంత సాగదీశారంటే వారి జవాబులన్నీ నోట్ చేసుకుని ఓ పుస్తకంగా ప్రచురిస్తే వెయ్యి పేజీల సంపుటి అవుతుంది. ఇలాంటి వ్యవహారం మా జూనియర్ అయిన్ ర్యాండ్ దగ్గర సాగదు. కావున ఏకాక్షరంలో బోత్ అని సమాధానం ఇచ్చారు. ఇంతకు ముందు ఉన్న అనుభవం ప్రకారం ఇంకేమైనా చెబుతారేమోనని చూస్తున్న నాకు ఆర్చర్యాన్ని మిగులుస్తూ కేవలం ఒకే అక్షరంతో ముగించారు. ఇంకేమైనా అడగాలా అన్నట్లు చూసారు. ఎందుకూ? అని నేను అడగలేదు. వారూ చెప్పలేదు. ఎందుకంటే నాకు కావాల్సిన సమాధానం అప్పటికే నాకు దొరికింది కదా! మా అమ్మ ఎప్పుడు చెప్తుంటారు. ప్రశ్నకు తగిన పరిమితిగల సమాధానం ఇవ్వాలని. నాకు సుచరిత గారిని చూసిన ప్రతిసారి ఈ వాక్యానికి నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తారు. విషయం ఎంత చిన్నదైనాసరే ఎప్పటికీ గుర్తుండిపోయేలా చెప్పడంలో వారు సిద్ధహస్తులు.

యదార్థవాది లోకవిరోధి అని నా గట్టి నమ్మకం. మా కొడాలి వారు చాలా యదార్థంగా మాట్లాడతారు. అయితే వారు లోకవిరోధి కాదు. పెద్ద బ్లెండర్ మిస్టేక్ చేసినా సరే చెప్పే విధానం ఎంతో నెమ్మదిగా, సరళంగా ఆలోచింపజేసేదిగా ఉంటుంది. వారి మాటలలోని ప్రశాంతత చూసి, ఉద్దేశంలో ఆర్ద్రత విన్నాక మరొక్కమారు ఎప్పటికీ ఆ తప్పుని మళ్ళీ చేయడానికి మనసొప్పదు. అయితే ఇంత ప్రశాంతత నిర్మలత్వం ఉన్న మనిషి మెతకేమో చాల సులభంగా ఒప్పించగలం అని

అనుకోవద్దు. అది వారి విషయంలో చాలా పొరపాటు. అలా అనుకుంటే పప్పులో జారి మునిగినట్టే. ఎందుకంటే వారు జూనియర్ అయిన్ ర్యాండ్. మనం ఏదైనా విషయాన్ని అడిగినప్పుడు వీలైతే వెంటనే ఒప్పుకొని చేసేస్తారు. 'వద్దులెమ్మా' అని అంటే మాత్రం ఖేల్ ఖతం దుకాణ్ బంద్. వద్దు అంటే ఇంక వద్దు అంతే. మనం మొదటిసారి అడిగినప్పుడు ఎంత ప్రశాంతగా వద్దులేమ్మా అని అంటారో నూట పదోసారి అడిగినప్పుడూ అదే జవాబు. అదే ట్యూన్. ఏమీ మార్పుండదు. నో మేటర్ హూ ది హెల్ యూ ఆర్ అండ్ వాట్ ది మేటర్ ఇట్ ఐస్. ఈఫ్ మేడం సేడ్ ఇట్స్ నాట్ గోయింగ్ టు బి డన్, ఇట్స్ నాట్ గోయింగ్ టు బి డన్. దట్స్ ఆల్. ఐ హ్యావ్ నెవర్ కం అక్రోస్ సచ్ ఏ పర్సన్ విత్ గ్రేట్ స్టబోర్న్ నేచర్. ఈ విషయంపై వారితో నాకు బోల్డంత అనుభవం ఉంది. అందుకే వారికి నేను ఇంకో నిక్ నేమ్ పెట్టుకున్న. యాంటిక్ పీస్ అని. ఒక్కటే పీస్ ఎక్కడా దొరకరు. ఎంతో నిజాయితీతో కూడిన సమాధానాన్ని వ్యక్తపరిచే గుణం వారి సొంతం. వీరిలో ఉన్న ఈ ఒక్క గుణాన్ని గురించి నా అనుభవం కూడా కలుపుకుని ప్రస్తావించాల్సొస్తే అదింకో వ్యాసం అవుతుంది.

వారి గురించి వారి విద్యార్థులతో ముచ్చటిస్తే చాలు మనల్ని కదిలించే విషయాలతో సుచరిత గారితో వారి కున్న అనుభవాల్ని మన మీద మాటల రూపంలో గుమ్మరిస్తారు. ఇలా వారి గురించి ప్రస్తావించినప్పుడు నాకు ఎదురైన ఒక అనుభవం గురించి చెప్తాను. నాకు బాగా గుర్తు. ఒక అమ్మాయి ''మేడం చాలా బాగుంటారక్క" అని అన్న మాట. అవును. ఆ అమ్మాయి చెప్పింది నిజమే. మేడం చాలా అందంగా ఉంటారు. వారి ఆలోచనా తీరులోనూ, దానిని వ్యక్తపరిచే విధానం లోనూ వారి అందం కనబడుతుంది. వారికి నచ్చిన అంశం గురించి చర్చిస్తున్నప్పుడు వారి కళ్ళల్లో కనబడే వెలుగు వారికి అందాన్నిస్తుంది. వారి నడతలో ఉన్న సౌమ్యత, ఒద్దిక వారికి అందాన్ని ఆపాదిస్తుంది. వారి ఆహార్యానికి నడకలో ఉన్న ధీమా ఠీవిగా మారి అందాన్ని మరికాస్త ఇనుమడింపజేస్తుంది. విద్యార్థుల మన్ననలు అనే అవార్డుని స్వీకరించినప్పుడు వారి అందం రెట్టిం పయ్యింది. ఒక వ్యక్తిత్వానికి సౌమ్యత, సంస్కారం, నెమ్మది, నిరాడంబరం, శ్రమ, బుద్ధికుశలత వంటి మణిభూషణలు కలిస్తే వచ్చే రూపం మా కొడాలి సుచరిత గారు. వారు చూసి 'మరిచిపోయేంత' అందంతో కనిపించరు. వారిని అనుసరించి కనీసం రెండు శాతం అయినా మనమూ వారిలా 'మారగలిగితే' బాగుండు అనుకునేంత అందంగా కనిపిస్తారు. వారు అందరి ఆడవారిలా తాత్కాలికంగా ఉండే అందంతో కనిపించరు. వారి వ్యక్తిత్వంతో విద్యార్థుల మనసు పొరల్లో చిరస్థాయిగా నిలిచి ఉండేటంత గొప్ప సౌశీల్యం అనే అందంతో అగుపడతారు. ఎంతైనా అందం కంటిని మాత్రమే ఆకట్టు కుంటుంది. కానీ సౌశీల్యం, హృదయాన్నే దోచు కుంటుంది. అందానికి అందం అద్దుతుంది.

మా కాలేజిలో లంచ్ బ్రేక్ ఒంటిగంట నుండి రెండింటి వరకు ఉంటుంది. 1.45 ఎప్పుడవుతుందా అని ఎదురు చూసేదాన్ని. ఎందుకంటే మరి ఆ సమయంలోనే కదా మా సుచరిత గారు నాకు కూస్తంత ఖాళీగా దొరికేది. 1. 45 నుండి 2. 00 దాకా ఆ పావుగంటా వారితో మాటామంతీ చేయడం రోజూ నాకో పెద్ద పండగలా ఉంటుంది. మొదట్లో వారానికోసారి మాట్లాడేదాన్ని. అది కాస్త రోజులకు మారింది. ఇంకిప్పుడు రోజుకి రెండు సార్లు కలవడం అలవాటైంది. వారు అస్సలు నా సబ్జెక్టు కాకపోయినా తరువాత నాకు ఆంగ్ల సాహిత్యం పట్ల ఎంత ఇష్టం కలిగిందో! ఆంగ్ల సాహిత్యం క్లస్టర్లో ఎవ్వరూ చేరక పోయినా దాన్నే ఎంచుకునేంత. చదవగలను అని నాపై నాకు నమ్మకం కలిగేంత. ఎంతైనా నచ్చిన టీచర్ చెప్తే సబ్జెక్టు ప్రాణమౌతుంది. టీచర్ నచ్చకపోతే సబ్జెక్టు ప్రాణసంకటం అవుతుంది. మనకు నచ్చిన వ్యక్తి మనం ఉన్న పరిసర ప్రాంతాల్లో ఉంటే ఆ పరిసర ప్రాంతాల వాతావరం మన ఇంటి వాతావరణాన్ని తలపిస్తుంది.

మైక్రోబయాలజీ డిపార్టుమెంటుకి వెళ్లిన ప్రతిసారి, ముఖ్యంగా సుచరిత గారు కళాశాలలో ఉన్న సమయంలో నేను ఆ అనుభూతిని ఆస్వాదించాను. అది నాకు మాత్రమే అనుభవం కాగల అద్భుతం. ఈ కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో మా కళాశాల మూతపడింది. ఆ రోజుల్లో నేను వారితో గడిపే ఆ పావు గంటని, వారి సున్నిత మాటల గారడీని, అయిన్ ర్యాండ్ గురించి సంగతులు చెప్తున్నప్పుడు విశేషంగా వారి కళ్ళల్లో మెరిసిన మెరుపుని మిస్ అవుతున్నాను. హఠాత్తుగా నా ఎదుట దేవుడు ప్రత్యక్షమై ఏం వరం కావాలో కోరుకోమని అడిగితే వారితో గడపాల్సిన ఆ కొద్దిపాటి సమయాన్నంతా తిరిగిచ్చేయమని కోరుకుంటాను. ఏదోఒక అద్భుతం జరిగి కాలం గిర్రున వెనక్కి తిరిగి కరోనా లేదు గిరోనా లేదు అంతా తూచ్ అంటే ఎంతబాగుంటుందో కదా! అయినా అనుకున్నామని జరగవు కొన్ని. అనుకోలేదని ఆగవు మరికొన్ని.

మన స్నేహితులు మనకంటే పెద్దవారైతే వారిలో ఉన్న ఉన్నత స్వభావాలు మెచ్యూరిటీ మనకీ కొంత అలవడ తాయి. నేను సుచరిత గారికి ఈ విషయం చెప్పక పోయినప్పటికీ నేను వారిని స్నేహితురాలిగా భావిస్తాను. అయితే ఈ ఫ్రెండుతో కలిసి క్లాసులు ఎగ్గొట్టి సినిమాలకూ షికార్లకూ తిరగలేదు. కానీ ఓ మంచి సినిమా గురించి అభిప్రాయాలు పంచుకున్నాం. నేను ఈ ఫ్రెండుతో కలిసి గంటలు గంటలు వాట్స్ యాప్లో చాట్ చెయ్యలేదు. కానీ డిపార్టుమెంటులో కొద్ది సమయం అనేక విషయాలపై ముచ్చటించుకున్నాం. నేను ఈ ఫ్రెండుతో కలిసి ఐస్ బర్గ్కి తిరగలేదు. కానీ మనసుని చల్లబరిచే కబుర్లు బోల్డన్ని మా మాటల్లో. నేను ఈ ఫ్రెండుతో లాంగ్ డ్రైవులకు వెళ్ళలేదు. కానీ మా కళాశాలలో వారితో ఎంతో అమూల్యమైన సమయాన్ని గడిపాను. నేను ఈ ఫ్రెండుకి థాంక్స్ చెప్పనే లేదు. కానీ ఎంతో సౌమ్యంగా, సహనంతో నా తప్పులను సరిదిద్దే ఫ్రెండుని ఏర్పాటు చేసినందుకు ఆ భగవంతునికి కృతజ్ఞతలు చెప్పుకున్నాను. ఈ ఫ్రెండుతో ఆటలు ఆడలేదు. ఈ ఫ్రెండుతో చాక్లెట్, స్వీటు పంచుకోలేదు. ఈ ఫ్రెండుతో కలిసి పానీపూరి తినలేదు. ఈ ఫ్రెండుతో కలిసి కాలేజీ క్యాంటీన్లో కూర్చొని పిచ్చాపాటి మాట్లాడుకోలేదు. అయినా మేం స్నేహితులం. ఈ ఫ్రెండుకి ఫౌంటెన్ హెడ్ గురించి చెప్పడం అంటే ఇష్టం. ఈ ఫ్రెండుకి అయిన్ ర్యాండ్ తత్వశాస్త్రం ప్రస్తావించడం అంటే ప్రాణం. ఈ ఫ్రెండుకి నాబోటి వారు మాట్లాడితే వినడం ఆనందం. ఈ ఫ్రెండుకి పాఠం చెప్పడం అంటే ప్రేమ. ఈ ఫ్రెండుకి సాహిత్యం గురించి మాట్లాడటం అంటే ఆపేక్ష. ఈ ఫ్రెండుకి విషయాన్నీ సాగదీసి చెప్పడం అంటే చిరాకు. ఈ ఫ్రెండుని పొగిడినప్పుడు చిన్న నవ్వు విసిరి మిన్నకుండటం తప్ప వారిలో గర్వాంధిని నేను చూడలేదు. ఈ ఫ్రెండుతో స్నేహం వలన మంచి సాహిత్యాన్ని చదవడం అలవర్చుకున్నాను. ఈ ఫ్రెండు వళ్ళ ఎందరో నిష్ణాతులు ఒట్టి కల్ల అని కొట్టిపారేసిన ఫిలాసఫీలోని నిజజీవిత వాస్తవికతని ఎరుకపరచు కున్నాను. ఈ ఫ్రెండుకి నేను ఫ్రెండ్షిప్ బ్యాండ్ కట్టలేదు. ఈ ఫ్రెండుతో కలసి సింగల్ టీ తాగలేదు. ఈ ఫ్రెండుతో కలిసి ఒకే బండి మీద త్రిబుల్స్ వెళ్ళలేదు. ఈ ఫ్రెండుతో కలిసి చిప్స్ ప్యాకెట్ కొనుక్కుని క్లాసులో దొంగతనంగా తినలేదు. ఈ ఫ్రెండుకీ నాకు ఎంతో వ్యత్యాసం. భూమికి ఆకాశానికి ఉన్నంత! అయినా మేం స్నేహితులం.

ఎంతో సహృదయ సంస్కారి. చాలా సామాన్య వేషధారి. నిరంతరం శ్రమించే విద్యార్థి. అలుపెరగని ఉపాధ్యాయిని. సరస్వతీ నేత్రా కృపా విహారి. మా కళాశాల నిర్వహణలో గట్టి పాత్ర వహించే సూత్రధారి. ఎంతో బహుముఖ ప్రజ్ఞాధురీణి. ఇదంతా మా సుచరిత గారంటే అతిశయోక్తి అనిపించవచ్చు. కానీ కొంచం లోతుగా చూస్తే అక్షరాలా స్వభావోక్తి. విద్యా సంపదను చాలా ప్రీతిపాత్రంగా స్వీకరించిన మా సుచరిత గారికంటే సంపన్నులు ఎవరూ లేరు. వారి మాటలు వింటూ ఎంతో నేర్చుకున్నాను. వారు తీర్చిదిద్దిన ప్రతి విద్యార్థి జీవితంలో వారే హీరో. ముందుండి నడిపించిన లీడర్. ఎందరికో

రోలెమోడెల్. ఇలాంటి అధ్యాపకులే మన జాతి సంపద. ఉపాధ్యాయలోకంలోని ఇలాంటి ఒక ఉరిమే ఉత్తేజం గురించి మీతో పంచుకోడం నాకు చాలా ఆనందంగా ఉంది.

వారిలో ఓ మేజిక్ ఉంది. ప్రపంచలోని ప్రతి విషయాన్ని మరో కోణంలో చూస్తారు. ఇంకోలా చెప్పాలంటే సరిగ్గా ఆలోచిస్తారు. వేసే ప్రతి అడుగుని కొత్త బాటలోకి నడిపిస్తారు. అందరు టీచర్స్ పాఠాన్ని చెప్తారు. వీరొక్కరే పాఠం వినాలనుకునేంతలా చెప్తారు. అలా వారితో సాన్నిహిత్యం పెరిగాక ఆడంబరాలెరుగని వారి నిరాడంబర జీవనశైలికి నేను అభిమానిని అయ్యాను. ఉపాధ్యాయులకు మృత్యుభయం లేదంటాడు ఓ తలపండిన తత్వవేత్త. అది ఎట్లా అంటే “వారు ఎల్లప్పుడూ వారి విద్యార్థుల గుండెల్లో ఉంటారు” కాబట్టి. కావున మీరు ఎల్లప్పుడూ చిరంజీవులే డా. కొడాలి సుచరిత గారు.

గురుభ్యోనమః

BHAVAVEENA
Vol. 18, Issue. 6, June 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# దేశి కవితకు పట్టం కట్టిన ప్రథమ కవి పాల్కురికి సోమన

- ఆర్. రమాదేవి, పరిశోధక విద్యార్థిని, ఓరియంటల్ విభాగం, తెలుగు, ఉస్మానియావిశ్వవిద్యాలయం, హైదరాబాద్.

సోమన తల్లి 'శ్రీయాదేవి', తండ్రి 'విష్ణురామి దేవుడు'. కవికాలం- క్రీ. శ. 1160-1240, సోమన ఓరుగల్లుకు 12 క్రోసుల దూరంలో ఉన్న పాలకుర్తి (పాల్కురికి)లో జన్మించాడు. బాల్యంలోనే సోమన వీరశైవమతం పట్ల అభిమానంతో ఆ మత దీక్షను తీసుకొని వీరమాహేశ్వరాచార్య వ్రతుడయ్యాడు.

పాల్కురికి సోమనాథుని కాలం లాగానే నివాస స్థలం మీద కూడా భిన్నాభిప్రాయా లున్నాయి. అయితే బ్రౌనుదొర కాలం నుండి పరిశోధకులందరూ సోమనాథుని జన్మస్థానాన్ని తెలంగాణాలోని నల్గొండజిల్లాలో జనగామ తాలూకా లోని వరంగల్లుకు 12 క్రోసుల దూరంలోని పాలకురికి అని అంగీకరించారు. కాని ఒక్క చిలుకూరి నారాయణరావు గారు మాత్రం కర్ణాటక ప్రాంతంలోని తుముకూరి తాలూకాలోని హాల్కురికి అని ప్రతిపాదించాడు. సోమనను తెలుగు, కన్నడాల్లో విశేష ప్రసిద్ధిగడించిన ఎందరో కవులు అతణ్ణి ప్రస్తుతించినా ఒక్కరైనా అతన్ని హాల్కురికి సోమనాథడని పేర్కొనలేదు. పైగా సోమన కన్నడ ప్రాంతీయుడైతే బసవ పురాణాన్ని మొదట మండలంలో పాల్కురికి గ్రామమే లేదు. కాబట్టి నల్గొండ జిల్లాలో జనగామ తాలూకాలోని పాలకురికి గ్రామమే సోమన జన్మస్థలం అని నిర్ధారింపవచ్చు.

నేటికీ ఇది ఒక పుణ్యక్షేత్రం. స్వయంభువగు సోమేశ్వర స్వామి ఆలయం విశేష మహిమాన్వితమై భక్తులకు యాత్రాస్థలంగా వెలసి ఉంది. నల్గొంగ జిల్లాలోని జనగామ తాలూకాలోని పాలకురికి గ్రామమే సోమన జన్మస్థలం అని నిర్ధారింపవచ్చు. నేటికీ ఇది ఒక పుణ్యక్షేత్రం. స్వయంభువగు సోమేశ్వర స్వామి ఆలయం విశేష మహిమాన్వితమై భక్తులకు యాత్రాస్థలంగా వెలసి ఉంది. అక్కడ దేవాలయ ధ్వజస్తంభం దిగువ ప్రాచీన లిపిలో "పాలకురికి సోమేశ్వరస్వామి" అని చెక్కబడి ఉన్నందువల్ల పై వాదాన్నే సమర్థింపవచ్చును. కాశీనాథుని నాగేశ్వరరావు గారు వృషాధిపశతకం పీఠికలో సోమన ఆరాధ్య బ్రాహ్మణుడని తెలిపారు. కొందరు సోమన జంగముడని కూడా వాదించారు. కానీ సోమన జన్మచేత బ్రాహ్మణుడే ఎందుకంటే సోమనాథుడు తన మేన మఱిది గురించి ఒకచోట 'ఆపస్తంభ సూత్ర ! హరిత సగోత్ర ! విద్యాపుణ్యగాత్ర !' అని సంబోధించాడు. సోమన బ్రాహ్మణుడు కాకుంటే తన మేనమఱిది హరిత సగోత్రుడు, ఆపస్తంభ సూత్రుడు కాడు అని శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు సోమన బ్రాహ్మణ కులంవాడని తేల్చారు.

గ్రామనామమే ఇంటి పేరుగా కలవాడు పాల్కురికి సోమనాథకవి'. ఆ పాల్కురికి : తెలంగాణంలోని ఓరుగల్లుకు పన్నెండు క్రోసుల దూరంలో జనగామ తాలూకాలో ఉన్న నేటి పాలకుర్తి' అనిన్నీ, అదే కవి జన్మస్థాన మనిన్నీ విమర్శకులు గాఢంగా విశ్వసిస్తున్నారు. కాని, దానిని కాదనేవారూ కొందరున్నారు. కీ.శే.చిలుకూరి నారాయణరావు పంతులుగారు మైసూరు రాష్ట్రంలోని తుముకూరు జిల్లాలో ఉన్న 'హాలుకురికె' అనే గ్రామం 'పాలకురికి' అయి ఉండవచ్చుననీ, కన్నడంలోని 'హ' వర్గం తెనుగున 'ప'గా మారటం సహజమని, పేర్కొన్నారు. కర్ణాట కవిచరిత్ర కర్త అయిన శ్రీ నరసింహాచార్యులుగారూ కన్నడ సారస్వతం (ఖుఖుతీవంవ ూఙవతీఫ్బతీవ) అనే గ్రంథాన్ని రచించిన రైసుదొర గారూ పాలకురిని గోదావరి జిల్లాలో ఉన్నదని ఊహించారు. ఈ రెండు వాదాలను ఇప్పుడు విమర్శకులు అంగీకరించటం లేదు. పాలకురికి తెలంగాణంలో ఉన్నదే అని నిశ్చయించటానికి తోంటద సిద్ధలింగకవి సోమేశ్వర పురాణం, అన్యవాదకోలాహల

శతకం, ప్రతాప చరిత్ర, పిడుపర్తి సోమనాథుని బసవ పురాణం చెప్పే అంశాలు తోడుపడుతున్నాయి. ఇంకా, పాలకుర్తిలో వెలసిఉన్న స్వయంభువయిన సోమేశ్వరుని ఆలయం సోమనాథుని ఆశ్రమస్థలి (సమాధి ?) మీద శిష్యుల చేత స్థాపించబడిన 'సోమనాథుని లింగము' సాక్ష్యం పలుకుతున్నాయి. పాలకుర్తి ప్రసిద్ధ శైవక్షేత్రం కావటం, బసవపురావణావతారికలో పేర్కొనబడిన కట్టకూరి పోతిదేవర నివాసస్థలమైన కట్టకూరు పాలకురికి సమీపంలోనే ఉండటం ఈ వాదానికి బలం చేకూరుస్తున్నవి. నేటి పాలకుర్తికి సమీపంలో ఉన్న పాలకుర్తి, ఉఋకుర్తి అనే గ్రామాలు కాకతీయుల కాలంలో పాలకురికి, ఉఋకురికి అని వ్యవహరించబడుతున్నట్లు శాసనా ధారాలు ఉండటంచేత ఎలకుర్తి కూడా ఆ కాలంలో పాలకుర్తి అని పిలవబడుతుండేదని భావించటానికి వీలౌతున్నది. ఇవన్నీ అలా ఉంచితే, దేశిపురాణ, మార్గపురాణ ధ్వజాలను ఎదురెదురుగా పోటీగా నిలువబెట్టిన సోమనాథ మారన పోతన మహకవులు ఓరుగల్లు ప్రాంతం వారని చెప్పటంలో సంశయం ఏమాత్రం ఉండ నవసరం లేదు.

పాల్కురికి రచనలు జనసామాన్యానికి అర్థమయ్యేటట్లు ప్రజలభాషను వాహికగా ఎన్నుకున్నాడు సోమన. అంతవరకు వచ్చిన మార్గకవిత స్థానంలో దేశికవితకు పట్టం కట్టాడు. 'జానుతెనుగుగా' దానికి కీర్తిని తెచ్చి పెట్టాడు. సోమన రచన సరళం, గంభీరం, సౌందర్య మాధురీభరితం. తెలుగు పలుకుబళ్ళు సంస్కృతపదాలతో సమానంగా పోటీపడుతూ అలరారుతూ ఉంటాయి.

పాల్కురికి సోమన పాత్ర సృష్టి అద్భుతమైంది. అపూర్వమైంది. సామాజిక జీవితానికి సన్నిహితమైంది. అతని పాత్రలు మామూలు మనుషుల్లాగా సహజంగా, సజీవంగా కనిపిస్తాయి. ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో, వైవిధ్యభరితంగా ఉంటాయి. పాత్రల ముగ్ధత్వాన్ని ప్రదర్శించడంలో సోమనను మించిన కవి లేడు. వ్యావహారిక పదజాలంతో పాత్రల సహజత్వాన్ని మనోజ్ఞంగా చిత్రిస్తాడు. పాల్కురికి చిత్రించిన రుద్రపశుపతి, బెజ్జమహాదేవి, ముగ్ధసంగయ్య, ఉడుమూరు కన్నప్ప, చిరుతొండ నంబి, గొడగూచి మొదలైన భక్తుల పాత్రలు ముగ్ధత్వానికి, నిర్మలమైన మనస్తత్వానికి, తాదాత్మ్య భక్తిప్రపత్తులకు తార్కాణంగా నిలుస్తాయి. పాల్కురికి సంగీతంలో ప్రసిద్ధంగా కనిపిస్తున్న దేశిని భాషలోకి, సాహిత్యంలోకి తీసుకువచ్చాడు. ఛందస్సు విషయంలోనూ దేశిని నిర్మించాడు. దేశి ఛందములను జాతులకు సాధారణ లక్షణమైన యతి గణ లక్షణాన్ని ప్రాసయతిని చెప్పి ఛందస్సుకు మరింత దేశీయత తీసుకొచ్చే ప్రయత్నం చేశాడు. ప్రాసయైనను యతిపై వడియైన దేసిగా నిలిపి యాది ప్రాసనియతి తప్పకుండ ద్విపదంబు రచియింతు.

అని సోమన స్పష్టంగా అన్నాడు. ఛందస్సంబంధ దేశి లక్షణాన్ని, జాతిచ్ఛందాలను వాడటం యతి, ఆది ప్రాసలతో బాటు వీలైన చోట్ల ప్రాసయతులను కూర్చడం, ఉత్పలమాల, చంపకమాలాది వృత్తాలలో యతిప్రాసల ద్వారా దేశీయతను ఆపాదించుకొన్నట్లే కొన్ని దేశి ఛందాలు మార్గ కవిత్వ పద్ధతిని పొందాయి. ఇటువంటి వాటి కంటే దేశి లక్షణ మెక్కువగా కలిగిన ద్విపదను సోమన నిర్మించుకొన్నాడు. ఛందస్సు విషయంలో సోమన లాక్షణిక దృష్టి ఇది. పురాణ ప్రసిద్ధమైనది కాక దేశీయమైన వస్తువుతో గూడినదియు, దేశీయములైన ద్విపద, తరువోజ, రగడ, అక్కర, సీసము మొదలైన దేశీయూలైన ఛందములందు రచింప బడినదియు దీర్ఘసమాస భూయిష్టము కాక దేశీయు పద ప్రచురమై సామెతలు, జాతీయాలు, వెల్లువగా కలిగి వాక్య రచనము, రచనా విధానము అన విషయములందు దేశీయతను వెలార్చునదియు, దేశీయ విజ్ఞానాన్ని దేశీయు జనజీవనాన్ని చిత్రించునదియు దేశికవిత్వమగును. పూర్వాంధ్ర సాహిత్యంలో నన్నెచోడుని తర్వాత దేశికవితకు గట్టి పునాదులు వేసినది పాల్కురికి సోమన. వస్తువు, ఛందస్సు, భాషయను మూడు విషయాల్లోను మార్గకవితను నిరసించి తన బసవపురాణం, పండితారాధ్య చరిత్రల్లో

దేశిమార్గానికత్యంత ప్రాధాన్యతనిచ్చాడు. నన్నె చోడునిలో మొలకెత్తిన దేశికవితాభిమానం పాల్కురికి సోమనలో మహావటవృక్షమై ఎందరికో ఆశ్రయ మిచ్చింది.

పాల్కురికి సోమనాథుడు పేర్కొన్న 'జానుతెనుగు' విషయంలో భిన్నాభిప్రాయాలున్నా, నన్నెచోడుడు అతని కంటే ముందు ఈ పదాన్ని ఉపయోగించినా బసవ పురాణం, పండితా రాధ్య చరిత్ర, వృషాధిప శతకం మూడుచోట్ల ఈ పదాన్ని ఉపయోగించాడు. అందువల్ల సోమనకు- భాషాభివ్యక్తి విషయంలో ఒక స్థిరమైన అభిప్రాయమున్నట్లు - మనం గుర్తించవచ్చు. సరసమై పరగిన జాను తెనుంగు. జానుతెనుగు విశేషము ప్రసన్నతకు, జాను తెనుంగున విన్నవించెదన్ అని మూడు సందర్భాలలోనూ మూడు రీతులుగా సమన్వయించేట్లు చెప్పడంతో సాహిత్య విమర్శకు లలో భిన్నాభిప్రాయాలు కనిపిస్తున్నాయి.

సంస్కృత పదభూయిష్ఠ రచన రసవిరుద్ధమని దాని కంటే జానుతెనుగు ఎక్కువ సరసమని బసవపురాణంలో చెప్పాడు. జానుతెనుగు ప్రసాదగుణంతో కూడి విశేషంగా ప్రసన్నతను కలిగిస్తుంది అన్నాడు. జాను తెనుగులో రాస్తానన్నప్పుడు సంస్కృత పదభూయిష్ఠ రచన కాదన్న స్ఫురణే కనిపిస్తుంది. నిజానికి దీన్ని భాషకు పర్యాయవాచిగా తీసుకోవడం వల్ల సమస్య వచ్చిందని పిస్తుంది. ఈ నిర్ణయంవల్లే జానుతెనుగు అచ్చతెనుగు అని భావించారు. దీనిని రచనా రీతిగా అర్థం చేసుకోవలసి ఉంటుంది. జానుతెనుగు భాషా రీతి కాదు అభివ్యక్తిరీతి. అందులో భాష ఒక ముడిసరుకుగా భావించవలసి ఉం టుంది. 'అల్పాక్షరముల ననల్పార్థ రచన' అన్నది కూడా అభివ్యక్తిని గురించి సోమన దృక్పథాన్ని చూపిస్తుంది.

రసం, వర్ణనలు, అలంకారాలు, అర్థభావాలు, కావ్య గుణాలు, కావ్య దోషాల విషయంలో సోమన కొంతవరకు పూర్వ సంప్రదాయాన్నే అనుసరించినా అక్కడక్కడ స్వతంత్ర మార్గం కనిపిస్తుంది. అనుభవసారంలో తొమ్మిది రసాలను చెప్పాడు. కానీ భక్తిని రసంగా చెప్పలేదు. కానీ చాలాచోట్ల భక్తిరసము ' అన్న పదప్రయోగం చేశాడు. భక్తిరసవాదం క్రీ.శ. 16వ శతాబ్దికి సంబంధించింది. అయితే అనుభవసారంలో (61) నవరసాలు భక్తి సమన్వితా లనే అభిప్రాయం చెప్పాడు. సోమనాథుడు భక్తి ఒక్కటే రసమని చెప్పలేదు. రసాలన్నిటిలో భక్తి కలసి ఉంటుందని చెప్పాడు. దీన్ని చర్చిస్తూ వే.న రెడ్డిగారు తమ సిద్ధాంత గ్రంథంలో భక్తి శృంగారము అద్భుత భక్తి, శాంత భక్తి, భయానకభక్తి, హాస్యభక్తి, రౌద్రభక్తి, బీభత్సభక్తి, వీరభక్తి, కారుణ్యభక్తిగా సోమన భావించాడన్నారు. శృంగార భక్తి/ భక్తి శృంగారం తప్ప మిగతావన్నీ అంతగా అన్వయించవు. ముగ్ధభక్తికి సంబంధించి లక్ష్యప్రాయమైన అంశాలు సోమన కవిత్వంలో దొరుకుతాయి. వర్ణనలలో సామాజిక జీవితాన్ని తెచ్చి వర్ణనలకు విస్తృతి కల్పించాడు. నన్నెచోడుడు చెప్పిన 36 అలంకారాలను తాను కూడా గ్రహించాడు.

ద్విగుణమగు అర్థ భావములు అన్న మాటలో 72 భావాలున్నాయి. స్థాయీభావాలు-9, వ్యభిచారిభావాలు-33, సాత్త్విక భావాలు-8, విభావాలు-5, అనుభావాలు - 17 మొత్తం 72 అన్న దృష్టితో 'రస' పర్యాయవాచిగా అర్థశబ్దాన్ని ఉపయోగించి 72 అర్థభావాలను (రస భావాలను) చెప్పాడు. పండితారాధ్య చరిత్రలో గుణములు, దోషములను చెప్పాడు. సమాసఘటన, వాక్యం, అక్షరాల కూర్పు, విశేషణాల సంయోజన ఛందస్సు వంటి అంశాలన్నిటిని దృష్టిలో పెట్టుకుని లాక్షణికులకంటే స్వతంత్రంగా చెప్పాడు. అభివ్యక్తి, కవిత్వతత్త్వం విషయంలో ఆయన అభిప్రాయాలపై అధ్యయనం జరగవలసి ఉంది.

జాను తెనుగనగా అందమైన తెనుగని, ఇంపైన తెనుగని వివిధ విమర్శకులు అభిప్రాయం. డా॥. సి.నారా యణ రెడ్డిగారు జాను తెనుగునకు "ఏది ఒకానొక దుర్బో ధక విషయాన్ని గూడ సామాన్య జనులకు సైతం

సుబోధకంగా, సుప్రసన్నంగా అందించునో అది జాను తెనుగు'' అని పేర్కొన్నాడు. జాను తెనుగు మొదట పాటించినది నన్నెచోడుడే. అయినా పాల్కురికి జాను తెనుగునకు పూర్తి న్యాయం చేకూర్చగలిగాడు. ఈ విషయంలో నన్నె చోడునికి పాల్కురికికి భేదం ఉంది. స్పష్టంగా అర్థమయ్యే దేశికవితనే జాను తెనుగని నన్నె చోడుడు పేర్కొన్నాడు. పాల్కురికి సోమన బసవ పురాణంలో

''ఉరుతర గద్య పద్యోక్తుల కంటే.. సరసమై పరగిన
జాను దెనుగు
చర్చింపగా సర్వ సామాన్యమగుట ........ ॥బ.పు. 1-4॥

పండితారాధ్య చరిత్రలో -

''ఆరూఢ గద్యపద్యాది ప్రబంధ
పూర్తి సంస్కృత భూయిష్ఠరచన
మానుగా సర్వసామాన్యంబుగామి
జానుతెనుగు'' - ॥పం-చ-18॥

అని జాను తెనుగును పేర్కొన్నాడు. పాల్కురికి భావంలో జాను తెనుగంటే సంస్కృత భూయిష్ఠరచన కానిది, దేశీయ నిబద్ధయైనదైన తెలుగు, ఇంకా తత్సమమైనా, తద్భవమైనా, దేశ్యమైనా, అన్యదేశ్యమైనా తుదకు సంస్కృత సమ భూయిష్ఠరచన అయినా దేశీయ ఛందో నిబద్ధయై ఉంటే జాను తెనుగని చెప్పవచ్చు.

BHAVAVEENA
Vol. 18, Issue. 6, June 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# సొలొమోను మహారాజు అందించిన అద్భుతమైన సామెతలు

- **సూరేపల్లి పద్మావతి,** సూపరింటెండెంట్, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

'సొలొమోను' మహారాజు ఇశ్రాయేలు రాజైన దావీదు మహారాజు కుమారుడు. ప్రపంచంలోనే మహా ప్రసిద్ధి చెందిన జ్ఞాని, సొలొమోను తన రాజ్యమందు స్థిరపచ బడగా అతని దేవుడైన యెహోవా అతనితో కూడ ఉండి అతనిని బహు ఘనుడైన రాజునుగా చేసెను. దేవుడు సొలొమోనునకు ప్రత్యక్షమై నేను నీకు ఏమి ఇయ్య గోరుదునో దాని అడుగుమని సెలవియ్యగా! సొలొమోను దేవునితో ఈలాగు మనివి చేసెను. నీవు నా తండ్రియైన దావీదు యెడల బహుగా కృపచూపి అతని స్థానమందు నన్ను రాజుగా నియమించి ఉన్నావు గనుక దేవా యెహోవా, నీవు నా తండ్రియైన దావీదునకు చేసిన వాగ్దానమును స్థిరపరచుము. నేను ఈ జనులమధ్యను ఉండి కార్యములను చక్కపెట్టునట్లు తగిన జ్ఞానమును తెలివిని నాకు దయచేయుమని నిస్వార్థముగా అడిగిన గొప్ప మహారాజు. అంతేకాకుండా యెరూషలేములో మొట్టమొదటిగా అతిపెద్ద దేవాలయాన్ని కట్టించిన గొప్ప మహారాజు. ఈయన బైబిల్లోని కీర్తనల గ్రంథంలోని కొన్ని కీర్తనలు, సామెతలు, ప్రసంగి, పరమగీత గ్రంథాలను రచించాడు. వీటన్నింటిలో సామెతలు ప్రసిద్ధమైనవి. సామెతల గ్రంథంలో మొత్తం 31 అధ్యాయాలు 915 వచనాలు ఉన్నాయి.

సామెత అనగా మంచిమాట అని అర్థము. మనం రోజు ఎన్నో సామెతలను ఉపయోగిస్తుంటాము. ఈ సామెతల గ్రంథం చదివిన వెంటనే అర్థం అయ్యే విధంగా రచించారు. అలాగే మనం నడువవలసిన మార్గాన్ని మనకు తెలియజేస్తుంది. బైబిలులోని సామెతల గ్రంథాన్ని చదవని క్రైస్తవులు ఉండరు. మనం ప్రతీరోజూ ఉదయాన్నే సామెతల గ్రంథాన్ని చదవటం వలన మనం నడువవలసిన మార్గాన్ని తెలుసుకుంటాము. అందరూ చదువతగిన మంచి మాటలు ఈ సామెతల గ్రంథంలో ఉన్నాయి. అందువలన ప్రతి ఒక్కరూ చదువవలసినవి సొలొమోను సామెతలు.

"అనుదినము నా గడపయొద్ద కనిపెట్టుకొని
నా ద్వారబంధములయొద్ద కాచుకొని
నా ఉపదేశము వినువారు ధన్యులు"

(సామెతలు 8:34)

దేవుని ఉపదేశము వింటూ ఆయనని కనిపెట్టుకొని, ప్రతిదినము దేవుని ఎదుట మోకరిల్లి ఆయనకు ప్రార్థన చేస్తూ దేవుని రాజ్యంలోకి ప్రవేశించుటకు కనిపెట్టుకొనిన వారు ధన్యులు.

### పిల్లలను గూర్చిన సామెతలు :

తల్లిదండ్రుల మాటలు వినకుండా తిరిగే పిల్లలను గూర్చిన సామెతలు రాయబడ్డాయి. అవి వారికి బుద్ధి చెప్పే విధంగా ఉన్నాయి. అవి పిల్లలు చదవటం వలన, వారికి అర్థం అయ్యే విధంగా వ్రాయబడటం వలన, వారు సామెతలను అర్థం చేసుకొని మంచి మార్గంలో నడవడానికి దోహదపడుతున్నాయి.

"జ్ఞానముగల కుమారుడు తండ్రిని సంతోషపరచును
బుద్ధిలేని కుమారుడు తన తల్లికి దు:ఖము
పుట్టించును"

(సామెతలు 10:1)

నేడు పిల్లలు మాకు మాత్రం అన్నీ తెలుసు అన్నట్లుగా తల్లిదండ్రులకు ఎదురు తిరుగుతున్నారు. తండ్రి మాట విని నడుచుకునే కుమారుడు జ్ఞానవంతుడు అవుతాడు. అలాగే తల్లికి దు:ఖము కల్గించే కుమారులు బుద్ధిలేని వారౌవుతారు. అందుకే తల్లిదండ్రుల మాటలు విని నడుచుకుంటే వారికి ఉపయోగాలు కూడా సామెతల్లో తెలియజేశారు.

"నా కుమారుడా, నీ తండ్రి ఉపదేశము ఆలకింపుము
నీ తల్లి చెప్పు బోధను త్రోసివేయకుము"

(సామెతలు 1: 8)

"అవి నీ తలకు సొగసైన మాలికయు
నీ కంఠమునకు హారములునై యుండును'

(సామెతలు 1:9)

"మూఢుడు తన తండ్రిచేయు శిక్షను తిరస్కరించును
గద్ధింపునకు లోబడువాడు బుద్ధిమంతుడగును"

(సామెతలు 15:5)

"నీ కుమారుని శిక్షించినయెడల అతడు నిన్ను సంతోషరచును
నీ మనస్సుకు ఆనందము కలుగజేయును"

(సామెతలు 29:17)

మనము పిల్లలను గద్దించి సరియైన మార్గములో నడిపించిన యెడల అతను మంచి మార్గంలో నడుచుట వలన తల్లిదండ్రుల మనస్సుకు ఆనందము కలుగజేసిన వారగును. "తండ్రి శిక్షించిన కుమారుడు జ్ఞానము గలవాడగును అని సామెతల గ్రంథములో తెలియ చేయబడినది."

**పశ్చాత్తాపము :**

దేవునితో ప్రతీ ఒక్కరూ చేయవలసిన ప్రార్థనా విన్నపములు వ్యర్థమైనవి, అబద్ధములు ఆడరాదని, పేదరికము, ఐశ్వర్యము ఇస్తే తక్కువైతే దొంగతనము చేసీ దేవుని పేరు చెడుగొట్టి లేదా ఎక్కువైతే దేవుని దూషిస్తానేమోనని పశ్చాత్తాప పడాలి.

"వ్యర్థమైనవాటిని అబద్ధములను నాకు దూరముగా నుంచుము
పేదరికమైనను ఐశ్వర్యమునైనను నాకు దయచేయకుము
తగినంత ఆహారము నాకు అనుగ్రహింపుము.
ఎక్కువైనయెడల నేను కడుపు నిండినవాడనై నిన్ను విసర్జించి
యెహోవా యెవడని అందునేమో
లేక బీదనై దొంగిలి నా దేవుని నామమును దూషింతునేమో"

(సామెతలు 30:8,9)

**సోమరితనము :**

జ్ఞానవంతుడు సోమరిగా ఉంటే అతనికి కలిగివున్న తెలివి మొత్తం వృథానే. అందుకే సొలొమోను మహారాజు ఇలా అన్నారు.

"నీ కన్నులకు నిద్రయైనను
నీ కను రెప్పలకు కునుకుపాటైనను రానియ్యకుము"

(సామెతలు 6:4)

"సోమరీ, చీమల యొద్దకు వెళ్ళుము
వాటి నడతలు కనిపెట్టి జ్ఞానము తెచ్చుకొనుము"

(సామెతలు 6:6)

చీమలు బలము లేని చిన్న జీవులు కానీ అవి చాలా తెలివి కలిగివుంటాయి. వాటి క్రమము చూసి మనం మన ప్రవర్తనను మార్చుకోవాలని చెప్తున్నారు.

"బద్ధకముగా పనిచేయువాడు దరిద్రుడగును"

(సామెతలు 10:4)

సోమరితనాన్ని విడిచి చురుకుగా పనిచేసుకోవాలి. ఎక్కువసేపు పడుకొని ఉండకూడదు. మెలకువ రాగానే లేవాలి. అంతేకాని ఇంకొంచెం సేపు పడుకుంటా అని, ఇంకొంచెం కునికెదనని పడుకుంటే దారిద్ర్యము లేమి నీ యొద్దకే వస్తుందని సొలొమోను మహారాజు చెప్తున్నాడు.

" సోమరీ, ఎందాక నీవు పండుకొనియుందువు!
ఎప్పుడు నిద్రలేచెదవు!

(సామెతలు 6:9)

"ఇక కొంచెము నిద్రించెదనని కొంచెము కునికెదనని
కొంచెము సేపు చేతులు ముడుచుకొని పరుండెదదని నీవనుచుందువు
అందుచేత దోపిడిగాడు వచ్చునట్లు దారిద్ర్యము నీయొద్దము వచ్చును.

ఆయుధదారుడు వచ్చునట్లు లేమి నీ యొద్దకు
వచ్చును.

(సామెతలు 6: 10, 11)

## నీతిమంతులు - భక్తి హీనులు :

"యెహోవా నీతిమంతుని ఆకలిగొననియ్యడు
భక్తిహీనుని ఆశను భంగము చేయును"

(సామెతలు 10:3)

యెహోవా నీతిమంతునికి ఏ విధంగానైన సహాయం చేసి అతనికి ఏ ఆపదయు ఆటంకముయు ఆకలియు కలుగనియ్యడు. కానీ భక్తిహీనుడు ఏమి చేసినా అతని ఆశ భంగమైపోతుంది.

"నీతిమంతుని తలమీదికి ఆశీర్వాదములు వచ్చును
బలాత్కారము భక్తిహీనుని నోరు మూసివేయును
నీతిమంతుని జ్ఞాపకము చేసికొనుట ఆశీర్వాదకరమగును
భక్తిహీనుల పేరు అసహ్యత పుట్టించును"

(సామెతలు 10:6,7)

నీతిమంతుడు చేసే ప్రతి పనిలో యెహోవా అతనికి ఆశీర్వాదమునిస్తాడు. కానీ భక్తిహీనుడు నాశనమవుతాడు. నీతిమంతుని గురించి మాట్లాడుకోవటం ఆశీర్వాదమగును కానీ భక్తిహీనుల పేరే అసహ్యత కలిగివుంటుంది.

"భక్తిహీనుడు దేనికి భయపడునో అదే వానిమీదకి
వచ్చును.
నీతిమంతులు ఆశించునది వారికి దొరుకును".

(సామెతలు 10:24)

"భక్తిహీనుల ఆయుస్సు తక్కువై పోవును
నీతిమంతుల ఆశ సంతోషము పుట్టించును
భక్తిహీనుల ఆశ భంగమై పోవును"

(సామెతలు 10: 27, 28)

భక్తి హీనుడు ఏపని చేసినా, దేనికి భయపడినా అదే వారి మీదకి వచ్చును. కానీ నీతుమంతులు ఏది చేసినా యోహోవా ఆశీర్వాదం వారికి దయచేస్తాడు. భక్తిహీనులు ఎన్ని సార్లు చెప్పినా వినరు వారు హఠాత్తుగా నాశనం అవుతారు. నీతిమంతులు ఏది చేసినా సంతోషంతో యోహోనా దయచేస్తాడు. భక్తిహీనులు చెడుమార్గంలోకి వెళ్ళిపోతారు కాబట్టి వారి అశను భంగము చేస్తాడని సొలొమోను మహారాజు చెప్తున్నాడు.

## ముగింపు :

సామెతల గ్రంథంలోని 31 అధ్యాయల గురించి మనం చదివి తెలుసుకోవాల్సిన మంచి విషయాలు చాలా ఉన్నాయి. మనం చదివి మంచిని నేర్చుకొని నడుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. సామెతల గ్రంథం మొత్తం చదివితే అది మనకి మంచి మార్గాన్ని నిర్దేశించి జీవిత విలువలు నేర్పిస్తుంటుంది. "నీ హృదయములో నుండి జీవధారలు బయలుదేరును కాబట్టి అన్నింటి కంటే ముఖ్యముగా నీ హృదయమును భద్రముగా కాచుకొనుము" (సామెతలు 4:23)

మనం మాట్లాడే ప్రతీ మాటా ప్రేమ, ద్వేషం, అసూయ, నిజం అబద్ధం, అన్నీ మన హృదయం నుండే వస్తాయి. కనుక మన హృదయాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటే మనం అందిరిలో బాగుంటాము.

## ఆధార గ్రంథాలు :

1. పరిశుద్ధ గ్రంథం (తెలుగు బైబిలు)-బైబిలు సొసైటీ ఆఫ్ ఇండియా.

# తెలంగాణ విమోచనోద్యమ నవలల్లో స్త్రీ చైతన్యం

- డా॥. తిరునగరి దేవకీదేవి, ఆచార్య జయధీర్ తిరుమలరావు, పొ. శ్రీ. తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

## పరిశోధన పరిధి :

వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం స్త్రీని భోగ వస్తువుగా, ప్రణయ నాయికగానే చూసింది. అక్కడక్కడ స్త్రీ ప్రతిఘటనా చర్యలు, నిరసనలు రికార్డు కాలేకపోలేదు. ఆధునిక యుగంలో ఈ భావన కొంత తగ్గి వివిధ ఉద్య మాల్లో స్త్రీలు ప్రదర్శించిన వీరత్వం, పోరాట శక్తి, మానవీయత చిత్రింపబడ్డాయి. 1946-1951 మధ్య తెలంగాణ నేల మీద జరిగిన చారిత్రాత్మక రైతాంగ సాయుధ పోరాటం నేపథ్యంలో సుమారు 21 నవలలు వచ్చాయి. ఇందులో దాదాపు 14 నవలు స్త్రీలు ప్రదర్శిం చిన పోరాట శక్తిని నమోదు చేశాయని ఈ పరిశోధకురాలు తన పరిశోధనలో తేల్చి చెప్పింది. రైతాంగా సాయుధ పోరాట నేపథ్యంలో వచ్చిన సాహిత్యం మీద వివిధ విశ్వవిద్యాలయాల్లో చాలా పరిశోధనలు జరిగినా అవేవీ స్త్రీ చైతన్యాన్ని సమగ్రంగా పరిశోధించలేదు. ఆ దిశగా ఈ పరిశోధన ఒక ముందడుగు. ఈ గ్రంథంలో మృత్యుం జయులు, సింహగర్జన, ప్రజలమనిషి, గంగు, ఓనమాలు, మృత్యువునీడల్లో, చిల్లర దేవుళ్లు, తెలుగు గడ్డ, మోదుగుపూలు, జనపదం, సంగం, మలుపు తిరిగిన రథ చక్రాలు, విప్లవజ్వాల, బందూక్ నవలల్లో చిత్రితమైన స్త్రీ చైతన్యాన్ని పరిశోధకురాలు పరిశోధించారు.

## సమాచారణ సేకరణ పద్ధతి :

పరిశోధనాంశానికి లోబడి రచయిత్రి చాలా శ్రమకోర్చి విస్త ృతమైన సమాచారాన్ని సేకరించి విశ్లేషించారు. ముఖ్యంగా రైతాంగ సాయుధ పోరాటం వస్తువుగా వచ్చిన నవలలన్నింటినీ చదివి అందులోని స్త్రీ చైతన్యాన్ని ఎత్తిచూపడం అంత సులువైన విషయం కాదు. ఎందు కంటే వచ్చిన నవలలన్నీ ఒకటి అరా తప్పితే అన్నీ పురుషులు రాసిన నవలలే. వాటిలో స్త్రీ పాత్రలు చాలా తక్కువ. అదీగాక ఆ పాత్రలు కూడా అంతగా ప్రాధాన్యత లేని పాత్రలే అయి ఉంటాయి. అప్పుడు ఆ కొద్ది పాత్రల ఆధారంగానే స్త్రీ చైతన్యాన్ని నిరూపించాలి. "నిజాం సంస్థానం ఏర్పడే వృత్తాంతంతో ఆరంభించి దానిలో భాగమైన తెలంగాణ చరిత్రను ఆద్యంతం చెప్పారు. నిజాం రాష్ట్ర అవతరణం, నిజాం పాలనలో ఏర్పడిన నిరంకుశ పాలనా విధానాలను కరణం పట్వారీలు, దొరల, దేశ్‌ముఖ్‌ల గుమాస్తాలు, గూండాలు, దొరలు ఆ పైన నిజాం ప్రజలను దోచుకునే పాలనా వ్యవస్థను, గ్రామ ప్రజల, రైతుల బాధలను కష్టాలను గురించి దేవకీదేవి వివరించారు. నిజాం పాలనలో మాత్రమే కనిపించే వెట్టి చాకిరి విధానాన్ని, రెండో ప్రపంచ యుద్ధంలో ఖర్చులను భరించేందుకు రైతుల నుంచి అదనంగా వసూళ్లు చేసే లేవీ ధాన్య భారాన్ని ఆడబాపల వ్యవస్థను ఆమె పరిశీలించారు. ఆంధ్రోద్యమ ఆవిర్భావం, కమ్యూనిష్టు పార్టీ అవతరణను గురించి చెప్పారు. దేవకీదేవి ఆంధ్రోద్యమ స్వరూపాన్ని చాలా విశదంగా చర్చించి ముందు రాబోయే పరిశోధకులకు మంచి సమాచారాన్ని రికార్డు చేసి అందించారు." (డా॥ ముదిగంటి సుజాతారెడ్డి రాసిన ముందు మాట నుంచి) అంతేగాక దేశ విదేశాల్లో జరిగిన వివిధ విప్లవాలలో స్త్రీ పోరాటాన్ని, చైతన్యాన్ని కూడా వివరించారు.

## అధ్యాయాల విభజన - సామంజస్యత :

తెలంగాణ విమోచనోద్యమ నవలల్లో స్త్రీ చైతన్యం అనే ఈ పరిశోధనా గ్రంథాన్ని రచయిత్రి ఏడు ప్రకర ణాలుగా విభజించింది. ఈ విభజన ఎంతో సమంజసంగా జరిగిందని చెప్పాలి. రైతాంగ సాయుధ పోరాట నేపథ్యంతో మొదలు పెట్టి ఆంధ్రోదమం, ఆంధ్ర మహా సభలు, సాయుధ పోరాటానికి దారితీసిన పరిస్థితులు, వివిధ ఉద్యమాల్లో స్త్రీలు, జాతీయోద్యమ నవలల్లో

స్త్రీలు, విమోచనోద్యమ సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో స్త్రీల చైతన్యం, తెలంగాణ విమోచనోద్యమ నవలల్లో స్త్రీ పాత్రలు, తెలంగాణ విమోచనోద్యమ నవలల్లో స్త్రీ చైతన్యంతో పాటు అనేక విషయాలను చర్చించారు.

**అధ్యాయాల సంక్షిప్త పరిచయం :**

మొదటి ప్రకరణంలో తెలంగాణ విమోచనోద్యమం - పూర్వాపరాలు వివరింపబడ్డాయి. ఇందులో చరిత్రలో తెలంగాణ, నిజాం హైద్రాబాద్ రాష్ట్ర అవతరణ, నిజాం రాష్ట్రంలో నిరంకుశ ధోరణి, అగమ్యగోచరంగా ఉన్న ఆర్థిక వ్యవస్థ, దొరల వారి ఫ్యూడల్ వ్యవస్థలో గ్రామీణుల అగచాట్లు, గ్రామీణులను నిలువునా దోచిన భూస్వాములు, వెట్టి, ఆడబాపల వ్యవస్థ, పోరాటానికి నాందీ పలికిన పరిస్థితులు, మొదటి ప్రపంచ యుద్ధ ప్రభావం, భారతదేశంపై రష్యన్ విప్లవ ప్రభావం, ఆంధ్రోద్యమ ఆవిర్భావం, గ్రంథాలయోద్యమం, ఆంధ్ర జనసంఘ స్థాపన, ఆంధ్రమహాసభలు, సాయుధ పోరాటానికి దారి తీసిన పరిస్థితులు, యూనియన్ సైన్యాల కిరాతక చర్య తదితర విషయాలు చర్చించారు. రెండవ ప్రకరణంలో దేశ, విదేశ ఉద్యమాల్లో స్త్రీల గురించి అంటే రష్యా, చైనా ఉద్యమాల్లో, వివిధ హక్కుల పోరాటాల్లో పాల్గొన్న స్త్రీల గురించి వివరించారు. జాతీయోద్యమంలో, తెలంగాణ పోరాటంలో స్త్రీల గురించి వివరించారు.

మూడవ ప్రకరణంలో జాతీయోద్యమ నవలల్లో స్త్రీ చైతన్యం గురించి వివరించారు. రథచక్రాలు, నిష్కామ యోగి, కొల్లాయిగట్టితేనేమి, అతడు - ఆమె నవలల్లోని స్త్రీ చైతన్యం గురించి వివరించారు. నాల్గవ ప్రకరణంలో విమోచనోద్యమ సాహిత్యంలో వివిధ ప్రక్రియలు - స్త్రీల చైతన్యం గురించి వివరించారు. పాటలు, యక్షగానం, పల్లెసుద్దులు, బుర్రకథలు, పోరాట నాటకాలు (మా భూమి, పోతుగడ్డ, గెరిల్లా...), వచన కావ్యాల్లోని (ఉదయిని, త్వమేవాహం, తెలంగాణ...) స్త్రీల చైతన్యం గురించి వివరించారు. అయిదవ ప్రకరణంలో తెలంగాణ విమోచనోద్యమ నవలల్లో స్త్రీ పాత్రల గురించి వివరించారు. సాయుధ పోరాట ప్రారంభ కాలం (1946) వరకు గల కాలాన్ని ఇతివృత్తంగా గల కావ్యాల్లోని (చిల్లర దేవుళ్ళు, ప్రజలమనిషి, గంగు, మృత్యుంజయులు) స్త్రీ పాత్రల గురించి వివరించారు. తర్వాత యూనియన్ సైన్య ప్రవేశం ముగింపుగాగల నవల(మోదుగుపూలు, ఓనమాలు, మృత్యువు నీడల్లో, విప్లవజ్వాల, సంగం)ల్లోని స్త్రీ పాత్రల గురించిన ప్రస్తావన కనిపిస్తుంది. సాయుధ పోరాట విరమణ ముగింపుగా గల నవల సింహగర్జనలోని స్త్రీ పాత్రల గురించిన చర్చ జరిగింది.

చివరగా సాయుధ పోరాట విరమణాంతర కాలాన్ని కూడా ఇతివృత్తంగా గలిగిన మలుపు తిరిగిన రథ చక్రాలు, జనపదం, బందూక్ నవలల్లోని స్త్రీ పాత్రల గురించిన వివరణ ఉంది. ఆరవ ప్రకరణంలో తెలంగాణ విమోచ నోద్యమ నవలల్లో స్త్రీ చైతన్యం గురించిన కూలంకష వివరణ ఉంది. లైంగిన వేదింపుల ప్రతిఘటన, స్త్రీలపై జరిగే అత్యాచారాన్ని సంఘటితంగా ప్రతిఘటించిన స్త్రీలు, ఆత్మరక్షణ విధానాన్ని తోటి స్త్రీలకు బోధించిన మహిళా కార్యకర్తలు, తమ జీవితాలను చక్కదిద్దుకున్న ఆడ బాపలు, ఉంపుడుకత్తెలోని సామాజిక స్పృహ, పోరాటంలో పాల్గొన్న నాయకులకు, కార్యకర్తలకు సహకరించిన వీరమాతలు, కన్నతల్లిని మరిపించగల్గిన స్థాయిలో సంఘం సభ్యులకు సేవచేసిన స్త్రీలు, పునరావాసం కల్పించేందుకు కృషి చేసిన స్త్రీలు, భార్యలుగా పోరాట కార్యకర్తలకు, నాయకులకు సహకరించినవారు, భర్తల దుర్మార్గాన్ని ప్రశ్నించిన స్త్రీలు, భూమిని కాపాడు కునేందుకు ప్రతిఘటించిన స్త్రీలు, గూఢచారిమణులుగా పనిచేసిన స్త్రీలు, పోలీసులు, రజాకార్ల నుండి కార్యకర్తలను కాపాడిన స్త్రీలు, ఆహారం చేరవేసిన స్త్రీలు, పాటలు, గేయాలు, ఉపన్యాసాలతో ఉద్యమానికి దోహదం చేసిన స్త్రీలు, వడిసెలు, రాళ్లు, కారంపొడులతో రజాకార్లను, పోలీసులను ఎదిరించిన స్త్రీలు, సహానుభూతితో సంఘాన్ని రక్షించాలనుకున్న ముస్లిం స్త్రీలు, మాతృ

ప్రేమను అధిగమించి పోరాటానికి ప్రాముఖ్యాన్ని ఇచ్చిన స్త్రీలు, పోరాట దళంలోని స్త్రీలు, ప్రజస్వామ్య ధోరణిలోనే నిలిచి సమాజానికి సేవ చేసిన స్త్రీల గురించి లోతైన అధ్యయనంతో వివరించారు రచయిత్రి. నిజానికి ఈ అధ్యాయం ఈ గ్రంథానికే తలమాణికమైన అధ్యాయమని చెప్పవచ్చు. ఏడవ ప్రకరణంలో సాధారణంగా ఉండే ఉపసంహారం, ఉపయుక్త గ్రంథసూచి, అనుబంధాలు ఉన్నాయి.

## ప్రత్యేకత - పూరించిన ఖాళీలు :

ఏ ఉద్యమాన్నయినా మనం పురుషుల పరంగానే అంచనా వేయడం అలవాటు చేసుకున్నాం. కాని ప్రతి ఉద్యమంలో ఎంతో కొంత శాతంగా స్త్రీలు తప్పకుండా ఉంటారు. వారి కోణం నుండి లేదూ విమోచనోద్యమ నవలల్లోని స్త్రీల చైతన్యం గురించి కూలంకషంగా చర్చించిన ఈ సిద్ధాంత గ్రంథం ఆ దిశగా ఒక గొప్ప ప్రయత్నం. స్త్రీలు చూపిన చొరవ, తెగువ, తెలివితేటలు సాయుధ పోరాట సాహిత్యంలో ఎలా రికార్డయ్యాయో ఈ గ్రంథం తెలుపుతుంది. "తెలంగాణ స్త్రీ సమాజంలో ఎలాంటి వాతావరణంలో జీవిస్తుంది. ఎలాంటి విషయాల పట్ల శ్రద్ధ చూపగలుతుంది. ఏ విధంగా స్పందనలకు లోనవుతుంది? సామాజిక జీవన విధానంలో ఆమె చైతన్య స్థాయి ఎలాంటిది?" అని ఈ గ్రంథం ఒక అంచనా వేసింది. స్త్రీ కేవలం వంటింటి కుందేలుగానే కాదు అవసరమైనప్పుడు తన శక్తినంతా కూడగట్టి సమాజాభివృద్ధి కోసం తన కర్తవ్యాన్ని నిర్వహించిందని ఈ పుస్తకం వలన తెలుస్తుంది. రైతాంగ సాయుధ పోరాట సాహిత్యంపైన ఇప్పటికే చాలా పరిశోధనలు వచ్చినా వాటిల్లో ఎవరూ స్త్రీ చైతన్యాన్ని గురించి పూర్తిస్థాయిలో పరిశోధించలేదు. ఇది ఆ ఖాళీని పూరించిన గ్రంథమని చెప్పవచ్చు.

## పరిశోధనా ఫలితాల క్రోడీకరణ :

వైజ్ఞానిక శాస్త్రాల పరిశోధనల్లో సమాచార సేకరణ, విశ్లేషణ, ఫలితాల క్రోడీకరణ అనేది ఒక క్రమ పద్ధతిలో జరిగి వారు కొత్తగా కనుక్కొన్న ఫలితాలను ప్రపంచానికి అందించడం అనేది తప్పని సరిగా కనిపిస్తుంది. సామాజిక శాస్త్రాల విషయంలో ఇది కొంత సరిగా అమలు కాకపోవడం కనిపిస్తుంది. కొన్నిసార్లు ఎంచుకున్న పరిశోధనాంశపు విషయ సేకరణ సరిగా జరగదు. జరిగినా దాన్ని సరైన పద్ధతుల్లో విశ్లేషణ చేయరు. ఇక ఫలితాల క్రోడీకరణ చాలా తక్కువ సందర్భాలలోనే నూటికి నూరు శాతం జరుగుతుంది. ఈ గ్రంథం దానికి అపవాదుగా కనిపిస్తుంది. రచయిత్రి ఇందులో "వాస్తవ ఘటనలు, పాత్రలను తెలుసుకుని నవల్లో చిత్రింపబడిన కాల్ప నికతతో తులనాత్మకంగా పరిశీలించారు. ఆ విధంగా యధార్థ చరిత్రతో రచయితలు సృష్టించిన సన్నివేశాలను పోల్చి చూశారు. జరిగిన పోరాటాన్ని, ఆ పోరాటంలో పాల్గొన్న స్త్రీల చైతన్యాన్ని కూడా కొత్త కోణంలో చూపారు. పోరాట మహానదిలో మహిళల మహత్తర త్యాగాల ప్రవాహాన్ని విడదీసి చూపగలిగారు. ఒక రకంగా తెలంగాణ రైతాంగ పోరాట సమగ్ర సాహిత్య సమీక్షగా కూడా దీన్ని మలచడం పరిశోధకురాలి పటిమకు నిదర్శనం. ముఖ్యంగా ఆనాటి అన్ని సాహిత్య ప్రక్రియల్లో స్త్రీ చిత్రణని చారిత్రకంగా బేరీజు వేశారు. ఇది తలకు మించిన పనే. అయినా చాలా చక్కగా పరిశోధనా పద్ధతులు పాటించి రచించిన గ్రంథం ఇది." (జయధీర్ తిరుమలరావు రాసిన ముందు మాట నుంచి)

## పరిశోధనా రచనా శైలి :

ఏ ప్రక్రియకైనా, ఏ పుస్తకానికైనా రీడబిలిటి అనేది చాలా ముఖ్యమైనది. పరిశోధకుడు తాను సేకరించిన సమాచారాన్ని ఒక దగ్గర కుప్ప పోయడం కాదు. దాన్ని పాఠకుడు ఆసక్తికరంగా చదవగలిగేలా రాయాలి. లేకపోతే మొదటికే మోసం వచ్చి అసలు గ్రంథాన్నే ఏ పాఠకుడు తెరవడు. అందులో ఏముందో కూడా చదవలేడు. కాబట్టి మంచి పఠనశీలత పాటిస్తూ రాయడం అనేది ఏ ప్రక్రియకైనా ప్రాణ సమానమైనది. ఈ గ్రంథం ఈ విధానాన్ని చాలా వరకు పాటించిందనే చెప్పాలి. చారిత్రక సంబంధ పరిశోధనల్లో చాలా కన్ఫ్యూజన్ ఉంటుంది.

అలాంటిది ఏ మాత్రం లేకుండా చూసుకున్నారు ఈ రచయిత్రి. పరిశోధానాంశం ఎంపిక, సమాచార సేకరణ, విశ్లేషణ, అధ్యాయాల విభజన ఇలా ప్రతిదీ ఒక క్రమానుసారం సాగిపోవడం వలన గందరగోళం ఏ మాత్రం లేకుండా ఉంది. దీనికి మచ్చుతునక అయిదు, ఆరు అధ్యాయాలు. అయిదవ అధ్యాయంలో రచయిత్రి చేసిన గొప్ప పని ఏమిటంటే వచ్చిన నవలల్ని అవి ఏ నేపథ్యంతో వచ్చాయో చాలా స్పష్టంగా ముందుగానే వింగడించుకోవడం. ఇక ఈ పరిశోధనా గ్రంథానికే కీలకమైన ఆరవ అధ్యాయంలో స్త్రీ చైతన్యాన్ని సుమారు 30 కోణాల్లో చాలా ప్రతిభావంతంగా విశ్లేషించారు. ఇదేగాక వివిధ ప్రక్రియల్లో స్త్రీ చైతన్యాన్ని కూడా విశ్లేషించడం ఈ గ్రంథానికే ఒక మేలిమలుపు.

రచయిత్రి రచనా శైలికి మచ్చుతనకగా ఈ పేరాను చూడండి. ''నిజాం భూస్వామ్య వ్యవస్థలో దుర్భర దురాచారాం ఆడబాపల దుష్ట సంస్కృతి. ఆ వ్యవస్థలో పేదవాడు మరింత పేదవాడవటం తప్ప ప్రశ్నించటమే నేరంగా పరిగణింపబడిన రోజులు. ఈ పేదరికమే తల్లిదండ్రులు తమ పిల్లలను అమ్ముకునే స్థితికి దిగ జార్చింది. కాకుండా కొన్నిసార్లు దొరల కన్నుపడ్డ స్త్రీలు ఆడబాపలుగా గడీలకు చేర్చబడ్డారు. కారణాలు ఏమైనా, ఎన్నైనా దాని చెడు ఫలితాలను అనుభవించింది స్త్రీ జాతే. ఆడబాపలైన ఆ స్త్రీలు ఆ కుటుంబాల వారికి కావలసిన చాకిరీ చేయడంతో పాటు దొరల, వారి ఇంటికి వచ్చిన అతిథుల, బంధువుల లైంగిక కోర్కెలను తీర్చడం తప్పని సరైంది. వారు, వారి సంతానం తరతరాలుగా అదే వారసత్వానికి లోనై దుర్భర జీవితాలను గడిపారు. ఆ కుటుంబాల ఆజ్ఞ మేరకు కడుపులు తీయించుకున్నారు.

ఆ క్రమంలో కొన్నిసార్లు ఆనారోగ్యం పాలయ్యారు. మరికొన్ని సార్లు ప్రాణాలనే పోగొట్టుకున్నారు. సమాజంలో ఏ మాత్రం గౌరవ మర్యాదలు లేని వర్గంగా పరిగణించ బడ్డారు. అయితే పోరాట కాలంలో ఎంతో మంది స్త్రీలు ఆడబాపల దుష్ట సంస్కృతి నుండి దూరమై తమ జీవితాలను చక్కదిద్దుకొని స్వేచ్ఛామయ జీవితాలను గడిపేందుకు తపించారు. అలాంటి పాత్రలను 'చిల్లర దేవుళ్ళు', 'గంగు', 'విప్లవజ్వాల', 'మలుపు తిరిగిన రథ చక్రాలు', 'మృత్యుంజయులు', నవలల్లో చూడవచ్చు.'' ఒక సమస్యను మూలం నుంచి చర్చించడంతో పాటు ఆ సమస్య నవలల్లో ఎలా ప్రతిబింబించిందో చూపడం గొప్ప పరిశోధనా దృష్టికి నిదర్శనం.

## భావి పరిశోధకులకు సలహాలు :

ఏ పరిశోధనా సమగ్రం కాదనేది పరిశోధనలో ఒక స్థిర అభిప్రాయం. ఒక అంశంపై ఎన్ని కోణాల్లో పరిశోధన చేసినా ఇంకా ఏవో కోణాలు మిగిలే ఉంటాయి. అసలైన పరిశోధన భావి పరిశోధకులకు మరికొన్ని పరిశోధనాంశా లను మిగిల్చి ముగియాలి. ఈ పరిశోధనా గ్రంథం అలాంటిదే. ఈ గ్రంథలోని అనుబంధం - 2లో తెలంగాణ ప్రజల జీవితాన్ని, పోరాటాన్ని చిత్రించిన వివిధ సాహిత్య ప్రక్రియల గ్రంథాలను ఒక దగ్గర కూర్చి చూపెట్టడం వలన భావి పరిశోధకులకు ఈ రంగంలో ఇంకా ఎన్నో పరిశోధనలకు ఆస్కారం ఉందని చెప్పకనే చెప్పారు రచయిత్రి. నవలలు(20), నాటికలు (12), నాటకాలు (3), కథలు (53), కథా సంపుటాలు (5), బుర్ర కథలు (8), కవితా సంకలనాలు (21), పాటల సంకలనాలు (11), పరిశోధనా గ్రంథాలు (11), ఇవేగాక జమీందారు స్వగతం, నిజాంషాహి స్వగతం, నెహ్రూ వీధి బాగోతం, గొల్ల సుద్దులు, వెట్టివాని పాట, పకీరు పాట, లత్కోరు సాయిబు వంటి ప్రజాకళారూపాలు పెద్ద సంఖ్యలో వచ్చాయని అవి ఈ నాటికీ తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారంలో ఉన్నాయని పేర్కొనడం వలన భావి పరిశోధకులకు ఎంతో సమాచారాన్ని అందించి ఆదర్శంగా నిలిచారు రచయిత్రి. ఇదేగాక తెలంగాణ విమోచనోద్యమ సాహిత్యంలో వివిధ వర్గాల అంటే బీసీ మహిళలు, దళిత, ఆదివాసి మహిళలు, అగ్రవర్ణ మహిళలు ఏ మేరకు పాల్గొన్నారు. వారి చైతన్యం ఏ

మేరకు సాహిత్యంలో రికార్డు అయ్యిందనేది కూడా పరిశీలనాంశమే. ఈ పరిశోధనా గ్రంథం ఈ కోణంలో ఇంకా అనేక పరిశోధనలకు మార్గం సుగమం చేసింది.

స్త్రీ చైతన్యాన్ని కేంద్ర బిందువుగా తెలంగాణ విమోచనోద్యమ సాహిత్యాన్ని డా॥ దేవకీదేవి చాలా సమగ్రంగా పరిశోధించారు. "తెలంగాణ చేసిన పోరాటాలను, పొందిన విజయాలను, వైఫల్యాలను న్యాయంగానే మహిళా చైతన్య దృక్పథంతో విశ్లేషించడానికి ప్రయత్నించారు. ఆమె తెలంగాణ విమోచనోద్యమ చరిత్రను, అందులో స్త్రీ చైతన్యాన్ని సాహిత్యం - చరిత్రల తులనాత్మక అధ్యయనంలో భాగంగా మన కళ్లముందుంచారు. వెట్టి చాకిరీకి రిసీవింగ్ ఎండ్‌గా ఉన్న వారిగా, వ్యవసాయ కూలీలుగా, పురుష స్వామ్యానికి బలి అవుతున్నవాళ్లుగా, దొరల గడీలలోని అఘాయిత్యాలను, దోపిడీని, పోలీసుల, రజాకార్ల దాడుల్లో దౌర్జన్యాలకు, హింసలకు - లైంగిక హింసకు, పోలీసు ఠాణాల్లో చిత్రహింసలకు, ఈ దైనందిన పోరాట జీవితంలో పితృస్వామ్య సమాజ వికృత రూపాలుగా తమ ఇళ్లలో పోరాటకాలంలో కూడా అమలైన వివక్ష - ఆఖర్న అంత మహోజ్వల విప్లవ పోరాటంలో నాయకత్వం కూడా సృజనాత్మకంగా చేరుకోలేక విముక్తమైన స్త్రీ చైతన్యానికి విధించిన పరిమితులకు ఈ నవలలు - వీటిలో స్త్రీ పాత్రలు ఎట్లా ప్రతీకలో దేవకీదేవి వివరించారు." (వరవరరావు రాసిన ముందు మాట నుంచి)

ప్రపంచ పోరాటాల చరిత్రలోనే సువర్ణాక్షరాల్లో రాయదగిన గొప్ప పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. ఆ పోరాటంలో పురుషులతో పాటు భుజం భుజం కలిపి స్త్రీలు కూడా పాల్గొన్న చరిత్ర మరువలేనిది. పోరాటాన్ని అర్థం చేసుకోవడానికి, పోరాటంలో భాగస్వాములు కావడానికి స్త్రీలకు వారి అవిద్య కూడా అడ్డు రాలేదు. పోరాటంలో స్త్రీలు ప్రదర్శించిన తెగువ, త్యాగం, పోరాడిన విధానం, ఎదుర్కొన్న వివక్ష భవిష్యత్తు పోరాటాలకు మార్గదర్శకం. స్త్రీలు ఆనాడు పోరాటానికి మద్దతు తెలిపి వీరోచితంగా పోరాడినా వారి త్యాగాన్ని, వారి ఉనికిని పెద్దగా గుర్తించలేదు. రాసిన నవలల్లో కూడా స్త్రీ పాత్రల్ని సహకార పాత్రలుగా మాత్రమే చిత్రించారు తప్పితే ప్రధాన పాత్రగా చేసి రాసిన నవలలు లేవు. చివరికి ఉద్యమాన్ని విరమించిన తరువాత కూడా స్త్రీల జీవితాల్లో పెద్దగా మార్పు రాలేదు. బతుకు మరింత భారమై దుర్భర జీవితాన్ని భరించిన స్త్రీలు ఎందరో. "గత అర్ధశతాబ్ది కాలంగా ఎన్నో ఉద్యమాలు ముందుకు వచ్చి స్త్రీల అస్తిత్వం నిరూపించుకోవడానికి; హక్కులు సాధించుకోవడానికి వీలు కల్పించాయి. అలాంటి ఉద్యమాలకు తెలంగాణ పోరాటం ప్రేరణనిచ్చింది. ఇంతటి విశిష్టత కలిగిన పోరాటంలో పాల్గొన్న మహిళల పాత్రను సాహిత్యంలో పరిపూర్ణంగా చిత్రించలేకపోయారని చెప్పవచ్చు" అని రచయిత్రి ఈ పరిశోధనా గ్రంథాన్ని ముగించారు. చారిత్రాత్మకమైన రైతాంగ సాయుధ పోరాట నవలల్లోని స్త్రీల చైతన్యాన్ని అవగాహన చేసుకోవడానికి ఈ పరిశోధనా గ్రంథం ఒక దీపదారి.

# అనువాదం – ఆవశ్యకత

– ఆచార్య ఎస్. వి. కృష్ణారావు, తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

అక్షరం - ఓ మంత్రం
భాష - ఓ ఆయుధం
మంత్రాన్ని స్మరించి ఆయుధాన్ని సంధిస్తే
లక్ష్యం ఛేదించబడుతుంది, విజయం సాధించ బడుతుంది
మానవ సమాజానికి భాష అతిపెద్ద ఆయుధం
ఆయుధాలు మారుతున్నాయి
సాధనాలు మారుతున్నాయి
ఏకాగ్రత మాత్రం మారదు, మారలేదు, మారకూడదు - కారణం
ఏకాగ్రత అంతస్సూత్రం - లక్ష్య నిర్ణయం - విజయ సాధనం.

ప్రస్తుతం 2 అంతరాలున్నాయి. 1. భాషా సమాజం, 2. భాష, సమాజం.

ప్రతి జాతి అస్తిత్వాన్ని తెలిపేది, నిలిపేది భాష. నువ్వెవ్వడవు అంటే తెలుగు వాడ్నంటావు, నీదేభాష అంటే తెలుగు భాషంటావు, నీదే సమాజం అంటే తెలుగు సమాజమంటావు.

- భాష వినిమయం, వినియోగం లేకుండా సమాజం మనుగడ సాగించలేదు. ఇది ఒక కోణం.

- భాష పరిణామం కలది, సమాజం పరిణామం కలది గనుక మన అస్తిత్వం ప్రమాదంలో పడే సందర్భంలో మనలో చైతన్యం కలగాలి, ప్రపంచంలో నిలవాలి, ప్రపంచానికి పోటీ ఇవ్వాలి. ఆ దిశగా ప్రయత్నాలు జరగాలి, చేయాలి.

- మామన్నారు గదా అని మనం పూర్తిగా మారిపోతే మన మూలమేదో మనకే తెలియని దారుణ పరిస్థితి ఏర్పడుతుంది. నేర్చుకోవడం వేరు, మారడం వేరు. నేర్చుకొని, తెలుసుకొని మన అస్తిత్వాన్ని నిలుపుకొంటూ ఎదగటం, ముందుకు వెళ్ళటమే పరిణామ రహస్యం. గానీ అస్తిత్వాన్ని కోల్పోయే మార్పు చేయకూడని పని. జరగకూడని పరిణామం.

**ఉదా** : జంతువెలన్నీ తెలివి పొంది సింహోంది దొరక్క పోతే సింహం వేట ఆపి పడుకుంటుందా? తన అస్తిత్వాన్ని చంపుకొంటుందా? లేదు, వేటాడే విధానాలు మార్చు కొంటుంది గాని, వేటాడే స్వభావాన్ని మార్చుకోదు. మనమూ అంతే. నేర్చుకొనే తీరులు. నిలబెట్టుకొనే మార్గాలు వెతుక్కోవాలి గానీ, నేను కొత్తదనం జోలికి రాను అంటే నీ ఉనికిని నువ్వే సమాధి చేస్తున్నట్లు. కనుక ఇప్పుడు ఆ ప్రయత్నాలు చేద్దాం.

- అందులో ఇప్పుడు ప్రధానమైన అంశాల్లో ఒకటి అనువాదం. (Translation). సృజన మొదాటిదైతే - అనువాదం రెండవది. Creation and translation.

- కబడ్డీలో నిలబడాలంటే కూత విడవకూడదు.

- ప్రపంచంలో నిలబడాలంటే నీదైన ప్రత్యేక కేక లేక ముద్ర నిలబడాలి, వినబడాలి.

- మన తెలుగు భాషలో వచ్చిన కావ్యాలు, కథలు, కవిత్వ ఏదీ తక్కువేం కాదు. మన సృజన ఏ భాషా సృజన కన్నా తక్కువ కాదు. కానీ మనమెందుకు వెనుకబడి వున్నాం. మన రచనా విశిష్టతను ప్రపంచానికి అందించ లేకపోతున్నాం.

- మన సాహిత్యాన్ని, భాషను ప్రపంచానికి దగ్గర చేసే సాధనం. వారధి. (Bridge)

**అనువాదం :**

- రవీంద్రనాథ్ ఠాగోర్ గీతాంజలికి కూడా బెంగాలీలో రాసినపుడు నోబెల్ బహుమతి రాలేదు. దానిని ఆంగ్లంలో అనువదించినపుడే అది ప్రపంచానికి దగ్గరైంది. ప్రపంచం

హత్తుకొంది, ఆదరించింది. గీతాంజలి విలువను గుర్తించింది, గౌరవించింది, సత్కరించింది.

**అనువాదాలు కొన్ని జరిగాయి :**

- ♦ కందుకూరి - రాజశేఖర చరిత్ర - ఖీశీతీవంఅవం ఔ ష్ట్రవవశ్రీ గా
- ♦ కేశవరెడ్డి - అతడు అడవిని జయించాడు - ఎవ ఎశీఅనబశీతీవన్ ష్ట్రవ జీబఅస్త్రశ్రీవ గా
- ♦ వాసిరెడ్డి సీతాదేవి - మందుతున్న వెన్నెల - The Burning Moon Light గా
- ♦ కొడవటిగంటి కుటుంబారావు - చందమామ నవల - Sundaram Learners గా
- ♦ దాశరథి రంగాచార్యులు - చిల్లర దేవుళ్ళు - Lesser Deities గా
- ♦ నవీన్ 'అంపశయ్య' - Bed of thorns గా

ఇలా కథలు, కవిత్వాలు అనువాద మొచ్చినా అనుకొన్న స్థాయిలో, ప్రపంచం గుర్తించే స్థాయిలో రాలేదు. దీనికి కారణం ఏమున్నా ఇప్పటితరం తెలుసుకోవలసింది, నేర్చుకోవలసిది - ఆ స్థాయికి చేరటానికి మనం చేసే ప్రయత్న మేమిటి? అనేది. అందులో ఒకటి - అనువాదం. అందులో ప్రధానంగా 3 రకాలున్నాయి. 1. Literary Translation, 2. Commercial Transalation, 3. Technical Translation. మనకు కావలసింది Literary Translation సాహితీ అనువాదం.

## అనువాదం అంటే :

Translation is the communication of meaning from one language to another language. Translation reffers to written information, whereas interpretation refers to spoken in.....

**అనువాదం - లాభాలు :**

1. ఒకరు ఇంకొకరికి తెలుస్తారు.
2. 
3. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు సన్నిహితులవుతారు.
4. ఒక ప్రాంత సాహిత్యం మరో ప్రాంతాల వారికి తెలుస్తుంది.
5. సాంఘీక జీవనం, సంస్కృతి, సంప్రదాయాలు తెలుస్తాయి.
6. ప్రజల్లో ఐకమత్యం పెరగటానికి దోహద పడుతుంది.
7. ఒక సమాజం మరో సమాజాన్ని అర్థం చేసుకొని వారిని గుర్తించి, గౌరవించటానికి ఒక అవకాశం కల్పిస్తుంది.

అనువాదం వలన ఇబ్బందులు వుండవు. అనువాదం చేయడంలో ఇబ్బందులుటాయి. అనువాదంలో ప్రయోజనాలే చాలా వుంటాయి.

- ప్రపంచం వేగంగా పరిణామం చెందుతుంది. ప్రపంచీకరణలో భాగంగా సాంకేతిక సాధనాలు, విధానాలు విస్తృతంగా వస్తున్నాయి. వాటిని అధ్యయనం చేయ వలసిన అవసరం వుంది. పుట్టగానే ఎవడికీ ఏం తెలియదు. ఒక్క ఏడవడం తప్ప. పాలు తాగడం, పాకడం, పరిగెత్తడం, ఓడించడం, గెలవడం, సాగించడం అన్నీ తెలుసుకొన్నాడు, నేర్చుకొన్నాడు, తన అస్తిత్వాన్ని స్థిరంగా ప్రకటించుకొన్నాడు. ఇప్పుడు మనమూ అంతే! తెలుగు భాష, సాహిత్యాలను విద్యార్థులకు బోధించడానికి, విద్య వ్యాప్తం చేయడానికి భాషా సాంకేతిక శాస్త్రవేత్తలు ఎందరో ప్రయత్నించి అనేక రకాలైన సామగ్రిని లేదా పరిసరాలను, విధానాలను కనిపెట్టారు. వాటిని క్రమంగా నేర్చుకొని తెలుగు సమాజం సాంకేతికంగానూ ముదుకు వెళ్ళగలిగే స్థాయిని మనమే ఏర్పరచాలి. అందుకు మనమందరం ప్రయత్నించి సాధించాలి అంటే ఇప్పుడు భాషా సాంకేతిక నిపుణులు, శాస్త్రవేత్తలు చెబుతున్న ఆయా అంశాలను విధిగా నేర్చవలసి వున్నదని, ఆ అవసరం ఎంతో వుంది.

BHAVAVEENA
Vol. 18, Issue. 6, June 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# జానపద గేయాలు – జగద్ధితవాక్యాలు

– డా॥. పఠాన్ ఖాసిం ఖాన్, సహాయ ఆచార్యులు, భారతీయ భాషల అధ్యయన కేంద్రం, ఆలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం, ఆలీఘర్.

కలలు కాదు, కల్పితాలు కాదు. కష్టజీవుల హృదయాంతరాళాల్లోనుంచి ఉబికివచ్చిన జానపద గేయాలు. కవనపుకడలి అలలు, రైతులు, రైతు కూలీలు, శ్రామికులు, కార్మికులు, కమ్మరి, కుమ్మరి, జాలరి, చాకలి, సాలీలు వంటి సమస్త వృత్తులవాళ్ళు, సర్వవిధ శ్రమజీవులు ఈ సాహిత్యోధ్వర సమిధలు. జగద్ధితార్థం ఈ సాహిత్యాధ్వరం. జానపద గేయాలలోని లోక హితోక్తులను పరిశీలించటం ప్రస్తుత వ్యాసాల లక్ష్యం.

సందెవేళ చుక్క ఓ చందమామ తల్లిగావలెమాకు ఓ చందమామ

చల్లనీ చందురుడు ఓ చందమామ
తండ్రిగావలెమాకు ఓ చందమామ

ఆదినారాయణుడు ఓ చందమామ
అన్నగావలెమాకు ఓ చందమామ

వరపుత్రి జానకి ఓ చందమామ
వదినగావలెమాకు ఓ చందమామ

దక్షిణాపు దిశ చుక్క ఓ చందమామ
అక్కగావలెమాకు ఓ చందమామ

బంగారి సూర్యుడు ఓ చందమామ
బావగావలెమాకు ఓ చందమామ

మాపటీలు చుక్క ఓ చందమామ
మరిదిగావలెమాకు ఓ చందమామ

మల్లెల్లశ్రీలక్ష్మి ఓ చందమామ
చెల్లెగావలెమాకు ఓ చందమామ

జానపదుల వసుదైక కుటుంబ భావానికి ఈ గీతం సంపూర్ణ సాక్ష్యం. తల్లి, తండ్రి, అన్న, వదిన, అక్క, బావ, మరిది, చెల్లి వంటి బంధువాచకాలకు సర్వసృష్టిలోని సమర్ధవంతమైన సాదృశ్యాలను సంగ్రహించి జానపదులు సర్వజనులను సమైక్యం చేస్తున్నారు. కుల, మత, వర్ణ, వర్గ, దేశ, భాష, ఆది భేదభావాలతో, అంతఃకలహాలతో అలమటిస్తూ, అణగారిపోతూ, అంతరించపోతున్న మానవజాతికి ఈ గీతం పునరుజ్జీవం. పృధ్వీశాంతికిది మూలం. సర్వసమస్యల పరిష్కారానికిది శక్తివంతమైన సాధనం.

పన్నెండు పరగణాలు - వానదేముడా
పంటల్లు పండాలి వానదేముడా

పన్నెండు ధాన్యాలు వానదేముడా
పంటచేలు పండాలి వానదేముడా

మా కడుపు నిండాలి వానదేముడా
పేదసాద బతకాలి వానదేముడా

కూలినాలి దొరకాలి వానదేముడా

పారిపోయిన మా బావ వానదేముడా
పరుగెత్తుక రావాలి వానదేముడా

ఊరెళ్ళిన మా బావ వానదేముడా
ఉరికురికి రావాలి వానదేముడా

తల్లిలేని పిల్లలు వానదేముడా
తల్లడిల్లుతున్నారు వానదేముడా

చేటంత మబ్బుపట్టి వానదేముడా
చెరువంత నిండాలి వానదేముడా

తూరుపున మొయిలేసి వానదేముడా
తుళ్ళితుళ్ళి కురవాలి వానదేముడా

ఈగతల్లి నీళ్ళాడి వానదేముడా
వీధివీధి నిండాలి వానదేముడా

దోమతల్లి నీళ్ళాడి వానదేముడా
దొడ్లెల్ల నిండాలి వానదేముడా

పాముతల్లి నీళ్ళాడి వానదేముడా
పంట చేల తిరగాలి వానదేముడా

కప్పతల్లి నీళ్ళాడి వానదేముడా
కడవ పంచల కూయాలి వానదేముడా

డబ్బుకు తవ్వెడు బియ్యం వానదేముడా
దేశమంతా దొరకాలి వానదేముడా

ఈ గేయమునందు సహితం జానపదుల సర్వజన సంక్షేమాభిలాష సంవిదితం. ఈగలు, దోమలు, పాములు, కప్పలు వంటి ప్రాణులను తల్లులుగా భావించటం పల్లె జనుల భూత దయకు ప్రమాణం. పేదసాదలకు, తల్లడిల్లుతున్న తల్లిలేని పిల్లలకు అందరికి అన్నం అందాలి. పశువులను, శిశువులను వెంట తీసికొని వెళ్ళి తీరాలి బయట ప్రదేశంలో ప్రజలందరు వర్షం కోసం పరమాత్మని ప్రార్ధించడం ఇస్లాం ధర్మాచారం. అదేవిధంగా ఇక్కడ తల్లిలేని పిల్లలను చూపి ప్రార్ధించడం జరిగింది. పల్లె ప్రజల వర్షాధిక్య వాంఛ, ఈగలూ, దోమలు, పాములు, కప్పలు వంటి ప్రాణి వృద్ధి కాంక్ష ద్వారా ప్రస్ఫుటమవుతుంది.

తల్లికాల్లకు మొక్కే తనయుండు తనయుండు
తండ్రి సేవలు జేసే తనయుండు తనయుండు
దానధర్మము జేసే ధనికుండు ధనికుండు
కల్లలాడని వాడె కరణుండు కరణుండు
భూదేవికిని మొక్కే పురుషుండు పురుషుండు

సల్లైన నీళ్లైన సద్దిబువ్వైన బాటెంట
వొయ్యేటి పాంధులకు వోసి

సల్లబరిచేతల్లి సల్లన్ని తల్లి
మేలు చేసే తండ్రి మెచ్చైన తండ్రి

తల్లి కాళ్ళ దగ్గర స్వర్గం ఉందని, తండ్రి స్వర్గ ప్రధాన ద్వారమని ఇస్లాం ప్రవచిస్తుంది. జనని జన్మభూమి స్వర్గంకన్నా మిన్నయని రాముడు వక్కాణిస్తాడు. అందుకే పల్లె జనులు సహితం తల్లిదండ్రుల సేవ చేసే తనయుడే తనయుడని ఉగ్గడిస్తున్నారు. అన్నదాన, ఆవశ్యకతను అన్ని ధర్మాలు ప్రవచిస్తున్నాయి. బాటసారులకు సత్తైన, నీళ్ళైన, సద్దిబువ్వైన పెట్టి సంతృప్తి పరిచే తల్లియే తల్లి, మేలు చేసే తండ్రియే తండ్రి దాన ధర్మాలు చేసే ధనికుడే ధనికుడు, కల్లలాడని కరుణాత్ముడే కరుణాత్ముడని జానపదులు సర్వధర్మసారాన్ని స్పష్టపరిచారు.

పరహితాభిలాషులు తాము చెడిపోయిన ఇతరులు తనులాగ చెడిపోకూడదని చెప్పుతుంటారు. దానికి ఉదాహరణయే మల్లరెడ్డి.

మల్లరెడ్డి మల్లరెడ్డంటుండ్రీ
మల్లిగాడు మల్లిగాడనపట్రీ
నీలాకనే నేనుంటిరో
నాలాకనే నువ్వయితవురో

ఈ గీతంలోని మల్లరెడ్డి భాగ్యవంతుడు. వేశ్యాలోలుడై ఉన్నదంతా పోగొట్టుకొని వేశ్యా గృహానికి ద్వార పాలకుడయ్యాడు. బాగా అలంకరించుకొని వేశ్యాగృహానికి వస్తున్న ఓ వ్యక్తిని తన లాగా చెడిపోవద్దని తిరిగిపొమ్మని ఉద్బోధిస్తున్నాడు. పరోపకార పరాయణతకు పరాకాష్ఠ మల్లరెడ్డి.

సంతానార్థం గృహమేధులవటం సర్వధర్మ సమ్మతం. సంతానం కోసం ఓ స్త్రీ స్వామిని ఇలా అర్ధిస్తుంది.

సామి నాకు సంతానం దయ చేయరాదా ॥సామి॥

పాడుంటె పదిమంది కోస్తరంట జనులు
ఓసి నువ్వు పోసినవ లేవే?

పాడుంటె పదిమంది కోయలేదు సామి
తలుపేసికొని ఇంట్లదాగున్న సామి ॥సామి॥
ఓసి నాకు సంతానమికయాడగలదే

వాడలో బాలలు ఆడుచుండగ ఎలపెట్టి పండ్లుగొని
ఇచ్చేరు జనులు ఓసి నువ్వు ఇచ్చినవ లేదే?

ఎలిపెట్టి పండ్లుగొని ఇవ్వలేదు సామి కోలకట్టెలతోటి
కొట్టి నా సామి ॥సామి॥

ఓసి నీకు సంతానమిక యాడగలదే

ఈ గీతంలో సంతానార్థం చేయాల్సిన సత్కార్యాలు సముదితం. పూర్వం పాడి ఉన్నవాళ్ళు పాలు పెరుగు కాకపోయినా మజ్జిగైనా ఇరుగు పొరుగు వాళ్ళు పోసే వాళ్ళు. దీపం పెట్టి దేవుని మొక్కుకొనేవాళ్ళు. పిల్లలకు పళ్ళు పంచేవాళ్ళు. ఇట్టి పుణ్యకార్యాల వల్ల సంతానం కలుగుతుందని ఈ పాట ప్రస్ఫుటం చేస్తుంది.

కాని వారిలోను కావించు చెలిమి
కట్టె విరిచి పోయిన పెట్టినట్లుండు
అయిన వారితో కావించు చెలిమి
ఆకు మడచి మడత పెట్టునట్లుండు
కానివారి మాట కంట్లోది నలుసు
ప్రాణం పోయిందాక ప్రక్కలో పోటు
అయిన వారి మాట అమృతంపు తేట
బ్రతికి ఉన్నందాక భాగ్యంపున బాట
ఉన్న ఊరు విడిచి ఉండనే లేము
కన్నతల్లిని విడిచి ఘడియుండలేము
బియ్యము తెల్లన్న పిండి తెల్లన్న
వరుస దప్పిన వాని వలికి తెల్లన్న
వరుసగానాదాన్ని వరుసలాదేవు
పాపాత్మ నీ శిరసు పక్కున పగులు
కాలినిండా గుడ్డ వెయ్యంది రోత
కావివాళ్ళు కనెత్తి చూచింది రోత
మంచి గంధపు చెక్క సావనే చీకు
మంచాలి దేహమ్ము మనసులో చీకు
ఆయుస్సు మూడినను ఆకు చిరిగినను
బ్రతికించు వారెవరు? అడుగువారెవరు?
ఉన్నఊరే నాకు చెన్నపట్నము
కన్నతల్లే నాకు కల్పవృక్షమ్ము
చిమడకే చిమడకే ఓ చింతకాయ
నువ్వెంత చిమిడినా నీ పుల్ల పోదు
ఉడకవే ఉడకవే ఓ ఉల్లిపాయ
నువ్వెంత ఉడికినా నీ కంపు పోదు

పల్లె జనుల అనుభవ జ్ఞానానికి పై గేయం నిలువు టద్దం. నరుల నైజాన్ని, నడతను జానపదులు నిసర్గ మనోహరంగా అభివర్ణించారు. కాని వాళ్ళతో చెలిమి ఎంత కష్టతరమో, అయిన వాళ్ళతో చెలిమి ఎంత అనాయసమో తెలిపే సముచిత దృష్టాంతాలు సంప్రయుక్తం, ఉన్న ఊరు కన్నతల్లి తోకల గాఢానుబంధం సుస్పష్టం. పరిణామ మాడదగని అమ్మ, పిన్నమ్మ, పెద్దమ్మ మొదలైన వరుస ఖురాను నందుక్తం. వరుస తప్పటం అధర్మం, పాపం, అందుకు శిక్ష శిరస్సు పగలటం. పాపాత్ములపై పల్లె జనుల ప్రకోపాన్ని, శాపాన్ని, 'పక్కున పగులు' అనే పదాలు ప్రదర్శిస్తున్నాయి.

కాయం కనబడకుండా కట్టాలి బట్ట. కనిపించేటట్లు కట్టడం రోత. కాని వాళ్లను కన్నెత్తి చూడటం మరీ రోత. సర్వేంద్రియాలలో నయనం ప్రధానమే కాదు ప్రమాదమని కూడా పల్లె జనం ప్రస్ఫుటం చేస్తున్నారు. ఇంద్రియ నిగ్రహమే కాదు మనో నిగ్రహమత్యావశ్యకం. జానపదుల ధార్మిక జీవనానికిది దర్పణం.

తాగవొద్దురా కల్లు తాగవొద్దురా
తాగువారితోడ దోస్తి జేయవద్దురా ॥తాగ॥
అన్న చెల్లెలిద్దరు కల్లు దాగపోయినారు
మల్లమల్లి వచ్చేటప్పుడు ఆలుమొగలైనారు ॥తాగ॥
సజ్జనులు మెచ్చవోరు సావుకార్లు నమ్మవోరు పావుసేరు
పప్పగల్లు సేతిలోన బెట్టవోరు ॥తాగ॥
కుడువ వోలె కూడు లేదు గుడిసె మీద దుగ్గు లేదు
మల్లమల్ల తాగినీవు ఇల్లు ముంచుకుంటావు ॥తాగ॥

మద్యపానం మానవుని మతిలేని వానిగా చేస్తుంది. వరుసలు తప్పడం సజ్జనులు మెచ్చరు, సావుకార్లు నమ్మరు, కూడుండదు. గుడిసెమీద దుగ్గుండదు. కొంప ముంచటం వంటి తిప్పలకు తాగుడే మూలం. అందుకే మహాభారతం, ఖురాన్ గ్రంథం వంటి ధార్మిక గ్రంథాలలో మద్యపానం నిషేధితం. ఈ గీతంలో జానపదులు

సంస్కారాభిలాషను వ్యక్తం
ఎంత పనిచేసెనే కాలంబూ
ప్రజలు జేసి పాపంబూ ॥ఎంత॥

పాపంబు హెచ్చాయె పుణ్యంబు తచ్చాయె
పైసాగర్వామాయె పరమాత్మ అవరైరి ॥ఎంత॥
ఇంటి పురుషుని జూసి ఇసమానిపలికేరు
పర పురుషులను జూసి పకపకా నవ్వేరు ॥ఎంత॥
భూమెంతో బారువాయెనయ్యా
మందువోసె మంటవెట్టి రయ్యా ॥ఎంత॥
ఎనకమోటలు ఎత్తపోయె నడమధ్య నరాటమాయె
ఇంజన్లు లావాయె ఇంటి సొమ్ములు వాయె ॥ఎంత॥
టెర్రీకాటను దాడ్గుటాయె
చేతి కాంగ్రీసైండు గడీలాయె ॥ఎంత॥
నోటిలో విడియాము చేతిలో సిగరెట్టూ
హోటల్లో దినేరు మోటర్లు వక్కేరు ॥ఎంత॥
నాలుగ్గుండిల రైకలాయె నాభి కింద సీరలాయె
మొగవానితో సారి మోటార్ల కూసోని
యాత్రాకెల్దామని ఆగమైరి స్త్రీలు ॥ఎంత॥
లంచాలు లావాయెనయ్యా
ఎంచపంచాయితీలు పెరిగెనయ్యా
తెలిసిన వారిని చెప్పుమని అడిగితె
పైసాకాసాపడి పనివున్నడంమారు ॥ఎంత॥

పాపం తరగాలి పుణ్యం పెరగాలి, పైకపు గర్వం పోవాలి, పరమాత్మను ప్రార్థించాలి వంటి సుభాషితాలు జానపదుల సంస్కారవంతమైన జీవన సరళికి నిదర్శనాలు.

కలియుగ ప్రపంచ నడక కనుల జూడండీ
కలవలపు మాటలు జెప్పుకుంటా గడుపుతారండీ
తల్లిదండ్రీ దైవమనుచు దలపలేరండీ

ఇత్యాదిగా సాగిన పాట వట్టి మాటలు కట్టిపెట్టాలి. తల్లిదండ్రులను గౌరవించాలి, పైపై డాబులు పనికిరావు వంటి సూక్తులతో సంభరితం.

"అప్పగించితిమీ ఒప్పుల తల్లి నీ అప్పగించితిమీ"

వంటి అప్పగింతల పాటలలో అత్తమామలు, ఆడుబిడ్డలు, భర్త, తోడికోడళ్ళు, బావ, మరదులు ఇరుగు పొరుగు వారు మున్నగువారితో ఎలా మెలగాలో తెలియజేసే ప్రబోధాలున్నాయి.

కొండకోన ఉడ్డిమల్ల చికటిమత్తోరో
లోకమంత మరియత్తె వెలిగికేవ్రటో
మనడంత సదవలో సదవాలతమ్మా
మనడంత సదవలో సదవాలసెల్లో

హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని చదువు కొమ్మని కోరినట్లే కోయజాతివాళ్ళు కూడ చదువు విలువ తెలిసికొని బ్రతుకు దెరువు మార్చుకోవాలని రేలపాట పాడుచున్నారు. ఖురాను ఆదివాక్యం సహితం చదువుమనే శాసిస్తుంది.

మద్యపానం, ధూమపానం, వ్యభిచారం, అక్రమం, అధర్మం, అధ్వాన్నం, అశ్లీల వస్త్రధారణం, లంచాలు, పంచనలు వంటి దురాచారాలను వివరించి వాటిని వారించటానికి, చదువు, సంస్కారం, సచ్ఛీలం వంటి సదాచారాలను పాటించటానికి పల్లె ప్రజలు పడే పలు పాట్లకు ఆగచాట్లకు ఈ గేయాలు దర్పణాలు, వారి పరోపకార వాంఛలకు ప్రమాణాలు. ప్రపంచ శాంతి పథాలు.

## అంతస్సూచికలు :

1. త్రివేణి - ఆంధ్రదేశ జానపద గేయాలు పుట 362
2. జానపద సాహిత్యంలో అలంకార విధానం - డా॥. కె. బుక్నుద్దీన్ పుట 352
3. జానపద సాహిత్యంలో అలంకార విధానం - డా॥. కె. బుక్నుద్దీన్ పుట 88

4. జానపద సాహిత్యంలో అలంకార విధానం - డా॥. కె. ఋక్నుద్దీన్ పుట 351
5. త్రివేణి - ఆంధ్రదేశ జానపద గేయాలు పుట 115
6. త్రివేణి - ఆంధ్రదేశ జానపద గేయాలు పుటలు - 336 & 334
7. జానపద విజ్ఞానం హాస్య గీతాలు - డా॥. ఎద్దుటూరి ఎల్లారెడ్డి పుట 53
8. జానపద విజ్ఞానం హాస్య గీతాలు - డా॥. ఎద్దుటూరి ఎల్లారెడ్డి పుట 54
9. జానపద విజ్ఞానం హాస్య గీతాలు - డా॥. ఎద్దుటూరి ఎల్లారెడ్డి పుట 74
10. తణుకు మండలం - జానపద సాహిత్యం - ఒక పరిశీలన - గోవాడ జాన్ పీటర్ పుట 124
11. చింతూరు మండలం ఖమ్మం జిల్లాలోని కోయ జాతి సాంఘిక జీవన సమీక్ష పుట 119
- కొదుమూరు జగన్మోహనావు

**ఉపయుక్త గ్రంథాలు :**

1. త్రివేణి - ఆంధ్రదేశ జానపద గేయాలు 1986. సంపాదకులు - శ్రీ బి. రామరాజు, శ్రీశ్రీపాద గోపాలకృష్ణమూర్తి శ్రీ నేదునూరి గంగాధరం, శ్రీ తూమాటి దొణప్ప. ప్రకాశకులు - తెలుగు విశ్వవిద్యాలయం - హైదరాబాద్.
2. జానపద సాహిత్యంలో అలంకార విధానం - 1989, డా॥. కె. ఋక్నుద్దీన్.
3. జానపద విజ్ఞానం - హాస్య గీతాలు - 1991 - డా॥. పొద్దుటూరి ఎల్లారెడ్డి, ప్రచురణ - జాతీయ సాహిత్య పరిషత్, పాలమూరు, మహబూబ్‌నగర్ జిల్లా.
4. తణుకు మండలం, జానపద సాహిత్యం ఒక పరిశీలన - 2011, అముద్రితం - పరిశోధకుడు - గోవాడ జాన్ పీటర్, సిద్ధాంత వ్యాసం - మద్రాసు విశ్వవిద్యాలయం.
5. చింతూరు మండలం (ఖమ్మం జిల్లా) లోని కోయజాతి సాంఘిక జీవన సమీక్ష - 2011, అముద్రితం, పరిశోధకుడు - కొదుమూరు జగన్మోహనరావు, లఘు సిద్ధాంత వ్యాసం - ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

# మనసు కవి – మన 'సు' కవి – గేయ సాహిత్యం

– డా॥. పెండ్యాల లావణ్య
తెలుగు అధ్యాపకులు, డా॥. కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాల, దుగ్గిరాల.

– పి. శాంతి
పరిశోధక విద్యార్థిని, తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

మనసులోని భావాలకు అక్షర కూర్పు చేర్చి మదిని రంజింపచేసిన మనసు కవి, మన 'సు' కవి ఆత్రేయ. తెలుగు సినీ గేయాలకు మనసు తడిని అద్దిన కవి ఆత్రేయ. అలతి పదాల్లో అనల్పార్థాన్ని నింపిన భావుకుడు. తెలుగు తెర వెండి పాటల్లో చందమామలా ప్రకాశించే సూర్యుడు ఆత్రేయ.

ఆయన అక్షరాలు బీజాక్షరాలు, మనస్సును హత్తుకునే పాటలు, మనిషిని గెలుచుకునే మాటలు, సాహిత్యాన్ని సుసంపన్నం చేసని కథలు, ప్రపంచాన్ని శాసించిన నాటకాలు ఇలా ఒకటేమిటి అన్నింటా ఆయన పున్నమి చంద్రుడే. ఓ వ్యక్తి జీవితంలో ఎన్ని దశలుంటాయో, ఎన్ని సందర్భాలుంటాయో, మధురిమలు, విషాదాలు, బాధలు, సంతోషాలు, ఆశలు, స్వప్నాలు, విశేషాలు, ఉద్వేగాలు. ఇలా అన్నింటిని తన పాటల్లో పలికించిన పాటల రేడు. తెలుగు సినీ సాహితీ క్షేత్రాన్ని సుసంపన్నం చేసిన మనసు కవి ఆత్రేయ. కొంతమంది కవులు ఆత్రేయ గొంతెత్తి పాడలేదు, గుండెత్తి పాడారంటారు.

ఆయన అక్షరాలు బీజాక్షరాలు వాటి విలువ శాశ్వతం. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను చవిచూశారు. ఆత్రేయను అపర శ్రీనాధుడు అనే వాళ్ళున్నారు. తన జీవితంలో ఎదురైన ఎన్నో సందర్భాలను పాటల రూపంలో పొదివి గుండె బరువును దింపుకున్నారు.

ఆత్రేయ అసలు పేరు కిళాంబి వేంకట నరసింహా చార్యులు. నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేట తాలూకా మంగళంపాడులో మే 7 1921వ సంవత్సరంలో జన్మించాడు. పసిప్రాయంలోనే తల్లిని పోగొట్టుకున్నారు. వీరిది ఆత్రేయ గోత్రం. అందుకే వీరు పేరును గోత్రంతో కలిపి ఆచార్య ఆత్రేయ అని పేరు పెట్టుకున్నారు. ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడే నాటకాల మీద మోజుతో చదువుకు స్వస్తి పలికాడు. వీరికి బాల్యదశనుండే నాటకాల్లోని పద్యాలను, రాగయుక్తంగా పలికే ఆత్రేయకు ఆ వయసు నుండే సంగీత, సాహిత్యాల పట్ల ఆసక్తి పెరిగింది. తన అభిరుచితోపాటు బతుకుతెరువు కోసం టీచర్ ట్రైనింగ్ పూర్తిచేసి కొన్ని సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆ తరువాత లేఖకునిగా, గుమస్తాగా, పత్రికా సంపాదకునిగా ఉద్యోగాలు చేసి చివరకు సినీ ప్రపంచంలో స్థిరపడ్డారు.

పాటల రచయితగానే కాక నాటక రచయితగా కూడా ఆత్రేయకు మంచి పేరుంది. ఎన్.జి.ఓ., ఈనాడు నాటకాలు రచించి ప్రదర్శనలిస్తూ ఆంధ్ర దేశమంతటా పర్యటించారు. 1949 సంవత్సరంలో ఎన్.జి.ఓ నాటకానికి ఆంధ్ర నాటక కళా పరిషత్ పోటీలలో ప్రథమ బహుమతి లభించింది. విశ్వశాంతి, కప్పలు, భయం, బలిదానం, ఒక రూపాయి, తెరచిన కళ్ళు లాంటి సుమారు 15 నాటకాలు నేడు మనకు అందుబాటులో ఉన్నాయి. తన స్వీయ రచన ఆత్మకథను 'తొలిగాయం' పేరుతో పద్య రూపంలో రాశారు. వీరి రచనలన్నింటిని మొత్తం 9 సంపుటాలుగా మనస్విని సంస్థ ముద్రించింది. రాయల సీమలోని క్షామ పరిస్థితుల్ని కళ్ళకు కట్టినట్టు రచించిన తీరు ఎందరినో ఆలోచింప చేశాయి. ఆత్రేయ నాటకాలు ఆయన కలం బలాన్ని తెలియజేశాయి. ఆత్రేయ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడాడు. తన పాటల ద్వారా మాటల ద్వారా ఉద్యమకారుల్లో స్ఫూర్తి నింపారు. వీరు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు పాలై

య్యారు. తరువాత క్రమంగా కమ్యూనిస్ట్ భావాలవైపు ఆకర్షితులైయ్యారు.

ఆత్రేయ సినీరంగ ప్రవేశం 1951వ సంవత్సరంలో విడుదలైన 'దీక్ష' చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయ మయ్యారు. దాదాపు 400 సినిమాలకు 1400 పాటలు రాశారు. ఆత్రేయ తన పాటలతో మనసుకు కొత్త భాష్యాలు చెప్పారు. మనసులోని భావాల్ని, అంతరంగ లోతుల్ని, పొరల్ని విడివిడిగా తన పాటలతో అల్లారు. ఎటువంటి శబ్దాడాంభికాలు లేకుండా నిర్మల గంగా ప్రవాహంలా సరళమైన పదాలతో పాటు రాశాడు. ప్రజల మాటల్నే పాటలుగా చేశాడు. పాటలుగా రాశాక తన పాటల్నే మాటలుగా చేశాడు.

ఆత్రేయ చిన్నతనంలోనే తల్లి ప్రేమకు దూరమవ్వడం వల్ల ఆ ప్రేమ మాధుర్యాన్ని అమ్మపై రాసిన పాటల్లో కురిపించారు. "అమ్మంటే అమ్మ అనంత సృష్టికి ఆమే అసలు బ్రహ్మ" (రామ్ - రాబర్ట్ - రహీమ్) అన్నాడు. "అమ్మ అన్నది ఒక కమ్మనిమాట అది ఎన్నెన్నో... మమతల మూట" (బుల్లెమ్మ బుల్లోడు) ఇటువంటి పాటల ద్వారా తల్లిప్రేమను చవిచూపించారు. ఆత్రేయ కేవలం మనసు పాటల్నే కాక వలపు పాటలు, జీవితాన్ని తర్కించే పాటలు, ప్రేమ గీతాలు, జానపద గీతాలకు సరికొత్త హంగులతో రాశాడు. పాటల రచయితగానే కాక దర్శకుడిగా, నిర్మాతగా అనేక చిత్రాలను రూపొందించారు. వీటితో పాటు 'నీలిమేడ' అనే కథ రాశాడు.

(ఆత్రేయ పేరు వినగానే తెలుగు సినీ పాటల పూదోట గుభాళించిన ఎన్నో పరిమళాలు మనమదిలో మెదలౌతాయి) వీరి పాటల్లో ఎక్కువగా మనసుకు సంబంధించిన ప్రస్తావనలే ఎక్కువ. అందుకే ఆయన్ని 'ఆంధ్రా ఇబ్సన్' అని పిలుస్తారు. ఆత్రేయ మనసు పెట్టి రాస్తే క్షణాల్లో బంగారం వంటి పాట రాసేసేవాడు. సగటు తెలుగు పలుకుబడులు ఆయన రాసిన మాటలలో, పాటలలో జీవం పోసుకునేవి. మహదేవన్ సంగీతం, ఆత్రేయ పాట, ఆదుర్తి దర్శకత్వం త్రివేణి సంగమంలా చాలాకాలం చిత్రసీమలో కనకవర్షం కురిసింది. భక్తి పాటలతో పరవశింపజేశాడు. హాస్యంతో గిలిగింతలు పెట్టాడు. విషాదంలో శిఖరాగ్రతం చేరాడు.

"ముద్దబంతి పువ్వులో మూగకళ్ళ ఊసులూ.. జనత జనమ బాధలు ఎందరి తెలుసులే బాసలూ..." చెపాలనా, "ఈనాడే ఏదో అయింది.. అందాల లోకం రమ్మంది" అని ప్రేయసీ, ప్రియుల్ని ఉక్కిరిబిక్కిరి చెయాలనా? 'మూగమనసు' యొక్క భృాష చెప్పాలనా? 'మంచు కురిచే వేళలో మల్లె విరసే దెందుకో' ఆలోచన చేయాలనా? "మధ్య తరగతి జీవుల బతుకుబండి గూర్చి చెప్పాలన్నా 'విశ్వ జనీన సమస్యలు వెలికి తీయాలనా? అది కేవలం ఆత్రేయకు మాత్రమే సాధ్యం.

"రాకరాక వొచ్చావు చందమామ" అంటూ చల్లని తేనెలూరు తెలుగు పాటని చిత్రరంగానికి పరిచయం చేసి, 'తేట, తేట తెలుగులా తెల్లవారి వెలుగులా' అంటూ తెలుగు పాటల్లోని తెలుగుదనాన్ని తెలుగువారికి అందించారు. అలాగే 'ఆడుతూ పాడుతూ పనిచేస్తుంటే అలుపు సొలుపేమున్నది' అంటూ పాటలు పాడుతూ పనిచేస్తూ పాటలు పాడుతుంటే కష్టం మరచి ఆనందంగా ఉంటే ఆ మధురిమ ఎలా ఉంటుందో వివరించారు. శిల్ప సంస్కృతి చాటిచెప్తూ 'శిలలపై శిల్పాలు చెక్కినారు మనవారు సృష్టికే అందాలు తెచ్చినారు' అంటూ తెలుగు చలనచిత్ర ప్రపంచానికే తలమాణికమైన అద్భుతమైన పాటలను అందించారు.

ఆత్రేయ రచనలు ఒక్కొక్కటి ఒక్కొక్క విశిష్టతను కలిగి ఉంటాయి. ఒకదాన్ని మరొకదానితో పోల్చి చెప్పలేము. ప్రియుడి చేత "ప్రియతమా నా హృదయమా" అంటూ ప్రేయసీ ప్రియుడి హృదయమనిపించినా, 'ఎదుటా నీవే ఎదలోనా నీవే' అంటూ ప్రేయసి తన గుండె లోతుల్లోనే 'ఉందనిపించినా, 'సిరి మల్లెపువ్వల్లే నవ్వు చిన్నారి పాపల్లె నవ్వు' అని ప్రియురాలి ఆనందాన్ని కోరుకున్నా, ఆనంద పారవశ్యంలో ఉన్న అదే ప్రియుడి చేత 'ప్రేమ ఎంత మధురం ప్రియురాలు అంత కఠినం'

అని ప్రియురాలి కఠినత్వాన్ని ఎత్తి చూపినా, 'ప్రేమలేదని ప్రేమించరాదనీ' అని భగ్న ప్రేమను చూపినా అది కేవలం ఆత్రేయకే చెల్లుతుంది. 'సాపాటు ఎటు లేదు పాటైనా పాడు బ్రదర్' అంటూ పొట్టచేత పట్టుకుని నగరాలకు వచ్చిన నిరుద్యోగ యువతకు చేయూతనిస్తూ 'పోరాబాబు పోరా.. ఎలుకోరా నీ గమ్యం చేరుకోరా' అని ప్రోత్సహించారు. ఒకవైపు చైతన్యాన్ని కలిగిస్తూ మరోవైపు ముద్దబంతి పువ్వులో దాగి ఉన్న ఊహల్ని బయటకు తీసి 'నీవులేక వీణే పలుకలేనన్నది' అంటూ తెలుగు సినీ ప్రపంచాన్ని ఊహాలోకంలో విహరింపచేశారు. అలాగే తెలుగు సాహితీ ప్రియుల సుఖాన్ని కోరుతూ 'నీ సుఖమే నే కోరుకున్నా' నన్నారు. 'తెల్లచీర కట్టుకుంది ఎవరి కోసము' అంటూ కొంటె ప్రశ్న వేసి అప్పటి కుర్రకారు ఉర్రూత లూగించారు. కుర్రోళ్ళోయ్-కుర్రాళ్ళు వెర్రెక్కి ఉన్నోళ్ళు' అని అంటూ, 'వేళ్ళాపాళలేదు ఈ కుర్రాళ్ళాటకు' అంటూ చమత్కరించారు.

కళ్ళుకూడా మాట్లాడగలవని ఆత్రేయ సాహిత్యం నిరూపించింది. 'కనులు కనులతో కలబడితే ఆ తగువుకు పేరేమి' అని సూటి ప్రశ్న సంధించి, 'కళ్ళలో ఉన్నదేదో కన్నులకే తెలుసు' అని 'నా మాటే నీ మాటై చదవాలి' అని, 'పల్లవించవా నా గొంతులో పల్లవికావా నా పాటలో', 'మాట లేకపోతేనేమి మౌనమే నీ భాష ఓ మూగమనసా' అన్నారు. ఈ విధంగా మనసులో పలికే మాటలు మనసెరిగిన మన 'సు' కవి తప్పా ఇంకెవరికి సాధ్యం.

మనసును అద్దంలా తీర్చిదిద్ది దాని భాషను మాటల ద్వారా భాష్యం చెప్పిన ఘనత ఆత్రేయది. 'మనసు గతి ఇంతే మనిషి బ్రతుకింతే' అంటూ మనసు మనిషికి మధ్య జరిగే ఘర్షణను మనోహరమైన కావ్యం ద్వారా వెలి బుచ్చారు. 'భారతమాతకు జేజేలు' అంటూ దేశభక్తిని చాటి చెప్పారు. 'ఉన్నావా అసలున్నావా? ఉంటే కళ్ళు మూసుకున్నావా?' అంటూ దైవాన్ని నిలదీసిన ఘనత ఆత్రేయదే. తనకున్న భక్తి తత్పరతను శేషశైలవాస శ్రీవేంకటేశ' అంటూ చాటి చెప్పారు. ఎన్నో భగ్న హృదయాల్ని తన పాటల ద్వారా ఆవిష్కరించిన మనసు కవి సైతం ప్రేమలో విఫలమైనవారేనట. భగ్నప్రేమికుల హృదయాల్ని వారి విరహ తాపాన్ని, దూరాన్ని మనసు పిండే విషాద గీతాలలో ఆత్రేయ కలం పెనవేసుకు పోయింది.

ఆత్రేయ పాటతోపాటు మాటలుసైతం ప్రేక్షక హృదయాల్ని అలరించాయి. భావాన్ని ప్రేక్షకుడి మనసుకి సూటిగా తాకేట్టు చేయటంలో ఆత్రేయ పటిమ ఎనలేనిది. భాషతో భావాలతో ఆయన ఎప్పుడూ వెట్టి చాకిరీ చేయించుకోలేదు. అలవోకగా పలికే పదాలు ఆయన చేతిలో అందంగా అమరిపోయేవి. మనసు లోతుల్లోకి తొంగి చూసి, మనసును ఎవరూ చెప్పలేనంత లోతుకి చెప్పిన మహాకవి ఆత్రేయ.

ఆత్రేయ తాత్విక ధోరణిలో రాసిన సంభాషణలు జీవన గమనాలు గుట్టు విప్పుతాయి. జీవితాన్ని కాచి వడపోసిన నగ్న చిత్రాలు. ప్రతి వ్యక్తి జీవితానికి మార్గదర్శకాలు. ఆత్రేయ తన రచనల్లోని సంభాషణలు తనదైన శైలిలో రాసి ప్రతి సన్నివేశాన్ని రక్తి కట్టించారు. సెంటిమెటల్ అనే పదానికి భావగర్భిత, కరుణ, శృంగార భావాలుగల అర్థాలున్నాయి. సెంటిమెట్ డైలాగ్స్‌ని రాయటంలో ఆత్రేయకు సాటి ఎవరు లేరు అనటంలో అతిశయోక్తి లేదు.

ఆత్రేయ గొప్ప వేదాంతి. ప్రతి విషయాన్ని వాస్తవిక దృష్టితో ఆలోచించి సంభాషణలను సమకూరుస్తారు. భాషను అదుపు చేయడం భావాన్ని అదుపు చేయటం లోను 'తిమ్మెర' వంటి తేలిక మాటలతో తేనెలు, తీయని తావులు వెదజల్లడంలో ఆత్రేయ మేటి. తిక్కనకు వారసుడు ఆత్రేయ అని శ్రీ వేటూరి సుందరామ్మూర్తి గారు వివిధ సందర్భాల్లో అంటుండేవారు.

"తినని దేవుడికి బలవంతంగా తిండిపెడతావు, తిండి లేక ఏడ్చే వాడిని తరిమి తరిమి కొడతావు"

"పని దొరకని పేదవాడిని సోమరిపోతంటారు. పనిచేయని గొప్పవాణ్ణీ పల్లకీల్లో మోస్తారు"

"కాటికెలితే అందరు ఒకటే అనుకో బోకు అక్కడ కూడా తేడాలున్నాయ్ కాలే వరకు"

"బతికుండగా నిన్ను ఏడిపించినోళ్ళు నువ్వు చస్తే ఏడుస్తావు దొంగనాయాళ్ళు" ఇటువంటి పకడ్బందీ మాటల బందీ ఆత్రేయది.

ఆత్రేయ "వేదాతం, వైరాగ్యం ఒంటబడితే చాలా ప్రమాదం వాటి జోలికి పోకుండా ఉంటే మంచిదన్నారు. అవి మనిషిలోని కార్యదీక్షను, గట్టి విశ్వాసాలను దెబ్బతీస్తాయి" అని చెప్తుంటారు. శృంగార రసం శృతి మించితే అశ్లీలమౌతుంది. రచయిత అశ్లీలం రాయనని మడికట్టుకు కూర్చుంటే సినీ పరిశ్రమలో రాణించలేరు. అందుకే ఆత్రేయను బూత్రేయ అనే పేరుతో పిలిచేవారు. మనసు కవి ఆత్రేయ రాసినన్ని మనసు పాటలు ప్రపంచవ్యాప్తంగా ఏ కవీ రాయలేదు.

సుఖ, దుఃఖాలకి స్పందించని హృదయం ఉండదు. స్పందించడానికి లింగ భేదాలు లేవు. అందుకే వారి పాటలకీ, మాటలకీ అందరు మంత్ర ముగ్ధులౌతారు. ఆత్రేయ గురించి చెప్పాలంటే తెలుగులో వేరే మాటలు, పదాలు లేవు. వారు ప్రయోగించిన పదాలు, మాటలు, పాటలతోనే వారి గురించి చెప్పాలే తప్ప వేరే మార్గం లేదు.

చిన్న చిన్న పదాలతో స్పష్టమైన భావాన్ని పలికించడంలో వీరు ఘనాపాటి. ఆచార్య ఆత్రేయ తెలుగు సినీ గేయ రచయితగా, సంభాషణ కర్తగా పేరు పొందినా నిజానికి అతడి మాతృరంగం నాటకాలే. నాటక రచయితగా అతడి స్థానం సుస్థిరం. మనసు కవిగా సినిమా వాళ్ళు పిలుచుకునే ఆత్రేయ నాటకాల్లో చక్కని ప్రయోగాలు చేసి నాటకరంగాన్ని మలుపు తిప్పారు.

ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడానికి పద్యం కంటే నాటకం బలమైన ప్రక్రియ అని భావించి నాటకరంగం వైపు మొగ్గు చూపించారు. ఇబ్సన్ ప్రభావంతో స్వాభావిక వాదాన్ని ఆశ్రయించి, ఆధునిక నాటకరంగంలో నూతన ధోరణులను ప్రవేశపెట్టిన బళ్ళారి రాఘవ, పి.వి. రాజమన్నార్ లను ఆదర్శంగా తీసుకున్నారు. వీరి ప్రోత్సాహంతో ఆత్రేయ నాటక రచనను కొత్తపుంతలు తొక్కించి ఆధునికాంధ్ర వచన నాటకరంగంలో యుగ కర్తగా గుర్తించబడ్డారు. అసంబద్ధ నాటక ధోరణిలో తన అభిమాన పాత్రలకు ఈటెల్లాంటి మాటలను రాసి సమాజాన్ని జాగృతం చేశారు. ప్రజల కళ్ళు తెరిపించడానికి తాను చేసిన తపస్సు నుండి తన నాటకాలు వెలువడ్డాయంటారు. కవిత్వ, నాటక దశలలో తన అభ్యుదయ దృక్పథాన్ని, సామాజిక స్పృహను ఎలుగెత్తి చాటారు.

## ఆత్రేయ గారి కొన్ని నాటకాలు :

**1. గౌతమబుద్ధ** : గౌతమబుద్ధ రచన 1943 సంవత్సరంలో రచించారు. ఈ నాటకానికి మూలం బెర్నార్డ్‌షా వ్రాసిన 'The black girl in search of God' అనే కథను తీసుకున్నారు.

**2. అశోక్ సామ్రాట్** : ఈ నాటకాన్ని 1944వ సంవత్సరంలో రచించారు. ఈ నాటకానికి మూలం చారిత్రక గ్రంథం నుండి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

**3. పరివర్తన** : నీ నాటకాన్ని 1945 వ సంవత్సరంలో రచించారు. ఈ నాటకాన్ని హిందీలో అనువదించి 'హంరాహి' అనే హిందీ చిత్రాన్ని కూడా తీశారు. పరివర్తన నాటకాన్ని బళ్ళారి రాఘవ గారికి అంకితమిచ్చారు. ఈ నాటకాన్నే 'కలిమంగవ' పేరుతో అనువాదం చేశారు. ఈ నాటకం ద్వారా ఆచార్య ఆత్రేయ ప్రజానాట్యమండలికి పరిచయమైయ్యారు.

**4. వాస్తవం** : ఈ నాటకాన్ని 1946వ సంవత్సరంలో రచించారు. ఈ నాటకం మొత్తం రాజకీయంగా నడిపించారు. అప్పటి కాంగ్రెస్ పార్టీ యొక్క ప్రభావం ప్రజలమీద ఎలా ఉందో ఈ నాటకం ద్వారా కళ్ళకు కట్టినట్లు చూపించారు.

**5. ఈనాడు** : ఈనాడు నాటకాన్ని 1947వ సంవత్సరంలో రచించారు. బర్మా దేశ రాజధాని రంగూన్‌లో

జరిగిన మతకల్లోలాలకు ఆధారంగా ఈ నాటకాన్ని రచించారు. ఈ నాటకానికి ప్రేరణ 'The Banfire' అనే ఆంగ్ల కథ. మత సామరస్యం కోసం రచించడం వలన ఈ నాటకం ప్రజాదరణ పొందింది. ఈ నాటకాన్ని గాంధీజీకి అంకితమిచ్చారు.

**6. ఎన్.జి.ఓ :** ఈ నాటకాన్ని 1948వ సంవత్సరంలో రచించారు. మధ్య తరగతి కుటుంబాల స్థితిగతులను, వారి సంభాషణలు నాటకాన్ని రక్తి కట్టించాయి. 'ఎన్‌జీఓ' నాటకం ఆత్రేయకు పేరు ప్రతిష్టలు తెచ్చి పెట్టాయి. ఈ నాటకం అనేక భారతీయ భాషల్లోకి అనువదించారు. 1953వ సంవత్సరంలో ఈ నాటకాన్నే తెలుగు చిత్రం 'గుమస్తా'గా తెరకెక్కించారు. కన్నడంలో 'లంచావతారం' అనే పేరుతో అనువదించారు. ఆత్రేయ మొదట ఈ నాటకానికి 'అద్దెకొంప' అనే పేరు పెట్టి తర్వాత ఎన్‌జీఓగా మార్చారు.

**7. విశ్వశాంతి :** ఈ నాటకాన్ని 1951వ సంవత్సరంలో రచించారు. ఈ నాటకంలో ఆత్రేయ వినూత్న ప్రక్రియ చేశారు. ఈ నాటకానికి శ్రీశ్రీ ముందుమాట రాశారు. శ్రీశ్రీ ముందు మాటలో 'నాటక రంగమనే వైద్యశాలలో జరుగుతున్న ఒక చికిత్సా విధానమే ఈ విశ్వశాంతి' అని అభివర్ణించారు. శ్రీశ్రీ మహా ప్రస్థానంలోని గేయాలు ఇందులో ప్రయోగించారు.

**8. కప్పలు :** 1953వ సంవత్సరంలో ఈ నాటకాన్ని రచించారు. పూర్తి వ్యంగ్యార్థంలో రచించబడిన హాస్య నాటకం.

**9. భయం :** ఈ నాటకాన్ని 1954వ సంవత్సరంలో రచించారు. ఈ నాటక రచనలో సినీ నాటక ప్రముఖుడు నాగభూషణం సహకరించారు. సగటు మనిషి జీవితంలో భయానికి అద్దం పట్టిన నాటకం ఇది. ఆత్రేయ రచించిన నాటకాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన నాటకంలో ఇది ఒకటి.

**10. మనసూ - వయసు :** ఈ నాటకాన్ని 1968వ సంవత్సరంలో రచించారు. ఈ రచనకు మరోపేరు 'తిరుపతి'. ఈ నాటకానికి మూలం హోవర్డ్ వ్రాసిన 'They knew what they wanted' అనే కథగా చెప్పవచ్చు. ఇదే వారి చివరి రచన.

**11. మాయ :** రాయలసీమ క్షామ పరిస్థితులను వివరించారు. వీరి మిగతా రచనలు. ఎవరు దొంగ?, ప్రగతి, చావకూడదు, వరప్రసాదం మొదలగునవి.

ఆత్రేయ తన రచనల ద్వారా ప్రజల మనసులో సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. 1989వ సంవత్సరంలో మరణించే సమయంలో చరమ గీతాన్ని తేటగీతి పద్యంలో వారికి వారే రచించుకున్నారు.

"చలనచిత్ర నిర్మాతలు సంతసిల్ల
సురకవి రుండిది విని యచ్చెరువు పొంద
గురువు మల్లాది శ్రీశ్రీయు సరస నుండ
తరలె నాత్రేయ పరమ పదమ్ము చేర!"

చూడాలనుకున్నా మనసు కనిపించదు కానీ ఆత్రేయ పాటలో మనసు కనిపిస్తుంది. పలకాలనుకున్నా మనసు పలకలేదు. కానీ ఆత్రేయ మాటలో మనసు పలుకుతుంది. ఆత్రేయ మాటలు, పాటలు సంధించటంలో ఆరితేరిన సవ్యసాచి 'మనో విపంచిని శృతి చేసి మీటగలిగే మనసు కవికే అది సాధ్యం".

**ఆధార గ్రంథాలు :**

1. పుస్తక లోకం ఆచార్య తెలుగు కొండూరి రవి భూషణ్.
2. మనసు దోచిన కవి ఆత్రేయ 15 సెప్టెంబర్ 2019 సాక్షి.
3. సరసభారతి మనసు కవి ఆత్రేయ - 1, 2, 3 ఉయ్యూరు.

# జానపద సాహిత్యం – మానవతా దృక్పథం

– డా॥. డి. విజయ కుమారి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

సాహిత్యం ద్వారా సమకాలీన సామాజిక నేపథ్యం వ్యక్తమవుతుంది. నేటి సామాజిక పరిస్థితులు కూడా సాహిత్యంలో ప్రస్ఫుటమవుతున్నాయి. ప్రస్తుతం కరోనా వైరస్ వల్ల ప్రజల జీవన స్థితిగతులు పాటలు, కథలు, కవితలు, నవలల రూపంలో వెలువడుతున్నాయి. లిఖిత రూపంలో ఉన్న కథలు, కవితలు, నవలలు అక్షరాస్యు లకు మాత్రమే చేరుతాయి. కాని పాట మాత్రం నిరక్ష రాస్యులను కూడా చేరుతుంది. ఉదాహరణకి "పిల్ల జెల్లా ఎట్ల ఉండ్రో" అనే పాట వల్ల వలస కూలీల జీవన విధానం కళ్ళకు కట్టినట్టుగా కనబడుతుంది. ఈ పాట కూలీ దగ్గర నుండి కోటీశ్వరుడు వరకు చేరిందని చెప్ప వచ్చు. ఈ విధంగా అందరిని అలరింపజేసే సాహిత్యమే జానపద సాహిత్యం.

నన్నయకు పూర్వం నుండి జానపద సాహిత్యం ప్రచారంలో ఉంది. అయినప్పటికి ఈ సాహిత్యం మౌఖికంగా ప్రచారం పొందుతూనే ఉంది. సామాజిక సమస్యలను జానపద గేయాలు, కథలు, కథా గేయాలు, సామెతలు. పొడుపు కథలు, జానపద కళలు, కళారూపాల ద్వారా రూపుమాపే ప్రయత్నం జరుగుతుంది. ప్రజలను చైతన్యవంతులనుచేసే, ఈ సాహిత్యంలోని మానవతా విలువలు ఈ వ్యాసంలో చర్చించబడ్డాయి.

## బుడ్డా వెంగళరెడ్డి చరిత్ర - మానవతా దృక్పథం:

బుడ్డా వెంగళరెడ్డి గ్రామం ఉయ్యాలవాడ. ఇతని తండ్రి నల్లపరెడ్డి. వెంగళరెడ్డి తరువాత వరుసగా తిమ్మమ్మ, ఈశ్వరరెడ్డి, సుబ్బమ్మ జన్మించారు. క్రీ.శ. 1866లో రాయలసీమలో గొప్ప క్షామం ఏర్పడుతుంది. ఆ కరువు ధాతనామ సంవత్సరంలో వెలువడింది కాబట్టి, దానిని 'ధాత కరువు' అని అన్నారు. బుడ్డా వెంగళరెడ్డి ఆ ప్రజలకు అన్నవస్త్రాలిచ్చి ఆదుకుంటాడు. క్రీ.శ. 1866లో విక్టోరియా మహారాణి వెంగళరెడ్డి దానశీలతకు అబ్బురపడి, అతనికి ఒక స్వర్ణపతకాన్ని కూడా బహూకరించిందట. ఆచార్య టి.వి.సుబ్బారావుగారు ఆ గ్రామం వెళ్ళినపుడు, వారి వంశస్తుల దగ్గర ఆ పతకాన్ని చూశారట. ఆ పతకం వెనుక ఈ కింది విధంగా రాయబడిందట.

"Presented of the to Budda Vengala Reddy as a token of the high appreciation of her Majestydμs Government of his munificent liberality to his destitude country men in the famine of 1866".

(సుబ్బారావు, టి.వి. 2013. పుట: 483).

బుడ్డా వెంగళరెడ్డిని ఆ ప్రాంతం వాళ్ళు రేనాటి దాన కర్ణుడుగా అభివర్ణిస్తారు. రేనాటికి ఉయ్యాల నారసింహా రెడ్డిని సూర్యుడుగాను, వెంగళరెడ్డిని చంద్రుడిగాను వారు భావిస్తారు. బుడ్డా వెంగళరెడ్డి చెల్లెలు తిమ్మమ్మ నిరుపేదల కష్టాలను చూసి వారికి అన్నదానం చేయమని తన సోదరుని ప్రోత్సహించిన వైనం ఈ కింది పంక్తులలో కనిపిస్తుంది.

పడమర దేశంబు పైరులు లేక
    కుడువ నన్నములేక కొనప్రాణములను
చెడివచ్చి మనదాపు చేరియున్నారు
    పుడమి వారల బ్రోవ పుణ్యంబు గలదు
పుట్ట కెక్కినవాని పూరియునోట
    బట్టిన వానిని భయపడ్డవారి
ఘన వివద్దశవచ్చి కావు మటంచు
    వినయమ్మునను తన్నువేడినవాని
అని బలముడిగి నిరాయుధండగుచు
    తనుతానె పరువెత్తి దాగిన వాని
అన్నంబులేకను అడరెడు వాని
    మన్ననతో బ్రోవమటి కీర్తి గలదు

ఎన్నంగ దానంబు లెన్నిచేసినను
అన్నదానము సేయుటధిక ఫలమ

(రేనాటి సూర్యచంద్రులు, 1999. పుట: 322,323)

పడమట దేశంలో పేదలు పంటలు పండక తినడానికి తిండి లేక మన చెంతకు చేరారు. వారిని పోషించినట్లైతే మనకు పుణ్యం కలుగుతుంది. కష్టాలలో ఉన్నవారిని, భయపడినవారిని కాపాడాలి. మనచెంతకు చేరినవారిని, బలం లేక నిరాయుధలై పారిపోయనవారిని ఆహారం లేక బాధపడేవారిని మన్నించిన యెడల మనకు కీర్తి వస్తుంది. ఎన్ని దానాలు చేసిన అన్నదానం మించిన దానం లేదు అని సోదరుడైన వెంగళరెడ్డికి తిమ్మమ్మ మానవత్వ విలువల గురించి చెబుతుంది.

అపుడు వెంగళరెడ్డి పనివాళ్ళనిచ్చి తిమ్మమ్మను వెళ్ళి అన్నదానం చేయమని చెబుతాడు. తిమ్మమ్మ అన్న సత్రాలు కట్టించి బీదలందరికి అన్నదానం చేసిన వైనం ఈ కింది గేయంలో కనబడుతుంది.

"మనమున తిమ్మమ్మ మహదేవనీదె
ఘన పుణ్యకార్యంబు కడ తేర్చుమనుచు
బీదల కంబలుల్ ప్రేమ బోయించి
ఆదరంబున వారి యాకలుల్ మాన్చి
..................................
..................................
పనివాండ్ర రప్పించి పందిళ్ళ మర్చి
కొట్టముల్ శిబిరముల్ కొదువలేకుండ
కట్టించి తడికల కప్పు లెత్తించి
అందుకుంటి కురూపు లంధులనునిచి
కొందరు నవమాసకులకు వేర్వేఱ
ఇంతుల నొకపాటి యిండ్లలో నునిచి
ఇంతియె గాదు బాలింతలకెల్లి
పాసగ శాల్యన్న మింపుగ బెట్టివారి
పసి బాలరకు గోవు పాలాదిగాను
అగ్గించి ఖరము పాలను ద్రాగ బ్రనిచి
..................................
..................................
వంటజేయను నేర్పు వారి రప్పించి
వంట పాత్రల వారి కిప్పించి
వెంటనె అన్నంబు వేగ జేయించి
భక్షింప బీదల పంక్తుల నునిచి
విరివిగా పాత్రలు వేయించి యందు
అరమర లేకుండ అన్నంబు పెట్టి"

(రేనాటి సూర్యచంద్రులు. 1999.పుట: 324, 326)

రాయలసీమలో తీవ్రమైన కరువు వచ్చినపుడు బుడ్డా వెంగళరెడ్డి తన చెల్లెలయన తిమ్మమ్మకు సహాయంగా పనివారిని పంపించి పేదవారి ఆకలి తీర్చమని చెబుతాడు. అపుడామె పేదవారికి ప్రేమతో అంబలి పోయించి వారి ఆకలి తీర్చమని చెబుతాడు. అపుడామె తిమ్మమ్మ పని వాళ్ళను పిలిపించి పందిళ్ళు వేయించి, సత్రాలను కట్టించి అందులో కుంటివారిని, అంధులను ఉంచుతుంది. గర్భిణీ స్త్రీలను ఒక ఇంటిలో ఉంచుతుంది. బాలింతలకు పథ్యపుటన్నం పెట్టిస్తుంది. పసిపిల్లలకు ఆవుపాలను, గాడిదపాలను ఉగ్గు పెట్టిస్తుంది. బీదలకు అన్న సత్రాలను కట్టిస్తుంది. నేర్పరులైన వంటవారిని రప్పించి వంట చేయించి భిక్ష కోసం ప్రజలకు అన్నం వడ్డిస్తారు. కొంత మంది నీరు సరఫరా చేసి దాహం తీరుస్తారు. వెంగళరెడ్డి భార్యలు, అతని పినతల్లి శేషమ్మ చల్లని మాటలతో సంతోషంతో కూరలు చారులు ఆవకాయ పిండివంటలు మజ్జిగతో ప్రజలకు తృప్తిగా భోజనం పెట్టిస్తారు.

ఎవరెవరికి ఏ ఆహారం పెట్టాలో నిర్ణయించి, తిమ్మమ్మ వాటిని పనివారిచేత వండించి, వడ్డించడం మొదలైన పనులు నిర్వహిస్తుంది. ఇక్కడ ఆమెకున్న వ్యవహారదక్షత, నేర్పరితనం వెల్లడి అవుతున్నాయి. తిమ్మమ్మ సమర్థమైన పాలనాదక్షురాలుగా, మానవతా దృక్పథం, ఉదాత్తమైన దానశీలత గల స్త్రీగా సమాజంలో గుర్తింపు పొందిందని చెప్పవచ్చు.

కొంత కాలం తరువాత బుడ్డా వెంగళరెడ్డి దగ్గర ఉన్న ధనధాన్యాలు ఖర్చై పోతాయి. అపుడు అతని భార్యలు, చెల్లెలు తిమ్మమ్మ, వారి ఆభరణాలను తీసి, అన్నదానం చేయమని వెంగళరెడ్డికి ఇస్తారు.

"కొఱతేల! ధాన్యంబుగొనుము నీవనుచు
తొలగక బంగారు తొడవులుదీసి
పలుమాఱునివి శివార్పణమనియిచ్చె
.............................
..................................
పౌజుల కమ్మలు పసిడి యడిగెలు
బాజుబందులుకాన బావిరీల్ జడలు
కత్ర బావిరీల్కంకణంబులును
మెత్తని బంగారు మేటి ముర్కులును
చిలుకల కమ్మలు చిఱుత కంటియలు
పాలుపొంద గోధుమ పూసల సరులు
చాను పూల్కడియాలు చౌకడిల్జతలు
ప్రేమ పల్లెర పూలు బిల్లలడాబు
.................................
.................................
కడు సంతసించి వెంగళరెడ్డి గారు"

(రేనాటి సూర్యచంద్రులు. 1999. పుట: 359,362)

బీదలకు అన్నదానం చేయమని తిమ్మమ్మ వెంగళ రెడ్డికి తన ఆభరణాలను తీసి ఇస్తుంది. అది చూసి, రెడ్డి భార్యలిద్దరు ఆశ్చర్యపోయి, తాము ఉండగా ఆడపడుచు నగలు తీసుకోవడం వల్ల ప్రజలు వారిని చులకనగా చూస్తారని, ఆమె నగలు తిరిగి ఇచ్చి వేయమని, వారి నగలు తీసి భర్తకు ఇస్తారు. అపుడు వెంగళరెడ్డి ఎంతో సంతోషించి, అన్నదాన కార్యక్రమాలను నిర్విఘ్నంగా చేస్తాడు. ఇక్కడ స్త్రీలు పురుషుడితోబాటు సమానంగా బాధ్యతలు తీసుకుని, వారికి గల మానవతా దృక్పథాన్ని చాటి చెప్పారు.

ఈ విధంగా వెంగళరెడ్డి అతని కుటుంబ సభ్యులు ఆ ప్రాంతంలోని పేదవారిని ఆదుకుంటారు. ఇప్పటికి ఆ ప్రాంతంలో వెంగళరెడ్డి చేసిన ధన ధర్మాలను గుర్తు చేసుకుంటూ ప్రజలు కథలుగా పాడుకుంటారు.

"ఉత్తరాది ఉయ్యాలవాడలో- ఉన్నది ధర్మం చూడరయా
నేటికి బుడ్డా యెంగళరెడ్డీ- దొడ్డప్రభువనీ తెలియ రయా" !!ఉత్తరాది!!

(సుబ్బారావు, టి.వి. 2013. పుట. 483)

అని పై విధంగా వెంగళరెడ్డి గొప్పతనం కీర్తించ బడుతుంది.

అంతేగాక వెంగళరెడ్డి విగ్రహం మీద ఈ కింది విధంగా రాసి ఉందని టి.వి సుబ్బారావుగారు తెలుగు వీరగాథా కవిత్వంలో తెలియజేశారు.

"దొడ్డ ప్రభువనీ దొరలు మెచ్చగా - ఇడుపున గూర్చోనుండునయా
ఇడుపున గూర్చో వెంగళరెడ్డీ - ఇకయిక నగుతా నుండునయా"

(సుబ్బారావు, టి.వి. 2013. పుట.483)

ఒకరోజు వెంగళరెడ్డి 'చెన్నపల్లె' అనే గ్రామానికి వెళుతుంటాడు. అక్కడ కొంతమంది వెంగళరెడ్డిని చంపాలనుకుంటారు. ఆ శత్రువుల ఇంటిలో ఉన్న మాల కులానికి చెందిన ఒక వ్యక్తి, ఆ విషయాన్ని తెలియజేస్తాడు. రెడ్డి అతనికి తనపై గల భక్తికి మెచ్చి, అతన్ని పెంచి పెద్దచేసి, వివాహం వైభవంగా చేసి, మూడు రోజులపాటు, చుట్టూ ఉన్న గ్రామాలవారందరికి తన ఇంటిలోనే భోజనం ఏర్పాటు చేశాడట. ఆ మూడు రోజులు వంట చేసుకున్న వారికి జరిమానా విధిస్తానని చెప్పాడట.

"చుట్టూ వుండే ఆమడ పొడుగూ - లోపల మూడూ దినముల వరకూ
కుండపెట్టి కూడొండిన వాడికి - జులుమానుందని పలికెనయా"

(సుబ్బారావు, టి.వి. 2013. పుట. 483)

ఒకసారి వెంగళరెడ్డి కంకుల కోతకు మాలమాదిగలను పిలిచి, వారిని కంకులన్ని కోసుకుని, వట్టి చొప్పను మాత్రం, తనకు పంపించమంటాడు. వారు అదే విధంగా చేస్తారు. కాని రెడ్డి బంధువులు వారిని హింసించి, చావడిలో బంధించారట. అది తెలిసి అతడు దుఃఖించాడట. ఈ కింది గేయం వల్ల ఆ విషయం వెల్లడి అవుతుంది.

"ఎవరు కొట్టిరో నా పిల్లలనూ - ఎవరు తిట్టిరో నా పిల్లలనూ
మూడు నూర్లా దుడ్డుపోసీ- మందినెల్ల యిడిపించెనయా"

(సుబ్బారావు, టి.వి. 2013. పుట. 483)

ఈ విధంగా వెంగళరెడ్డి ఆ ప్రాంతంలోని మాల మాదిగలను ఎంతో దయతో ఆదరించేవాడని తెలుస్తుంది. ఇంకా అనేక కథలు వెంగళరెడ్డి దాతృత్వాన్ని కొనియాడుతూ వచన రూపంలో కూడా ప్రచారంలో ఉన్నాయని సుబ్బారావుగారు తన గ్రంథంలో పొందుపరిచారు.

## పల్నాటి వీరచరిత్ర - మానవతా విలువలు :

పల్నాటి వీరచరిత్రలో నాగమ్మకు, బ్రహ్మనాయుడికి యుద్ధం జరుగుతుంది. బ్రహ్మనాయుడు ఆ యుద్ధానికి వెళుతూ తన తల్లి అయిన శీలమ్మ దగ్గర దీవనలు తీసుకోడానికి వెళుతాడు. అపుడు ఆమె బ్రహ్మనాయుడికి యుద్ధం ఏయే సమయాలలో చేయాలి, ఎవరని వధించకూడదు వంటి విషయాలు ఈ కింది విధంగా బోధిస్తుంది.

"తల్లి శీలమ కడకు తనయుడు బ్రహ్మ
    అరుదెంచి మ్రొక్కిన నతనికిట్లనియె
................................
    ...............................
కట్టె మోపుల వారికల గూరవారి
    పశుల కాపరులను బులుసు గూరాకు
అని అడవులలో తిరిగెడువారు
    మగువుల గోష్టిచే మానంబు తప్పి
యెదురేమయులు లేక యింతులుతాము
    తమ గృహంబులోన తమకించి చాల
తడబాటు చేతను దాగినవారి
    చిన్నారు గుళ్ళలో చేరినవారు
మనసున దయలేక మగపాడి విడిచి
    చంపుట దోషము జగములోపలను
తగవు ధర్మము దయయును విడిచి
    చంపుట దోషము జగము లోపలను
..................................
    ..................................
వినవయ్య బ్రహ్మన్న విశదంబుగాను
    జపముకై బ్రహ్మణుల్ చనియెడివేళ
వేగుజామున పాడువ వేగిర పడకు
    పదమని సతులను పాడిధేనువుల
పాలకై పొద్దున పరగ నూరుతాళ్ళు
    తలకోలలను పట్టి తనరార పితుక
ఆ వేళ కోటపై నార్చెనగాని
    అగ్ని వాయువు చేత నా పట్టణంబు
భస్మముగా కాలి పసులు సమసినను
    అటువంటి దోషమ్ము లణగ వెన్నటికి
పగలెల్ల పొలమున పనిపాటుచేసి
    మగడు ధాన్యము కొని మాటలు చేరు
నను నాస బిడ్డలు నతని కుల సతియు
    ఎదురు చూచు నందు రిండ్లలో నుండి
అర్ధరాత్రి పోటు అది కాదు వినుము
    ఆ వేళ కోటపై నార్చిన నీవు
నిద్ర తెలియక యపుడు నిలువును లేక
    తత్తరపడి భీతి తయాయుధములను
నేమరి నిను చూచి యెల్లవారలును
    పోరకున్నను వారిపోడువ దేషమ్ము
అన్నన్న! వారల నావహంబు నను

అనుజులుగా చూడు మతి వేడ్కతోను
పరగవారిని పొడువ పాపంబు వచ్చు"
(పల్నాటి వీరచరిత్ర, 1961. పుట: 191, 194)

పల్నాటి యుద్ధానికి వెళుతున్న బ్రహ్మనాయుడితో, శీలమ్మ ఈ విధంగా చెబుతుంది. పశువుల కాపరులను, కట్టెలు కొట్టేవారిని, చెన్నకేశవుని గుడిలో దాక్కున్న వారిని చంపడం దోషం. ధర్మాన్ని, దయను విడిచి, గర్వంతో కోటలు జయించరాదు. అంతేగాక ఏ సమయంలో యుద్ధం చేయరాదో చెబుతుంది. బ్రాహ్మణులు జపతపాలకై వెళ్ళే సమయంలోను, పాడి ఆవుల పాలను పితికే సమయంలోను పట్టణాన్ని భస్మం గావించిన పాపం ఎన్నటికీ పోదు. పగలంతా పొలంలో పనిచేసి భర్త ధాన్యాన్ని తీసుకుని ఇంటికి వస్తాడని భార్యా బిడ్డలు ఎంతో ఆశతో ఎదురుచూస్తారు. అటువంటి సమయంలో యుద్ధం చేయరాదు. నిద్రిస్తున్న వారిని, భయపడేవారిని చంప రాదు. వారిని సోదరులవలె చూడాలి. బ్రాహ్మణులను భక్తులను, భట్లను, దాసుళ్ళను, జంగమ దేవరలను యుద్ధానికి రావద్దని ప్రేమగా చెప్పు అని అంటుంది. గురజాలపై దండెత్తి వస్తున్నట్లుగా చెప్పిన ఏడు రోజుల తరువాత యుద్ధానికి వెళ్ళమని తల్లి శీలమ్మ బ్రహ్మన్నకు హితవునుపదేసిస్తుంది. దీని ద్వారా శీలమ్మకు యుద్ధనీతి తెలుసని వ్యక్తమవుతుంది.

బ్రహ్మన్న మంత్రిగా వ్యవహరించిన వ్యక్తి అయినప్పటికి, శీలమ్మ అతనికి యుద్ధనీతిని బోధిస్తుంది. ఎందువలననగా సహజంగా రాజులకు ఉండే రాజ్యకాంక్ష వల్ల, ఒక్కొక్కసారి నియమాలను అతిక్రమించడం జరుగుతుంది. అందువల్ల శీలమ్మ తన కుమారునికి హితవు నుపదేశిస్తుంది. ఈ కథలో ఆమె చెప్పిన యుద్ధ నియమాలు, యుద్ధం చేసే ప్రతి రాజు ఆచరించదగినవి. ఇక్కడ ఆమె తల్లిగా తన కర్తవ్యాన్ని నెరవేర్చింది. ప్రతి తల్లి తమ బిడ్డలను సన్మార్గంలో నడపడానికి, ఈ ఘటన ఉపయోగపడుతుందని చెప్పవచ్చు.

**ముగింపు :**

ఈ వ్యాసంలో బుడ్డా వెంగళరెడ్డి గురించి, మరియు పల్నాటివీర చరిత్రలోని బ్రహ్మనాయుడు గురించి చర్చించ బడింది. వెంగళరెడ్డి దాతృత్వం, మానవత్వం గల వ్యక్తి. అతని మంచితనం, మానవత్వం నేటి సమాజానికి తెలియ వలసిన ఆవశ్యకత ఉంది. ఈ కథ వల్ల కొంతమందైనా మానవతా దృక్పథంతో వ్యవహరించడానికి అవకాశ ముందని చెప్పవచ్చు. ఈ కథ వాస్తవికమైనది. ఆ ప్రాంతంలో నేటికి అనేక కథలు, గాథలు ప్రచారంలో ఉన్నట్లు ఆధారాలు లభిస్తున్నాయి. కాబట్టి ఇది సమాజానికి ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. అదేవిధంగా బ్రహ్మనాయుడికి శీలమ్మ చెప్పిన యుద్ధనీతి కూడ మానవతా విలువలను చాటి చెప్పే విధంగా ఉన్నాయి. అవి నిత్య జీవితంలో ప్రతివ్యక్తి ఆచరించదగినవి.

ఈ వ్యాసంలో చర్చించిన రెండు అంశాలు సమకాలీన సామాజిక చైతన్య పరిణామ క్రమానికి తోడ్పడతాయని చెప్పవచ్చు. ఆ దృష్టితోనే వీటిని చర్చించడం జరిగింది. జానపద సాహిత్యం ప్రవహించే నది వంటిదని పండితులు తెలియజేశారు. నిశిత పరిశీలన చేస్తే అనేక పరిశోధనలు చేయడానికి అవకాశముంది.

**ఉపయుక్త గ్రంథములు :**

1. కృష్ణకుమారి, నాయని. 1974. జానపద గేయాలు - సాంఘిక చరిత్ర. మురళి పవర్ ప్రెస్, హైదరాబాదు.
2. కృష్ణకుమారి, నాయని. 2007. తెలుగు జానపద గేయగాథలు. తెలుగు అకాడమి, హైదరాబాదు.
3. లక్ష్మీకాంతం, (సం.పా), 1991. (ప్ర.ము.1961). పల్నాటి వీరచరిత్ర. ..........
4. సుబ్బారావు, టి.వి. 1999. రేనాటి సూర్యచంద్రులు, శ్రీలక్ష్మి ఆర్ట్స్ ప్రింటర్స్, బెంగుళూరు.
5. సుబ్బారావు, టి.వి. 2013. తెలుగు వీరగాథా కవిత్వము. శ్రీకృష్ణదేవరాయ రసజ్ఞ సమాఖ్య, బెంగుళూరు.

# 'ఆకాశమంత చూపు' – సమీక్ష

– డా॥. చిలకా అనిత, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళా కళాశాల, గుంటూరు.

"మన తెలివి తేటలను ఎప్పుడూ మన బ్రతుకు బాగు చేసుకోవడానికి వాడుకోవాలి. ఇతరుల బ్రతుకును నాశనం చేయడానికి వాడకూడదు" - స్వామి వివేకానంద.

గోవర్ధనరావు గారు వృత్తిరీత్యా ఉపకలెక్టరుగా సేవలందించి పదవీవిరమణ చేశారు. పదవీవిరమణ తర్వాత కూడా తన వంతు బాధ్యతగా సమాజానికి ఏదైనా చెయ్యాలి అని అనుకున్న గొప్ప సాహిత్యాభిలాషి. గోవర్ధనరావు గారు ఊరకే ఉంటే ఊరా పేరా? అని తన కవిత్వ కలాన్ని ఝుళిపించాడు. తనవంతు కృషిగా 'ఆకాశ మంత చూపు'తో చిటికెడంత ఆలోచనతో పిడికెడంత ధైర్యంతో సమాజ భావ దారిద్ర్య చట్రంలో ఇరుక్కుపోయి పెద్దమనుషుల ముసుగులో చలామణి అవుతున్న వారికి కళ్లనేవి ఉంటే అవి విచ్చుకునేలా చేశారు.

ఈ కవితా సంపుటిలో ఉన్న 38 కవితల్లోను కవి యొక్క ఆత్మఘోష వినిపిస్తూనే ఉంటుంది. తన అనుభవాలకు ఆలోచనలకు అనుగుణంగా సామాజిక ధిక్కార స్వరాన్ని పాఠకులకు వినిపించాడు. హరిత విప్లవం నుండి ప్రపంచీకరణ వరకు మానవ సంబంధాల నుండి సెల్‌ఫోన్ వరకు 'కాదేది కవితకనర్హం' అన్న శ్రీశ్రీ మాటలను నిజం చేశాడా అన్నట్లుగా ఏ చిన్న విషయాన్ని కూడా తన దృష్టిని దాటి పోలేదు.

మానవుడు తాను సంఘ జీవినన్న విషయాన్ని మరిచి మనలో మనం గిరిగీసుకొని ఎవరితో సంబంధం లేనట్లుగా నేను నా కుటుంబమంటూ నాలుగ్గోడల మధ్య నివసించే వారిని ఉద్దేశించి ప్రజల సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అని అంటూ వీరు స్వార్థంతో వేర్పాటు వాదాన్ని ఏర్పాటు చేసుకుంటూ ఎవరికి వారు అర్థం కాని కమర్షియల్ భాషలో మాట్లాడు కోవడం నచ్చని కవి 'రాయని చరిత్ర' కవితలో రాయలేని నిజాలను దాచేస్తే దాగని సత్యంలా పాతేస్తే లేచిన నిజంలా ఆకాశమంత ఆత్మగౌరవాన్ని ఊరవతలకు నెట్టిన దళితుడికి ఆపాదించారు.

ప్రపంచీకరణ ప్రతి ఊరి ముఖచిత్రాన్ని తారుమారు చేసినపుడు సగటు మానవుడు తనకు తానుగా ఉండలేక తన ఉనికిని కోల్పోయి వ్యాపార వస్తువుగా తర్జుమా కాలేక పోయాడని కవి తన ఆక్రోశాన్ని నిస్సహాయతను తెలియ జేశారు.

జమైకా చిరుత పరుగుల క్రీడాజ్యోతి ఉసేన్ బోల్ట్‌ని. జెస్సీ వొవెన్స్ కార్ల్ లూయిల్ సంధించిన పరుగుల బాణంగా మట్టిలో మాణిక్యంగా అభవర్ణించి కవి తన యొక్క క్రీడాభిమానాన్ని చాటుకున్నారు.

చేతనైన వృత్తిలో బలంగా జీవించే సగటు మానవుణ్ని నగరీకరణ అనే కొత్త కల్చర్ వచ్చి ఆసరా లేకుండా చేసిందని. ఎన్నికల్లో పర్వితమైన ఓటును స్వేచ్ఛగా వేస్తే చివరకు తన ఉనికి, నైజం దోపిడి దారులు, రాజకీయ వ్యాపారుల ముందు ఏమైందో తెలియక నా లాంటి సహచరుల్ని వెదక్కుంటూ 'రోటీ కపడా ఔర్ మకాన్' కోసం వలసకు సిద్ధమైన విషయాన్ని ఎంతో పాఠకుల హృదయాన్ని కదిలించి వేసింది. నయవంచకుల నయాముసుగును తొలగించే ప్రయత్నం కవి చేశారు.

మనిషి - మనిషి తత్వం - మానవత్వాన్ని గురించి ప్రస్తావిస్తూ అందరూ వేదికలెక్కి వేదాలు వల్లించే వారే అమాయకులను ఆదమరపించి హతమార్చి "శవాల మీద డబ్బులు చల్లి వెళ్లిపోతున్నారు. ప్రేమ దీపాలను ఆర్పేస్తున్నారని కలుషితమైన మానవ సంబంధాల అగాధాలను తొలగించి ఊబిని పూడ్చాలి" అని పిలుపునిచ్చారు.

దిగుబడి లేక చేతికందని పత్తితో అప్పుల ఊబిలో కూరుకుని బలవంతపు మరణం వైపు అడుగువేసిన దేశానికి వెన్నెముకగా భావించే రైతన్నకు హరిత విప్లవమే

జానపదమై కన్నీటి పొంగలైంది. పత్తి పేలిన చప్పుడు దూదిపూల దు:ఖమైందని రైతన్నల దైన్యాన్ని 'పత్తి పేలినచప్పుడు' ద్వారా తెలిపే ప్రయత్నం చేశారు.

దిల్‌షుక్‌నగర్ బాంబు పేలుడు సంఘటనను, శ్రీకాకుళం లక్ష్మింపేట దళితులపై కులోన్మాదులు జరిపిన దాడులను నిరసిస్తూ "ఎవడీ బద్మాష్ / వాడి సమాదిమీద కూడ / మనం మట్టి మమతలను పేర్చుదాం / కాసిన్ని కరుణపూలను పంచుదాం" అంటూ బద్మాష్‌లైన కుట్ర దారులను క్షమించి వారి సమాది మీద కూడా పూలను ఉంచుదాం అంటూ తన విశాల హృదయాన్ని చాటు కున్నారు.

మట్టిని చిన్నచూపు చూసేవారి కోసం మట్టిచేత మాట్లాడించి మట్టి విశిష్టతను తెలియజేశారు. 'ఎద గాల్సింది... ఈ మట్టిలోనే / మట్టి.... ప్రశ్నల నిధిలా పుడుతూ / జవాబుల్ని మనిషి నీడలోనే వెతకుతుంది / వెరసి చూస్తే విశ్వమంతా మట్టి అందమే' అంటూ మట్టి పట్ల తన సానుకూల దృక్పదాన్ని 'మట్టి కూడా మాట్లాడు తుంది' కవిత ద్వారా తెలియజేశారు.

భారతదేశ కీర్తి పతాక, సాంఘిక విప్లవ కాంతి ప్రదాత అంబేద్కర్‌ను అక్షర తేజంగా పోల్చుతూ జ్ఞాన మార్గాన్ని అందించే కాంతి పుంజంగా, వెన్నెల సూరీడుగా వన్నె తరగని చందురుడిగా వేకువ గువ్వలను చూపించే బహుజన బాంధవుడిగా పేర్కొని కవి తాను అంబేద్కర్ వారసుడిగా నిలబడి దళితులకు ధైర్యాన్ని నూరిపోసే ప్రయత్నం చేశాడు. ('అతడు' కవిత).

ఎవరివారే యమునా తీరే అంటూ సెల్‌ఫోన్ చేసే ఫీట్లను గురించి చెబుతూ మానవ జీవితంతో విడదీయ రాని అనుబంధంతో మమేకమైన సెల్‌ఫోన్ గురించి రాస్తూ సెల్‌ఫోన్‌లో అతడు లేడు / సెల్‌ఫోన్ అతనితో ఉంది / ఉంటూ ఆడిస్తోంది / ఆట్లాడుకుంటోంది. అని తనదైన వ్యంగ్య ధోరణిలో వాస్తవాన్ని తేటతెల్లం చేసే ప్రయత్నం చేశాడు.

ఇక్కడ కవి కొత్త పదబంధాలను తన కవితా సంపుటి ద్వారా మనకు పరిచయం చేశారు, కలతల జడి / ఇనుప ఆక్టోపస్‌లు / వెలుతురు పిట్టలు / చినుకు పిట్టలు / మెరుపు పువ్వు / వేకుల గువ్వలు ఆకాంక్షల హరివిల్లు / పుడమి గొంతుక / అధికారపు అత్తరు / ఓదార్పు ఏరువాక / నాగలి దిగులు మొదలైన క్రొత్త పదాలతో తన కవిత లకు పరిపుష్టం చేశారు.

మురికి కూపాల నుండి, అశుద్దపు గోతులనుండి మానవ మలినాల రోత నుండి విముక్తి చెయ్యడానికి పాకీవారికి ఊరు అవతల అసింటా నివసించే దళితులకు ఆకాశమంత ఆత్మగౌరవాన్ని ఆపాదించి భయపడినా, బెదరిపోయినా / మనసును బందించినా / మడిగట్టుకు కూర్చున్నా / కు సంస్కారంతో మనలినా / బలహీనతలకు లొంగినా / కవిత్వం రావాలను కోదన్న నిజాన్ని నిర్భయంగా వెల్లడించారు. అందువల్ల కవులు సాహసమే ఊపిరిగా మెలగాలని పిలుపు నిచ్చారు. ఇక్కడ కవితలో ఉన్న వస్తువును మాత్రమే పాఠకుడు దర్శించడం గోవర్థన్ గారి ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

అవకాశం లేని ఆశావాదాన్ని / విశ్వజనీనమంత ఆత్మ గౌరవంతో / వికసించే సమతను వీక్షించాలనుకునే ఆకాశ మంత చూపున్న కవికోరిక నెరవేరి సమసమాజ స్థాపన జరిగి దళితులు ఆనంద డోలికల్లో తేలియడాలని గోవర్ధన్ గారి కవితా మాగాణుల్లో మరిన్ని కవితా సుమాలు పూసి వాటి పరిమళాలు మానవ సంబంధాలను మానవీయ విలువలను పెంచాలని ఆయన చేస్తున్న ఈ కవితా యజ్ఞంలో పాలుపంచుకుని తమవంతుగా సమాజసేవకు ప్రతి ఒక్కరు ఒక సైనికుడిగా మారాలని, భావితరం యువతకు మార్గదర్శంగా నిలిచి, మంచిని, మానవత్వాన్ని పురోగామి విలువలను 'ఆకాశమంత చూపు' ద్వారా అందించిన కవి గోవర్థన్ గారు. ఆయన కవితా సేవలు మరెన్నో సమాజానికి అందించాలని ఆశిద్దాం.

# సాహిత్య ప్రస్థానం పత్రిక – నానీలు – సామాజిక విశ్లేషణ

– డా. సంగీతరావు మేడతోటి, తెలుగు సహాయ ఆచార్యులు, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విద్యాలయం, అనంతపురం.

సాహిత్య ప్రస్థానం అనే పత్రికకు సంపాదకులు తెలకపల్లి రవి గారు. ఇది సాహిత్యాంశాలకే ప్రాధాన్యత నిస్తుంది. సంపాదకులైన రవి గారి గురించి రెండు పంక్తుల్లో తెలుసుకున్నట్లయితే తెలకపల్లి రవి గారు అక్టోబర్ 24, 1956 సం. లో జన్మించారు. వీరు ప్రముఖ జర్నలిస్టు, రాజకీయ విశ్లేషకులు మరియు రచయిత. అనేక పుస్తకాలు కూడా రాశారు. ఇలా రాసుకుంటూ పోతే ఎన్ని పేజీలైనా ఆయన గురించి వ్రాయుటకు సమాచార ముంది. ఇలాంటి వారు సంపాదకులుగా వున్న 'సాహితీ ప్రస్థానం'లో వివిధ సంవత్సరాలలో, మాసాలలో వచ్చిన కొన్ని 'నానీ'లను సమయ, స్థల భావాన్ని దృష్టిలో పెట్టుకొని సామాజిక కోణంలో విశ్లేషణ చేస్తున్నాను. 'నానీ'లు :

తెలుగు సాహిత్య ప్రస్థానం సుమారు వెయ్యి సంవత్స రాల పూర్వం నుండి అనేక మార్పులతో, ప్రయోగాలతో వస్తూవుంది. కారణం మారుతున్న కాలం. ఆ కాలంతో బాటు అనేక మార్పులు కూడా వచ్చాయి. అలాంటి వాటిని సాహిత్యంలో చూస్తే వస్తువులోను, రూపములోను, గుణములోను, రీతిలోను, కథనంలోను ఇలా చెప్పు కొంటూ పోతే అనేక విన్యాసాలకు సాహిత్యం ఆలవాల మైంది. సమాజం నుండి మానవుడిని, మానవుడి నుండి సమాజంను వేరుచేసి చూడలేము. కావున సమాజం మారినప్పుడల్లా మానవుడు మారతాడు, మానవుడు మారినపుడల్లా సమాజం మారుతుంది. ఇలా ఈ రెండింటికి అవినాభావ సంబంధం వుంది. అలానే సాహిత్యంలో కూడా ఇదే ప్రక్రియ కొనసాగుతుంది.

ఈ కొనసాగింపులో భాగంగా తెలుగు సాహిత్యంలో 1997 నుండి ఆచార్య ఎన్.గోపి గారి కలం నుండి 'నానీ'లు జాలువారాయి. ఈ 'నానీ'లు తెలుగు సాహిత్యా నికే సొంతం. 'నానీ'ల సృష్టి కర్త ఆచార్య ఎన్.గోపి గారు. ఆయన 'నానీ'ల గురించి ఇలా నిర్వచించారు. "నావీ...నీవీ...వెరసి మనవి" అని అన్నారు. (డా? కమలాకర శర్మ, సాగి. (సంపా). 10.12.2014, "కదంబం, తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు" మూసీ సాహిత్య సాంస్కృతిక, చారిత్రక మాసపత్రిక, హైదరాబాద్, పుట: 245).

'నానీ'లను ఆచార్య ఎన్.గోపి గారు 'వార్తా దినపత్రికలో 1997 లో రాసి, ఆ తరువాత 1998లో 'నానీ'లు అనే పేరుతో 365 'నానీ'లు కలిపి ఒక గ్రంథంగా ముద్రిం చారు. ఆ ముద్రించి గ్రంథములు పత్రికా సంపాదకులైన ఎ.బి.కె. ప్రసాద్ గారికి అంకితమిచ్చారు. (ప్రొ? సిమ్మన్న, వెలమల. 2012 "తెలుగు సాహిత్య చరిత్ర", విశాఖ పట్నం, పుట:620). ఆ తరువాత గోపిగారు 'గోపీ నానీ'లు అనే పేరుతో మరో 365 'నానీ'లు రాసి 2002 లో మరో గ్రంథం రాశారు. మొత్తం 730 'నానీ'లు రాసి, 'నానీ'లకు వ్యాప్తిని కలిగింప చేశారు. 'నానీ'ల ప్రత్యేకత : 1) 'అల్పమైన రూపంతో అనల్పార్థాన్నిచ్చే సుగుణం కలిగినవి 'నానీ'లు. 2) మానవ సమాజంలోని జీవితానుభవాలను అంత:సూత్రంగా మలచబడినాయి. 3) ఇందులో నాలుగు పాదాలుంటాయి. 4) 20 నుండి 25 అక్షరాలు వుండాలన్న నియమం వుంది. 5) 20 కంటే తక్కువ, 25 కంటే ఎక్కువ వుంటే అవి 'నానీ'లు అనిపించుకోవు. 6) ఒక్కో పాదంలో ఇన్నే అక్షరాలు పాటించాలన్న నియమంలేదు. 7) 'నానీ'లు మొదటి రెండు పాదాలను ఒక భావాంశంగా భావిస్తే, మలి రెండు పాదాలను మరో భావాంశంగా భావించవచ్చు. 8) ఇవి ఒకదానికొకటి సమర్థిస్తున్నట్లుగాను లేక పై భావాంశంలోని వైరుధ్యాన్ని కింది అంశం సమన్వయం చేస్తున్నట్లుగాను ఉంటుంది. 9) 'నానీ'లు గాన యోగ్యంగా వుంటాయి. 10) ఇవి ధ్వని ప్రధానంగా వుంటాయి'. (డా. కమలాకర

శర్మ, సాగి. (సంపా). 10.12.2014, "కదంబం, తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు" మూసీ సాహిత్య సాంస్కృతిక, చారిత్రక మాసపత్రిక, హైదరాబాద్, పుట: 245).

ఇలాంటి విలక్షణమైన, ప్రత్యేకత కలిగిన 'నానీ'లు నేటి సమాజ పరిస్థితులకు అద్దంపడుతూ, ప్రతిబింబింప జేస్తున్న 'నానీ'లను ఎంచుకొని సాహిత్య ప్రస్థానం పత్రికలో వచ్చిన కొన్ని 'నానీ'లను సామాజిక దృక్కోణంలో విశ్లేషణ చేయడం జరుగుతుంది.

1) మేరెడ్డి యాదగిరి రెడ్డి గారు రాసిన 'రైతు నానీ'లు సాహితీ ప్రస్థానం మే, 2010 సంచికలో వచ్చింది.

2010 వ సం. లో నేడున్న రెండు రాష్ట్రాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా వుంది. అప్పుడు వర్షాలు చాలా తక్కువగా వుండేవి. సాగుచేసే రైతులు పొలాలకు బోర్ల ద్వారా నీటిని అందించుకొంటారు, బోర్లు పని చేయాలంటే కరెంటు కావాలి. ఆరోజుల్లో కరెంటు కష్టాలు వర్ణనాతీతం. ఎందుకంటే రాత్రిపూటే ప్రభుత్వం పొలాలకు కరెంటు ఇవ్వడం వల్ల రైతులు అర్థరాత్రి నిద్రలేకుండా వెళ్ళి పొలాలకు నీళ్ళు పెట్టేవారు. ఆ సమయంలో రాసిన 'నానీ' ఇది. "కంటికి కునుకు లేదు వొంటికి సుఖం లేదు అర్థరాత్రి కరెంటు"

ఇలా చాలి చాలని కరెంటుతో తక్కువ నీటితో వరి పొలాలు బురదగా వుండేది. ఆ బురదలో ఏదైనా ఆహారం దొరుకుతుందేమోనని కొంగలు వచ్చి ఆ పొలంలో అటు ఇటు తిరగడం వల్ల వీటి కాళ్ళ తొక్కిడికి పికాసో చిత్రాల్లాగా నారుమడిలో కనిపిస్తున్నాయని తెలిపారు మేరెడ్డి గారు.

"నారుమడిలో పికాసో చిత్రాలు
కొంగల తొక్కుడు కదా!"

నేడు పర్యావరణ సమతుల్యం లేకపోవడంవల్ల వర్షాలు సకాలంలో పడటంలేదు. అంతేగాకుండా కరెంటు కష్టాలు కూడా వున్నాయి. అందువల్ల పంటలకు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. కావున రైతులు పొలాలు అమ్ముకున్నారు. కొన్నటువంటి రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆ పొలాలలో పంటలు పండించకుండా ప్లాట్ల వ్యాపారం చేస్తూ పంటల స్థానంలో రూపాయలు పండిస్తున్నారని, రైతులకు కన్నీళ్ళే మిగులుతున్నాయని ఈ 'నానీ'లో చెప్పడం జరిగింది.

"ఇవాళ పొలాల్లో పంటలు పండటం లేదు రియల్టర్లు
రూపాయలు పండిస్తున్నారు"

అలానే రైతులు మేలు రకపు విత్తనాలను వాడితేనే పంటలు అధిక దిగుబడి వస్తాయని రైతులను మోసంచేసి బి.టి. విత్తనాలు కొనిపించారు దళారులు. వారు బహుళ జాతి కంపెనీలకు అమ్ముడుపోయిన వ్యాపారులు.

ఆ బి.టి. విత్తనాలు నకిలీవి అగుటంవల్ల రైతులు నష్టాల్లో కూరుకుపోయి విషంత్రాగి ఆత్మహత్యలకు పాల్పడుతున్న స్థితిని వర్ణిస్తూ బహుళజాతి కంపెనీల విత్తనం విషపు పుత్రిక అని సమాజంలోని ఏ రైతూ ఇలాంటి విత్తనాలు వాడకూడదని ఈ 'నానీ' ద్వారా హెచ్చరించారు రైతులను. "బి.టి. విత్తనం వచ్చిందిక బహుళజాతి కంపెనీల విషపు పుత్రిక" (రవి, తెలకపల్లి. (సంపా?), మే, 2010 "సాహితీ ప్రస్థానం" పుట:36).

2) మేరెడ్డి యాదగిరి రెడ్డి రాసిన 'రైతు నానీ'లు సాహితీ ప్రస్థానం సెప్టెంబర్, 2011 సంచిక.

భారతదేశం వ్యవసాయానికి పుట్టినిల్లు. వర్షం మీద ఆధారపడి రైతులు వ్యవసాయం చేస్తుంటారు. ఆ వర్షాలు సకాలంలో రాకపోతే ఆధునిక సాంకేతిక పద్ధతులను పయోగించి ప్రభుత్వాలు కృత్రిమ మేఘాలు(మేఘ మధనం) సృష్టించి వర్షాలను అప్పటికప్పుడు అందిస్తారు. అయితే ఎన్ని వందల కోట్లు వెచ్చించినా అక్కడక్కడా చిరుజల్లులే కానీ సమృద్ధి వర్షాలు లేవు. తత్ఫలితంగా రైతులకు కడగండ్లే మిగిలాయి తప్ప వారికి ఒరిగిందేమీ లేదు. కానీ ప్రభుత్వాలు వందల కోట్లు వెచ్చించాయనే విషయాన్ని ఈ 'నానీ'లో చెబుతున్నారు. "మేఘ మధనానికి వందల కోట్లు అక్కడక్కడ చిరుజల్లులు"

మరియొక 'నానీ'లో వర్షాలు జడివానలాగా కురిసినా లేక తేలికపాటి జల్లులు కురిసినా రైతులకు ఎంత నష్టం జరుగుతుందో వివరించడం జరిగింది. అధిక వర్షం వుంటే పంటలు దెబ్బతింటాయి. అలానే దీర్ఘకాలం తేలికపాటి వర్షాలు కురిసినా పంటలు దెబ్బతింటాయి. రైతులు ప్రతి సంవత్సరం అనుభవిస్తున్న వ్యథలను వివరించారు.

"జడివాన ఎంత కష్టం ఎంత నష్టం
మొసలి కన్నీటితో తడిసిన పంట పొలం"

అలానే వర్షం పంటకు ప్రాణం లాంటిది. అధిక వర్షం రైతుకు ప్రాణ సంకటం లాంటిది అనేది ఈ 'నానీ'లో వివరించడం జరిగింది.

"వర్షం పంటకు ప్రాణం అధిక వర్షం రైతుకు ప్రాణ సంకటం" (రవి, తెలకపల్లి. (సంపా?), సెప్టెంబర్, 2011 "సాహితీ ప్రస్థానం" పుట:35).

3) లక్కరాజు నిర్మలా గారు రాసిన 'నానీ'లు. సాహితీ ప్రస్థానం, ఆగష్టు, 2012 సంచికలో వచ్చింది.

ఇందులో ప్రధానంగా రైతు తన పొలంలో ఏ విత్తనం వేస్తే అదే పంట కోస్తాడని, అలానే మనిషి ఆలోచనను బట్టే ఆచరణ ఉంటుందనే జీవిత సత్యాన్ని ఇందులో తెలిపారు. "ఏ విత్తు వేస్తే ఆ పంట ఆలోచనను బట్టే ఆచరణ మరి" నిర్మాత గారు మరో 'నానీ'లో ఇలా చెప్పారు. సంఘంలో అన్ని రకలుగా మార్పు రావాలనే వారికి చురక అంటించారు. సంఘంలో మార్పు రావాలనే వారు ఎవరైనా సరే మొదటిగా తనతోనే మొదలెట్టాలని మాటల గారడీ కాకుండా చేతలతోనే చూపెట్టాలని విజ్ఞప్తి చేశారు. "సంఘాన్ని మార్చాలంటావా? అయితే ముందు నీతో మొదలు పెట్టు"

అలానే అవసరానికి పనికిరాని ఏ రత్నమైనా సరే రాయితోనే సమానం. సమాజంలో మనుషుల మధ్య సత్సంబంధాలు ఒకరి అవసరాల్లో మరొకరు సహకరించు కొంటేనే సమాజాభివృద్ధి చెందుతుందని, లేకపోతే రాయివలె నిశ్చలంగా సమాజం వుంటుందని, మనిషనే వాడు సత్సంబంధాలతో వుండాలని ఒకరికొకరు అవసరాలలో సహకరించుకొంటూ పనికివచ్చేవారిగా వుండాలని హితవు పలికారు ఈ 'నానీ'లో. "అవసరానికి పనికిరాకపోతే రత్నాలు కూడా రాళ్ళతో సమానం"

మరొక 'నానీ'లో ఇద్దరి వ్యక్తుల మధ్య గొడవ మొదలైతే మాటలనే తూటాలు పెంచకుండా మౌనంగా వుంటే కుటుంబ వ్యవస్థ గానీ, సమాజ వ్యవస్థగానీ మహోన్నతంగా, ప్రేమమయంగా వుంటుందని పరిష్కారం చూపారు. "మాటకు మాట తూటాలా పేల్చావ్ మౌనాన్ని ప్రదర్శించి చూడు" (రవి, తెలకపల్లి. (సంపా?), ఆగష్టు, 2012 "సాహితీ ప్రస్థానం" పుట:36).

4). దాసరోజు శ్రీనివాసాచారి గారి 'నానీ'లు. ఇది సాహితీ ప్రస్థానం అక్టోబర్, 2012 సంచికలో ముద్రించబడింది.

నేటి కాలంలో అన్నింటినీ కొనుకున్నట్లే నిద్రను కూడా ఖరీదు పెట్టి కొనుక్కోవడమనేది పరిపాటి. అయినా నిద్రపట్టని రాత్రులతో ఆల్కహాల్‌కు బానిసై నిద్ర మాత్రలు మింగుతున్న వారిని గూర్చి, అదే సమయంలో పండు వెన్నెలలో జాబిలమ్మ ఒడిలో ఓలలాడుతూ పూరిగుడిసెలో సైతం ప్రశాంతమైన కునుకు తీసే వారికి మధ్య వున్న వ్యత్యాసాన్ని తెలిపే 'నానీ' ఇది. "ఏ.సి. గదుల్లో కాస్ట్లీ కునుకు గుడిసెల్లో ఉచితం చంద్రుని వెలుగు"

మరొక 'నానీ'లో భగవంతుడు మనిషికి కాళ్ళు చేతులు ఇచ్చినా వాటికి పనిచెప్పక బలుపుతోటి చిన్న చిన్న పనులను కూడా పనివారితో చేయించుకోవడం ధనవంతులకు పరిపాటి. అదే కాళ్ళు,చేతులతో పేద వాళ్ళు రెక్కాడినా డొక్కాడని బతుకుల తారతమ్యతను సామాజిక ధృక్కోణంలో విశ్లేషించారు. "ఒకవైపు రెక్కలేవని బలుపు ఇటు రెక్కడొక్కాడని బతుకు" అలానే పుట్టిన ప్రతి మనిషికి చనిపోతామని తెలుసు. కానీ స్వార్థమనే సొగసును ధరించుకొని నీది, నాది అని మనుషులను దూరంచేసుకొని హరించుకు పోతున్నా, దృష్టించని

మనిషిని ప్రశ్నిస్తున్నారు ఈ 'నానీ' ద్వారా. "చనిపోతామని అందరికి తెలుసు మరెందుకీ స్వార్థాల సొగసు"

ఈనాడు సమాజంలో వివాహాలు హాస్యాస్పదంగా మారడానికి కారణం ఆన్లైన్ సంబంధాలు. పూర్వకాలంలో వివాహం చేయాలంటే తెలిసిన వారి ద్వారా అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు చూసి వివాహాలు చేసే వారని, అందువల్ల వివాహ వ్యవస్థ పది కాలాల పాటు వర్ధిల్లుతుండేదని చెప్పడం జరిగింది. నేడు ఈ పరిస్థితి పోయి పెళ్ళైన మరునాడే వీలైతే అదేరోజు అనేక కారణాలతో కొంతమంది విడాకులు తీసుకోవడం జరుగుతుంది. అలాంటి పరిస్థితికి కారణం మధ్యవర్తులు లేకుండా వివాహం చేసుకోవడం. సమస్య వచ్చినప్పుడు మధ్యవర్తులు లేకపోవడం వలన వివాహ వ్యవస్థ నవ్వులపాలై విడాకులు తీసుకోవడం జరుగుతుంది. కావున పెద్దలు కుదిర్చిన వివాహ వ్యవస్థ రావాలని దాసరోజు గారు సామాజిక దృక్కోణంలో వివరిస్తున్నారు. "పెళ్ళి అయిన మరునాడే విడాకులు ఆన్లైన్లో సంబంధం కదా!" (రవి, తెలకపల్లి. (సంపా?), అక్టోబర్, 2012 "సాహితీ ప్రస్థానం" పుట:17).

5) తగుళ్ళ గోపాల్ రాసిన 'నానీ'లు సాహిత్య ప్రస్థానం మార్చి' 2016.

ఇందులో ప్రధానంగా కవిత్వం రాయడమనేది తపస్సు లాంటిదని చెప్పడం జరిగింది. "నిరంతరం రాస్తున్నాను కవిత్వం తపస్సు అంటే ఇదేనా అనిపిస్తుంది". అలానే భారతీయ సమాజంలోని వివాహ వ్యవస్థ కట్నంతో ముడిపడి, వివాహమునకు ముందు, వెనుక సతమత మవుతున్న ఆడపిల్లలకు మరియు వారి తల్లిదండ్రులకు ఎలా ఆ వివాహం శాపంగా మారిందో వివరించడం జరిగింది. "ఈడు జోడు బాగానే కుదిరింది వరకట్నమే శాపమయ్యింది" (రవి, తెలకపల్లి. (సంపా.), మార్చి, 2016 "సాహితీ ప్రస్థానం" పుట:10)

పట్నంలో అస్తవ్యస్తమైన జీవితాలతో పగటికి రాత్రికి తేడా లేకుండా వుంటుందని, అదే పల్లెల్లోనయితే అలా వుండదని ప్రశాంత వాతావరణం వుంటుదని చెప్పడం జరిగింది.

"పగలు రాత్రిని గుర్తించలేక పోతున్న మకాం పట్నానికి మారాక"

అలానే అమ్మ ప్రేమను వర్ణించుటకు ప్రాచీన కాలంలోని ఏ పద్యంలోను బిగించలేకపోయారని, అమ్మను వర్ణించుటకు అక్షరాలు చాలవని తనదైన శైలిలో ఎంతో చక్కగా సామాజిక కోణంలో రాయడం జరిగింది. "అమ్మ ప్రేమను వర్ణించాలని తపన ఏ పద్యంలోను అది పట్టలేదు"

ఈ విధంగా వరకట్నంను నశింపచేయాలని, పట్నాల్లో మారుతున్న వ్యవస్థలను గమనించి ప్రశాంత వాతా వరణంలో వుండాలని, అమ్మ ప్రేమ అనేది అనిర్వచ నీయమైనదని, సమాజంలోని స్థితిని వర్ణించి పరిష్కారం పాఠకులకు వదిలేశారు గోపాల్ గారు.

6) పాలపర్తి ధనరాజ్ 'నానీ'లు సాహితీ ప్రస్థానం ఆగష్టు, 2016 సంచికలో వచ్చింది.

ధనరాజ్ గారు చూసిన పట్నపు వాతావరణంను ఆవిష్కరించారు. పల్లెల్లో చిరు వ్యాపారాలు చేసేవారు ఖాళీగానున్న ప్రదేశాలలో ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా క్రయ విక్రయాలు చేస్తుంటారు. కానీ పట్నంలోనైతే చిరు వ్యాపారులకు ఖాళీ స్థలం లేకపోవటంవల్ల, ఒకవేళ వున్నా వాటికి అద్దెచెల్లించలేక రోడ్డుకిరువైపుల వున్న ఫుట్ పాత్ లపై వ్యాపారం చేసుకుంటూ మనుషులు నడుచుటకు ఇబ్బంది కల్గిస్తుంటారు. అందువల్ల ఫుట్ పాత్ పై నడవాల్సినవారు రోడ్డుమీదకొచ్చి నడుస్తుంటారు. తద్వారా ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ప్రాణాలు హరించుకు పోతున్నాయని తెలిపారు. "రోడ్డుసైడు ఫుట్ పాట్లు చిరువ్యాపారుల బండ్ల పార్కింగ్లు"

అలానే పూర్వకాలంలో కుల, మతాలకతీతంగా చిన్నవారు గాని పెద్దవారు గాని మంచి చెడులు చెబితే అందరూ విని మంచిని పాటించేవారని, నేడు అలా

వినేవారు కరువయ్యారని వెలిబుచ్చారు. "చెబితే వినేవారు ఇది గతం చెప్పినా వినరు ఇది ప్రస్తుతం"

పట్నం యొక్క నాలుగు కూడళ్ళల్లో వెలిగే ఎరుపు, పసుపు, ఆకుపచ్చ లైట్లు చూసుకొని ట్రాఫిక్ రూల్స్ పాటించి, తోటి ప్రయాణీకులకు ఆటంకం కలిగించ కుండా క్షేమంగా ఇల్లు చేరుకొనే వారు.

కానీ నేడు అది పోయి ట్రాఫిక్ నిబంధనలకు భిన్నంగా ప్రవర్తిస్తూ ఆ కూడళ్ళల్లో ట్రాఫిక్ పోలీసులుంటేనే నిబంధనలు పాటిస్తున్నారని, అయినా కొంతమంది పాటించక పోవడం వలన ప్రమాదాలకు గురవుతున్నారని వివరించారు. "చౌరస్తా నిబంధనలు భయం పోలీసులున్న ప్పుడే నేటి కాలంలో ఎవరికివారే తెలివిగలవారమని మంచి చెడుల విషయంలో కుటుంబీకులతో సంప్రదింపులు లేకుండా ఎవరికి వారే విచ్చిన్నమవుతున్నారని తెలిపారు. "ఎవరికి వారే యమునా తీరే సిటీల్లో మరీనూ"

సెల్ ఫోన్ల వల్ల హద్దు ఆపు లేకుండా నెట్లో జీవిస్తూ కుర్రకారు వక్రమార్గాన పడి అకృత్యాలకు పాల్పడుతున్న విషయాన్ని ఇక్కడ వివరించారు. "చేతిలో సెల్లు చెవుల్లో తీగలు కుర్రకారు పైలా పచ్చీసు"

అలానే ప్లాస్టిక్ వాడకంవల్ల సమాజమునకు కలుగు తున్న ముప్పు గురించి పర్యావరణ వేత్తలు ప్లాస్టికన్ను నిషేధించమని ఏకరువు పెట్టి చెబుతున్నారు. అంతేగాక భవిష్యత్తులో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారు తుందని గూడా హెచ్చరిస్తున్నారు. అయితే మరోవైపు వాడేసిన ప్లాస్టిక్ ను ఏరుకొని జీవితం వెల్లబుచ్చే కడు పేదల ఆలోచనలను, వారి మనోగతంను ఆవిష్కరిస్తూ ప్లాస్టిక్కు నూరేండ్లు వర్ధిల్లమని పేదవారు కాంక్షించడం చూస్తే వారికి ఎలాంటి దీనస్థితి సమాజంలో వుందో గమనించాలి. "ప్లాస్టిక్కు నూరేళ్ళు వర్ధిల్లు ఏరుకొనే వాడి మనోగతం"

అలానే చైనా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు వచ్చిన తరువాత మరి ముఖ్యంగా పట్నంలోని యువత సాయం కాల మయితే చాలు ఇంటికెళ్ళి భోజనం చేయకుండా రోడ్డు మీద అప్పటికప్పుడు తయారుచేసే ఫాస్ట్ ఫుడ్ తిన డానికిష్టపడి ఆరోగ్యాన్ని కోల్పోవడం జరుగుతుంది. తద్వారా చిన్నవయసులోనే అనారోగ్యం పాలై మందుల వాడకం మొదలుపెట్టి త్వరగా మరణానికి లోనవు తున్నారని అర్థం చేసుకోవాలి. "ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు సాయంకాలం కడుపు డంపర్లు"

అలాగే భారతదేశంలో పెట్రో, డీజిల్ ధరలు రోజు రోజుకి హెచ్చుతగ్గులతో ఎక్కేమెట్టు దిగేమెట్టుగా వుంటుందని, వీటికి స్థిరీకరణ కల్పిస్తే బావుంటుందని వెల్లడించారు. "పెట్రోలు డీజిలు ఎక్కేమెట్టు దిగేమెట్టు"

నేటి నవ వధువుల దుస్థితి ఎంత దయనీయంగా వుందోనన్న విషయాన్ని గూర్చి వధువు వచ్చె తెచ్చె ఇచ్చె చచ్చె అని చెప్పడం వలన నూరేళ్ళు భర్తతో కలిసి పిల్లా పాపలతో సాఫీగా సాగాల్సిన వైవాహిక జీవితం కట్నం దాహానికి ఆ వధువు హత్యకు లేక ఆత్మహత్యలకు గురికాబడుతున్న జీవితాలను హృదయ విధారకరమైన రీతిలో స్ఫురింపజేసి వాటిని ఆపాలనే ఆలోచనను సమాజానికి వెల్లడించారు ధనరాజ్ గారు. "ఈనాటి వధువు వచ్చె తెచ్చె ఇచ్చె చచ్చె".

ఈనాడు టెక్నాలజీ పెరిగి ప్రపంచమే కుగ్రామమై నట్టింట్లోకి నెట్టిల్లు, టి.వి. వచ్చి యువతను పెడదోవ పట్టించడమే గాక సాఫీగా సాగుతున్న దాంపత్య జీవితం లోకి టి.వి. సీరియల్స్ వచ్చి సాయంకాలం అలసిపోయి ఇంటికి వచ్చిన భర్తను, పిల్లలను పట్టించుకోకుండా వారిని విలన్లుగా భావించడం ఎక్కువ మంది గృహిణులకు సర్వసాధారణమైంది. అయితే ఇది ఇంటికే పరిమితం కాబట్టి భర్త సర్దుకుపోవడం, పిల్లలు నోరుమూసుకోవడం పరిపాటైంది. కానీ రాకరాక ఎప్పుడైనా బంధువులు సీరియల్స్ వచ్చే సమయంలో ఇంటికి వస్తే వండి పెట్టాలని,

సీరియల్స్ చూడకుండా వుండాల్సి వస్తుందని కోపంతో ఆ వచ్చిన బంధువలను కూడా విలన్లుగా భావించుకొని

బంధువులను, ఆత్మీయులను దూరంచేసుకోవడం ఆపై ఒంటరిగా మిగిలిపోవడం కనిపిస్తుంది. తద్వారా సమాజంలో మానసిక రుగ్మతలతో జీవితాలను దుర్భరం చేసుకొనే వ్యక్తుల సామాజిక స్థితిని వెల్లడించారు.

"చుట్టాలు
కూడా
విలన్లేజి
సీరియల్ ట్రెంలో"

(రవి, తెలకపల్లి. (సంపా?), ఆగష్టు, 2016 "సాహితీ ప్రస్థానం" పుట:28) ముగింపు :

పైన చెప్పుకొన్న విధంగా 'నానీ'లు సమాజ స్థితి గతులను సమాజాభివృద్ధిని కాంక్షిస్తూ ప్రకృతి పట్ల మనిషి ఎలా మసులుకోవాలో, మరియు మనుషులతో ఎలా మసులుకోవాలో, సమతా, మమతలను ఎలా పెంపొం దించుకోవాలో అని తగుళ్ళ గోపాల్ గారు, పాలపర్తి ధన్ రాజ్ గారు, దాసరోజు శ్రీనివాసాచారి గారు, మేరెడ్డి యాదగిరి రెడ్డి గారు, లక్కరాజు నిర్మల గారు వైవిధ్య భరితమైన 'నానీ'లను రాసి సామాజిక దృక్పథంతో సమాజాభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తున్నాయి వారి 'నానీ'లు. అని చెప్పుటలో ఎంతమాత్రం సందేహం లేదు.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1) రవి, తెలకపల్లి. (సంపా11), మే, 2010 "సాహితీ ప్రస్థానం" సంచిక.
2) రవి, తెలకపల్లి. (సంపా?), సెప్టెంబర్, 2011 "సాహితీ ప్రస్థానం" సంచిక.
3) రవి, తెలకపల్లి. (సంపా?), ఆగష్టు, 2012 "సాహితీ ప్రస్థానం" సంచిక.
4) రవి, తెలకపల్లి. (సంపా), అక్టోబర్, 2012 "సాహితీ ప్రస్థానం" సంచిక.
5) రవి, తెలకపల్లి. (సంపా?), మార్చి, 2016 "సాహితీ ప్రస్థానం" సంచిక.
6) రవి, తెలకపల్లి. (సంపా1), ఆగష్టు, 2016 "సాహితీ ప్రస్థానం" సంచిక.
7) డా. కమలాకర శర్మ, సాగి. (సంపా), 10.12.2014, "కదంబం, తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు" మూసీ సాహిత్య సాంస్కృతిక, చారిత్రక మాసపత్రిక, హైదరాబాద్.
8) ప్రొ. సిమ్మన్న, వెలమల, 2012, "తెలుగు సాహిత్య చరిత్ర", విశాఖపట్నం .

# కాళహస్తీశ్వర శతకము – మానవాభ్యుదయ మార్గము

– డా॥. బి.ఎన్. మంగాదేవి, విభాగాధిపతి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు, మారిస్ స్టెల్లా కళాశాల, విజయవాడ.

సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీ కృష్ణ దేవరాయల భువన విజయ సభ నలంకరించిన అష్ట దిగ్గజ కవులలో ఒకడైన ధూర్జటి పరమ శివభక్తుడు, అద్వైతి. ధూర్జటి ముదిమి వయసులో కాళహస్తీశ్వర శతకాన్ని రచించాడని విమర్శకుల అభిప్రాయం. అల్పాక్షరాలతో, అనల్పార్థ రచన ద్వారా మానవ జీవన మార్గం ఎటునుంచి, ఎటువైపు మరలాలో ఎటువైపు మరిలితే మానవుడు తనకు కావలసిన శాంతిని పొందు తాడో బోధించాడు. తాను హృదయ పరీక్ష చేసుకుంటూ, మన హృదయమును విప్పిచెప్పుకున్నంత సన్నిహిత భావము మనకు కలిగేటట్లు ఈ శతక కవి మానవ స్వభావాన్ని, నీతి ధర్మ తత్త్వములను, భగవతత్త్వమును మనకు అందించాడు.

సత్యాన్వేషి అయిన మానవుడు సాంస్కృతికంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా తాను వున్న స్థితి నుండి సత్యాన్వేషణ చేస్తూ, మానసిక తృప్తిని, శాంతిని పొంద డానికి ఒక మార్గాన్ని ఎంచుకొని, ఆ మార్గంలో ప్రయత్నం చేస్తూ వుంటాడు. అదే మానవభ్యుదయ మార్గం. ఆ ప్రయత్నంలో అనేక విషయాలను ప్రకృతి నుంచి, సమాజం నుండి అభ్యసిస్తాడు. తాను అభ్యసించిన ఆ పాండిత్యాన్ని తిరిగి సమాజానికి పంచవలసిన బాధ్యతను విస్మరిస్తున్న మానవునికి ధూర్జటి తనదైన విలక్షణ శైలిలో ప్రశ్నలు సంధించాడు. పాండిత్యం ద్వారా, మానవుడు పొంద వలసిన ఆత్మ ఔన్నత్యాన్ని పొందలేకపోతే అభ్యసించిన ఆ పాండిత్యానికి ఫలితమేమిటని ప్రశ్నిస్తాడు.

''చదువుల్ నేర్చిన వండితాధములు స్వేచ్ఛాభాషణక్రీడలన్
వదరన్ సంశయ భీకరాటవులఁ ద్రోవల్‌దప్పి వర్తింపఁగా
మదనక్రోధకిరాతు లందుఁగని భీమప్రౌఢి వేఁ దాఁకిసం
జెదరున్ జిత్తము చిత్తగింపఁగదవే శ్రీకాళహస్తీశ్వరా''

వేదశాస్త్ర పురాణాదులను చదివిన ఈ పండితా ధములు తన మాటకారి తనముతో సభలలో ఇష్ట మొచ్చినట్లు మాట్లాడితే అదివిన్న నాకు సత్యమేదో, అసత్యమేదో తెలుసుకోలేక సంశయం అనే అడవిలో బడి తిరుగుతుంటే ఆ అడవిలోని కామం, క్రోధం అనే కిరాతులు భయంకరంగా నన్ను ఢీ కొంటున్నారు. అ దాడికి ఈ చిత్తం చెదిరి పోతున్నది. ఈ నా దయనీయ స్థితిని అవతరింపుము తండ్రి అని అడుగుతాడు.

ఇక్కడ ఏమి నేర్చిన అది సమాజ హితానికి వుపయోగ పడాలేకాని, మానవులలో ఇది. సత్యమా, అసత్యమా అనే సంశయాన్ని కల్గించకూడదని, పిండితలు ఏదైనా విషయాన్ని సభలలో ప్రసంగించేటప్పుడు అది జనహితమై వుండాలని ప్రభోధించారు. అప్పుడే ఆ పండితులు అభ్యుదయ మార్గాన సమాజాన్ని నడిపించ కలుగుతారు. పండితుల పాండిత్యం అరిషడ్వర్గాలను జయించడానికి ఉపకరించాలి. అంతేకాని సమాజంలో అరిషడ్వర్గాలు ప్రకోపింప చేయకూడదని ప్రభోదించాడు.

అంతేకాక

''ఆయవార్హై చరియింపవచ్చుఁ, దన పాదాంభోజ తీర్థరంబులన్
దయతోఁ ఒమ్మనవచ్చు, సేవకుని యర్థ ప్రాణ దేహదు ల
న్నియు నా సొమ్మనవచ్చుష, గాని సిరులన్ నిందించి నిన్నాత్మ ని
ష్క్రియుతం గానషగరాదు వండితులకున్ శ్రీకాళహస్తీశ్వరా''

ఆచార్య పీఠాన్ని అలంకరించిన పండితుల ఆచరణలోని లోపాన్ని ఎత్తి చూపి పండితులు ఆచరించే విషయంలో ధర్మమేదో తమ పాండిత్యంతో చెపితే చాలదని, అది ఆచరణలో చూపాలని అలా చూపలేకపోతే ఆ ఆచార్యపీఠాన్ని అలంకరించడం వలన సమాజహితం జరగదని, శిష్యులకు ధర్మ మార్గాన్ని నైతిక విలువలను బోధించాల్సిన ఆచార్యులు ఆచరణలో అవి చూపించి, శిష్యులు నైతిక విలువలతో ధర్మమార్గములో నడిచేలా చేయాలని, ఆచార్యుడే అర్థ, కామాలకు విలువనిస్తే ధర్మమార్గము దర్శింపగలడా అని ప్రశ్నిస్తాడు. ధూర్జటి తరువాత అన్నీ తెలుసుకున్న పండితులుకూడా కూడా ఏది శాశ్వతమో, ఏది అశాశ్వతమా తెలుసుకోలేక పోతున్నారే మానవుడు శాశ్వత సుఖాన్ని ఎలా పొందగలడు అంటూ

"శ్రుతు లభ్యాసము చేసి శాస్త్రగరిమల్ శోధించి తత్త్వంబులన్
మతి నూహించి శరీర మస్థిరము బ్రహ్మంబెన్న సత్యంబు గాం
చితి' మంచున్ సభలన్ వృథావచనముల్ చెప్పంగనే కాని, ని
ర్జిత చిత్తస్థిర సౌఖ్యముల్ తెలియరో శ్రీకాళహస్తీశ్వరా"

వేదాలు చదివాం, శాస్త్రాలు పలికించి చూసాం, భగవతత్త్వాలు తర్కించాం - తుదకు దేహమనిత్యం - బ్రహ్మనిత్యం అని తెలుసుకున్నాం - అని సభలలో పనికిరాని మాటలు చెపుతారే కాని మనస్సుని జయించి శాశ్వత సుఖాన్ని పొందేవారు ఏరి? అని కాళహస్తీశ్వరుని ముందు వాపోతూ ఏమి తెలియని, నేర్వని సామాన్య జనం లాగా అన్నీ చదివిన వారు కేవలం సభలలో ఉపన్యసించడం నిరుపయోగమే కదా అని ధూర్జటి చెప్పాడు పండితుడు అయినవాడు ఎలా నడుచుకోవాలి. శాశ్వతమైన సత్యాలను ఆచరిస్తే, మానవుడు హృదయ శాంతిపొంది, శాశ్వతమైన సుఖాన్ని ఎలా పొందగలుగుతాడు అని చెపుతూ ఒక మార్గాన్ని సుగమం చేసి చూపించి మానవా అభ్యుదయ పథం వైపు నడిపించాడు.

మానవుడు అభ్యసించిన విషయాలు నిరుపయోగమైనప్పుడు ఆ చదువులెందుకు అన్ని ప్రశ్నిస్తూ

"ఏ వేదంబుఁ బఠించె లూత భుజగం బే శాస్త్రముల్ చూచెఁ దా
నే విద్యాభ్యసనం బొనర్చెఁ గరి, చెంచే మంత్ర మూహించె, బో
ధా విర్భావ నిదానముల్ చదువులయ్యా కావు, నీపాద సం
సేవాసక్తియె కాక జంతు తతికిన్ శ్రీకాళహస్తీశ్వరా"

అసలైన జ్ఞానం ఎలా వస్తుందో, ఆ భగవతత్త్వం ఒంట పట్టించుకుంటే ఏదిశాశ్వతమో అది తన్నుకుంటూ వస్తుందని అద్వైత తత్త్వాన్ని ఆవిష్కరించాడు ధూర్జటి.

లోకాన్ని అజ్ఞానం నుండి జ్ఞాన మార్గంలోనికి నడిపించే ఈ విద్వాంసులు ఇలా కామార్థాలకు లోనై, మానవులను అభ్యుదయ మార్గంలో, జ్ఞాన మార్గంలో నడిపించ లేక పోతున్నారు.

"వేదం దిట్టఁగరాదుగాని భువిలో విద్వాంసు లంజేయనే
లా? ధీచాతురిఁ జేసెఁ జేసినగులా మాపాటనేపోక క్షు
ద్బాధాదుల్ కలిగింపనేల? యదికృత్యంబైన దుర్మార్గులన్
ఛీ ధాత్రీశులఁ జేయనేటి కకటా శ్రీకాళహస్తీశ్వరా"

అని వారి కామార్థాలను నెరవేర్చడానికి ఉదారులైన రాజులను ఎందుకు సృష్టించలేదు అని విధాతను నిందించడానికి కూడా వెనుకాడలేదు.

అంతేకాక మానవాభ్యుదయం కలగాలంటే పాలకుడైన రాజు ఎలావుండాలో చెప్పి

"పదివేలైనను లోకకంటకులచేఁ బ్రాప్తించు సౌఖ్యంబు నా
మదికిం బథ్యముగాదు; సర్వమునకున్ మధ్యస్థుఁడై సత్యదా
నదయాదుల్ గలరాజు నాకొసఁగు మొన్నన్ వాని నీయట్లచూ
చి దినంబుల్ ముదమొందుదుం గడపటన్ శ్రీకాళహస్తీశ్వరా"

లోక కంటకులైన రాజులు, వారిచే కలిగే సుఖములు

జనహితము గావని, సర్వమునకు తటస్థుడై సత్య, దాన, దయాధృతి క్షమలు గలరాజును మాకు ఇచ్చినచో ఆ రాజులో ఈశ్వరుని దర్శిస్తానని అద్వైత తత్వాన్ని నిరూపించి మానవాభ్యుదయం కలగాలంటే పాలకులైన రాజులు ఉత్తములై వుండాలని చెప్పాడు. ప్రబంధ యుగంలో క్రాంతదర్శియైన ఋషి ధూర్జటి అందుకే కృష్ణదేవరాయలు ధూర్జటి పల్కులకేల కల్గెనో అతులిత మాధురీ మహిమ అని ప్రశంసించాడు.

BHAVAVEENA
Vol. 18, Issue. 6, June 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# కథావార్షిక కథలలో ఇతివృత్త వైవిధ్యం

- కె. వెంకట లక్ష్మి, పరిశోధక విద్యార్థి, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

స్థల, కాల, ప్రాంత, భాషతో సంబంధం లేకుండా అందరి హృదయాలకు చేరువైనది కథ. కథను ఇష్టపడని వారు ఉండరు అనడం అతిశయోక్తికాదు. విస్తృత ప్రచారాన్ని, విశేష పాఠకాధరణను పొందిన ప్రక్రియ కథానికి, వీటికి నేడు శాశ్వతత్వాన్ని కల్పింస్తునవి కథాసంపుటాలు, సంకలనాలు. ఒక రచయిత రాసిన కథలను ఒక పుస్తకంగా వేస్తే అది కథా సంపుటి. ఒక పత్రికలో వచ్చిన కథలు లేదా ఒక పరిమితి కాలంలో వచ్చిన కథలను ఒక పుస్తక రూపంలో వేస్తే అది కథా సంకలనం. కథాసంకలనాలలో కథా పరిణామానికి, ఉద్యమాలకు ప్రాంతాలకు, సాహితీసంస్థలకు సంబంధించినవి ఉంటున్నాయి. కథావళి (1932), విస్మృత కథ (1980), నూరేండ్ల తెలుగు కథలు (2011) మొదలైనవి కథాపరిణామ సంబంధ సంకలనాలు. స్త్రీలకథలు (1901-1980), రైతుకథలు, దళితకథలు, మతన్ (ముస్లీంకథలు) మొదలైనవి ఉద్యమ కథా సంకలనాలు. కళింగకథానికలు, తెలంగాణకథలు, సీమ కథలు, కడప కథ మొదలైనవి ప్రాంతీయసంబంధమైనవి. తెలుగు విశ్వవిద్యాలయం 'తెలుగు కథ', 'రచన'శాయి - వాహినీ బుక్‌ట్రస్ట్‌వారి 'కథావాహిని 2003, 2004, 2005 .........., తానా - అమెరికా సంయుక్త రాష్ట్రాల వారి 'తానా తెలుగు కథలు' మొదలైనవి సాహితీసంస్థల సంకలనాలు. కథావార్షిక కథాసంకలనాలు సాహితీ సంస్థలు కథా సంకలనాల కోవకు చెందినవి.

### కథావార్షిక :

మానవత్వంను ప్రతిబింభించే వందలాది కథలు రాసిన రచయిత 'మధురాంతకం రాజారాంగారు', అతని స్మృతికి చిహ్నంగా ఏర్పడిన సంస్థ "మధురాంతకం రాజారాం సాహిత్య సంస్థ". ఇది ఒక సంవత్సర వ్యవధిలో వివిధ పత్రికలలో వచ్చిన కథలను సేకరించి, చదవడం, కథా సాహిత్యసంహావలోకనం నిర్వహించడం చేస్తుంది. ఉత్తమ కథలలో కథా వార్షికను ప్రచురించేవారు. ఇవి 2000 సంవత్సరం నుండి 2012 వరకు వచ్చాయి. మధురాంతకం నరేంద్ర సంపాదకత్వంలో వెలువడినాయి. యువ రచయితల ప్రోత్సాహ నిమిత్తం "కథా కోకిల పురస్కార ప్రధానం చేయబడుతుంది.ఉత్తమ కథల సంపుటికి ఈ పురస్కారం ప్రధానం చేయబడుతుంది.

### కథావార్షిక కథలలో ఇతివృత్త వైవిధ్యం :

కథావార్షిక సంపాదకులు ముందుమాట చెబుతూ ఉత్తమ ఇతివృత్తం, శిల్పం ఉన్న కథలకు ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టంగా పేర్కొన్నారు. కథావార్షిక ఆరు సంకలనాలలో (2007, 2008, 2009, 2010, 2011, 2012) మొత్తం యాభై ఐదు కథలున్నాయి. ఇవి వివిధ రచయితలచే రాయబడి ఉన్నాయి. ఇతివృత్త వైవిధ్యంను కలిగి ఉన్నాయి. అవి కుటుంబ సంబంధాలు, మానవ సంబంధాలు, స్త్రీలసమస్యలు, కర్షకులు, కార్మికులు, దళితులు, మైనారిటీలు, ప్రపంచీకరణ, సంస్కృతి - సంప్రదాయాలు, మాతృభాషాప్రాముఖ్యం, తాత్వికాంశాలు. ఇలా ఇతివృత్త వైవిద్యంతో కథలు రచింపబడ్డాయి.

### కుటుంబ సంబంధాలు :

మానవ జీవితం కుటుంబంతో ఆరంభమవుతుంది. భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శమైనది. కథావార్షిక సంకలనాలలో కుటుంబ సంబంధాలను చిత్రించిన కథలు పదిహేను ఉన్నాయి. భార్య - భర్తల సంబంధాలు, తల్లిదండ్రులు - పిల్లలమధ్య సంబంధాలు, విద్యావిషయాలు, అంతరాలు మొదలైన ఇతివృత్తం కలిగిన కథలు కలవు. భార్యభర్తల సంబంధాలలో అన్యోన్యదాంపత్యం, ద్వితీయ వివాహాలు అనేవి ఉప

విభాగాలు. నేనొస్తున్నాను కథలో భార్యభర్తల అన్యోన్య దాంపత్యం చిత్రించబడింది. జీవిత ప్రయాణంలో కష్టాలు, అత్యాశలనుండి ఒకరికొకరు రక్షించుకోవాలని తెలుపుతుంది. ద్వితీయ వివాహ సమస్యను చిత్రించిన కథ ఆవిడ (సత్యవతి). కథలు లేని కాలం, బంధీ కథలలో తల్లిదండ్రులు - పిల్లలమధ్య అంతరాలుచిత్రింపబడ్డాయి. ఒక్కవానకోసంలో (పాపినేని శివశంకర్) విద్యా విధానం లోని మార్పులను చిత్రించిన కథ. నేడు కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులకు ఈ కథలు నిదర్శనంగా ఉన్నాయి.

**మానవ సంబంధాలు :**

మానవుల మధ్య సంబంధాలు ఉన్నతంగా, పటిష్టంగా ఉన్నప్పుడు సమాజం అభివృద్ధి చెందుతుంది. కథావార్షిక కథలలో మానవసంబంధాలను చిత్రించిన కథలు పద హారు ఉన్నాయి. సత్సంబంధాలు, దుస్సంబందాలు, స్నేహసంబంధాలు, ఆర్ధికసంబందాలను చిత్రించిన కథలున్నాయి. సహృదయత, సాయం, సేవ, నిజాయితి వంటివి సత్సంబంధాలు. దేవుణ్ణి అటకాయించిన మనిషి (మొహార్)లో సహృదయత, చాంద్‌కీ ఈద్ (బా రహమతుల్లా) లో సాయం, గోమేజ్ ఎప్పుడొస్తాడో (వేలూరి వేంకటేశ్వరరావు) లో సేవ, అసందిగ్ధ కర్తవ్యం (అడెపు లక్ష్మీపతి) లో నిజాయితీ చిత్రింప బడ్డాయి. అమానుషం, అవినీతి, దురాశ వంటి దుస్సంబంధాలు చిత్రింప బడ్డాయి. అత్యాశతో విభిన్న వ్యాపారాలు చేసి పతనమైన రీతిని చిత్రించిన కథ చివరి మజిలి (టి.ఎస్.ఏ కృష్ణమూర్తి) పులి (ఏ.ఎన్.జగన్నాధ శర్మ), క్వీన్ విక్టోరియా మళ్ళీనవ్వింది (నల్లురి రుక్మిణి) కథలలో అమానుషం, అవినీతిని చిత్రించారు.

తల్లిలాంటి సొంతఊరు దక్కలేదనే బాధ, స్నేహితుని మరణంతో ప్రాణాలను వదిలిన ఇల్లాంనాయుడి గాధను చిత్రించిన కథ 'మాయ' (గంటేడ గౌరునాయుడు). ఆకలి, పేదరికాన్ని భరించలేక తన కష్ట ఫలితంకోసం సాటిమనిషి బాధించిన లింగాల కథ కొలిమి (కొలకలూరి ఇనాక్). సమాజంలోని మంచి, చెడు రెండు పార్శ్వాలను ఈకథలు ప్రతిబింబిస్తున్నాయి.

**స్త్రీలసమస్యలు :**

సమాజంలో సగభాగమైన స్త్రీలు కొన్ని సమస్యలను ఎదుర్కొంటున్నారు. కథావార్షిక కథలలో స్త్రీహత్య, గృహ హింస, వంచన, జోగినీ వృత్తి మొదలగు సమస్యలు చిత్రిం చిన కథలున్నాయి. ప్రేమించలేదని కసితో కాలేజీ యువతిపై యాసిడ్ దాడితో చంపిన కథ పాఠాంతరం (వాడ్రేవు చినవీర భద్రుడు). పరివర్తన (ఆరి సీతా రామయ్య), నల్లపిల్లనవ్వు (విమల) కథలలో గృహహింస, వంచన ప్రధానాంశాలుగా ఉన్నాయి. అనాదిగా కొన సాగుతున్న జోగిని వృత్తికి బలిఐన అమ్మాయి కాళాపు. అహింసావృత్తినుండి విముక్తి కోసం ఆమెచేసిన ప్రయత్నం చిత్రించిన కథ కాళావు ( మన్నం సింధుమాదిరి) ఇలా స్త్రీలపై జరుగుతున్న అరాచకాలను ఇతివృత్తంగా తీసుకుని కథలు రచింపబడ్డాయి.

**కర్షకులు :**

కర్షకులే అన్నదాతలు, దేశానికి వెన్నెముకరైతన్న, అద్దంలో చిత్రం (వి. పోతన్న), ఇగవీడు తొవ్వకురాడు (పెద్దింటి అశోక్ కుమార్) రెండు కర్షకుల జీవితాన్ని చిత్రించిన కథలు. పంటలపై పెట్టిన పెట్టుబడిరాక, అప్పులు చేసి, వాటిని తీర్చలేక ఆత్మహత్య చేసుకున్న రైతు వ్యధను వర్ణించిన కథ అద్దంలో చిత్రం. కరెంటు లేక నీరు అందక ఎండిన పంటను చూసి బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు జీవితగాధను తెలిపిన కథ ఇగవీడు తొవ్వకురాడు.

**కార్మికులు :**

శ్రమకి కష్టానికి నిలువెత్తు నిదర్శనం కార్మికులు, కథా వార్షిక సంకలనాలలో సామికుంబుడు (సి. రామచంద్ర రావు), బానిసల స్వర్గం ( బి. అజయ్ ప్రసాద్) కథలు శ్రామికుల ఇతివృత్తంను చిత్రించిన కథలు. తమ యజమాని పని ప్రారంభ ప్రార్ధన పూజ జరుపలేదని

కార్మికులు నిరసన తెలుపుతారు. చివరివరకు పోరాడి తమకార్యం నెరవేర్చుకుంటారు కార్మికులు అని స్వామి కుంబుడు కథ తెలుపుతుంది. అధికారి పెట్టే అవమానా లను భరిస్తూ, తమ ఉద్యోగం ఎప్పుడు ఊడిపోతుందో ననే భయంతో జీవించే ఉద్యోగుల బాధలను చిత్రించిన కథ బానిసల స్వర్గం.

**దళితులు :**

అనాది కాలంనుండి అస్పృస్యతను, అవమానాలను, అసమానతను, వివక్షను ఎదుర్కొంటున్నవారు దళితులు. దళితుల ఆత్మగౌరవాన్ని, హక్కులను, సమానతను పోరాడి సాధించిన విధానాన్ని వర్ణించిన కథ పంపకాలు (పి. చిన్నయ్య). దేవుళ్ళతో సమానంగా భావించే చిన్న పిల్లల మనస్సుపై ముద్రింపబడిన కులస్పృహ చిత్రించిన కథ బ్లాక్ ఇంక్. దళితుల పేదరికాన్ని, ఆకలి వ్యధను హృదయాన్ని ద్రవింపచేసేలా చిత్రించిన కథ..... బాలేదు, జెరమొచ్చింది (డా॥ వినోదిని). అగ్రకులస్థుల ఇంటిలో జీతకత్తెగా మంగమ్మ ఉంటుంది. ఇంటిపని పొలం పనులు చేసేది. ధాన్యం పంపకం సమయంలో మంగమ్మ భర్తపై దొంగతనం నింద వేసి ధాన్యం ఇవ్వరు. దు:ఖ పడుతూ వెళ్ళిన మంగమ్మ ఇతివృత్తం ఉన్నకథ కాకికి కడవెడు పిచ్చిక్కి పిడికెడు (స.వెం.రమేష్).

**మైనారిటీలు :**

సంఘంలో నివసిస్తున్న జనాభాలో మతం, భాష, సంస్కృతి, జాతిలో ఇతరుల కంటే భిన్నంగా ఉండే ప్రజా సమూహాన్ని మైనిరిటీలు అంటారు. జమ్మూ (వేంపల్లి షరీఫ్) లో ముస్లింల అభద్రత చిత్రింపబడింది. ప్రతి శుక్రవారం భర్తను, కొడుకును ఖచ్చితంగా మసీదుకు పంపే ముస్లింస్త్రీ మక్కామసీదులో బాంబు బ్లాస్ట్ ఐనరోజు వాళ్ళు మసీదుకు పోనందుకు సంతోష పడుతుంది. కబూతర్ (స్కైబాబు) పేద ముస్లీం ఆడపిల్లలకు పెళ్ళి చేయడానికి వారుపడే బాధలను తెలిపిన కథ. మా (బారహమతుల్లా) అమ్మ ప్రేమకు మించిన ప్రేమలేదని అమ్మగొప్పతనాన్ని చాటిన కథ.

**ప్రపంచీకరణ :**

యావత్ ప్రపంచం ఒక కుగ్రామంగా మారడాన్నే ప్రపంచీకరణ అనవచ్చు. 'చూపు' కథలో విద్య, ఉద్యోగా లలో వచ్చిన పరిణామాలు చిత్రింపబడ్డాయి. ఒక్క వాన కోసం (పాపినేని శివశంకర్) విదేశీ విద్యా వ్యామోహంను తెలుపుతుంది. దారికాచిన దృశ్యం (జి. వెంకటకృష్ణ) కథ రైతులపై ప్రపంచీకరణ ప్రభావంను ప్రతిబింబింప జేస్తుంది.

**సంస్కృతి - సంప్రదాయాలు :**

భారతదేశ సంస్కృతి - సంప్రదాయాలు సర్వోన్నత మైనవి. గిరిజనుల ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయా లను, వివాహాన్ని అద్భుతంగా వర్ణించిన కథ 'టెహిళికి పెళ్ళి'. నదిపరిసర, లోతట్టు ప్రాంతాల ప్రజలు నదులకు, సెలయేర్లను పూజించే విధానంను చిత్రించిన కథ 'ఆడపొడసు సొంగెం' వీటిని స. వెం. రమేష్ రచించారు.

**సాహిత్యం - భాష :**

సాహిత్యపుస్తకాల ముద్రణను, పంపిణి గౌరవంగా భావించి కృషి చేసిన సాహితీమూర్తులకు నిలయంగా ఉన్న బెజవాడ గొప్పదనాన్ని, సాహిత్యకారుల ప్రాముఖ్యంను తెలిపిన కథ. దీనికి పాత సాఫ్ట్‌వేర్ పనిచేస్తుంది (చొరగుడి జాన్‌సన్) స.వెం. రమేష్ రచించిన 'అడివంచు పల్లె' కథ ఒక మారుమూల పల్లె ప్రజల, పట్టణ వాసం తెలియని వారికి మాతృభాషపై ఉన్న మమకారాన్ని చిత్రించబడింది.

**తాత్వికాంశాలు :**

తాత్వికతను చిత్రించిన కథలు ఐకాంతిక (స్వామి), సగంమనుషులు (కాశీభట్ల వేణుగోపాల్), చిట్టచివరి సున్నా (భగవంతం) మొదలుగునవి. మానవుడు కొన్ని సంధర్భాలలో ఊహలలో, భ్రమలో జీవిస్తుంటాడని తెలిపిన కథ ఐకాంతిక. మనుషులు ఎవరికి ఎవరు పూర్తిగా అర్థంకారు అంతా సగం సగమే అని చెప్పిన కథ సగం మనుషులు. చిట్టచివరిసున్నా కథలో మానవ జీవితం అంతా శూన్యం, ఉన్నవాటితో తృప్తిగా, ఆనందంగా జీవించాలనే సందేశం పాఠకులకు కలిగించినది.

**ఉపసంహారం :**

పైన తెలిపినవేకాక, రాజకీయ, విజ్ఞాన, వ్యాపార, వ్యంగ్య మొదలగు అంశాలు ఆయా కథలలో అంత ర్లీనంగా చిత్రించబడ్డాయి. కథావార్షిక కథలలో ఇతివృత్తం వైవిధ్యంగా ఉంది. చక్కని శిల్పంతో పాఠకులను ఆకర్షించే విధంగా కథలు ఉన్నాయి. సంపాదకుల ఆశయాలకు అనుగుణంగా కథల ఎంపికలో ఇతివృత్త వైవిధ్యంను కనబరిచారు.

**ఆధార గ్రంధాలు :**

1. కథావార్షిక సంకలనాలు - 2007,2008,2009,2010,2011,2012, మధురాంతకం రాజారాం సాహిత్యసంస్థ, మునిరెడ్డి నగర్, తిరుపతి.
2. తెలుగు కథానిక - కొలకలూరి ఇనాక్.
3. మన నవలలు - మన కథానికలు - రాచపాలం చంద్రశేఖర్ రెడ్డి.
4.నూట పదేళ్ళ తెలుగు కథ - విభిన్న దోరణులు - కాలువ మల్లయ్య.

BHAVAVEENA
Vol. 18, Issue. 6, June 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# వలసపాలనలో జమిందారీలు – రైతాంగ పోరాట చరిత్ర

- డా॥. కె. శ్రీదేవి
తెలుగుభాష & అనువాద అధ్యాయనశాఖ,
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

- చంద్రబాబు
పరిశోధక విద్యార్థి, తెలుగుభాష & అనువాద
అధ్యాయనశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

బ్రిటీష్ వలసపాలకుల ఆధిపత్యంలో ఉత్తరాంధ్ర, రాయలసీమ, కోస్తా, తెలంగాణా నాలుగు ప్రాంతాలు మొఘలాయిలు తర్వాత కాలంలో ఫ్రెంచివారి ఆధి పత్యంలో కొనసాగాయి. అయినప్పటికీ ఈ ప్రాంతాలు స్థానికంగా కొండజాతికి చెందిన రాజుల ఆధీనంలోనూ, క్షత్రియ, వెలమ కులాలకు చెందిన వారి పాలనలోనే కొనసాగాయి. ఆనాటికి రాజులు శిస్తు వసూలు చేసే అధికారం, రక్షణకోసం స్వంత సైనిక బలగాలను పోషించుకునే అధికారం కల్గి ఉన్నారు. అయితే అత్యధికభాగం విజయనగరం రాజుల ఆధీనంలోనే ఉండేది. బొబ్బిలి యుద్ధం తదనంతర పరిణామాలలో బ్రిటీష్ వలసపాలకులను విజయనగరం రాజు ఆనంద గజపతిరాజు ఆహ్వానించాడు. బ్రిటీష్‌వారితో చేతులు కలిపి ప్రెంచివారిని యుద్ధంలో ఓడించడం ద్వారా బ్రిటీష్ వలసపాలన ప్రత్యక్షంగా ప్రారంభమయింది. ఈ యుద్ధానంతర పరిణామాలలో నైజాం నవాబు సలాబత్‌జంగ్‌కు, బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ వారికి జరిగిన సంధిలో భాగంగా బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలోకి వెళ్లింది. అయినప్పటికీ స్థానికంగా రాజుల ప్రత్యక్ష పర్యవేక్షణలోనే సామాన్య ప్రజానీకం ఉంది. యుద్ధం జరిగి, విజయం సాధిస్తే జరగబోయే పరిణామాలను గురించి విజయనగరం రాజులకు ఆంగ్లేయులకు మధ్య ఒప్పందం కుదిరింది.

శాశ్విత శిస్తు నిర్ణయ పద్ధతి అమల్లోకి వచ్చిన కొంత కాలానికే ప్రధానంగా కొండ జమీందార్లు, కంపెనీ చెప్పిన పద్ధతుల్లో 'పేష్కస్' చెల్లించలేకపోవడంతో బహిరంగవేలం పద్ధతుల్లో ఈ జమీలను కంపెనీ స్వాధీనంలోకి పోవడమో లేదా బహిరంగ వేలంలో అధికమొత్తాలను చెల్లించిన వారికి దఖలు పడటమో జరిగాయి. జమీలు పోవడం తోనూ, కంపెనీ పాలకుల ఆదేశాలను పాటించాల్సి రావడం అనే కారణంతోనూ అనేక ప్రాంతాలలో అసంఘటిత రైతాంగ పోరాటాలు జరిగాయి.

ముఖి వీరభద్రరాజు పితూరీ, పాయకరావు తిరుగుబాటు, అచ్చపువలస పితూరీ, పట్టశింగి పితూరీ, గొలుగొండ పితూరీ ఇలా అనేక తిరుగుబాట్ల వెల్లువ అటవీ ప్రాంతాలలో సాగింది. రాజ్యం అల్లకల్లోలంగా మారుతోందని గ్రహించిన బ్రిటీష్ ప్రభుత్వం ఈ తిరుగుబాట్ల వెల్లువను అణచివేయడం కోసం సకల అధికారాలు కల్పించి రసెల్ అనే అధికారిని పంపింది. అతడు ఓ వైపు తిరుగుబాట్లను విజయనగర జమీందార్ విద్రోహకర వత్తాసుతో నిర్ధాక్షిణ్యంగా అణచివేస్తూ, సాధారణ పరిపాలనా చట్టాలతో వీళ్లను పాలించడం అసాధ్యంగా భావించి ఈ ప్రాంతాలకు వర్తించేలా విశేష అధికారాలతో కలెక్టర్‌ను ఏజెంట్‌గా నియమిస్తూ ప్రత్యేక చట్టాన్ని 1838 సంవత్సరంలో తీసుకువచ్చారు. ఆ తర్వాత కాలంలో విశాఖ జిల్లాలో తిరుగుబాట్ల వెల్లువ కొనసాగుతూనే ఉంది. సాలూరు ప్రాంతంలో కొర్రాయి వలస పితూరి, బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని కూల్చాలనే స్పష్టమైన లక్ష్యంతో సాగింది. 5000 గిరిజన సైన్యాన్ని కొర్రా మల్లయ్య సమకూర్చుకున్నాడు. వాళ్లకి తుపాకి ఆకారంలో ఉండే వెదురుబొంగులతో విల్లంబులను అందించి సాయుధులను చేసాడు. విషయాన్ని గ్రహించిన బ్రిటీష్ పాలకులు 1900 మే 7న ప్రత్యక్ష దాడికి దిగి వీరిపై దమనకాండకు పాల్పడ్డారు. ఉద్యమ నాయకులను నిర్భంధంలోకి తీసు

కున్నాడు. నిర్భంధంలోనే కొర్రా మల్లయ్య మరణించాడు. దీని తర్వాత సాయుధ తిరుగుబాట్లకే తలమానికమైన అల్లూరి శ్రీరామరాజు నేతృత్వంలో రంప తిరుగుబాటు రూపుదిద్దుకుంది. బహుశ దీర్ఘకాలం అంటే 2 సంవత్స రాలపాటు తమ కొద్దిమంది సైన్యంతో బ్రిటీష్ ప్రభుత్వాన్ని ముప్పుతిప్పలు పెట్టిన రంప చోడవరం తిరుగుబాటు నాయకత్వ నిర్మూలనతోటే అణచి వేయబడింది. మొత్తంగా వలసపాలన కాలంలో సాగిన ఆదివాసీ తిరుగుబాట్లను, కారణాలను సాకల్యంగా, లోతుగా పరిశీలించాల్సి ఉంది.

బ్రిటీష్ కంపెనీ పాలన కూడా అంతకుముందు ఈ దేశంపై దండెత్తిన దురాక్రమణదారులవలనే భారతీయ సామాజిక పునాది చట్రాన్ని కదిపే ప్రయత్నం ఏమీ చేయలేదు సరికదా ఈ చట్రంలో అత్యున్నత స్థానంలో ఉన్నవారి పునాదిని మరింత బలీయం చేసింది. ఆ విధంగా తమకు ఎటువంటి ఢోకా రాకుండా చూసుకొంది. సామాజిక స్థాయిలోని పై వర్గంతో రాజీపడటం ద్వారా తన అధికారాన్ని స్థిరపరచుకొనే ప్రయత్నం చేసింది. ఈ దేశపు భూసంబంధాలలో మౌళిక మార్పులు తీసుకు రావడానికి కంపెనీ ఎటువంటి ప్రయత్నాలు చేయలేదు సరికదా యధాస్థితిని కొనసాగించడానికే కంపెనీ మొగ్గుచూపింది. సరికదా అంతవరకు దేశంలో లేని భూస్వామ్య వ్యవస్థకు పునాదులు వేసింది. రెవెన్యూ వసూళ్ల యంత్రాంగంగా ఉన్న జమీందార్లకు భూములపై అధికారాన్ని దఖలు పరిచే శాశ్విత నిర్ణయ పద్ధతిని అమలు చేసింది. ఆ విధంగా సామ్రాజ్యవాదం దేశీయ ఫ్యూడ లిజంతో మమేకమైందన్న సూత్రీకరణ తెలుగు ప్రాంతంలో అడుగడుగునా కనిపిస్తుంది.

శాశ్వితశిస్తు నిర్ణయం జరిగిన తర్వాత భూమిపై శాశ్వత హక్కు, వంశపారంపర్యహక్కులతో సహా జమీందారీ వర్గం ఏర్పడిన తర్వాత భూసంబంధాలలో అత్యంత మొరటు పద్ధతులు చోటచేసుతున్నాయి. ప్రాచీన గ్రామసమాజంలో భూమి ఉమ్మడి ఆస్తిగా పరిగణించబడే స్థితి నుంచి, బ్రిటీష్ తరహా ఫ్యూడలిజంని బ్రిటీష్ సామ్రాజ్యవాదంతో రైతాంగ జీవితం ఎలా అతలాకుతలమైన స్థితిని ఎదుర్కొందో రైతులు అసహాయ స్థితినుంచి ఆందోళనా పథం వైపు అడుగులు వేసిన స్థితిని పరిగణించాల్సి వుంది. ఏ పరిస్థితుల్లో రైతాంగం జీవనం గడుపుతోందో అర్థం అవుతుంది.

బొబ్బిలి జమీందారీ: బొబ్బిలి జమీందార్ రైతాంగంపై క్రూర నిర్భంధకాండను ప్రయోగించడంలో ఈయన అగ్రగామి. రైతాంగంలో ఏ ఒక్కరూ తనకు ఎదురు చెప్పకూడదనేది ఈయన అహంకార ప్రవృత్తికి నిదర్శనం. అటవీ ప్రాంతాలపై సైతం అధికారం ఈతనిదే అటవీ ప్రాంతాలను ఆనుకొనివున్న గ్రామాలలో వ్యవసాయ భూమిపైకి అడవి జంతువులు వచ్చి దాడిచేస్తే వాటిని కొట్టే హక్కుసైతం రైతాంగానికి లేదు. తమ పంటలు నాశనం అవుతున్న మౌనంగా పట్టనట్లు చూడాల్సిన స్థితి రైతాంగానిది. (ఇంటర్వ్యూ: మద్రాపు సత్యనారాయణ, రైతు నాయకులు) సరిగ్గా 16 శతాబ్దంనాటి జర్మనీ రైతాంగం స్థితిని ఎంగెల్స్ తన ప్రసిద్ధ గ్రంథం 'జర్మనీలో రైతు యుద్ధాలు' అనే పుస్తకంలో వివరించిన విధంగానే ఈ స్థితి ఉంటుంది. బొబ్బిలి సంస్థానంలో అటవీప్రాంతాల పరిరక్షణకు ఒక అటవీశాఖాధికారి ఉండేవారు. బొబ్బిలి జమీందారీ ప్రాంతంలో అటవీప్రాంతం హెచ్చుగానే ఉండేది. దుప్పులు, లేళ్లు, సింహం, సివంగి, చిరుత పులులు, అడవి పందులుండేవి. అడవిపందులు తరచుగా అటవీ భూములను ఆనుకొనిఉన్న వ్యవసాయ భూములపై పడి పంటను ధ్వంసం చేసినా వాటిని బంధించే అధికారం కానీ, చంపే హక్కుగాని రైతాంగానికి లేదు. బొబ్బిలి సంస్థానంలో ఈ అటవీ ప్రాంతానికి ఆనుకొని బక్కుపేట, నారశింహునిపేట, రాజేరు, బొడ్డవలస, కొనికొండవలస, నిమ్మలపాడు, చెల్లివలస, డొంగిరివలస, నారాయణప్పవలస ఇలా అనేక గ్రామాలుం డేవి. ఈ గ్రామాల రైతాంగానికి తమ పంటలు తిరిగి ఇంటికి వచ్చే వరకు అడుగడుగునా గండాలే. (మద్రాపు ఇంటర్వ్యూ)

రైతుల జీవన సరళి చాలా సాధారణంగా ఉండేది. కట్టుకోవడానికి గుడ్డలు ఉండేవి కావు. కేవలం మొల వరకు మాత్రమే గుడ్డ కట్టేవారు. ఆడవాళ్ళకు జాకెట్టు తొడిగే అలవాటు లేదు. పిల్లలకు వస్త్రధారణ అనేదే లేదు. వ్యవసాయకులాల పరిస్థితి ఇలా ఉంటే దళిత, గిరిజనుల పరిస్థితి మరింత దారుణంగా వుండేది.

జమీందారు దగ్గర బంధువు అటవీశాఖ అధికారిగా ఉండేవారు. అతను నిరంతరం గుర్రంపై ఈ ప్రాంతాలను తిరుగుతూ అజమాయిషీ చేసేవాడు. మైదాన ప్రాంతంలో ఏదైనా అంశంపై ప్రజల్లో ఎవరైన పొరపాటున నిలవేసినా వాళ్లపై అటవీసంపద నాశనం చేశారనే కేసులు నమోదు చేయబడేవి.

ఈ పరిస్థితులు దాదాపుగా 'స్వాతంత్యా'నంతర కాలం వరకు కూడా కొనసాగాయి. బొబ్బిలి జమీందారీ దొంతరల వ్యవస్థ జమీందార్ -దివాన్ -శిరస్‌దార్ -ఠాణేదార్ -సమాజ్‌దార్ -గ్రామ రెవిన్యూ పెత్తందార్‌ను చూసినా హడలుగానే ఉండేది.

బొబ్బిలి సంస్థానాధీశుని నిరంకుశత్వానికి వ్యతిరేకంగా రైతాంగం ఆగ్రహం ఎప్పుడూ అణచిపెట్టబడి ఉండేది. 1992లో శిస్తులు పెంచడాన్కి బొబ్బిలి జమీందారు చేసిన నిర్ణయాలకు వ్యతిరేకంగా రాజాం దగ్గరలోని అడవరం - లక్ష్మీపురం గ్రామ రైతాంగం స్పాంటేనియస్ ఆందోళన చేశారు. బొబ్బిలి రాజు వాళ్లను ఖైదు చేయించాడు. 22 మంది రైతులు అరెస్ట్ చేయబడ్డారు. అందులో ఒకతను జైల్లో మరణించాడు. (ఆంధ్రప్రదేశ్‌లో రైతు ఉద్యమాలు : సం: వై.వి.కృష్ణారావు)

పర్లాకిమిడి జమీందారీ: పర్లాకిమిడి రాజు కూడా ఇతర జమీందారుల్లానే వ్యవహరించేవాడు. ప్రజల్లో అత్యధిక శాతం నిరక్షరాస్యులు, వ్యవసాయకులాలుగా ఉన్న వారిలో ఈ ప్రాంతంలో కాపులు అధికం. రైతులకు స్వంత ఆస్తి అనేదిలేదు. జమీందార్ సిబ్బంది శిస్తుల వసూలుకు వచ్చేవారు. పాతపట్నం, ఫర్లాకిమిడి (నేటి అర్థంలో) తాలూకాలు మొత్తం ఫర్లాకిమిడి జమీందార్ ఆధీనంలో ఉండేవి. ఈ జమీలో నీటి వనరులుగా ఫర్లాకిమిడిలో సీతసాగరం, పాతపట్నంలో రామసాగరం అనే చెరువులే ఉండేవి. మెళియాపుట్టిలో ఒక చెరువు ఉండేది. ప్రాజెక్టులు లేవు. చెరువులు, చిన్న నీటి సరస్సులు మాత్రమే నీటి వనర్లు.

నీటి వనరులున్న ప్రాంతంలో వరి, మెట్ట ప్రాంతాలలో వేరుశెనగ ప్రధాన పంటలు. కొద్దిపాటి చెరకు. అరటి పంటలుండేవి. (ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు దారపు విశ్వనాథం ఇంటర్వ్యూ ఆధారంగా)

విజయనగరం సంస్థానం: జమీందారులందరికన్నా విజయనగరం జమీందారులు ఉదార స్వభావులనే పేరు ఉంది. అయితే ఈతని క్రింద లెక్కకు మించిన ఇనాం దార్లు, మొఖసాదార్లు ఉండేవారు. వాళ్లు చాలా దుర్మార్గంగా వ్యవహరించేవారు. విజయనగరం జమీం దారు ఏనాడూ వీరిని కట్టడి చేసే ఆలోచన చేసేవాడు కాదు. సరికదా రైతాంగం హక్కుల గురించి వాకబుచేసి వాళ్లను తమ దుర్భర, దారిద్ర్యం నుంచి తప్పించిన దాఖలాలు కూడా లేవు. దీనికి ఉదాహరణగా అల మండలో 'కాకర్లపూడి' ఇంటిపేరుగల రాజులలో కొందరు చాలా దుర్మార్గంగా ప్రజలతో వ్యవహరించేవారు.

'ఆలమండ' చుట్టుపక్కల గ్రామాలలో ప్రజలు రోడ్డు మీద చెప్పులు కూడా వేసుకొని నడవడానికి వీలులేదు. ఒంటినిండా బట్టలు కట్టుకోడానికి లేదు. ఈ గ్రామాల్లో యువకులకు ఇతర గ్రామాలవాళ్లు పిల్లనిచ్చే దానికి సైతం ముందుకు వచ్చేవారు కాదు. ఈ గ్రామాలు ఎప్పుడూ రాజుల ఆధీనంలో, చెప్పుచేతల్లో ఉండాల్సి ఉండేది. రాజుల స్వంత పొలాలు సాగుచేసిన తర్వాత మాత్రమే రైతులు తాము సాగుచేస్తున్న భూములు సాగు చేయాల్సి ఉండేది. ఉన్న ఒకే ఒక నీటివనరు గ్రామంలో ఉన్న చెరువు మాత్రమే. చెరువుల దగ్గర భూములన్నీ మొఖాసాదార్లవే! రైతుల భూములకు నీటి గ్యారంటీ అనేది లేదు. రైతుల పరిస్థితి ఇలా ఉంటే వీళ్లమీద

ఆధారపడే వ్యవసాయకూలీల స్థితి చెప్పనలవికాదు' (ఆలమండ రైతు ఉద్యమ నాయకుడు లగుడు సింహాద్రితో ఇంటర్వ్యూ)

మందస జమీందారి ప్రాంతం: జమీందార్‌కి 'అంచ నాల కమిటీ' అని ఉండేది. ఆ అంచనాల కమిటీ గ్రామాలను పర్యటించి అంచనావేసి తమ నివేదికలను జమీందార్‌కి ఇచ్చేవారు. ఈ అంచనాలను బట్టి శిస్తు నిర్ణయం అయ్యేది' (రైతు ఉద్యమ నాయకుడు మార్పు పద్మనాభం తనయుడు సీతారామయ్యతో ఇంటర్వ్యూ) శాశ్విత శిస్తు నిర్ణయ పద్ధతిలో నిర్ణయం అయిన శిస్తులకు, వాస్తవంలో రైతు దగ్గర వసూలు చేసే శిస్తులతో ఎటువంటి పోలికా ఉండేదికాదు. రైతాంగం తీవ్రమైన దారిద్ర్యంతో మగ్గేవారు.

పంట దిగుబడులు కూడా చాలా స్వల్పంగా ఉండేవి. పంటలో అధికభాగం శిస్తులకే పోయేది. శిస్తులు చెల్లించలేక రైతాంగం భూముల్ని వదిలేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. వీటి గురించి ఇంకా వివరంగా చర్చిం చాల్సివుంది.

మొత్తంగా పరిస్థితి చూసినపుడు స్పష్టమైన వర్గవిభజన జరిగిపోయింది. కొద్ది సంఖ్యలో, అష్టైశ్వర్యాలతో, రైతాంగాన్ని పీల్చిపిప్పిచేస్తూ భోగాలను అనుభవించే జమీందారీవర్గం, వాళ్లకు వస్తాసుగా నిలబడే బ్రిటీష్ సామ్రాజ్యవాదం ఒకవైపున, అశేష రైతాంగం, పీడిత ప్రజానీకం మరోవైపు ఎదురెదురుగా మోహరించి ఉన్నారు. అజ్ఞానం, నిరక్షరాస్యత, జమీందారీ పాలకులపై మూఢభక్తి, రెక్కలు తప్ప ఆస్తులు లేని రైతాంగం, వ్యవసాయకూలీలు మరోప్రక్క ఉన్నారు.

## రైతాంగ ఉద్యమ చైతన్యం :

1920-47 కాలం నాటి మద్రాస్ ప్రెసిడెన్సీలోని ఉద్యమ, చైతన్య స్థాయిలను పరిశీలిస్తే, 1917లో విజయ వంతమైన రష్యావిప్లవ ఫలితంగా ఒక నూతన తరహా సమాజం కోసం యువత కలలు కనడం ఆరంభమైంది. 'రంగూ, రూపులో భారతీయులుగానూ, ఆలోచనల్లో ఆంగ్ల మానసపుత్రులు గానూ' తయారు చేయాలనుకొన్న 'మెకాలే' సంకల్పం జాతీయ భావాలు గల యువత తయారుకావడాన్కి కూడా తోడ్పడింది. ఆంగ్లభాషను అధ్యయనం చేయడంతోపాటు ప్రపంచ చరిత్రను, రాజకీయాలను సైతం యువత అధ్యయనం చేయ సాగింది. ప్రధానంగా రష్యన్ విప్లవ విజయం యువ తరాన్ని మంత్రముగ్ధుల్ని చేసింది. ఫలితంగా అస్పష్టంగా నైనా కార్మిక, కర్షక రాజ్యం కోసం తపన మొదలైంది. తమ దేశంలో విదేశీ సామ్రాజ్యవాదుల జోక్యాన్ని, అజమాయిషీని, నియంత్రణలను ప్రశ్నించే ఉద్యమాలు మొదలైనాయి. మొదటో ఈ భావాలు మధ్య తరగతి చదువుకున్న బృందాలకు పరిమితమైనప్పటికీ వ్యవ సాయక సమాజంగా ఉన్న భారతదేశం లాంటి దేశంలో అవి సామాన్య రైతు జనావళికి వ్యవసాయ కూలీల శ్రేణుల్లోకి వెళ్ళకుండా ఉద్యమాలు నిలదొక్కుకొనే అవకాశం ఉండదు. కాబట్టి ఉద్యమాలు మధ్యతరగతి శ్రేణుల్ని దాటి రైతు సంఘాలుగానూ, వ్యవసాయ కూలీ సంఘాలుగానూ పరివర్తన చెందడం ఆరంభించాయి. తద్వారా సామాజిక జీవితపు అట్టడుగు పొరల్లో చైతన్యం విస్తరించి, రైతు ఉద్యమాలకు జవాన్ని, జీవాన్ని అందించాయి.

# "గురుదేవోభవ" ఆడియో గీతాల ఆల్బమ్ – గురువు విశిష్టత

– పురస్తుల అనిల్ కుమార్, టి.జి.టి. తెలుగు ఉపాధ్యాయులు, బాలురు1, టెగ్రీస్, కరీంనగర్.

''గుకారోంధరకారస్తు రుకారస్తాన్నివత్తయే'' అని, అంధకారాన్ని తుడిచే వాడు గురువని గురువుకు అర్థం చెప్పారు. గురువుకు అధ్యాపకుడు, ఉపాధ్యాయుడు అనే పర్యాయ పదాలు వాడుతున్నారు. సంస్కృతంలో గు అనగా చీకటి/అంధకారం మరియు రు అనగా వెలుతురూ /ప్రకాశం అని అర్థం. అనగా గురువు అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించే వాడు.

బడి అనే నారు మడిలో విద్య అనే విత్తనం వేసి, అక్షరం అనే నీరు పోసి, చెడు అనే కలుపు తీసి మంచి నీతి అనే ఫలాలని సమాజానికి అందించే వాడే ఉపాధ్యాయుడు. ఆదిమ యుగం నుంచి ఆధునిక యుగం వరకు ఆయనే ఋషి. జీవన వికాసానికి నిచ్చెన వేసే అక్షర కార్మికుడు, సమాజ దేవాలయానికి నిజమైన రక్షకుడు. ఆయనెవరో కాదు మనందరికీ విద్యా బుద్ధులు నేర్పే గురువు. అందుకే మన సమాజంలో అమ్మా నాన్నల తరువాతి స్థానం గురువులకి ఇచ్చారు. శిశువుని లోకానికి పరిచయం చేసిన అమ్మ మొదటి గురువైతే, ఎదలపై తన్నుతూ ఆటలాడే శిశువుకు నడక నేర్పే నాన్న రెండో గురువు. ఆ తరువాత ఈ లోకంలో ఎలా నడుచుకోవాలో నేర్పి విద్యాబుద్ధులు అందించే ఉపాధ్యాయుడు మూడో గురువు. తల్లిదండ్రులు పిల్లలను కనడం, పెంచడంవరకే బాధ్యత. అభివృద్ధిపథంలో నడిచే ప్రతీ ఒక్కరికి సమాజంలో గురువుల పాత్ర తప్పక ఉంటుంది. వారు పాఠ్యాంశాలను బోధించడంతోనే సరిపెట్టుకోరు. ప్రపంచ గమనాన్ని అవగతం చేయడం ద్వారా విద్యార్థుల నడవడికను తీర్చిదిద్దుతారు. ఉన్నతమైన ఆశయాలను ఉద్బోధిస్తాడు. ఆ ఆశయ సాధన దిశగా దిశా నిర్దేశం చేస్తారు. ప్రతీగురువు తన వ్యక్తిత్వం ద్వారా విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేస్తారు. అలాంటి గురువు ఎప్పటికి విద్యార్థుల మనస్సులో దేవుడుగా నిలిచి పోతాడు. అందుకే పెద్దలు మాతృ దేవోభవ, పితృ దేవోభవ, ఆచార్యదేవోభవ అని అన్నారు.

ఇంతటి అత్యంత ముఖ్యమైన స్థానాన్ని కల్పించిన గురువును పూజించడానికి 1966 అక్టోబర్ 5 న పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఉపాధ్యాయుల హెూదా గురించి విశిష్టమైన తీర్మానం ఆమోదించబడింది. ఆ రోజును ఏటా ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని 1994లో యునెస్కో ప్రకటించింది.

మనదేశంలో గురువు జాతి గౌరవాన్ని లోకానికి చాటి చెప్పిన ఉన్నతమైన ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మన దేశ రెండో రాష్టపతి, మేదావి, విద్యావేత్త అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని ప్రభుత్వం ఉపాధ్యాయదినోత్సవంగా గుర్తించింది. ప్రతియేటా సెప్టెంబర్ 5న గురువులను సన్మానించుకునే అవకాశాన్నిచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా సుమారు వంద దేశాలు అక్టోబర్ 5న అంతర్జాతీయ గురుపూజోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ ముఖ్య ఉద్దేశం భవిష్యత్ తరాలకు విద్యా ప్రణాళిక ఎలా ఉండాలి అనే అంశంపై ఉపాధ్యాయుల మద్దతు కూడగట్టడం. అజ్ఞానం అనే చీకట్లను పారద్రోలి జ్ఞానమనే వెలుగును ప్రసాదించేది గురువు. ఆ వెలుగులో ముందుకు నడిపిస్తూ అనుకున్న గమ్యానికి చేర్చేది గురువు. మహా పరాక్రమవంతులుగా ధర్మ బద్ధులుగా ప్రసిద్ధి చెందిన మహారాజులే కాదు అవతార పురుషులుగా చెప్పబడుతున్న శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి వారు సైతం గురుముఖతా విద్యను అభ్యసించారు. కొంతమంది భక్తులు దైవాన్ని ఆశ్రయించినపుడు గురువును ఆశ్రయించమని ఆ దైవమే ప్రత్యక్షంగా చెప్పిన సందర్భాలు

ఉన్నాయి. గురువు, దైవం ఇద్దరూ ఒకేసారి ఎదురుపడితే తాను గురువుకి ముందుగా నమస్కరిస్తానని ఎందుకంటే ఆ దైవాన్ని చూపించినది గురువే నని "కబీరు దాసు"హొచెప్పడాన్ని బట్టి గురువు యొక్క గొప్పతనం ఎంతటిదో మనం గ్రహించవచ్చు. అంతటి గురువును పూజించే రోజుగా గురుపౌర్ణమి చెప్పబడుతోంది. ఆషాఢ పౌర్ణమి గురుపౌర్ణమిగా పిలువబడుతుంది. ఎందుకంటే ప్రథమ ఆచార్యుడైన వేదవ్యాసుడు పుట్టినది ఈ రోజునే. లోకానికి అష్టాదశ పురాణాలను అందించిన ఆచార్యుడిగా, సనాతన ధర్మాన్ని ఆచరించమని చెప్పిన గురువుగా ఆయనని ప్రతి ఒక్కరూ పూజించవలసిన అవసరం ఉంది. అందుకే ఈ పౌర్ణమిని వ్యాస పౌర్ణమి అని కూడా పిలుస్తారు.

ఈ రోజున తమకి అక్షర భిక్ష పెట్టిన గురువులను దర్శించి వారికి పాద పూజ చేసి దక్షిణతో కూడిన నూతన వస్త్రాలను పండ్లను సమర్పించాలని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. గురువు యొక్క ఆశీస్సులు భగవంతుడు ప్రసాదించిన వరాలతో సమానమైనవని, ఎవరైతే గురువుని పూజిస్తారో, ఆయనని సేవిస్తారో అలాంటి వాళ్ళు భగవంతునికి అత్యంత ప్రీతిపాత్రులు అవుతారని స్పష్టం చేస్తున్నాయి.

ప్రతి వ్యక్తి జీవితంలో గురువుల పాత్ర గణనీయంగా ఉంటుంది. మత పరంగా గురువు అనేది మార్గదర్శి అన్న అర్థం వచ్చే విధంగా సిక్కు, బౌద్ధ, హిందూ మతాలలో మరియు కొన్ని ఆధునిక మత చైతన్యాలలో ఉపయోగంలో ఉన్నాయి. గురుకుల విద్యా విధానంలో గురువు పాత్ర అత్యంత కీలకమైనది. ఆధునిక కాలంలో ఉపాధ్యాయులు (Teachers) మరియు ఉపన్యాసకులు (Lecturers) అని వివిధ దశలలో విద్యా బోధన చేస్తున్నారు.

తెలుగు సాహిత్యంలో ఉపాధ్యాయుని పై పద్యం, వచనం, కవిత్వమే కాక గేయాలు కూడా ఎక్కువగానే వచ్చాయి. ఇలా ఎంతో మంది గేయ రచయితలు రాసిన పాటలలో ప్రస్తుతం నేను ఎంచుకున్న ఆల్బమ్ "గురు దేవోభవ" దీనిలో మొత్తం ఏడు పాటలు న్నాయి. వీటిని మాట్ల తిరుపతి, ఇతరులు రాయగా సురేష్ బాబు, సాయి చంద్, అరుణ, అనిల్ కుమార్, శ్రీ మల్లేష్ మొదలగువారు ఆలపించారు. అవి,

1. గురువే సృష్టికిమూలంరా
2. ఇవే ఇవే వందనాలు
3. దేశ ప్రగతికి సేవ చేసే గురువారా
4. దండమో దండాలు సారూ మాష్టారు.
5. అందాల మా ఊరిలోన మాష్టారు.
6. మాస్టారు మాపల్లెలు నిన్నే పిలిచాయి.
7. విద్యను బోధించే మా మంచి గురుదేవా

!!ప!! దేశ ప్రగతికి సేవచేసే గురువరానికొందనం దీన
జనులకు విద్య నేర్పే విద్య వేత్తలకు వందనం.
చదువు సారం తెలియనోళ్లు బతుకు భారం మోసేటోళ్లు,
బడుల గూడులను కట్టే టోల్లు బండరాళ్లను ఎత్తెటోళ్లు.

మీ వాళ్లను మరువకు ఓ మాస్టారు, చదువు వెలుగు పల్లె పల్లెకు నింపు మాస్టరు.

'దేశ ప్రగతికి సేవచేసే గురువరానీకొందనం" అనే పాటలో పేద విద్యార్థులకు చదువు నేర్పమని గురువును వేడుకోవడం కనిపిస్తుంది. దీంట్లో పల్లవి మొదటిలోనే దేశం యొక్క ప్రగతిని ప్రపంచ నలుదిశలా చాటి చెప్పుటకు గురువు చేసే సేవా ప్రధానమైనది. ప్రపంచ భవిష్యత్తు నాలుగు గోడల మధ్య రూపుదిద్దుకుంటుందని "కొఠారి కమీషన్" చెప్పిన మాట ప్రకారం, ఇలా నాలుగు గోడల మధ్య గురువులు చెప్పిన వివిధ పాఠాలు విని విద్యార్థులు వివిధ రంగాలలో రాణించి ఉన్నత స్థానాలను అధిరోహించి వారి వారి విధులను నిర్వర్తించే క్రమంలో

చెడును, అవినీతిని, అన్యాయాన్ని, అధర్మాన్ని, అక్రమాల్ని దరిచేరనీయకుండా విధుల్ని నిర్వర్తించినప్పుడే అవినీతి రహిత సమాజం ఏర్పడుతుంది. అలాంటి సమాజం ఉన్నప్పుడే దేశం అన్నింటా ప్రగతిని సాధిస్తుంది అని ఇక్కడ మనం అర్థం చేసుకోవచ్చు.

ఈ పాట మొత్తంలో ఒక వ్యక్తి విద్యార్థి దశ నుంచి ఉపాధ్యాయునిగా ఎదగడానికి తోడ్పడిన వాళ్ళని గుర్తు చేస్తూ నీ ఉన్నతికి సహాయ పడినటువంటి వాళ్లు సమాజం లోని శ్రామికులందరు . ఆ శ్రామికులకు,

ఆ సమాజానికి నీవు చదువు వెలుగును పల్లెపల్లెకు నింపి సమాజ అభివృద్ధికి తోడ్పడాలి మాస్టారు అని చెబుతున్నట్లు కనిపిస్తుంది. కాబట్టి అభివృద్ధి చెందిన సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయుని పాత్ర ఎంతో ముఖ్యమని తెలుస్తుంది. మట్టి ముద్దలను పనికి వచ్చే పాత్రలను తయారు చేసే శక్తి ఒక ఉపాధ్యాయునికే ఉన్నదన్న విషయం అర్థమవుతుంది. సమాజానికి సేవ చేయడం ఉపాధ్యాయుని బాధ్యత అని తెలుస్తుంది .

!!ప!! గురువే సృష్టికి మూలం రా గురువే త్రిమూర్తి రూపం రా
గురు తత్వ బోధ గురు సత్య వేద మోక్ష ద్వార ములు చేర్చును రా
గురు పాదములకు సమర్పించిన మనసే బ్రహ్మ స్వరూపం రా
గురువుపదేశం పొంది తరించిన మానవ జన్మే ధన్యం రా.

1. భవ బంధాలను దూరం చేసి భక్తి విత్తనం నాటు రా
బాధ రోధనల ఈ భయ భ్రాంతుల భ్రమల నెల్ల కడ తేర్చును రా
దుఃఖ నివారణ దుర్గుణనాశన మొనరించు వాడు గురువే రా
మానవజాతికి ధీనకోటికీ మార్గదర్శి సద్గురు వేరా

2. అజ్ఞానమనే అంధకారమున విజ్ఞాన జ్యోతి గురు వేరా
ఖర్మ సారమును విషద పరచి సన్మార్గమునే చూపించునురా
ఆహారమును బాపి ఇహ పరమొసగి ఆత్మశుద్ధి గావించునురా
స్వార్థ రక్కసిని సమాధి చేసే సత్య సమిద సద్గురువే రా

3. సృష్టి స్థితి లయ కారకులైనా త్రిమూర్తులే శిక్షించినను నిష్ఠతోడ సద్గురును స్మరించిన చేరదీసి రక్షించును రా
హొగురు ఆగ్రహానికి గురి అయితే తరుణోపాయం శూన్యం రా
గురు చరనాణాలె నమ్మినవారికి శాశ్వత పరమా నందం రా

4. కలిమాయల వలలోన చిక్కి కాలయాపనా చేయకురా
కలి చూ పైన చేరలేని గురు కరముల నీడన గడుపుము రా
క్షణ భంగురమౌజీవితాన్ని తత్క్షణమే గురునికి అర్పించరా
కనివిని ఎరుగని ఘన యోగాన్ని పొంది సద్గురుని సేవించరా

'గురువే సృష్టికి మూలంరా అనే పాటలో'' సృష్టికి మూలమైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను గురించి పరి చయం చేసేది గురువే కాబట్టి గురువు కంటే త్రిమూర్తులుహొగొప్పవారు కాదు అని అర్థమవుతుంది.

జీవితంలో విజయం సాధించాలని కోరుకోని వారుం డరు. కానీ కొందరే విజయ తీరాన్ని చేరగలరు, అనుకున్న లక్ష్యం చేరడం సులువు కాదు, అలాగని అసాధ్యం కాదు. ఒక సామాన్యుడు విజేత గా మారిన ప్రతి నేపథ్యం వెనుక ఓ గురువు ఉంటాడు. ఈ గేయంలో ఆధ్యాత్మిక గురు తత్వం ఎక్కువగా కనిపిస్తుంది. గురువు అంటే

అజ్ఞానమును తొలగించి జ్ఞానం వైపు నడిపించే వాడు కనుక ఈ తత్వాన్ని మనకు బోధిస్తాడు. ఇది నేర్చుకున్న శిష్యుడు మంచి వ్యక్తిత్వం గలవాడిగా సమాజంలో భాసిల్లుతాడు. వేద అంటే జ్ఞానం అని అర్థం. కాబట్టి గురువు నేర్పించే సత్యమైన జ్ఞానాన్ని నేర్చుకున్న ప్రతి విద్యార్థి జీవితం మోక్షం లాగా ఉంటుంది. అంటే ఎటు వంటి స్థితిలోనైనా తన స్థానాన్ని నిలుపుకోగలడు. కష్ట నష్టాలలోనైనా, సుఖదుఃఖాలలోనైనా తనను తాను నిలదొక్కుకునే ఆత్మస్థైర్యాన్ని పొందగలుగుతాడు. ఎటువంటి స్థితిలో నైనా పరమానందాన్ని పొందగల ధైర్యంను పొందగలుగుతాం. అంటే ఇహ లోక శ్రమలు మనల్ని ప్రభావితం చేసినా తొట్టిల్లకుండా ఉండగలం. జ్ఞానాన్ని సొంతం చేసుకోవడానికి గురు తత్వ బోధలు, గురు సత్య వేదలు సహాయ పడుతాయని విషదమవుతున్నది. "గురు పాదములకు సమర్పించిన మనసే బ్రహ్మస్వరూపం రా" అన్న వాక్యంలో శిష్యుడు తన ఏకాగ్రతను గురువుకు సమర్పించిన అపారమైన జ్ఞానాన్ని పొందుతాడు. బ్రహ్మ స్వరూపులు అనగా జ్ఞానవంతులుగా వెలుగొందుతారు అన్నమాట. గురు ఉపదేశం పొంది తరించిన మానవ జన్మే ధన్యమురా. అనగా గురువు దగ్గర మనం శిష్యునిగా స్థానం సంపాదించాం అంటే అంతకంటే ధన్యమైన జన్మ మరొకటి లేదు.

"భవ బంధాలను దూరం చేసి భక్తి విత్తనం నాటునురా" అనగా పుట్టిన తరువాత ఈ సమాజంలో అల్లుకున్న బంధాలు, మనసులో భక్తి అనే విత్తనాన్ని నాటే వాడేగురువు. బాధ, రోధన, భయభ్రాంతులు, భ్రమలను, దుఃఖాన్ని నివారించడం, చెడు గుణాలను నాశనం చేయడం, గురువు నేర్పే జ్ఞానజ్యోతి తోనే సాధ్యం అవుతుంది. దీనులకు మార్గనిర్దేశం చేసే వాడు గురువే. ఉదాహరణకు సావిత్రిబాయి పూలే, అంబేద్కర్ మొదలగువారు ఎటువంటి స్వార్థం లేకుండా దీన జనులకు విద్యను అందించి దిశా నిర్దేశకులు అయినారు.

ఖర్మ సారము అనగా ఎటువంటి స్వప్రయోజనం కాంక్షించకుండా సన్మార్గము నడిపించేది గురువే అన్నాడు. అవును ప్రతి గురువు తను తమ గురువుల వద్ద నేర్చుకున్న విద్యను ఎంతమాత్రము దాచుకోకుండా తమ విద్యార్థులకు ఉన్నత స్థానం చేరుకోవాలని కోరుకుంటాడు. గురువు శిష్యునికి విద్యాబుద్ధులు నేర్పించడమే కాకుండా అతడు తనను మించిపోయేంతగా అభివృద్ధి చెందాలని ఆకాశమే హద్దుగా ఎదగాలని చివరకు తాను కూడా శిష్యుని చేతిలో పరాజయం పొందేంతగా శిష్యుని శ్రేయస్సును గురువు కాంక్షిస్తాడు. శిష్యుడు కూడా తనకు పునర్జన్మ వంటిదైన జ్ఞాన జన్మను ప్రసాదించిన గురువు పట్ల కాల పరిమితి లేకుండా జీవితమంతా కృతజ్ఞతా భావాన్ని కలిగి ఉండడమే కాకుండా గురువు ప్రశస్తిని లోకానికి తెలియ జెప్పే రీతిలో ప్రవర్తిస్తాడు. ఇక్కడ గురువు ఎటువంటి స్వార్థాన్ని ఆశించకుండా శిష్యుని ఉన్నతిని కోరడం గమనించవచ్చు. అలాగే "అహము" నేను అనే భావాన్ని తొలగించి సమాజంలోని అందరిలో నేనున్నాను అనే ఆత్మశుద్ధి కలుగజేసి సత్యము, జ్ఞానము అనే కట్టెలతో స్వార్థము అనే రాక్షసిని సమాధి చేసేవాడు గురువే అని గురువు కున్న శక్తిని కీర్తించినాడు. సృష్టికి కారకులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరుడు అయిన త్రిమూర్తులు శిక్షిస్తే కనుక సద్గురుని శరణు కోరితే చేరదీసి రక్షిస్తాడు, అంటే గురువుకు అంతటి శక్తియుక్తులు కలవు. అంతటి గురువుకు కోపం తెప్పిస్తే కనుక తరువాత మనకు రక్షణ దొరకదు. అలాంటి గురువుల నమ్మినవారికి శాశ్వత పరమానందం దొరుకును.

పురాణాల ప్రకారం సృష్టిలో కృతయుగం, త్రేతా యుగం, ద్వాపరయుగం, కలియుగం అని నాలుగు యుగాలు ఉన్నాయి. కలియుగంలో కలి చెడును, అజ్ఞానాన్ని ప్రేరేపిస్తాడు. పాపాలను ఎగదోస్తాడు కాబట్టి ఆ కలిని దరిచేరనీయకూడదు, అంటే మన దగ్గర జ్ఞానం అనే వెలుగు ఉండాలి. ఆ జ్ఞానం గురువు దగ్గర లభిస్తుంది. అజ్ఞానం వలన ఇప్పటి సమాజంలో హత్యలు మానభంగాలు జరుగుతున్నాయి. ఇలాంటివి జరగకుండా

ఉండాలంటే కలి మాయ లో చిక్కకూడదు. ఇటువంటి అజ్ఞాన అంధకారాన్ని పోగొట్టేది కేవలం గురువు మాత్రమే. జ్ఞానం అనే వెలుగు ఉంటే అజ్ఞానం అనే అందకారం దరిచేరదు. గురువు దరిచేరి కలి ప్రేరేపించే కాలయాపన పనులు మానుము అని అర్థం. కావున మానవ జీవితం ఏ క్షణంలో ముగుస్తుందో తెలియదు. కాబట్టి ఈ క్షణం క్షణభంగురమౌ జీవితాన్ని గురువుకు అప్పగిస్తే మనం ఎన్నడూ చూడని, వినని ఒక గొప్ప యోగాన్ని తను అందించే విద్య ద్వారా కల్పిస్తాడు అని చెప్పుకొచ్చాడు.

!!ప!! మాస్టారు మా పల్లెలు నిన్నే పిలిచినయి వపాలెం గ్రామ ప్రభుత్వ గిరిజన పాఠశాలలో 52 మంది విద్యార్థులు ఉన్నారు. అక్కడికి చేరాలంటే పాడేరు మండలం నుండి సుమారు 50కిలోమీటర్లు ప్రయాణించాలి అందులో సగం దూరం బైక్ పై వెళ్లొచ్చు ఇక అక్కడ నుండి బైక్ ప్రయాణం కుదరదు కాలినడకన వెళ్లాల్సిందే నడుచుకుంటూ వెళ్ళాడు, అప్పుడు విద్యార్థుల సమయం అంతా వృదా అయింది. అది గమనించి గ్రామస్థులు ఆ మాస్టారుకు గుర్రం కొనుగోలు చేసి ఇచ్చారు, అప్పటి నుండి ఆ మాస్టారును గుర్రం మాస్టారూ అని పిలిచేవారు, ఆయన చేసే బాధ్యతాయుత బోధనను ప్రభుత్వం గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు ఎంపిక చేసింది. ఇలాంటి సేవ చేసే మాస్టార్లు ఎంతోమంది ఉన్నారు. ఆ గ్రామ వాసులంతా ఒక గుర్రాన్ని కొనిచ్చి మా పిల్లల భవిష్యత్తు మార్చమని ఆహ్వానించారు మా బ్రతుకుల వలే మా పిల్లల బ్రతుకులు అంధకారం కాకుండా వారి జీవితంలో జ్ఞానం అనే జ్యోతిని వెలిగింప స్వాగతం పలికారు కాబట్టి మారుమూల పల్లె ప్రజల జీవితాల్లో వెలుగు నింపే సూర్యుడవై ఉదయించు మాస్టారు అని రచయిత భావం.

రెండవ చరణంలో ఆ చల్లని వెన్నెల నీవై చదువులు నేర్పించాలి అంటాడు. అంటే వెన్నెల చల్లగా ఉంటుంది మా పిల్లలు మీరు చెప్పిన ఇంటి పనులు చేయకపాతే కనుక నాలో దీపం వెలిగించావు నన్నే వెలుగులో నడిపించావు

1. మల్లె పువ్వంటి మనసే నీ దయ్య,నిండు వెన్నె
   లయినా నీ సాటి రాదయ్యా
   కల్ల లెరుగని పిల్లల మయ్యా, ఎల్లకాలము సల్లంగా జూడు.
3. ఎట్టి సాకిరిలో నన్నేడిపించి రయ్య, పొట్టకూటి
   కోసంహొ నన్ను జీతముంచిరయ్యా
   బర్ల నుగొర్ల ను గాసే నన్ను బడిలోనసదువ
   నేర్పించావు.

ఈ పాఠలో మల్లెపూవసొంటి, కళ్ళు ఎరుగని, కాయకష్టం చేసుకుని బతికే పిల్లల జీవితాలలో దీపం వెలిగించి, ఆ వెలుగులో నడిపించే గురువు యొక్క దయాగుణాన్ని ఆవిష్కరించాడు రచయిత.

మూడవ చరణంలో పొట్ట నింపుకోవడం కోసం బాల్య వయసులోనే వారి బాల్యాన్ని మొగ్గలోనే నలిపి వేయబడే చిన్నారులను గుర్తించి బడిలోకి చేరదీసి చదువు చెప్పే గురువులదయార్ద హృదయాన్ని స్పృషించాడు. ఇలాంటి గురువులను ఎంతో మందిని గమనించే ఉంటాము. అలాంటి వారిని నా విద్యాభ్యాసంలో స్వార్థం ఎరుగని గురువులను చూసాను. నేను వ్యక్తిగతంగా దైవ సమాను లైన ఒక గురువు అంధకారమయమయ్యే నా జీవితంలో వెలుగులు నింపారు, ఆయనే నాకు డిగ్రీలో చరిత్ర బోధించే ఉపన్యాసకులు. తను సంపాదించే ఆదాయంలో 70 శాతం వరకు మాలాంటి ఎంతోమంది నిరుపేదలకు ఎటువంటి స్వప్రయోజనాన్ని ఆశించకుండా విద్య కయ్యే ఖర్చును భరించేవారు. తను అందించిన స్ఫూర్తిని మేము నేటికీ కొనసాగిస్తున్నాము. నేను

ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి కారణం చిన్ననాటి నుండి నాకు విద్య నేర్పిన ఉపాధ్యాయులే, కాబట్టి విద్యార్థుల నైతిక విలువలను పెంపొందించి విజ్ఞానంతో పాటు అనుబంధాలు సత్ప్రవర్తన వంటి విలువలను నేర్పే గురువును గౌరవించి గుండెల్లో పెట్టుకో వలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

ఆధునిక కాలంలో దూసుకెళ్తున్న విద్యాభ్యాసంలో, బోధనలో తేడాలు రాలేదు. విద్యా విధానంలో పరీక్ష నిర్వహణలో తేడాలున్నాయి కానీ గురుశిష్యుల మధ్య సంబంధం మాత్రం ఎప్పటిలాగే ఉంది. లోకంలో తండ్రీ కొడుకుల సంబంధం అట్లాగే భార్యాభర్తల సంబంధం, తల్లి కొడుకుల సంబంధం వలే గురు శిష్య సంబంధం కూడా స్థిరమైనది, పవిత్రమైనది. కంప్యూటర్లు సీ.డి.లు, ప్రయోగశాలలు, ఎల్.సి.డి.లు, ప్రొజెక్టర్లు ఇలా అత్యాధునిక పరికరాలు ఎన్ని అందుబాటులోకి వచ్చినా, ఎంత సాంకేతిక సమాచారం ఇచ్చినా దానిని ఆకళింపు చేసుకొని ఆలోచనలను, సమస్యలను పరిష్కరించుకునే జ్ఞానాన్ని అందించేది  ఒక గురువు మాత్రమే. పుస్తకంలో పాఠాలే కాదు జీవితంలో నేర్వాల్సిన గుణపాఠాలు నేర్చుకోవాలంటే గురువు వద్దకు చేరాలి. ఏ వృత్తికి లేని ఇతివృత్తం ఉపాధ్యాయ రంగానిది, ఏ వ్యక్తికీ లేని శిష్యకోటి పరివృత్తం ఉపాధ్యాయునికి మాత్రమే సొంతం.

విద్యా వ్యవస్థ శరవేగంగా మారిపోతున్న ప్రస్తుత తరుణంలో ఇలాంటి గొప్ప గురువుల అవసరం నేటి సమాజానికి ఎంతో ఉంది. అయితే గతంలో మాదిరిగా ఇప్పుడు ఉపాధ్యాయులు- విద్యార్థుల మధ్య సంబంధాలు కొనసాగడం లేదు. వారిపట్ల గురు-శిష్య సంబంధాలు మాయమై డబ్బు సంబంధాలను మాత్రమే మిగుల్చుతున్నాయి. నేటి కార్పొరేట్ విద్యావ్యవస్థలో ర్యాంకులే పరమావధి కావడం వల్ల

ఉపాధ్యాయుల పట్ల చూపించాల్సిన విధేయత, గౌరవాభిమానాలు తగ్గుముఖం పట్టాయి. రాను రాను పేలవమవుతున్నాయి. కొన్ని కొన్ని సినిమాల్లో వారిని ఎగతాళి చేస్తూ చూపించడం చాలా బాధాకరం, నేటి సమాజంలో కొంతమంది ఉపాధ్యాయులలో కొంత మేరకు నైతిక విలువలు లోపిస్తుండటం కూడా కొంత కారణం కావచ్చు, నైతిక విలువలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉంది. దీనితో సమాజం, రాష్ట్రం, దేశం సర్వతోముఖాభివృద్ధి చెందుటకు పూర్తిస్థాయి గురువుగానే కాక సద్గురువుగా ప్రతి ఒక్కరు విరసిల్లాలి.

# కె.వి.నరేందర్ కథలు – ఇతివృత్త వైవిధ్యం

– రాయపూడి శివకుమారి, పరిశోధక విద్యార్థిని, ఓరియంటల్ విభాగం, తెలుగు, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

కథా ప్రక్రియ ఆనాటి ప్రాచీన సాహిత్యంలో సామాన్య జనులలోనూ మిక్కిలి ఆదరణ పొంది ప్రత్యేకమైన సాహిత్య ప్రక్రియగా గుర్తింపుపొందింది. ఆనాటి నుండి కథా వాఙ్మయంలో వేలకు వేలు కథలు గంగా ప్రవాహంలా పుట్టుకొని వచ్చాయి. ప్రాచీన సాహిత్యాలలో కథా వాఙ్మయం ఒక జీవనదిలాంటిది. అయితే అక్కడ కనిపించే కథాస్వరూపం వేరు. ఆధునిక కథా స్వరూపం వేరు. ఒకే సాహిత్య ప్రక్రియగా వెల్లివిరిసినా సంస్కృత కథలకు తెలుగు కథలకు ఎక్కడా పోలీకలేదు.

తెలుగు కథానికా సాహిత్యంలో ఒకే అంశం చుట్టూ తిరిగే కథలతో కథానికా సంకలనాలను వెలువరించిన ఘనత కె.వి. నరేందర్ కు దక్కుతుంది. 'అమ్మ'ను కేంద్రంగా చేసుకొని 'అమ్మ' పేరుతో, సైనికులను కేంద్రంగా చేసుకొని 'యుద్ధం' పేరుతో, పిల్లలను కేంద్రంగా చేసుకొని 'బురదలో జాబిల్లి' పేరుతో, తండ్రిని కేంద్రంగా చేసుకొని 'నాన్న' పేరుతో, ఇల్లాలని కేంద్రంగా చేసుకొని "నాతి చరామి' పేరుతో, పల్లెటూరును కేంద్రంగా చేసుకొని "ఊరు' పేరుతో ఆయన ఇదివరకు ఇలాంటివి ఆరు కథానికా సంకలనాలను వెలువరించాడు. ఈ తరహా కథలకు ఆయన 'సింగిల్ కాన్సెప్ట్ కథలు అన్న పేరు కూడా పెట్టాడు. అమ్మ మీద వెలువరించిన కథలకు 'మదర్ కాన్సెప్ట్ స్టోరీస్' అని నాన్న మీద వెలువరించిన కథలకు 'ఫాదర్ కాన్సెప్ట్ స్టోరీస్' అని... ఇలా ఈ కథలను సింగిల్ కాన్సెప్ట్ కథలనో లేక ఏకాంశ కథలనో అనొచ్చునన్న అభిప్రాయాన్ని కె.వి.నరేందర్ కల్గించాడు. తెలుగు కథానికా సాహిత్యంలో దీన్నొక ప్రయోగంగా చెప్పుకోవచ్చు.

ఇతివృత్త వైవిధ్యం, పాత్ర చిత్రణలో పటుత్వం, అద్భుతమైన కథాశిల్పం, గంగా ప్రవాహంతో సాగే రచనా పాటవం తన కథల్లో మలచిన కథా శిల్పి, సీనియర్ కథా రచయిత కె.వి.నరేందర్.

జీవితాన్ని నూతన దృక్పథంతో దర్శించి కథారూపంలో దాని తత్వాన్ని అన్వయించే ప్రయత్నంలో భాషలో కొత్తదనాన్ని, శిల్ప నైపుణ్యాన్ని, సంఘ అభ్యుదయాన్ని నిలబెట్టి చివరి వరకు చదివించే శైలిని, వస్తు శిల్పాల సమన్వయాన్ని కె.వి.నరేందర్ తన కథల్లో సమర్థవంతంగా నిర్వహించారు. 'ఇతివృత్తం కావ్యానికి శరీరం' అని భరతుడు చెప్పాడు. సాహిత్యంలో వ్యక్తమయ్యే ప్రధాన భావాన్ని వస్తువు లేదా ఇతివృత్తం అంటారు. రచయిత సాహిత్యంలో వివరించిన ఆశయాన్ని వస్తువుగా చెప్పవచ్చు. "కథకు ఇతివృత్తమంటూ ఒకటి ఉండడం తప్పనిసరి. ఇతివృత్తం కోసం ప్రత్యేకంగా వెదనవసరం లేదు. ప్రతి మనిషికి కదలికలోనూ కథకు కావలసిన ఇతివృత్తం ఉంటుంది. తనను, తన చుట్టూ వున్న సమాజాన్ని, మనుషులనూ పరికించి చూడగలిగితే ప్రతి కన్నీటి బొట్టూలోనూ, కంటిపాప మెరుపులోనూ, కథకు కావలసిన ముడిసరుకు దొరుకుతుంది. అయితే, రచయిత తనకు గల అభిరుచులను బట్టి, ఆలోచనా ధోరణిని బట్టి, తనకు కావలసిన వస్తువును ఎంచు కుంటాడు. తన సామర్థ్యాన్ని బట్టి కథగా మలచు కోగలుగుతాడు. సరిహద్దుల్లో శతృవునెదుర్కొంటున్న సైనికున్ని తల్చుకోకపోతే మన కన్ను మనం పొడుచు కున్నట్టే. అయిదు దాటిన తర్వాత ఆఫీసు నుంచి రావటం లేటయితేనే తల్లీబిడ్డలు తల్లడిల్లి పోయే రోజులివి. సరిహద్దుల్లో యుద్ధం చేస్తున్న కొడుకు/భర్త ఏ రీతిలో వస్తాడోనన్న ఆలోచన... ఎంత భయంకరమైందో వూహించండి.

యుద్ధం ముగిసినా... విజయోత్సాహాన్ని మనం పంచు కుంటున్నాం. జ్ఞాపకాల్నీ, అవార్డుల్నీ... కన్నీటితెరల మధ్యన వాళ్ల కుటుంబాలు పంచుకుంటున్నాయి. మరణానంతరం శౌర్యచక్రల్నీ, పరమవీరచక్రల్నీ, అందుకుంటున్నప్పుడు

కన్నీటితో ఒక్క పెట్టున రోదించిన తల్లుల్ని, స్పృహతప్పి పడిపోయిన ఇల్లాల్లనీ చూసి భరతమాత గుండె పగిలినా... మనం మాత్రం ఆ వార్తలు చదివి వదిలేస్తాం. సినిమాల్లో హీరోయిన్ ఏడుప్పు కదిలించినంత కూడా అలాంటి సంఘటనలు మనల్ని కదిలించలేకపోతున్నాయి. దాదాపుగా అవి మన దృష్టికే రాకుండా పోతున్నాయి.

అదిగో... అలాంటి స్ఫూర్తితో... యుద్ధమేఘాల వెనక తచ్చాడుతున్న గుండెల్లోని తడిని చూపించాలన్న తపనతో ఈ కథా సంపుటిని మీ ముందుంచుతున్నాం. సరిహద్దు జీవితాల్లోని బంధాలు, అనుబంధాల మధ్య సంఘర్షణనీ ప్రతిబింబించిన ఈ కథలు.

'యుద్ధం' కథలో నిజానికి యుద్ధమే లేదు. కాని సరిహద్దు ఉద్యోగాల్ని ఎలా భావిస్తున్నారో తెలియ చెప్పటంలో నరేందర్ కృతకృత్యులయ్యాడు. ఇప్పుడు యువకుల్లో దేశభక్తిని పెంపొందించటం ఎంతైనా అవసరం. సైనికుల త్యాగనిరతిని, శౌర్యగుణాల్ని మనోరంజకంగా చెప్పడానికి నరేందర్ ప్రయత్నించాడు. సైనికుల జీవితాల మీద చిరుకథల సంపుటి అయినా రావటం హర్షించదగింది. శత్రువు, పృథ్వీ, మా...తుయే సలాం, సైనికుని ఉత్తరం...ఇలా కథల పేర్లలోనే విశిష్టత వుంది. కథల్లో ఉద్వేగం, ఉద్రిక్తత మనసుని సరిహద్దుల్లోకి తీసుకెళ్తాయి. గుండె కవాటాలు యుద్ధభేరిని మోగిస్తాయి. కథనం పదంపదం...కదం కలిపిన సైనికుల్లో తట్టి లేపితే...కథనశిల్పం కదనరంగానికి మధనంతో, వ్యధనంతో సాగుతుంది.

ఒకే కాన్సెప్ట్ పై రాసిన కథలైనప్పటికీ... ప్రస్తుత బర్నింగ్ సబ్జెక్టు ఇదే కాబట్టి... అందంగా రూపుదిద్దుకున్న 'యుద్ధం' అందరూ చదవాల్సిన కథలసంపుటి. భారత సరిహద్దు ప్రాంతం మరోసారి దిక్కులు పిక్కటిల్లేలా దద్ద రిల్లుతోంది... రాకెట్ లాంచర్లు గగనతలాన్ని చీల్చు తున్నాయి... బంకర్ల

నించి వడగళ్లవానలా కురుస్తున్న గుళ్లు.. నిర్విరామంగా మూణెళ్లనించి సాగుతున్న యుద్ధం..

సైన్యం ఉక్కుపిడికిలి బిగించి పోరాడుతోంది... రవ్వంత విశ్రాంతి కూడా దొరకని పోరాటం అది... అప్పుడు...సాయంత్రం నాలుగున్నర గంటలు దాటు తోంది. విస్ఫోటనా శబ్దాల ప్రతిధ్వనులు శాంతికపోతపు గుండె కవాటాలై కొట్టుకుంటున్నాయి.

"స్టాప్ దట్ మిస్టర్ విక్రమ్.. మనకు దేశరక్షణే ముఖ్యం కాదనను... కాని మరోసారి ఆ టెలిగ్రాం చదువ్... రెండు ప్రాణులు నీ కోసం ఎదిరిచూస్తున్నాయి. రేపేమైనా అయితే భరతమాత దుఃఖం మనకు కన్పించకపోయినా భార్య కన్నీళ్లను ఏ అవార్డులూ, రివార్డులూ ఆపలేవురా... వీరజవాన్ జస్పాల్‌రాణా భార్య శోకం నన్ను అప్పుడప్పుడూ వెంటాడి మౌనముద్రలోకి తీసికెళ్తుంది. వీరమరణం పొందిన గురుదేవ్ సింగ్ భార్య "పరమవీరచక్ర' అవార్డ్ అందుకుంటూనే వేదిక మీదే కుప్పకూలిపోయింది. నా సర్వీస్‌లో ఎన్నో చూసాను. నీకు అవకాశం వుండబట్టే వెళ్లమంటున్నాను. అఫ్ కోర్స్... నీ కొడుకుని కూడా నీలాగే దేశరక్షణ కోసం అంకితం చేస్తానంటేనే నిన్ను పంపించేది..." నవ్వుతూ అన్నాడు మేజర్ జనరల్ మనీందర్ సింగ్. పృథ్వీ కథలో యుద్ధ సంఘటననూ సైనికుల విశేషాలను కళ్ళకు కట్టించారు. నరేందర్ చేసిన 'సింగిల్ కాన్సెప్ట్'ల ప్రయోగం తెలుగులో కొత్త కావచ్చు. కొన్ని ఇతర భారతీయ భాషల్లో ఎలాంటి ప్రయోగాలున్నాయి. నరేందర్ కథలు కొన్ని తమిళ, కన్నడ, ఒరియా భాషల్లోకి అనువదించబడినాయి. నరేందర్ 'రాష్ట్ర ప్రభుత్వ యువ విశిష్ట అవార్డ్, విశాల సాహితీ అవార్డ్' లతో పాటు సి.నా.రె., గోపీ వంటి సాహితీ సుగతుల ప్రశంసలు అందుకున్నాడు.

కె.వి.నరేందర్ కథల్లో చక్కని కథాశిల్పం, కథా గమనంలో కలిసిపోయే చక్కని కొసమెరుపులుంటాయి. రచయితల్లో మూడురకాల వారున్నారు. మొదటిరకం కేవలం కాలక్షేపం కోసమే రాసేవారు. వీళ్ళ రచనలూ కాలక్షేపంకోసం చదివేవే. ఇలాంటి రచయితలు మనకు చాలామందే ఉన్నారు. వివిధ పత్రికల్లో ప్రతినెలా వస్తున్న వందలాది కథల్లో ఇలాంటి కథలే ఎక్కువ. ఈ కథల్లో

మంచి శిల్పమున్నా వీటితో సమాజానికొరిగే ప్రయోజనమేం లేదు. ఈ రచనలు తర్వాతి కాలంలో కాలగర్భంలో కలిసిపోయినా రచయితకు పేరు, డబ్బు బాగానే లభిస్తాయి. ఈ రచనలు కొన్ని సినిమాలుగానూ రావచ్చు.. ఇవి పూర్తిగా వ్యాపార రచనలే. రెండవకోవకు చెందిన రచయితలు సాహిత్యానికి సామాజిక ప్రయోజనముండాలని, సాహిత్యం ఉబుసుపోకకు చదివేది కాదని భావించి రాసేవారు. వీరు వ్యాపార రచనల జోలికి పోరు. వీళ్ళు మంచి శిల్పంతో కూడుకున్న కథలు, శిల్పం కొంత తక్కువైనా మంచి వస్తువుతో కూడుకున్న కథలు రాస్తున్నా శిల్పానికంటే ఎక్కువ వస్తువుకే ప్రాధాన్యతనిస్తారు. మంచి వస్తువుతో, మంచి శిల్పాన్ని జోడించి కథలు రాసినా సాహిత్యం ప్రయోజనాన్ని గుర్తెరిగి రాస్తారు వీళ్ళు.. వీళ్ళకు తమ కథలు సినిమాలుగా వస్తాయా, టీ.వీ. సీరియల్‌గా వస్తాయా అన్న ఆలోచనుండదు. అవి తాముద్దేశించిన పాఠకుల్ని చేరుతున్నాయా లేదా అనే ఆలోచిస్తారు. అయితే తర్వాతి కాలంలో అవి క్లాసిక్స్ గా మారి టీ.వీ. సినిమాల కెక్కితే ఎక్కవచ్చు.. తెలంగాణా ప్రాంతంలో ముఖ్యంగా కరీంనగర్ జిల్లా నుంచి వచ్చిన రచయితల్లో ఇలాంటివారే ఎక్కువ. మొదటితరంలో ఈ జిల్లానుంచి ఒకరిద్దరు రచయితలుగా ప్రసిద్ధులైనా స్వాతంత్ర్యానంతరం పుట్టిన తరంలోంచే చాలామంది రచయితలుగా ఎదిగారు. ఎదుగుతున్నారు. 70లలో వచ్చిన ఉద్యమాలు ఈ జిల్లాలో కొంతమందిని కలంబట్టేట్టు చేసాయి. భూ పోరాటోద్యమాలు, స్త్రీవాద, దళితవాదోద్యమాలు, తెలంగాణాలో మధ్యతరగతి ఎదిగిన క్రమం, కులాల పాత్ర.. లాంటి అనేక విషయాలను తీసుకొని కథా సాహిత్యంలో ఉదాహరణ ప్రాయాలనదగిన కథలు రాస్తున్నారిక్కడి రచయితలు. కె.వి.నరేందర్ కలంపట్టే నాటికి చక్కని సాహిత్య నేపథ్యముందీ జిల్లాలో.

ఇక మూడోరకం రచయితలు.. వీళ్ళు మొదటి రెండు రకాల రచయితలకు మధ్యగా ఉంటారు. రెండు ధోరణులను ఆకళింపు చేసుకొని కొంత వ్యాపార ధోరణి ఉన్నా సామాజిక స్పృహను గుర్తెరిగి రచనలు చేస్తారు వీరు. ఇలాంటి రచయితల్లో అగ్రభాగాన నిలిచే రచయిత కె.వి.నరేందర్. అతి చిన్న వయసులోనే అన్ని పత్రికలకు, టీ.వీ.కి రచనలు చేసాడు కె.వి ఈతడు తన కథావస్తువుగా సీరియస్ విషయాన్ని తీసుకున్నా, సెంటిమెంటిను తీసుకొని రాసినా మంచి శిల్పంతో కథను పండిస్తూ కరీంనగర్ జిల్లా రచయితల్లో ఓ విలక్షణమైన స్థానాన్ని పొందిన రచయిత. అతడే వస్తువు పై కథ రాసినా అతని రచనల్లో పీడిత పక్షపాతమే కనబడుతుంది. ఇందుకాతని ఈ చిరు కథాసంకలనం బురదలో జాబిల్లే సాక్ష్యం. ఎవరూ పట్టించుకోని చిన్నపిల్లల గూర్చి రాసిన కథలివి. 'బురదలో జాబిల్లి' మరో పసివాడి కథ.. ఉద్యమ ప్రాంతంలో పిల్లలు ఉద్యమంతో సంబంధం ఉన్నా లేకున్నా ఎలా బలయిపోతున్నారో, పసివాళ్ళు విప్లవకారులకెలా ఉపయోగపడతారో, వాళ్ళ పసిచేతులెలా గాయాలకు గురవుతున్నాయో తెలిపే కథ ఇది. చద్దన్నం తీసుకెళ్ళిన మైసిగాడు బిక్క చచ్చిపోతున్న తెలంగాణా పల్లెలాగా చచ్చిపోతున్నా డంటాడు రచయిత. తెలంగాణా పల్లెల్లోని దినదినగండమైన బతుకుల గూర్చి అగ్నిగుండాల్లో ఉన్న పల్లెల గూర్చి చెబుతాడీ కథలో రచయిత. మర్నాడు పత్రికల్లో పతాక శీర్షికల్లో మైసిగాడి చావును గూర్చి రాసిన వాళ్ళగూర్చి ఇలా ఎద్దేవా చేస్తూ కథ ముగిస్తాడు రచయిత. ఇందులోని కథలన్నీ ఆణిముత్యాలనదగ్గవే. తన ప్రాంతంలో జరుగుతున్న వివిధ ఉద్యమాలను ఈ రచయిత పట్టించుకోనట్టు పైకి కనబడినా ఈ రచనలు చదువుతుంటే వాటిపై సానుభూతున్నట్టగుపడుతుంది. ఆతని పీడిత జన పక్షపాతమూ స్పష్టమవుతుంది. సాహితీలోకంలో అత్యంత వేగంతో దూసుకొస్తున్న యువ రచయిత కె.వి. నరేందర్.

ఈ రచయిత మరింత అవగాహనను పెంచుకొని ఇదివరకు రాస్తున్న విషయాలతో పాటు గ్లోబలైజేషన్ పేరుమీద సాగుతున్న అమెరికనైజేషన్, కులమతాల వికృత చేష్టలు, బ్రెయిన్ డ్రెయిన్, వలసలు, ప్రజల్లో

పెరుగుతున్న అసంతృప్తి, మృగ్యమవుతున్న మానవ సంబంధాలు, మారుతున్న విలువలు, అత్యంత వేగంగా వస్తున్న మార్పులు, కంప్యూటరైజేషన్ పేరుమీద పెరుగుతున్న నిరుద్యోగం, విశృంఖల విహారం చేస్తున్న టీ.వీ.సంస్కృతి.. లాంటి విషయాల పై కూడా చక్కని కథలు రాస్తున్నారు.

సూపర్ కిడ్, హింసధ్వని రెండూ మధ్యతరగతి జనం ప్రాపంచిక లౌల్యం, వెంపర్లాట తత్త్వాన్ని దృశ్యమానం చేసే కథలు. కృత్రిమమైన జీవన వాతావరణం ఒక 'ప్లాస్టిక్ పువ్వు' బతుకు ప్రసాదించే స్థితిని అర్థవంతంగా చెపుతాయివి. కటికోల్లు కథ వృత్తిపరమైన దోపిడీ, పెనుగులాట. నిస్సహాయత నిండిన కొందరి దుఃస్థితిని విశదపరుస్తుంది. కవితాత్మకంగా, ఒక సెల్యుక్షన్‌లా... సాంకేతిక సృజనాత్మకతతో రాసిన కథ సిటీ. ఒక్కరోజు జరిగిన సంఘటనల పరంపరను ఒక జీవన బీభత్సంగా, చెరిగిపోని ముద్రగా మన ముందు ప్రదర్శిస్తాడు. మనిషిని కదిలిస్తుందీ కథ.

నరేందర్ అప్పట్లో వెలువరించిన బర్రె కథ కూడా కలకాలం జ్ఞాపకముండే కృతి.

టెలివిజన్ లో స్క్రిప్ట్‌రైటర్‌గా రెండేళ్లకు పైగా పనిచేసిన ఈ రచయిత ఇప్పటికే 360 ప్రోగ్రాంలకు, 40 ప్రత్యేక కార్యక్రమాలకు రచన చేసి ఉన్నారు. ఏదైనా విజువలైజ్డ్‌గా చెప్పడం ఈయన ప్రత్యేకత. కళ్ళకి కనబడినట్టు చిత్రితమైన విజువల్స్ కాబట్టే ఈ కథల్ని 'చదువుతాం' అనే బదులు 'చూస్తాం, అనుభవిస్తాం' అనవచ్చు. కేవలం విషాద పార్శ్వాన్నే ఎత్తిపెట్టక వాటితోపాటు సాంస్కృతిక పరమైన విశేషాలూ, చమత్కారాలూ కలగలపడంతో కథానికలకు మరింత పుష్టి చేకూరింది.

రాస్తున్న కథల్లోంచి ఒక ఇతివృత్తానికి దగ్గరగా ఉన్న కథల్ని వేరు చేసి సింగిల్ కాన్సెప్ట్ కథలుగా వెయ్యడం నరేందర్ పద్ధతి. ఇప్పుడీ సంపుటి గ్రామ జీవితానికే కేంద్రీకృతమైతే ముందు ముందు తీసుకురాబోయేది మధ్య తరగతి జీవితాన్ని అతలాకుతలం చేస్తున్న అర్బనైజేషన్ కాన్సెప్ట్‌తో సిటీ కథల సంపుటి అని ఈయనే అంటున్నారు. నిశిత పరిశీలనతో, క్షుణ్ణమైన అవగాహనతో, అన్నిటినీ మించిన ఆయా ప్రాంతాల మాండలికంపై సరైన వ్యక్తీకరణతో ఈ 14 పల్లె కథలూ దేనికది పాఠకుల్ని కదిలిస్తాయి, కరిగిస్తాయి.

యంత్రీకరణ అనేది తమల్ని నియంత్రిస్తోందని తెలుసు గాని, అది రూపుదాల్చే క్రమమెక్కడో తెలీక కల్లాకపటం ఎరగని పల్లెజీవి కలవరపడుతున్నాడు. ఈ తికమక మట్టి మనసు కథలో స్పష్టంగా చూస్తాం. వ్యవసాయ పనులలో హార్వెస్టర్, రైస్ ట్రాన్స్ ప్లాంటర్ లాంటి యంత్రాలు చొరబడి మానవ సంబంధాల మదురానుభూతుల్ని పీల్చి పిప్పి చేస్తున్నాయి. పల్లెతనాన్ని పోగొట్టుకుని ఊరు ఉనికినే కోల్పోతున్న తెలంగాణ గ్రామీణ దురవస్థ బాల్యంతోనే ప్రారంభమవడం మరింత బాధాకరం. తొమ్మిదేళ్ళ సాగర్‌గాడు బతుకుదెరువు కోసం పడే వేదనను పిండం అనే కథలోనూ, నాలుగో తరగతి చదువుతున్న వికాస్ గుండెల్ని కదిపేసిన విషాదం నెమలి కన్నుపై నెత్తుటి చుక్కలు అనే కథలోనూ చూస్తాం ! ఇక మానవజాతి వెన్నెముకనే కోరుక్కుతింటున్న కుల వివక్ష అనే కుష్టు వ్యాధి తెలంగాణ పల్లెసీమలో ఎంతగా పాతుకుపోయి బాధిస్తోందో సందెన అనే కథ చెప్పకనే చెబుతుంది. ప్రతి కథా ఒక వ్యథ. ఒక సందేశాత్మకత.

ఈ కథా సంకలనాన్ని రచించిన కె.వి.నరేందర్ తాను పుట్టి పెరిగిన పరిసరాలను చిత్రించడం ఈ సందర్భంలో చెప్పుకోదగిన విశేషం. అప్పుడప్పుడూ రాసిన ఇలాంటి కథల్ని క్రోడీకరించి 'పొరు' కథలుగా నరేందర్ మన ముందుంచుతున్నాడు. ఇలాగే సింగిల్ కాన్సెప్ట్ (ఏకాంశ) కథలుగా అమ్మ, యుద్ధం, బురదలో జాబిల్లి, నాన్న, నాతిచెరామి, ఊరు, సిటి లాంటి కథా సంకలనాలు వెలువరించాడు. ఈ క్రమంలోనే కల్లోల కథలుగా పొరు' కథా సంపుటి రూపుదిద్దుకుంది.

నిజానికి మేం 'తెలంగాణగడీ'లపై పరిశోధనాత్మక వ్యాసాలు రాస్తూ అనేక గ్రామాలు తిరిగినపుడు అప్పటి

పరిస్థితులు చెప్పిన వాళ్ల మాటలు విన్నాక...అక్కడక్కడా శిథిలమైపోయిన స్థూపాలు కన్పించినప్పుడు....ఈ 'పోరు' కథలు వేయాలన్న ఆలోచన నరేందర్‌కి వచ్చింది. నరేందర్ రాసిన ఏకాంశ కథా సంకలనాలు చదివితే ఒక వస్తువుని తీసుకున్నాడంటే.. ఆ వస్తువుని పది పదిహేను కోణాల్లో మొత్తం బాడీ స్కానింగ్ చేసినట్లు భిన్నమైన రీతిలో కథనీకరించడం... ఇలాంటివి దీంతో కలిపి ఇప్పటికి 8 ఏకాంశ కథా సంకలనాలు తీసుకురావటం మామూలు విషయం కాదు. తెలుగు కథా సాహిత్యంలో ఇది ఎవరూ చేయని ప్రయోగం. ఒకవేళ చేద్దామనుకున్న ఇప్పుడు నరేందర్‌ని అధిగమించటం కూడా కష్టమే. .

ఈ కథల చివరలో తన ఏకాంశ కథా సంపుటాలపై వచ్చిన కొన్ని సమీక్షల్ని కూడా జతపరిచాడు. నరేందర్ కథలు చదవుతుంటే ఇండియాటుడేలో అవసరాల రామకృష్ణారావు రాసినట్టుగా చదువుతున్నట్లుగా కాకుండా... కళ్లముందు దృశ్యాలు కదలాడుతున్నంత విజువలైజ్డ్‌గా సజీవంగా కన్పిస్తాయి. స్త్రీకి భార్యగా, తల్లిగా, నానమ్మగా భిన్నమైన జీవన కోణాలున్నట్లుగానే ఒక స్థితి నుంచి బాహ్య వస్తు వలయాలకు సంబంధించిన సంబంధాల్లోనూ వైవిధ్యం ఉంది. సాధారణంగా వస్తువుకి చుట్టూ ఉండే వలయాల సంబంధం సమాంతరంగా ఉండదు. 'అమ్మ'లో ఇతర వస్తు వలయాల సంబంధం సమాంతరంగా ఉంటుంది. చాలావరకు 'అమ్మ' నుంచి చూసి చిత్రించడం వల్ల ఆ కోణంలో మార్పు ఎక్కువ ఉండదు. బాహ్య వస్తు వలయాల నుంచి చూసినప్పుడు వస్తు స్థితి వల్ల బేధం కనిపిస్తుంది. 'అమ్మ'ను సార్వత్రిక లక్షణంగా తీసుకున్న కె.వి. నరేందర్ కథల్లో ఈ లక్షణం కనిపిస్తుంది. సాధారణంగా బాహ్య వస్తుకోణంలోని వైయక్తిక దృక్పథం వల్ల వస్తుగుణంలో మార్పు చోటు చేసుకుంటుంది. ఈ మార్పు సాదారణీకరణకు భిన్నంగా ఉండొచ్చు, ఉండకపోవచ్చు. రచయిత ఏ పాత్రను ముఖ్యం చేసి కథా రచన చేస్తున్నాడనే అంశం పైనే ఈ భిన్నత్వం ఆధారపడి ఉంటుంది. నరేందర్ కథల్లో అయిదు కథలు ఒక కోణం నుంచి, మరో నాలుగు కథలు వేరే కోణం నుంచి, రెండు కథలు ఇందుకు భిన్నమైన కోణాల్నించి వచ్చాయి. మొదటికోణంలోని అయిదు కథలు- అమ్మ, అమ్మని పంచుకుందాం, వెన్నెల, డెలివరీ, నానమ్మ' వీటిలో బాహ్య వలయాల్లోంచి తల్లి పాత్రని చూపడం కనిపిస్తుంది. బాహ్య వస్తు వలయాల్లోనూ కొడుకు, మనవడు అనే రెండు అంతర్ భేదాలు కనిపిస్తాయి.

కుటుంబ సభ్యుల మనస్తత్వాన్ని, కొడుకుల వల్ల బాధపడుతూ గడిపిన తల్లిని అమ్మ, అమ్మను పంచు కుందాం కథల్లో చూస్తాం. ఇందులో మొదటి కథని కొడుకు కంఠస్వరంతో, రెండో కథను మనవని కంఠ స్వరంతో చెప్పడాన్ని చూడొచ్చు. అందువల్ల బాహ్య వస్తు కోణంలో భేదం కనిపిస్తుంది.

ఒకే రకమైన అంశాల్ని ఇతివృత్తంగా తీసుకుని కథా సంపుటులుగా ప్రకటించినరేందర్ ఒక నూతన ఒరవడికి నాంది పలికాడు. మొత్తం కథల్ని పరిశీలిస్తే వస్తువుకి ప్రాధాన్యం ఇవ్వడం కనిపిస్తుంది. ధ్వని లేదా ప్రతీ కాత్మకంగా కాకుండా స్పష్టమైన శైలిని ఎంచుకున్నాడు. తనకు అనుభవంలోకి వచ్చిన లేదా తనకు తెలుస్తున్న జీవితాల్లోంచే కథలు అల్లాడు. అందుకే ప్రాంతాలతో సంబంధం లేకుండా మన మధ్య తిరుగుతున్నవారి కథలే అనిపిస్తాయి. పరిణితి చెందిన రచనాకౌశలం బట్టి ఆ మేరకు గొప్ప కథల్ని నరేందర్ నుండి ఇంకా ఆశించొచ్చు. కథా సాహిత్య చరిత్రలో ఒకే వస్తువుని అనేక పార్శ్వాలుగా దర్శించి తనదైన దృష్టికోణంతో వైవిధ్యమైన కథల్ని అందిస్తున్న నరేందర్ అభినందనీయుడు. కాలం పరి ణామశీలం కలది. జీవితమూ, సాహిత్యమూ కాలాను గుణంగా మార్పులకు లోనుకావడం సహజమే. తెలుగు కల్పనా సాహిత్య కీర్తిని అంతర్జాతీయ స్థాయికి తీసుకొని పోయిన ఎందరో రచయితలు అన్ని వర్గాల జీవితాలలో చోటుచేసుకుంటున్న సమస్యల్ని, సంఘర్షణల్నీ మార్పుల్నీ

తమ రచనలలో ప్రతిబింబింపజేస్తూ తెలుగుకథకు ఔన్నత్యాన్ని చేకూర్చారు.

ఈ రచయితలలో కొడవగంటి కుటుంబరావు, రావి శాస్త్రి, కాశీపట్నం రామారావు తర్వాతి తరంలో తెలుగు కథా సీమను సుసంపన్నం చేసి, అత్యున్నత స్థానాన్ని అలంకరించిన మంచికథకుల్లో ఎన్నదగినవారు కె.వి.నరేందర్ అని చెప్పడంలో అతిశయోక్తి లేదనుకుంటాను.కవి అన్నవాడు ప్రజాకోటి కోసమే తన కలాన్ని ప్రయోగించాలి. అంతేగాని కాగితమూ కలమూ పుచ్చుకుని పోలీస్ కేసుల్లా పేజిలు నింపి బనాయించి చేసిన జీవిత వాస్తవికత లేని కథలు వ్రాస్తే అవి చస్తే మంచి కథలు కావు. కాలేవు. రామాయణానికి నాంది అయిన వాల్మీకి " మానిషాద" శ్లోకం జీవితంలో నుంచి పోగుచేసుకున్న వాక్యమే కదా ! ఈ విధంగా తన చుట్టూ వున్న జీవిత వాస్తవ పరిస్థితులను అవగాహన చేసుకొని వాటిని తన కథల్లో ఇతివృత్తంగా తీసుకొని జాతీయతను అంతర్జాతీయతను ఆవిష్కరించి, వర్తమాన తెలుగు సాహిత్యంలో బహుముఖ ప్రజ్ఞావంతుడు కె.వి.నరేందర్ ఇటువంటి వారే పాఠకుల హృదయాల్లో పదికాలాలపాటు నిలుస్తారు.

కె.వి.నరేందర్ పుంఖాను పుంఖాంగా కథలు రాస్తుండడమే కాకుండా కథా సంకలనాలు కూడా అంతే వేగంగా వెలువరిస్తున్నారు. నరేందర్ రచనలు తెలంగాణ గ్రామీణ వ్యవస్థలో చోటు చేసుకుంటున్న సామాజిక మార్పులకు తిరగబడుతున్న విలువలకు అద్దం పడుతున్నాయి. సునిశిత దృష్టితో పాటు అతులిత సృష్టి చేయగల నేర్పరితనం ఉన్నా రచయిత.

# డా॥. అక్కినేని పౌరాణిక భక్తి పాత్రల విశ్లేషణ

- జి.ఏ.జె. ప్రకాశిని, పరిశోధక విద్యార్థిని, తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

సహితానాం భావం సాహిత్యం. మానవ అనుభూతికి, భావసృజనాత్మకతను జోడించి అక్షరాలలో చిత్రించేదే సాహిత్యం. లిఖిత చిత్రాలకు దృశ్యాలుగా మార్చి కళ్ళెదుటి ప్రదర్శింపచేసేది సినిమా. నాగేశ్వరరావు పోషించిన వైవిధ్య భారత పౌరాణిక పాత్రలను స్థూలంగా రామాయణ పాత్రలు, భారత పాత్రలు ఇతర పాత్రలు అని వర్గీకరించ వచ్చు.

అక్కినేని నాగేశ్వరరావు ప్రారంభంలో పురాణ పాత్రలు కొన్ని పోషించినా ఆ తర్వాత తిరుగులేని సాంఘిక నాయకుడిగా ఎదిగారు. పోషించిన పౌరాణిక పాత్రలు తక్కువే అయినా ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలచిపోయే పౌరాణిక పాత్రలనే పోషించడం విశేషం.

లౌకిక వాస్తవాలను అలౌకిక ఉదాత్త సంకేతాల ద్వారా నిరూపించేవి పురాణ పాత్రలు. లౌకిక అనుభవాల్లో పరిమితులు పరిధులు ఆ సంకేతాలలోని ఆదర్శీకరణ వల్ల చెరిగిపోయి సార్వకాలికమైన అన్వయం, సందేశం ఆ పాత్రల మూలంగా లభిస్తాయి. ఆ జాతి పురాణ ప్రపంచంలోని పాత్ర ప్రతిఫలిస్తుంటాయి. పోషించిన పౌరాణిక, భక్తి పాత్రలు తక్కువ అయినా ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే పాత్రలను పోషించడం విశేషం.

పురాణ పాత్రధారణకు ప్రతి నటునికి సహజం రెండంశాలు అమరి ఉండాలి. 1. మార్గ చిత్రక మేరకు ఆదర్శప్రాయమైన రూపం. 2. స్ఫుటమైన ఉచ్ఛారణతో కూడిన మృదుమధుర గంభీరస్వరం ఏ స్థాయిలో కావాలో ఆ స్థాయిలో పలకగలగాలి. కాని ఎక్కడా గంభీరత చెందకూడదు. అందులో ఉదాత్త, లలిత, మంద్ర తారాభేదా సహజంగ పలకాలి. సహజమైన మలిదుత్వం నిండుదల ఉండాలి. మంద్రత హత్తుకునేలా ధ్వనించాలి. అక్కినేనికి ఈ రెండు సహజమైన సొమ్ములు అతని సొంతం అని చెప్పవచ్చు.

ఆంధ్రుల అంగ సౌందర్యం నిండి పొంగారే ఐదు అడుగుల పది అంగుళాల ఎత్తు విశాలమైన ఛాతీ నిండుగ మరీ గుండ్రంగా కాక, వెడల్పు కాక సమంగా ఉండే చక్కగా ఉండే ముక్కు ఎత్తుకు తగ్గలావు చక్కటి పెద్ద కళ్ళు దీర్ఘమైన నాసిక కుదురైన పెదవులు పలు వరుస కొంతలోకి ఉండడంతో నోరు భాగం సరిగ్గా అమరి దేవతా పాత్రలకు చక్కగా సరిపోయే ముఖం "ఆ పర్సనాలిటీ ఆయనకు ఒక వరం అంటారు కళావాచస్పతి జగ్గయ్య. శరీరాన్ని ఎప్పుడూ అదుపులో ఉంచుకోవడానికి ఆయన చాలా శ్రమపడ్డాడు. కఠినమైన వ్యాయామంతో శరీరాన్ని చాలా క్లేశపెట్టారు.

పాత్రలను నటులు ఎన్నుకోరు. పాత్రలే నటులను ఎన్నుకొంటాయి'' అంటారు లిండ్సే ఏండర్సన్. అక్కినేని నాగేశ్వరరావు విషయంలో ఇది అక్షరసత్యం. ఏయన్నార్ తన సుదీర్ఘ నటనా జీవితంలో విభిన్న పాత్రలలో నటించి, ఒప్పించి, మెప్పించారు. ప్రేమికుడిగా, భర్తగా, అన్నగా, తండ్రిగా, వీరుడిగా, భక్తుడిగా సంఘర్షణను, చిలిపి తనాన్ని బాధ్యతను, సాహసాన్ని తాదాత్మ్యాన్ని ఎన్నో స్థాయీ బేధాలతో రూపం పోసి ప్రేక్షకులకు రసానందాన్ని కలిగించిన మహానటుడు అక్కినేని.

జానపద పౌరాణిక చారిత్రక భక్తి సాంఘిక చిత్రాలలో ఇతరులు అనుకరించలేని నటనా వైశిష్ట్యాన్ని ప్రదర్శించారు. ఆ పాత్రలను నాగేశ్వరరావు మినహా మరెవ్వరూ పోషించి మెప్పించలేరన్న ఖ్యాతి గడించారు.

అక్కినేని తన మొదటి చిత్రం 'సీతారామ జననం' 1944లో శ్రీరాముడిగా నటించారు. సహజంగానే రాముడి పాత్రలో నటించాల్సిన అవసరం లేదు. భాషాపరంగా

అక్కినేనికి కష్టపడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే పౌరాణికంగా ఎన్నో డైలాగ్స్‌ను చెప్పి చెప్పి ఆయన అప్పటికే అమితమైన అనుభవాన్ని సంపాదించుకొన్నాడు.

## అభిమన్యుడు :

తెలుగు పౌరాణిక చిత్రం మాయాబజార్. ఇదివరకు లేదు ఒక మీద రాదు అనిపించుకున్న తెలుగు పౌరాణిక చిత్రం. ఈ చిత్రంలో అక్కినేని పాండవుల వారసుడిగా, వీరాభిమన్యుడిగా శృంగారం, వీరం, కరుణరసాలను బాగా పోషించాడు.

## అర్జునుడు :

1963లో విడుదలైన "శ్రీకృష్ణార్జునయుద్ధం నారదుడి నారాయణ స్తోత్రంలో మొదలయ్యే ఈ చిత్రం చాలా సంచలనాన్ని కలిగించింది. ఎన్‌టిఆర్, ఎఎన్ఆర్ ఇద్దరు సినిమా ప్రపంచానికి రెండు కళ్ళ వంటి వారు అంటారు పెద్దది. మాయాబజార్‌లో మేనమామగా, మేనల్లుడిగా, భూకైలాస్‌లో నారద, రావణాసురులగా, తాతా మన వళ్ళుగా నటించి ప్రేక్షకులను అలరించి కీర్తిని సాధించారు.

అక్కినేని శ్రీకృష్ణమాయ, భూకైలాస్ చిత్రాల్లో నటించిన నారద పాత్రను, చెంచులక్ష్మిలో మహావిష్ణు పాత్రను సతీ సావిత్రిలో సత్యవంతుని పాత్రను ధరించాడు. 1958లో విడుదలైన శ్రీ రాజరాజేశ్వరి ఫిలిమ్స్‌లో "శ్రీకృష్ణమాయ"లో అక్కినేని నారదునిగా నటించి హాస్యరసాన్ని పుష్కలంగా పోషించాడు. నాగేశ్వర రావు నట జీవితంలో మరువలేని మరుపురాని పాత్రల్లో భూకైలాస్ చిత్రంలోని పాత్ర గణనీయమైనది.

## మహావిష్ణువు :

చెంచులక్ష్మి ఒక పౌరాణిక జానపద చిత్రం. ప్రహ్లాదుని ఇతివృత్తం, చెంచులక్ష్మి కథ రెండింటిని సమన్వయపరిచి సదాశివ బ్రహ్మం మధురాతి మధురంగా అద్భుతమైన రీతిలో ఒకే కథగా రూపొందించారు. ఈ చిత్రంలో నాగేశ్వరరావు మిగిలిన వారి పాత్రలకన్న చాలా తక్కువ నిడివి గలది. అయినా తక్కువ పరిధిలోనే బాగా గొప్పగా నటించాడని చెప్పాలి.

మహావిష్ణువుగా చెంచితలో నటించేటప్పుడు అతని ముఖంలో కన్పించే ఆత్మవిశ్వాస ప్రదర్శన మనల్ని ఆకట్టుకొంటుంది. ఈ చిత్రంలో అతని కళ్ళల్లో ఆయన ప్రదర్శించిన చిలిపితనం, ముఖంలోని కొంటెతనం, పెదిమల్లోని పట్టుదల మన మాటలకందనిది.

నాగేశ్వరరావు తన నటనను కళ్ళుతోనే వ్యక్తం చేశాడు. కళ్ళతోనే మాట్లాడుతాడు, నవ్వుతాడు, జవాబిస్తాడు. ఒక ముక్కలో చెప్పాలంటే కళ్ళే ఆయన నటనకు కేంద్ర బిందువు. ఈ కళ్ళ యొక్క మౌనభాషను చెంచులక్ష్మిలో మనం బాగా గుర్తించవచ్చు.

## వాల్మీకి :

అక్కినేని శ్రీరామరాజ్యం 2011లో వాల్మీకి పాత్ర ధరించాడు. అద్భుత నటనను ప్రదర్శించారు. ఈ పాత్రను అర్థం చేసికోవడమే కాదు పాత్ర శిల్పాన్ని ఆవిష్కరించి ప్రపంచ సినీ జగత్తులో పాత్రకు చిత్తూరు వి. నాగయ్య తర్వాత తను తప్ప మరెవ్వరు సరిపోరని నిరూపించారు.

## భక్తిపాత్రలు :

అక్కినేని అనేక భక్తి పాత్రలు పోషించాడు. అందులో ముఖ్యంగా విప్రనారాయణ, భక్తతుకారాం, మహాకవి క్షేత్రయ్య, చక్రధాని పాత్రల్లో ఎంతో అద్భుతంగా పోషించి ప్రేక్షకుల మన్ననలు పొందాడు. కష్టాలొస్తే మనుష్యులు కృంగిపోతారు. కష్టాలంటే పాత కర్మల దరిద్రం వదలి పునీతమవ్వడమనే సందేశాన్ని అందించిన కళాత్మక చిత్రం విప్రనారాయణ.

విప్రనారాయణ పాత్ర సామాన్యమైంది కాదు. సాంఘిక పాత్ర కూడా కాదు. తరతరాల భారతీయ వైదిక ధర్మం లోంచి అవతరించిన ఒక మహనీయుని పాత్ర. డాక్టర్ అక్కినేని పోషించిన అనేక విశ్వజనీనమైన పాత్రల్లో మరుపురాని మణిదీపమై కోట్లాది హృదయాలను తేజోమయం చేసిన పాత్ర విప్రనారాయణ. భక్తిరస ప్రభావం శాంతరసానికి పట్టం కట్టిన నటన అక్కినేని అందించారు.

**చక్రధారి :**

సంసార బంధనాలను త్యజించి ఆహార పానీయాలను విసర్జించి ఏ నిర్జన ప్రదేశంలోనో కూర్చుని ఘోర తపస్సు చేస్తేగాని ఆభగవత సాక్షాత్కారం సాధ్యం కాదు. అనే దానికి భిన్నంగా వృత్తిలో దైవాన్ని చూసుకుంటూ ఒక ప్రక్క దైనందిన కార్యక్రమాలను నిర్వహిస్తూనే మరొక ప్రక్క ఆ దైవాన్ని స్తుతిస్తూనే వాడు పెట్టి పరీక్షలను సహనంతో ఎదుర్కొని ముందుకు సాగి భగవదను గ్రహాన్ని బడసిన పరమభక్తుని కథా చిత్రమే "చక్రధారి".

**మహాకవి క్షేత్రయ్య :**

అంజలీ పిక్చర్స్ కంబైన్స్ నిర్మించిన వర్ణ చిత్రం "మహాకవి" క్షేత్రయ్య. మనిషికి సంబంధించిన ఎటువంటి విశిష్ట సంక్లిష్ట క్లిష్ట అపూర్వ పాత్రలనైనా ఛాలెంజ్‌గా తీసికొవడం అక్కినేని అభిరుచి.

మహాకవి క్షేత్రయ్య సినిమాలో అభినయానికి అనువైన తలపులన్ని మూసి, పాత్రను చిత్రించి దాన్ని అక్కినేని చేతిలో పెట్టినట్లున్నారు. మువ్వగోపాల పదాలలోపైకి పచ్చి శృంగారం కనపడుతుంది అని చిత్రం వ్యాఖ్యానించి చెప్పింది. అటువంటప్పుడు క్షేత్రయ్య పదాలలో దివ్య శృంగారం ఉన్నదని చెప్పాలి. చిత్రంలో చెప్పించారు కూడా అయితే క్షేత్రయ్య తన జీవితంలో రసిక శృంగారాన్ని అనుభవించి, దాన్ని భక్తితో దివ్యశృంగారంలా మలచుకొన్న సన్నివేశాలు బలంగా ఉండవు. పైపెచ్చు అనుభవం లేకుండానే ఎంతో అనుభవం ఉన్నట్లు శృంగార పదాలు రచిస్తున్నాడని మువ్వలో అమ్మలక్కలనుకోవడం చిత్రంలో చిత్రంగా వినపడుతుంది. అంటే ఏదో దివ్యశక్తి చేత క్షేత్రయ్య శృంగార పదాలను రాశాడన్న మాట. ఆ శక్తి సిద్ధేంద్రయోగి ప్రసాదించిన మంత్రానిదా? క్షేత్రయ్య మనస్సులో పండించుకొన్న భక్తిదా? ఈ రెండింటికీ సరైన సమాధానం చెప్పలేని డైరెక్టర్ క్షేత్రయ్య పాత్రను డైలమాలో పడేశాడు. అక్కినేని నాగేశ్వరరావు కాకుండా మరొకరు ఆ పాత్రను ధరించి ఉన్నట్లయితే క్షేత్రయ్య పుట్ట మునిగే ఉండేది. అందుకే అక్కినేనికి అది ఒక ఛాలెంజ్.

క్షేత్రయ్య చిత్రాన్ని శ్రద్ధగా చూచేవారికి అక్కినేని క్షేత్రయ్య పాత్ర పోషణలో చూపించిన అంతర్గత వికాస సూత్రం.

ఈ విధంగా అక్కినేని పౌరాణిక భక్తి పాత్రల విశ్లేషణ మనకు స్పష్టమౌతుంది గదా. నాగేశ్వరరావులోని గాంభీర్యం, గాంభీర్యాన్ని మించిన ఔదార్యం దాన్ని మించిన నటనా కౌశల్యం అన్నింటిని మించి చిత్ర పరిశ్రమకు ఆయన అందించిన సేవలు ఇవన్నీ కలిపి ఆయనకు ప్రతిష్టాత్మకమైన "దాదా సాహెబ్ ఫాల్కే" అవార్డు అందించింది.

BHAVAVEENA
VOL. 18, ISSUE. 6, June - 2021.
ISSN NO. : 2456-4702 - RNI NO. APTEL/2003/12253
భావ వీణ
UGC care List Group -1 Journal
under Arts and Humanities Category

# ద్వివేదుల విశాలాక్షి రచనలు - సామాజిక సమస్యలు

**డా.జి.శ్రీనివాసరావు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ
APJAK ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పటాన్ చెరువు, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ

**1. ఉపోద్ఘాతం :-** తెలుగు సాహిత్యంలో ప్రముఖ తెలుగు రచయిత్రి ద్వివేదుల విశాలాక్షి తన రచనల ద్వారా భాషను, సమాజాన్ని, సంస్కృతిని ఎంతగానో ప్రభావితం చేశారు, ఎన్నో కొత్త దారులు వేశారు, ఎలాంటి రచనలు చేస్తే పాఠకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిపోతాయో అలాంటి రచనలు చేశారు.ఇవన్నీ కలిపిన మొత్తం స్త్రీ సమాజాన్ని ఎంతో గాని ప్రభావం చేయడమే కాకుండా స్త్రీ సామాజిక సమస్యలకు ఒక పరిష్కార మార్గాన్ని చూపించింది.

**2. బాల్యం - విద్యాభ్యాసం :-**

విజయనగరంలో 1929, ఆగస్టు జన్మించింది. వారిది తెలుగు సంస్కృతులు,సాంప్రదాయంగల మధ్య తరగతి కుటుంబం. ఆమె బాల్య విద్యాభ్యాసం పూర్తిగా విజయనగరంలో జరిగింది. ఆమెకు డిఎన్ రావుతో వివాహం జరిగింది. వారి అన్యోన్య దాంపత్యానికి గుర్తుగా కుమార్తె ఛాయ జన్మించింది.

**3. ద్వివేధుల విశాలాక్షి - రచనలు :-**

ద్వివేదుల విశాలాక్షి ప్రముఖ తెలుగు సాహితీ వేత్త మరియు రచయిత్రి. మధ్యతరగతి కుటుంబంలో స్త్రీలు ఎదుర్కొన్న సమస్యలను ప్రధాన సమస్యలను ఇతివృత్తాలుగా ఎంచుకునీ ఎన్నో అద్భుతమైన రచన లను చేశారు.తెలుగుతోపాటు ఇంగ్లిష్, హిందీ భాషల్లో పరిజ్ఞానం కలిగిన రచయిత్రి. విశాలాక్షి అనేక కథలు, కవితలు, వ్యాసాలు, రేడియో నాటికలు

రచించారు. అమెరికా, కెనడా, ఇంగ్లాండ్, మలేషియా, సింగపూర్ దేశాల్లో పర్యటించి తన సాహిత్య వాణి వినిపించింది. 1960వ దశకంలో ఆమె రచించిన ''వారధి'' నవల రెండు కుటుంబాల కథగా వెండితెరకెక్కింది. 1974లో విడుదలైన వస్తాడే మా బావ చిత్రానికి మాటలు రాసి సినీరంగంతోనూ అనుబంధాన్ని కొనసాగించింది. నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా వారు ఆమె 'వారధి' నవలను 1973లో పలు భారతీయ భాషలలోకి అనువదించి ప్రచురించారు. ఈమె రచనలపై ఆంధ్ర, వేంకటేశ్వర విశ్వవిద్యాలయాల్లో పలువురు విద్యార్థులు ఆమె రచనలపై పరిశోధనలు జరిపి ఎంఫిల్, పీహెచ్‌డీలు పొందారు.విశాలాక్షి 13 నవలలు, 3 కథా సంపుటాలను అందించారు. వాటిలో కొన్ని -

వైకుంఠపాళి (నవల) -1965,వారధి (నవల),మారిన విలువలు (నవల) -1966,గ్రహణం విడిచింది (నవల) -1967,గోమతి (నవల),ఎక్కవలసిన రైలు (నవల),హరివిల్లు (నవల),జారుడుమెట్లు (నవల),ఎంత దూరమీ పయనం (నవల) -1995

కలకానిది (నవల),కొవ్వొత్తి (నవల),పరిహారం (నవల), రేపటి వెలుగు (నవల)భావబంధం (కథాసంపుటి)

విశాలాక్షి కథలు (కథాసంపుటి)

మలేషియా నాడు-నేడు (వ్యాససంపుటి)

కథలు, నవలలకే పరిమితం కాకుండా హొరేడియోల్లోహొ నాటికలను అందించిన ఆమెహొఆకాశవాణిహొశ్రోతలకు చిరపరిచయమే.

4.ద్వివేదుల విశాలాక్షి రచనలు - సామాజిక సమస్యలు:-

ఆమె రచనల్లో మధ్యతరగతి కుటుంబ జీవితం, స్త్రీల అంతర్మథనం, కుటుంబ సంబంధాలు, సామాజిక సమస్యలు ప్రధానంగా కనిపిస్తాయి. పాత్రల మనస్తత్వాన్ని నిశితంగా పరిశీలించి, సహజమైన సంభాషణలు మరియు సూటి వ్యక్తీకరణతో చిత్రించడం ఆమె కథన కౌశలంలోని ముఖ్య లక్షణం.

ఆమె రచించిన వారధి నవల రెండు కుటుంబాల కథగా 'రెండు కుటుంబాల కథ' పేరుతో 1969లో సినిమాగా రూపొందింది. అలాగే వస్తాడే మా బావ చిత్రానికి సంభాషణలు రాశారు. వారధి నవలను నేషనల్ బుక్ ట్రస్ట్ పలు భారతీయ భాషల్లోకి అనువదించి

ప్రచురించింది.

తెలుగు సాహిత్యంలో స్త్రీల అనుభవాలను, కుటుంబ జీవితంలోని సంక్లిష్టతలను సున్నితంగా ప్రతిబింబించిన ప్రముఖ రచయిత్రిగా ద్వివేదుల విశాలాక్షి గుర్తుండిపోతారు

### 4.1.ప్రధాన సామాజిక సమస్యలు

### 4.1.1 స్త్రీల అణచివేత:-

కుటుంబంలో స్త్రీకి స్వతంత్ర నిర్ణయాధికారం లేకపోవడం, త్యాగం పేరుతో ఆమెపై బాధ్యతలు మోపడం, భావోద్వేగాలను నిర్లక్ష్యం చేయడం వంటి అంశాలను ఆమె రచనలు చూపిస్తాయి.

### 4.1.2.కుటుంబ కలహాలు:-

భార్యాభర్తల మధ్య అపార్థాలు, అత్తింటి సమస్యలు, కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాల బలహీనత, కుటుంబ విభేదాల ప్రభావం వంటి సమస్యలు కనిపిస్తాయి.

### 4.1.3.వరకట్నం, వివాహ సమస్యలు:-

వివాహాన్ని ఆర్థిక లావాదేవీగా చూడటం, వరకట్నం వల్ల స్త్రీలు ఎదుర్కొనే అవమానాలు, వివాహ నిర్ణయాల్లో వ్యక్తిగత ఇష్టానికి విలువ లేకపోవడం వంటి అంశాలపై విమర్శ ఉంటుంది.

### 4.1.4.మారుతున్న విలువలు:-

సంప్రదాయ విలువలు క్రమంగా మారడం, డబ్బు మరియు హోదాకు ప్రాధాన్యం పెరగడం, మానవ సంబంధాల్లో ఆత్మీయత తగ్గడం వంటి సామాజిక మార్పులను మారిన విలువలు వంటి రచనలు ప్రతిబింబిస్తాయి.

### 4.1.5.ఆర్థిక అసమానతలు:-

పేదరికం, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక ఒత్తిళ్లు, జీవనోపాధి కోసం చేసే పోరాటం, డబ్బు కొరత వల్ల ఏర్పడే కుటుంబ సమస్యలు రచనల్లో కనిపిస్తాయి.

మహిళల మానసిక సంఘర్షణ: కుటుంబ బాధ్యతలు, వ్యక్తిగత కోరికలు, ఆత్మగౌరవం, సమాజపు నియమాల మధ్య స్త్రీలు పడే సంఘర్షణను రచయిత్రి సున్నితంగా చిత్రించారు.

### 4.1.6.సామాజిక కపటత్వం:-

బయటకు నీతి, సంప్రదాయం, గౌరవం గురించి మాట్లాడేవారు వ్యక్తిగత జీవితంలో అన్యాయం చేయడం వంటి ద్వంద్వ వైఖరిని ఆమె విమర్శించారు.

### 4.1.7.తరాల మధ్య అంతరం: -

పెద్దల సంప్రదాయ ఆలోచనలు, యువతరం స్వేచ్ఛా భావాలు పరస్పరం ఢీకొనడం వల్ల కలిగే సమస్యలు కూడా ఆమె రచనల్లో కనిపిస్తాయి.

### 5.బిరుదు-సత్కారం:-

ఆమె కనేక పురస్కారాలు, బహుమతులు దక్కాయి.

ఆంధ్రప్రభ దీపావళి నవలల పోటీలో వైకుంఠపాళి నవలకు మొదటి బహుమతి -1965

గృహలక్ష్మీస్వర్ణకంకణం - 1966

అడవిబాపిరాజు అవార్డు - 1997

తెలుగు విశ్వవిద్యాలయం నుంచి డి.లిట్ పట్టా -1998

రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డు -1999

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ జ్యేష్ఠ సాహితీ అవార్డు

ఢిల్లీ తెలుగు అకాడమీ సాహిత్య పురస్కారం

### 6.ముగింపు:-

ద్వివేదుల విశాలాక్షిహొనవంబరు 7,హొ2014హొశుక్రవారం మధ్యాహ్నంహొవిశాఖపట్టణంలోహొతన 85వ యేట మరణించింది.

తెలుగు సాహిత్యానికి విశాలాక్షి చేసిన సేవ చిరస్మరణీయమైనది. తెలుగు సాహిత్యం ఉన్నంతకాలం ఆమె పేరు ఉంటుంది అని చెప్పటం ఎంత మాత్రం అతిశయోక్తి కాదు.

### ఆధార్ గ్రంథాలు:-

1. ఆధునిక తెలుగు సాహిత్య చరిత్ర. .......
డా.ద్వా.నా.శాస్త్రి
2. వైకుంఠపాళీ...........ద్వివేదుల విశాలాక్షి
3. గ్రహణం విడిచింది.......ద్వివేదుల విశాలాక్షి
4. విశాలాక్షి కథలు (కథా సంపుటి)...
ద్వివేదుల విశాలాక్షి
5.తెలుగు వికీపీడియాఖ

***

# The Eighth Hue : Amrita Sher-Gil in Biofiction

- ***Dr. Prashant kumar,*** Mafatlal Chauhan, Assistant Professor in English, Dr. S & S S Ghandhy Government Engineering College, Surat, Gujarat, India.

**Abstract :**

The life of Amrita Sher-Gil, one of the most important painters of 20th-century India, and India's Frida Kahlo, has recently featured in on and off-screen bio-works. Himanshi Shelat's *The Eighth Hue* is a reconstruction of the well-known painter's life story, and it confronts the readers with the deconstruction of biographical conventions. In the novel, Shelat uses biographical and fictional techniques in portraying a person's life to reflect on the relationship between art and history, artist and power, and shows that historical truth is reconstituted, reordered, or reconstructed in a selective way. This paper is focused on the narrative modes and re-presentation of the historical subject in *The Eighth Hue*. By emphasizing formal features and their impact upon perception and interpretation of history, this analysis considers the genre of biofiction as a narrative for achieving a sense of "poetic truth" of Amrita Sher-Gil's time. By relating history with the theory of neo-historical biofiction, Shelat reminds us that history might have been concealed in totalitarian society but could also be restored among the many stories by and about the individual—to connect the histories with his stories. Thus, we should regard *The Eighth Hue* as an amphibious art form, which ideally has both to obey the constraints of evidence and to respond creatively to the challenge of making literary form and meaning.

**Keywords:** Life, Biofiction, History, Narrative, Genre, Fiction.

**Introduction :**

Perhaps there is no other painter's life stories fascinate us in history as Amrita Sher-Gil (1913-1941) who has been one of the most important painters of 20th-century India. This Indian painter was hailed as India's Frida Kahlo. The life of Amrita Sher-Gil has appeared in many bio-works, raising many questions of larger implications of the relation between art and history, artist and the power. Himanshi Shelat's 2001 publication of a book called *The Eighth Hue (Aathmo Rang* in Gujarati*)* adopts a narrative form: biofiction, which combines the traditional biographical forms with many modern or postmodern concepts. Laying disputes of painting, politics, and life of the artist aside, Shelat's portrait of Amrita Sher-Gil tweaks historical truth with fiction to offer greater explicitness: that Amrita Sher-Gil is indeed a secret rebel, an ambiguous hero.

It is mainly agreed that Shelat's novel operates from biography to fiction. So consider it can be considered an experiment in life-writing because the author makes liberal use of the imaginary elements and ûctional techniques in picturing a person's life. Dorrit Cohn says in *The Distinction of Fiction*, fictional narratives do contain real-world references, but they "cannot refer to the real world" once they enter in the fiction (Cohn, Dorrit, 1999). Shelat's narrative configuration would certainly be difficult to be read as biological fictions which are wholly composed of real-world facts. Techniques as discrete fragments of truth, free

indirect discourse, and intertextual parody clearly mark her text as fiction. So, is *The Eighth Hue* still a valuable representation of Amrita Sher-Gil's life and beliefs? If it is, what kind of "truths" does novelist want to give to readers? How do they challenge or support particular historical narratives? And how does literary form contribute to the contemporary understanding of a ûgure from the past? Therefore this study will analyze Himanshi Shelat's *The Eighth Hue* in hope to offer possible answers to these questions.

**Biofiction and Its Narrative :**

Biofiction emerges from the urge of many postmodern writers and artists to bring historical figures of the past onto the page. Biofiction is an essential part of contemporary literary culture because it provides a creative way for authors to offer a simulacrum of a real person's life. The study of biographical fiction/biofiction is more commonly called life-writing studies (reference). Researches on popular works like J. M. Coetzee's *The Master of Petersburg* (1994), Margaret Atwood's *Alias Grace: A Novel* (1997), Michael Cunningham's *The Hours* (2000), and David Lodge's *Author, Author* (2004) have drawn a great deal of attention and interest in academe. And there is undoubtedly a need for more researches on famous ûgures who appears in multiple biographical works.

Biofiction combines the traditional biographical knowledge with the strong desire to create something spectacular when narrating the lives of people who existed in history (Cohn, Dorrit, 1999). It is a narrative product that relies less on historical necessities and contributes more to the reversal in our historical thinking. Biographical fiction writer like Shelat resists categorization because she thinks her work blurs genre and transgress the boundary between fact and fiction. She claims:

*The main reason I have chosen the autobiographical style for the narration is because of my attempt and desire to go within the character of Amrita. Seeing everything from Amrita's point of view, I became so engrossed in Amrita that it seemed strongly that if this material came from her point of view, in her language, according to her interpretation, it would be fine. Of course, this type of narration had its limitations, its development was to be partial as all other characters had to be seen from Amrita's point of view, but the autobiographical style was likely to retain traits of intimacy and passion, so in the end this venture was allowed to take place. (Shelat, Himanshi, 2009)*

Unlike biographers, biofiction writers may go beyond the historical facts and meditate historical events with their own perception. In other words, they fictionalise facts from the past to construct the tale they wish to tell. As they use imaginative speculation to create a sense of their "biographies", the narrative is, therefore, a discourse that consistently represents an effort to reconstruct, or reinvent a past (Cohn, Dorrit, 1999). There is no longer one truth, but there are other truths that generated from the subjective perception of the narrator. And the reader can compare historical events with the contemporary interpretation of them. What biofiction writers always do is using some of the same names and narratives (fictional and nonfictional) to forge a permeability between

his or her text and other past texts, such as auto/biographies, memoirs, letters, documents, and so on. The novel and historical sources are intertextual. For the author, constructing a text means a process of selection, manipulation and interpretation of various historical sources.

In terms of the writing of Amrita Sher-Gil, Himanshi Shelat admits that this novel is completed with reference to main sources, as claims:

*The main source of information I collected about Amrita's life was Iqbal Singh's biography of Amrita Sher-Gil (Vikas Publication) and special issue on Marg Publication's Amrita Sher-gil (edited by Geeta Kapoor, Vivan Sundaram, Ghulam Mohammad Sheikh, K. Subramaniam). For information on Amrita's relationship with Hungary, I have used Gyula Wojtilla's Amrita Sher-Gil & Hungary (Allied Publisher Pri. Ltd.). Besides this, I have also gone through some articles published in 'Illustrated Weekly', 'Free Press Journal', 'Sunday Mail', due to which the lines of the picture of Amrita that came before me have become clear. (Shelat, Himanshi, 2009)*

This reveals, then, historical facts recorded or reconstituted by the author in the novel are highly subjective. Readers have to compare the author's subjective perception of the event with the historical event of its "pretexts" constantly. The novel offers readers, of course, an opportunity to doubt the ontological status of characters and the conventional discourses. As a result, the intertextual structure of biofiction calls the readers for their surging interests— not in a biographical truth, but a higher truth value about life.

*The Eighth Hue* starts with a subtitle in italics in the opening section: *"the novel based on the life of Amrita Sher-Gil"*. The preface suggests the author's salute metaphorically to Amrita Sher-Gil as a protagonist of great moral complexity. Being the main preoccupation of the author's imagination, Shelat chooses to construct the subject in silent detachment from outward, turning inward upon the "self". Compared with the external "noise of time", Amrita Sher-Gil's voice is made from the silence and pain. The whole of her struggle, fame and pain without compromising her attitude marks her off many conventional pattern writings of a tragic protagonist. Shelat's selection of this narrative mode makes a very emotional sense of the protagonist's life. Or let's say, distinction and mobility of biofiction might go beyond any fate and touch onto the same concept of a person suffering under his or her emotional system.

**Narration in Himanshi Shelat's *The Eighth Hue* :**

Shelat writes *The Eighth Hue* with a first-person point of view and everything from persons to places are shown from Amrita's point of view. Although the novel is not show apparently divided into phases or section, the novel does distinctly portray the three vivid life phases of Amrita which describe three critical moments of Amrita Sher-Gil's life: her childhood, her youth before her marriage predominantly her struggle as a painter and her tragic life as a failed painter post her marriage. Shelat emphasizes how Amrita Sher-Gil never compromises with power and with art in all phases of her life.

The first phase portrays her childhood. Her birth and upbringing in the class marks her different from rest of the artists of her time. She belongs to the class — rich on both sides of her parents, dignified family, mixed-blooded and Western-style upbringing and education, a fusion of all three. Amrita Sher-Gil was born on 30 January 1913 in Budapest, Hungary, to Umrao Singh Sher-Gil Majithia, a Punjabi Jat Sikh aristocrat and a scholar in Sanskrit and Persian, and Marie Antoinette Gottesmann, a Hungarian-Jewish opera singer who came from an affluent bourgeois family. Amrita was the elder of two daughters; her younger sister was Indira. She spent most of early childhood in Budapest. She was the niece of Indologist Ervin Baktay. Baktay noticed Sher-Gil's artistic talents during his visit to Shimla in 1926 and was an advocate of Amrita pursuing art. He guided her by critiquing her work and gave her an academic foundation to grow on. When she was a young girl she would paint the servants in her house, and get them to model for her. The memories of these models would eventually lead to her return to India. In 1921, her family moved to Summer Hill, Shimla, India, and Amrita soon began learning piano and violin. By age nine she, along with her younger sister Indira, was giving concerts and acting in plays at Shimla's Gaiety Theatre at Mall Road, Shimla. Though she was already painting since the age of five, she formally started learning painting at age eight. Amrita started getting formal lessons in the art by Major Whitmarsh, who was later replaced by Beven Pateman. In Shimla, Amrita lived a relatively privileged lifestyle. As a child, she was expelled from her convent school for declaring herself an atheist. Her mother Marie moved to Italy along with Amrita and got her enrolled at Santa Annunziata, an art school at Florence. Though Amrita didn't stay at this school for long and returned to India in 1924, it was here that she was exposed to works of Italian masters. At sixteen, Amrita sailed to Europe with her mother to train as a painter at Paris, first at the Académie de la Grande Chaumière under Pierre Vaillent and Lucien Simon. She drew inspiration from European painters such as Paul Cézanne and Paul Gauguin, while working under the influence of her teacher Lucien Simon and the company of artist friends. While in Paris, she is said to have painted with a conviction and maturity rarely seen in a 16-year old.

Following the stream of consciousness mode, the narrative brings out Amrita Sher-Gil's upbringing and the backstories of her mother, her father, her sister, her places of living, her interests, her hobbies, and her attitude and so on.

The second and third phases vividly present the eccentric character of young and adolescent artist Amrita and also show her tragic love affairs mingled with her sexual experiments. Amrita's early paintings display a significant influence of the Western modes of painting, more specifically, the post-impressionism style. Her 1932 oil painting, Young Girls, came as a breakthrough for her; the work won her accolades, including a gold medal and election as an Associate of the Grand Salon in Paris in 1933. She was the youngest ever member, and the only Asian to have received this recognition.

Her work during this time includes a number of self-portraits, as well as life in Paris, nude studies, still life studies, and portraits of friends and fellow students.

When she was in Paris, one of her professors often said that judging by the richness of her colouring Amrita was not in her element in the west, and that her artistic personality would find its true atmosphere in east. In 1933, Amrita "began to be haunted by an intense longing to return to India feeling in some strange way that there lay her destiny as a painter." Amrita returned to India at the end of 1934. In May 1935, Amrita met the English journalist Malcolm Muggeridge, then working as assistant editor and leader writer for The Calcutta Statesman. Both Muggeridge and Amrita stayed at the family home at Summer Hill, Shimla and a short intense affair took place during which she painted a casual portrait of her new lover. She left herself for travel in 1936 at the behest of an art collector and critic, Karl Khandalavala, who encouraged her to pursue her passion for discovering her Indian roots. In India, she began a quest for the rediscovery of the traditions of Indian art which was to continue till her death. She was greatly impressed and influenced by the Mughal and Pahari schools of painting and the cave paintings at Ajanta.

Later in 1937, she toured South India and produced her South Indian trilogy of paintings Bride's Toilet, Brahmacharis, and South Indian Villagers Going to Market following her visit to the Ajanta Caves, when she made a conscious attempt to return to classical Indian art. These paintings reveal her passionate sense of colour and an equally passionate empathy for her Indian subjects, who are often depicted in their poverty and despair. By now the transformation in her work was complete and she had found her 'artistic mission' which was, according to her, to express the life of Indian people through her canvas. While in Saraya Amrita wrote to a friend thus: *"I can only paint in India. Europe belongs to Picasso, Matisse, and Braque.... India belongs only to me".* Her stay in India marks the beginning of a new phase in her artistic development, one that was distinct from the European phase of the interwar years when her work showed an engagement with the works of Hungarian painters, especially the Nagybanya School of painting.

Through the entirety of her short life, love and sex remained in abundance. Amrita had an affair with socialist realist painter Boris Taslitzky while studying in Paris. In 1931 she was briefly engaged to Yusuf Ali Khan, the son of Raja Nawab Ali, a prosperous landowner in Uttar Pradesh. However, at the time, it was rumoured that she was also having an affair with her cousin and future husband Victor Egan, despite the disapproval of her mother.

Amrita was also known to be bisexual, entertaining various female lovers during her life. For Amrita, her body was a subject in itself — one worth exploring both physically and intellectually. By tweaking artistic expression in terms of position, placement, colours, shapes etc. Amrita used the female form in her paintings to make significant statements about herself and the choices she was making not only as an artist, but also as a woman. While in Paris, she had a number of torrid affairs. It was rumoured that she even had a relationship with another woman, Marie Louise Chasseny, who was also a painter. Upon hearing these rumours, Amrita's

mother promptly wrote her a letter to enquire about this supposed affair. Amrita's reply betrays a lucid awareness of her own sexuality and a tenacity of spirit which is striking for a person so young.

*"Do you know that I am of age? So, please do respect me, my dear clever and understanding mother... I never had any relationship with Marie Louise, and will not have one either. And you can believe me. Knowing how unprejudiced, objective and intelligent you are, I am going to be very frank with you. I confess that I also think as you do about the disadvantages of relationships with men. But since I need to relieve my sexuality physically somehow (because I think it is impossible to spiritualize, idealize sexuality completely in art, and channelizing it through art for a lifetime is impossible, only a stupid superstition invented for the brainless), so I thought I would start a relationship with a woman when the opportunity arises…" (Shelat, Himanshi, 2009)*

Amrita married her Hungarian first cousin, Dr. Viktor Egan when she was 25. Egan had helped Amrita obtain abortions on at least two occasions prior to their marriage. She moved with him to India to stay at her paternal family's home in Saraya, in Gorakhpur, Uttar Pradesh. Thus began her second phase of painting which equals in its impact on Indian art with the likes of Rabindranath Tagore and Jamini Roy of the Bengal school of art.

It was during her stay at Saraya that Amrita painted the Village Scene, In the Ladies' Enclosure, and Siesta, all of which portray the leisurely rhythms of life in rural India. Siesta and In the Ladies' Enclosure reflect her experimentation with the miniature school of painting while Village Scene reflects influences of the Pahari School of painting. Although acclaimed by art critics Karl Khandalavala in Bombay and Charles Fabri in Lahore as the greatest painter of the century, Amrita's paintings found few buyers. She travelled across India with her paintings but the Nawab Salar Jung of Hyderabad returned them and the Maharaja of Mysore chose Ravi Varma's paintings over hers.

Although from a family that was closely tied to the British Raj, Amrita herself was a Congress sympathiser. She was attracted to the poor, distressed and the deprived and her paintings of Indian villagers and women are a meditative reflection of their condition. She was also attracted by Gandhi's philosophy and lifestyle. Nehru was charmed by her beauty and talent and when he went to Gorakhpur in October 1940, he visited her at Saraya. Her paintings were at one stage even considered for use in the Congress propaganda for village reconstruction. However, despite being friends with Nehru, Amrita never drew his portrait, supposedly because the artist thought he was "too good looking." Nehru attended her exhibition held in New Delhi in February 1937. Amrita exchanged letters with Nehru for a time, but those letters were burned by her parents when she was away getting married in Budapest.

In 1941, at age 28, just days before the opening of her first major solo show in Lahore, Amrita became seriously ill and slipped into a coma. She later died around midnight on 5 December 1941, leaving behind a large volume

of work. The reason for her death has never been ascertained. A failed abortion and subsequent peritonitis have been suggested as possible causes for her death. Her mother accused her doctor husband Egan of having murdered her. The day after her death, Britain declared war on Hungary and Egan was interned as an enemy alien. Amrita was cremated on 7 December 1941 in Lahore.

Some of Amrita's traits are unusual. For example, Amrita was not aware of the importance of her work and her valuable contribution to Indian painting. Thus, it seems that she has been surrounded by admirers, but that admiration is understood more of her magnetic femininity and less of her creativity. Someone like Karl Khandalawala valued her creativity and Amrita also continued to receive prizes and medals, but it seems from her statements that Amrita would often become depressed as she received such respect for the paintings that she herself found lacking in terms of art and the creation she felt was excellent were neglected. But all this is going on on a personal basis; she herself has remained unaware of the importance of paving a new path.

She sharply criticized the Bengal style of painting on the basis of her distinctive and subtle understanding of painting and colours. She was blunt. She also has the courage to express clearly what she believes. Amrita would have been able to take these natural powers instinctively. Amrita was able to portray the hidden essence and dignity of the common people of India in her paintings, because her relation with the surrounding reality remained close and strong. She also tried to find the limitations of her paintings. Such awareness is not easy in the art world. The artist's own ego often hinders his development. Amrita liked introspection. Rarely has she had trouble in accepting the harsh criticism.

*'... I can say from personal experience that it was never the considerate and reasonable criticism of my professor but the devastating and ruthless remarks of my fellow students that benefited me in the end. Ruthless criticism coming at the right moment can completely regenerate one artistically.' (Feb., 1937) (Shelat, Himanshi, 2009)*

Amrita's writing a letter to her mother at the age of twenty is honesty and fearless confession while astonishing to the reader.

*'I must confess, that I agreed fully with you about the disadvantages of sexual relations with a man and I need some how to physically meet my sexual needs because I believe that it is impossible to fully transform one's sexual desires into art, to idealize it and tranquil it through art for a whole lifetime ... so I thought I would have something with a female when the opportunity arises.' (Feb. 1934) (Shelat, Himanshi, 2009)*

At some point in life, many men and women, especially artists and creators, may have been put in a situation like this, but it is rare for them to be able to put this whole thing in front of their mother. Amrita does not intend to spread any sensation through frank conversation. She has no inclination to prove that there is something amazing in it and that she can create

it herself. But there is no effort to hide one's beliefs about life and art or opinions and some personal convictions.

Amrita's rebellion is not a product of the situation, it is natural. There is no stereotype or no obsession. So there is instinct and simplicity in this rebellion. The passionate like-dislike is a part of this personality, as well as the reasoning to do a healthy analysis is in her personality. She is well aware of the benefits of quiet analysis when it comes to frustration or failure in a relationship. Towards the end of her life (July, 1941) she writes to her friend Helen:

*'I haven't touched a brush or gone near a canvas for 4 months. I don't know why. I am gripped by a sort of fear whenever I think of working again. I suppose it could be explained by very simple and obvious reasons if I sat down to analyse it but I just cannot bring myself to. I suppose one can get out of the habit of painting.' (Shelat, Himanshi, 2009)*

An artist, who has been painting since childhood and as if she was born with a brush, does try to look at the situation neutrally when she cannot do paintings. Sometimes, looking at life in the eyes of a philosopher, Amrita reveals a deep understanding and balance that does not match her age. In December, 1940 she wrote to her sister Indira:

*'...All of us muddle through life at the very best of times, just muddle through. If you look at life from that point of view, everything will seem easier, I assure you. ' (Shelat, Himanshi, 2009)*

In the last few days, Amrita seems very upset and restless. We can only imagine the reasons for this. In her personal life, especially after her selective marriage to a cousin, Victor, what kind of frustration she felt would remain a mystery. This time is likely to be stressful. The emptiness and depression that she frequently mentions can hardly be found in a happy and warm coexistence. Amrita, who loves life and can spread that exhilaration everywhere, suffers from pain like that of deep surgery.

Amrita annoyed many because of her certain attitudes. Such incidents are woven into the novel. Her habit of speaking clearly must have created difficulties for her. To a best friend of hers and an art critic who valued Amrita's paintings, in the reference to his writing, Amrita:

*'Your values are fundamentally right and you express yourself clearly, concisely and intelligently. No defects except the defects of your qualities ...'*

*'Mind you, I don't for a moment mean to suggest that the ornamental, nebulous, mystical, hysterical and ridiculous styles of the majority of our acknowledged art critics is preferable to yours. No, No and No ...'*

*'But judged by higher standards it is not enough ...' (Sept., 1937) (Shelat, Himanshi, 2009)*

Amrita seemed to be arrogant and even superior to some people due to her bluntness. In the class she came from (rich on both sides of her parents, dignified family, mixed-blooded and Western-style upbringing and education, a fusion of all three) confidence is not an uncommon characteristic. Amrita would not be aggressive or insistent in the art discussion, had she conformed to the male dominated art world. She wanted to disrupt everything that was

jammed and frozen, re-establish the aesthetic concepts, and challenge the beliefs of the Bengal style and a large class that was following it. She had no group, no supporters. All she had to do was do it alone, with the support of one or two critics like Karl. All this cannot make happen in one's thirty without becoming aggressive or the sharpened sword.

Also having a little acuity in the speech of a person who is honest and purely motivated by the insistence of high standards is not new. The Punjab Film Academy invited Amrita for a talk and there was a lot of outrage about what she said there, but her statements are enough to show how far she could go from her time. The fact of the matter is that years later we find it in the films of Satyajit Ray or Shyam Benegal or Govind Nihalani.

Despite Amrita being surrounded by male friends and admirers and approaching Amrita at parties or other occasions with her charming personality, one gets acquainted with the deep sadness of that private solitude. Maybe her passion and her power left her alone. This is the destiny of talented people, especially of women, because in such a blazing presence many men who feel inferior fail to cross certain boundaries, or even cultivate true friendships. Amrita fell in love and broke up, but the answer to the question of whether anyone really came close to her heart is not easy. In a letter to Karl she writes:

*'... I am always in love, but unfortunately for the party concerned, I fall out of love or rather fall in love with someone else before any damage can be done! You know the type of alcoholic who stops drinking at the merry stage?' (May, 1937) (Shelat, Himanshi, 2009)*

Amrita's death is a mystery that raises many questions. It is true that stomach ailments can be serious, but as her health deteriorates, it is not clear why Victor did not seek the help of another doctor, and there is no answer. Amrita's parents were given the news of her serious illness very late. The reason behind this delay is also not found. From December 1, 1941, Amrita's health deteriorated. Amrita fell ill on 5th December. The news arrives by wire and before they both leave for Lahore, they get the news of Amrita's death!

